

"నా బుద్ధితో నేను చక్కగా వీక్షిస్తున్నాను. నా మనస్సు కూడా అదే చెబుతూ ఉంది. నేను సీతమ్మను చూడగలను. మీరంతా సంతోషించండి.

"వంద యోజనా లేమిటి? పదివేల యోజనముల దూరం కూడా నేను ఎగురగలను. లంకా పట్టణాన్నే పెకలించి తేగలను;' అని వీరాంజనేయుడు గర్జించాడు. వానరులంతా రెప్ప వేయకుండా హనుమంతుని చూస్తున్నారు.

"వీరుడా! కేసరిపుత్రా! వేగవంతుడా! వాయునందనా! నాయనా! మిత్రులందరి దుఃఖాన్ని దూరం చేశావు. మేమంతా నీకు శుభాన్ని కాంక్షిస్తున్నాము. నీకు ఋషుల అనుగ్రహముంది. పెద్దల ఆశీస్సు లున్నాయి. గురువుల దయ ఉంది. సముద్రాన్ని దాటేయ్;" అన్నాడు జాంబవంతుడు.

"నేను ఎగిరే సమయంలో నా వేగాన్ని ఎవరూ తట్టుకోలేరు.* ఈ మహేంద్రపర్వత శిఖరాలు చాలా గట్టివి. పెద్దవి కూడా. నా వేగాన్ని ఆ శిఖరం మీదనుండి చూపిస్తాను;" అని పలికి పవనసుతుడు మహేంద్ర పర్వతాన్ని ఎక్కాడు.

ఆ మహేంద్రపర్వతంపై హనుమంతుడు అటూ ఇటూ తిరిగాడు. ఆ తాకిడికి సింహం కొట్టిన దెబ్బకు మదగజము ఘీంకరించినట్లు మహేంద్రపర్వతము ధ్వని చేసింది.

పర్వతగుట్టలపై ఉన్న రాళ్ళు చెల్లాచెదరయ్యాయి. లేళ్ళు, ఏనుగులు, పులులు, సింహాలు బేజారెత్తి పరుగెత్తాయి. చెట్లు ఊగిపోయాయి. పక్షు లెగిరిపోయాయి. గుద్దను పిండినట్లు మహేంద్రపర్వతం జలాన్ని ప్రవించింది.

భయంకరమైన సర్పాలు పగం శరీరముతో పైకి లేచాయి. అప్పుడు అవి మహేంద్రగిరిపై జెండాలవలె శోభించాయి. విజయపతాకాలు ఎగురవేసినట్లు అగుపించాయి.

పర్వతశిఖరంపై పవనసుతుడు పర్వతరూపుడై నిలబడి ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాడు.

జై జై పవనసుత హనుమాన్ కీ!

కిష్కింధాకాండము సమాప్తము.

* గాలిలో ఎగిరే విమానం యొక్క టేకాఫ్ (**take-off**) దశ ఇది.

సుందరకాండము





శ్రీరామ
జయరామ
జయ జయ రామ....



తొలకరి

రసోవైసః
భగవంతుడు రసస్వరూపుడు.
రసరూపమే సారభూతము. అదే అందం. ఆనందం.
A thing of beauty is a joy for ever
'అందమైన వస్తువు సదా ఆనందదాయకమే' అన్నాడు కీట్సు మహాకవి.
ఆనందాన్ని తనలో దాచుకున్న అందమే సౌందర్యం.
మాటకందని
మనసు పొందని
మేను మరచే ఆనందం. అదే సౌందర్యం. జీవికి సౌందర్యం. జీవన సౌందర్యం.

ఇది సుందరకాండము

Beauty is the only thing that time cannot harm
కాలం కబళించ లేనిది సౌందర్య మొక్కటే-అని ఒస్కార్ విల్డె.
కాలిపోయేవి
రాలిపోయేవి
పారిపోయేవి-అన్నీ, ఆరిపోయే దీపాలే.
వెలిగే దీపాన్ని వెతికి పట్టుకోవాలి.
ఆరని దీపాన్ని అన్వేషించి సాధించాలి.
అదే సీతాన్వేషణము. ఆత్మాన్వేషణము.
పూచిన పున్నమి రాత్రివేళలో పవనసుతుడు సాగించిన అంతరాన్వేషణము.

సీతాన్వేషణము అనే సెలయేరులా ప్రారంభమై, సాగి సాగి, సాగరరూపాన్ని దాల్చింది ఈ కాండము. రసానంద సాగరమైంది.
తేనెల లోని తియ్యదనాన్ని
వెన్నెల లోని చల్లదనాన్ని-కలబోసి
వాల్మీకి కోకిల ఆలపించిన రసమయ కావ్యగానమే సుందరకాండము.

శబ్ద సౌందర్యం
అర్థ సౌందర్యం
రస సౌందర్యం -
కావ్యాన్ని ఆస్వాదించడానికి అవసరమైన ఈ మూడు
సౌందర్య మరభిలాలు సురుచిరంగా విరజిమ్మబడ్డాయి సుందరకాండములో.

శిలా తలం ప్రాప్య యథా మృగేంద్రః
మహా రణం ప్రాప్య యథా గజేంద్రః
రాజ్యం సమాసాద్య యథా నరేంద్రః
తథా ప్రకాశో విరరాజ చంద్రః

ఆకాశంలో పైకి వస్తున్న చంద్రుణ్ణి, శిలాతలముపై నిలిచిన సింహము లాగా,
రణరంగంలో ప్రవేశించిన గొప్ప ఏనుగు లాగా,
రాజ్యము నధిష్ఠించిన ప్రభువు లాగా ప్రకాశిస్తున్నట్లు వర్ణించి,
'ఇంద్ర-ఇంద్ర' అంటూ అంత్యప్రాసల దొంతరతో, పదకూర్పుల
మహేంద్రజాలంతో మృదంగ ధ్వనులను పలికిస్తూ, శ్రవణ సుభగత్వాన్ని
అందించడం శబ్దసౌందర్యానికి మచ్చుతునక.

ప్రవిశన్న భ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః
ప్రశ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చన్ద్రమా ఇవ లక్ష్యతే

మాటిమాటికి మేఘాలలో కనిపిస్తూ, కనుమరు గవుతున్న హనుమంతుడు
మబ్బుల్లో దోగాడే చంద్రునిలా కనిపించడం లాంటి అర్థసౌందర్యా లెన్నో!

మేఘాల వెనక్కి వెళ్ళినపుడు సీతమ్మ ఇలా కనిపించదేమో ననే ఆలోచన, బైటికి వచ్చినపుడు సీతమ్మ కనిపిస్తుందనే ఆశ చూచేవారికి కల్పిస్తూ, మబ్బుల్లో దోబూచులాడే మారుతాత్మజుని గమనవైభవము, భావసౌందర్యానికి మచ్చుతునక.

ఇక రససౌందర్యమా!
లలిత శబ్ద సంయోజనంతో, భావబంధురంగా, నవరస భరితమై శోభిల్లింది
ఈ సుందరకాండము.
వియోగ బాధలో సీతారాముల నుండి వ్యక్తమైన విప్రలంభము-శృంగారరసము-
మధువనంలో మర్కటముల విన్యాసాలలో హాస్యరసము -
అక్షకుమారుని వధించుటలో హనుమ చూపిన వీరరసము -
జంబుమాలి వధలో గోచరించిన రౌద్రరసము -
రావణుడు సీతమ్మపై కళ్ళెర్ర జేసిన భయానక రసము -
రాక్షసాంగనలు సాధ్వీమతల్లిని హింసించిన బీభత్సరసము -
సాగరోల్లంఘనము లోని అద్భుతరసము -
జానకి బాధతో విలపించిన దశలో ప్రవహించిన కరుణరసము -
సీత కనిపించని సమయంలో నిరాశలో నీరసించినపుడు శాంతరసము -

ఎక్కడ కొరికినా చక్కరబొమ్మలో మాధుర్యమే
ఎక్కడ చూచినా సుందరకాండలో సౌందర్యమే. రస సౌందర్యమే.

సుందరే సుందరో రామః సుందరే సుందరీ కథా
సుందరే సుందరీ సీతా సుందరే సుందరం వనమ్
సుందరే సుందరం కావ్యం సుందరే సుందరం కపిః
సుందరే సుందరం మంత్రం సుందరే కిం న సుందరమ్.

రాముడు సుందరుడు. రామకథ సుందరము. సీతమ్మ సుందరము. ఆమె వసించే వనము సుందరము. రామాయణకావ్యము సుందరము. హనుమంతుడూ సుందరుడే. రామమంత్రము కూడా సుందరమే. సుందరము కానిది అందు వెదకినా దొరకదు.
ఎడదల యెలమావిపై కూర్చుని, వాల్మీకి కోకిల చేసిన సుందర కావ్యగానం
శ్రోతల యెదలను ఎరుగని రసానంద లోకాలకు పట్టుక పోతుంది.

అందరిలో ఉంటూ, అందని సౌందర్యాన్ని ముందుంచిన కాండము.
మనసుల్ని మురిపించే కాండము.
మేనుల్ని మరపించే కాండము.
మైమరపించే కాండము.

మూలకథ ఆగింది ఈ కాండంలో
లీలాకథనం అద్భుతంగా నడిచింది ఈ కాండంలో

భారతీయ ఆదర్శ నారీరత్నం జాజ్వల్యమానమైంది ఈ కాండంలో

రావణుని ఘనవైభవం
సీతమ్మ శీల ప్రాభవం - మధ్య
ఆంజనేయుని అసమాన పరాక్రమం వెల్లడైంది ఈ కాండంలో.

రాముని కనిన కందోయితో రావణుని చూడలేని సీతమ్మ.
ప్రభుకార్యంలో ప్రాణత్యాగానికైనా వెనుకాడని హనుమ.
అధర్మమే ఊపిరిగా జీవించే రావణుడు హనుమత్సీతల నడుమ.

సంఘర్షణల మధ్య
నీచోన్నతాదర్శాల మధ్య

అవిరళంగా సౌందర్యాన్ని కురిపిస్తూ సాగిన అసమాన కాండము
ఈ సుందరకాండము.
పఠన యోగ్యము. పారాయణ యోగము.
అంతా అర్పణమే. సమర్పణమే. ఇంద్రియ మనోబుద్ధుల తర్పణమే.
ఈ తర్పణమే తరణము. భవసాగర తరణం. దుస్తర భవసాగర తరణం.
కోటలో పాగ వేసిన వానరుడే
తోటలో పాగా తీసిన వన్నెకాడు.
కటాక్ష వీక్షణానికై క్షణక్షణము పరితపించిన దుర్నిరీక్ష్య సౌభాగ్యం
ఒక వింత సౌందర్యం.
ఎదురు చూడడమే యెద సౌందర్యం. యెదలోని సౌందర్యం.
బెడదల మధ్య ఎడదలను పొంగించే కాండమే సుందరకాండము.
బాధల మధ్య బోధలను తెలిపే కాండమే సుందరకాండము.
విషాన్ని అమృతంగా మార్చి
వికారాన్ని మనోహరంగా తీర్చే
అమల జీవన సౌందర్య కాండమే సుందరకాండము.
మన సుందర భాండము. అమృతభాండము.
త్రాగుదాం కడుపారా
త్రేవుదాం మనసారా

అశోకాన్ని ఆబాలగోపాలానికి
అందించాలనే ఆరాటంలో
మీ
స్వామి సుందర చైతన్యానంద

చైతన్య రామాయణము

సుందరకాండము

సముద్రలంఘనం

గోష్పదీకృత వారాశిం మశకీకృత రాక్షసమ్
రామాయణ మహామాలారత్నం వందేఽనిలాత్మజమ్॥

"సముద్రాన్ని గోష్పదజలము వలె దాటినవాడు, దానవులను దోమల్లాగా వధించిన వాడు, రామాయణ మహామాలారత్న మని వాసి కెక్కిన వాయునందనుడు హనుమంతునికి వందనములు."

I salute Hanuman, the son of the wind-God, who sprang across the sea as though it were an impression made by the hoof of a cow, who crushed the ogres as though they were mosquitoes and who is a jewel adorning the great necklace of the Ramayana.

తన శక్తి తనకు తెలియనివాడే భక్తుడు. తన భక్తే గాని మరొక విషయము నందు ఆసక్తి, అనురక్తి లేనివాడే నిత్యభక్తుడు. సత్యరూపుడైన పరమాత్మ నిత్యదాస్యంలో, అన్యాశ్రయాలను త్యజించి, అనన్యభక్తిలో రమించువాడే పూర్ణభక్తుడు. అతడే ఆంజనేయుడు.

వంద యోజనాల దూరం సముద్రాన్ని దాటే వారెవరో తెలియక వానరులంతా నీరసపడ్డారు. సముద్రలంఘనానికి దేహబలం ఒక్కటే చాలదు. బుద్ధిబలం ఉండాలి. ధర్మబలం కావాలి. దైవబలం కావాలి.

అమాయకుని వలె ఒంటరిగా కూర్చుని ఉన్న ఆంజనేయుని చూశాడు జాంబవంతుడు. హనుమంతుని జనన విశేషాలు వివరించి చెప్పాడు. అతిబల సంపన్నుడైన ఆంజనేయుని సముద్రోల్లంఘనం చేయవలసిందిగా అర్థించాడు.

జాంబవంతుని మాటలు విని పవనసుతుడు తన బలపరాక్రమాలను ఊహించు కున్నాడు. సముద్రాన్ని దాటడం తనకు సామాన్యమైన కార్యమని చెప్పాడు. వానరులంతా సంతోషించారు.

తతో రావణ నీతాయాః సీతాయాః శత్రుకర్శనః
ఇయేష పదమన్వేష్టుం చారణా చరితే పథి ॥

"రావణుడు ఎత్తుకుపోయిన సీత యొక్క చోటును కనిపెట్టుటకు, చారణులు మొదలైన దేవతలు విహరించే గగనమార్గాన ప్రయాణం చేయాలని శత్రుకర్శనుడైన హనుమంతుడు భావించాడు.

ఇది సుందరకాండములో ప్రారంభశ్లోకం. **తతః** అనే పదంతో సుందరకాండము ప్రారంభ మైనది. సాధారణంగా ఇది గ్రంథారంభమున గోచరించే సంప్రదాయము.

తతః అనగా ఆ తరువాత అని అర్థము. అనుబంధ చతుష్టయాన్ని సూచిస్తూ "తత:" అని, "అథ" అని ప్రారంభించడం జరుగుతుంది. ఇక్కడ విశేష మేమిటంటే రామాయణము ఈ కాండలో ప్రారంభం కావడం లేదు. ఇప్పటికే నాలుగు కాండములు పూర్తి అయ్యాయి. ఇప్పుడు మంగళాచరణము చేయడం సముచితం కాదు.

కానీ వాల్మీకి అనాలోచితంగా, అసందర్భంగా ఏదీ చెప్పడు. రాయడు. రామాయణము ఇక్కడ ప్రారంభం కాకపోయినా రామాయణంలో తరళాయమానమైన విషయం ఇక్కడ చర్చింపబడుతుంది. అందుకే "తత:" అనే పదాన్ని వాడాడు వాల్మీకి.

సుందరకాండము **తతః** అనే పదముతోనే మొదలవుతుంది. దానితోనే సమాప్త మవుతుంది. సుందరకాండలో ప్రథమశ్లోకం "తత:" అనే పదముతో కదిలింది. చివరిశ్లోకం కూడా "తత:" అనే పదముతోనే కదుల్తుంది.

ఆద్యంతముల యందలి రెండు శ్లోకములు 'త' కారముతో ప్రారంభమై "త" త్పదాన్ని స్ఫురింప చేస్తున్నాయి. కనుక ఇది పరంధాముని హృదయములో నిలిపే కాండము.

సత్యరూపుడై, శివస్వరూపుడైన పరమాత్మ క్షర మెరుగని వాడు. అందుచేత సుంద రుడు. సత్య శివ సుందరు డైన పరమాత్మ దివ్య సౌందర్యాన్ని వ్యక్తము చేయు కాండమై ఇది సుందరకాండమని కీర్తించబడింది.

పై శ్లోకంలో సీతను రావణనీతగా వర్ణించాడు వాల్మీకి. అంటే రావణుని చేత అపహరించబడినది అని భావము.

అపహరించినవాడు రావణుడు. అపహరించబడింది సీత. ఎవరినుండి రావణుడు సీతను అపహరించాడు? తత:=అతని నుండి అని కూడా వేదాంతార్థము. తత్పదరూపుడైన శ్రీరాముని నుండి అని భావము.

అంతవరకు శ్రీరామునితో కలిసి ఆనందంగా జీవిస్తుండిన జానకి అపహరించబడి లంకలో నిరోధించబడింది. బంధించబడింది. లంకలో సీతమ్మ రాముని కొరకు దుఃఖిస్తూ ఉంది. క్షణ మొక యుగంగా భావిస్తూ ఉంది.

సీతమ్మ లంకలో బందీ అయింది. మన మంతా దేహంలో బందీలై ఉన్నాము. ఎంత దుఃఖిస్తే మాత్రం లంకలో రాముడు లభిస్తాడా? ఎంతగా శ్రమిస్తే మాత్రం దేహంలో నిత్యానందం ప్రాప్తిస్తుందా?

రావణ కుంభకర్ణా వహంకార మమకారౌ

రావణ కుంభకర్ణులు అహంకార మమకారాలు.

కనుక రావణుడు అజ్ఞాన స్వరూపము. అజ్ఞానము వలన మనలోని జ్ఞానము అపహరించ బడినట్లు అజ్ఞానరూపుడైన రావణుడు సీతమ్మను అపహరించాడు.

అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జంతవః

"జ్ఞానము అజ్ఞానముచే ఆవరింపబడి ఉంది. దాని వలన జీవులు మోహమునకు వశులై ఉన్నారు" అని భగవద్గీత-కర్మసన్యాసయోగములో శ్రీకృష్ణపరమాత్మ ఉపదేశించాడు.

పరమాత్మ అనే రాముని నుండి వివేకము అనే సీతమ్మను అజ్ఞానమనే రావణుడు అపహరించగా దేహమనే లంకలో బందీ అవడం జరిగింది.

తాదృశ లంకాఖ్య శరీరే నిరుద్ధ సీతా సదృశం వివేకం

"లంక అనే దేహంలో సీత అనే వివేకము బంధింపబడింది."

పరమాత్మకు దూరమైన వివేకం ప్రపంచ ఎడారిలో చిక్కి అలమటిస్తోంది. నిత్యానిత్య వస్తు వివేకం ద్వారా ప్రపంచానికి దూరమై, పరమాత్మకు చేరువై జీవులు తరించాలి.

ఇది ఎలా సాధ్యం? అజ్ఞానముచే కప్పబడినవారు జ్ఞానాన్ని ఎలా అన్వేషించగలరు? సత్యాన్ని ఎలా పట్టుకోగలరు? నిత్యవస్తువును ఎలా సమీపించ గలరు?

యత్తు స్వతః అప్రాప్తం తత్ శాస్త్రేణ బోధితవ్యం

"దేనిని నీకు నీవుగా పొందలేవో దానిని శాస్త్రమును శ్రవణం చేయుట ద్వారా గ్రహించాలి" అని శంకరభాష్యము.

ఇదే గురూపదేశము. శాస్త్ర శ్రవణము. ఉపదేశము గురువు చేస్తాడు. గురూపదేశములో గుర్తు తెలుస్తుంది. అజ్ఞానం చిత్తుగా వధింప బడుతుంది.

స్వకాయం ఘట మిత్యుక్తం యథా దీపో హి తత్పదమ్
గురువాక్య సమాభిన్నే బ్రహ్మజ్ఞానం స్ఫుటీభవేత్

"తన దేహమే కుండ."తత్" అనే పరమాత్మ కుండలో వెలిగే దీపము. గురువాక్యము దేహమనే ఘటాన్ని పగలగొట్టగా అజ్ఞానము నశించి బ్రహ్మజ్ఞానం సుస్పష్ట మవుతూ ఉంది" అని యోగకుండ ల్యుపనిషత్తు ప్రవచించింది.

అజ్ఞానముచే అపహరింపబడి పరమాత్మకు దూరమై ప్రపంచ దుఃఖాలయంలో అలమటించే వివేకాన్ని కనిపెట్టి పరమాత్మ వైపుకు మరలించాలి. మరి, దానికి మార్గ మేమిటి?

ఆ మార్గంలోనే పయనించాలని నిర్ణయించుకున్నాడు హనుమంతుడు. **చారణా చరితే పథి** "దేవగాయకు లైన చారణులు సంచరించిన మార్గము" లో వెళ్ళాలని హనుమంతుడు నిర్ణయించుకున్నాడు.

దేవదేవుడైన పరమాత్మను కీర్తించువారే దేవగాయకులైన చారణులు. స్వానుభవంతో కీర్తించువారు.

తస్యాః సాధనాని గాయన్త్యాచార్యాః

"పరమాత్మను పొందే మార్గాలను ఆచార్యులు గానము చేసి ఉన్నారు" అని భక్తాగ్రగణ్యుడైన నారదమహర్షి భక్తిసూత్రాలలో ప్రబోధించి యున్నాడు.

భక్తిని ఆచరించి, పరమాత్మను దర్శించి తరించిన వారు, పరుల నుద్ధరించే పవిత్ర కార్యంలో పరమాత్మ అనంత కళ్యాణగుణాలను ప్రబోధరూపంలో గానం చేస్తూ ప్రవచించారు.. వారే దేవగాయకులైన చారణులు. శ్రీచరణముల వద్ద చోటు సంపాదించుకున్న పుణ్యచరితులు. వారే గతంలో జీవించి, సమాజాన్ని జీవింపచేసిన ఆచార్యులు. పూర్వశోభకు ప్రతినిధులు. పూర్వాచార్యులు.

చారయన్తి ఆచారయన్తి ధర్మా నితి చారణాః

"ధర్మములను ఆచరించునట్లు చేయు వారిని చారణులు అంటారు. వారే పూర్వాచార్యులు."

అట్టి మహితాత్ములు నడిచిన మార్గమే **(పథి)** సర్వులకు శ్రీరామరక్ష. అందుచేత హనుమంతుడు కూడా చారణచరిత మార్గాన వెళ్ళాలని సంకల్పించాడు.

మహాజనో యేన గత స్స పన్థాః

"మహాత్ములు పోయిన మార్గమే మార్గము."

ఈ మార్గాన అందరూ చరించగలరా? ఆంజనేయుని వంటి వారికే అది సాధ్యము. ఎందుచేత? ఆయన శత్రుకర్శను డని వాల్మీకి ఆంజనేయుని ప్రస్తుత శ్లోకంలో వర్ణించాడు. శత్రుకర్శను లైన వారే చారణచరిత మార్గంలో చరించి చరితార్థులు అవుతారు.

శత్రుకర్శనుడు అంటే శత్రువులను కృశింప చేయువాడు అని అర్థము. అట్టివాని ప్రయాణమే సుఖం గాను, సులభం గానూ సాగుతుంది. మార్గం ఎంత చక్కగా ఉన్నా, శత్రువుల మధ్య చిక్కినవాడు ప్రయాణాన్ని సుఖంగా చెయ్యగలడా? ఎవరు మనకు శత్రువులు? ఇంకెవరు? అందరికీ తెలిసి, ఎవరికీ లొంగని కామమే. ఈ కామమే మనకు ప్రబల శత్రువు.

జహి శత్రుమ్ మహాబాహో కామరూపం దురాసదమ్

"జయించుటకు శక్యము గాని ఈ కామమనే శత్రువును వధించు అర్జునా!" అని భగవద్గీత- కర్మయోగంలో సూటిగా చెప్పాడు మధుసూదనుడు.

హనుమంతుడు కామమనే శత్రువును వధించినవాడు. కనుక నిర్భయంగా చారణ చరిత పంథా ననుసరించి ప్రయాణం చేయగలడు. అది భూసంచారము కాదు. గగన యానము. ఎత్తైన మార్గము. ఉన్నత మార్గము. మహోన్నత మార్గము. వేదాంత గగన విహారము.

"విశ్వాధారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగం"

అని భగవంతుని స్తుతిస్తూ ఉంటాము. పరమాత్మ గగనసదృశుడు. ఆకాశము వంటివాడు అని అర్థము. కనుక ఆకాశంలో సంచరించుట అంటే భగవంతుని యందు మనసు సదా చరించుట అని భావము.

ఈవిధంగా సాధకుడైన వాడు హనుమంతుని వలె, కామక్రోధాది శత్రువులను కృశింపచేసి, అజ్ఞానము అపహరించిన జ్ఞానమును పొందుటకు, మహాత్ములు పూర్వము చరించిన విశాల సాధనామార్గంలో ప్రయాణం చేయాలి అని తనకు తాను నిర్ణయించుకోవాలి **(ఇయేష).** ఈ నిర్ణయము కూడా స్థిర మైనదియై ఉండాలి. దృఢసంకల్పమై ఉండాలి.

సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢ నిశ్చయః

"భక్తు డైనవాడు నిత్యసంతోషిగా ఉండాలి. యోగియై ఉండాలి. నిగ్రహవంతుడై ఉండాలి. దృఢమైన నిశ్చయము గలవాడై ఉండాలి" అని భగవద్గీత-భక్తియోగంలో పరమాత్మ తెలుపుతాడు.

ఈవిధంగా మనసులో దృఢసంకల్పమును అవధరించిన హనుమంతుడు సముద్ర లంఘనమునకు సిద్ధపడి ప్రకాశించు చున్నట్లు తరువాత శ్లోకంలో వర్ణిస్తున్నాడు వాల్మీకి.

**దుష్కరం నిష్ప్రతి ద్వంద్వం చికీర్షన్ కర్మ వానరః
సముదగ్ర శిరోగ్రీవో గవాంపతి రివాబభౌ**

"ఎవ్వరికీ సాధ్యం గాని సాగరాన్ని అవలీలగ దాటడానికి హనుమంతుడు నిర్ణయించుకున్నాడు. చాచిన మెడతో, ఎత్తిన శిరస్సుతో ఆబోతు లాగ అగుపిస్తున్నాడు.

ఇది సుందరకాండము ప్రథమసర్గలో రెండవ శ్లోకం. దుష్కరం అంటూ ఈ శ్లోకాన్ని ప్రారంభించాడు వాల్మీకి.

హనుమంతుడు చేయదలచిన ఈ కార్యము దుష్కరమని తెలుస్తూవుంది. అన్యులకు అసాధ్యమని అవగతమౌతూ ఉంది. భావప్రకటనమే కాకుండా భాషా ప్రదర్శనమును చూచినా, ఈ శ్లోకంలో వాల్మీకి పల్కిన **దుష్కరం, నిష్ప్రతి, చికీర్షన్** అనే పదములలోని శబ్దవిన్యాసమును పట్టి ఈ కార్యము దుష్కరమే గాని సుకరము కాదని సుస్పష్టమౌతూ వుంది.

సమీరకుమారునికి సాగరోల్లంఘనము సాధ్యమే కావచ్చు. కానీ ఇంతటి మహత్తర కార్యమును అడ్డు లేకుండా **(నిష్ప్రతి ద్వంద్వం)** సాధించా లనుకోవడం సాహసంగా కనపడుతుంది. ఇదీ దుష్కరమే.

సాధకు డైనవాడు దృఢనిశ్చయాన్ని అవధరించిన తరువాత తన సాధన అడ్డు లేకుండా కొనసాగునట్లు చూసుకోవాలి. ఆవిధమైన నిర్ణయాన్ని కూడా హృదయంలో పదిలపరచుకోవాలి.

'శ్రేయాంసి బహు విఘ్నాని' మంచి పనులకు అడ్డంకులు మెండు. అడ్డంకు లొచ్చాయని, వడ్డింపు లెదురయ్యాయని ఈసడించుకొని మార్గాన్ని మార్చుకోకూడదు. నిష్ప్రతి ద్వంద్వంగా నడచిపోవాలి సాధకుడు.

హనుమంతుని ఆబోతుతో పోల్చడం వెనుక అంతర్భావ మిదే. ఆబోతు అడ్డంకులను లెక్క చేయకుండా ముందుకు దూసుకొని పోవునట్లు హనుమంతుడు అవరోధములను దాటుటకు ఆబోతు వలె నిలిచియున్నాడు. ప్రతి సాధకుడు కూడా ఆబోతు వలె ముందుకు సాగిపోవాలి.

అనిత్యమైన విషయప్రపంచానికి సంబంధించిన సంకల్పాలే ఇక్కడ సాధకునికి అడ్డంకులై నిలుస్తాయి. స్థిరసంకల్పచిత్తుడై దృఢమైన పురుషప్రయత్నము ద్వారా సంకల్పావరోధమును విరోధించాలి. ఈ విషయంలో ఆబోతు లాగా వ్యవహరించాలి.

వరం పౌరుష మాశ్రిత్య నీత్వా చిత్త మచిత్తతామ్
ధ్యానతో హృదయాకాశే చితి చిచ్చక్ర ధారయా

"ఉత్తమమైన పురుషప్రయత్నం ద్వారా మనసులోని సంకల్పాలను క్షాళనం చేయాలి. హృదయాకాశంలో ధ్యానాన్ని సాగించి, జ్ఞానమనే చక్రము ద్వారా మనసును వధించాలి" అంటుంది మహోపనిషత్తు.

హనుమంతుడు ఉత్తమ పురుషయత్నంతో ఉన్నట్లు ఇంతవరకు మనకు అవగతమైంది. ఇక హృదయంలో ధ్యానమనే గగనవిహారాన్ని సాగిస్తాడు. మనోనాశ మనే రావణవధ జరిగిపోతుంది. ఇదే అజ్ఞాననాశము.

ఆబోతు లాగా అగుపిస్తున్న ఆంజనేయుడు మెడను చాచినట్లు, శిరస్సును పైకెత్తినట్లు వర్ణించాడు వాల్మీకి.

హనుమంతుడు సంకీర్తనా ప్రియుడని మనకు తెలుసు కదా! మెడను చాచి, శిరస్సు పైకెత్తిన దృశ్యాన్ని నేత్రాలు మూసికొని మీరు దర్శిస్తే హనుమ రామనామ సంకీర్తనలో మునిగియున్నట్లు మీకు దర్శన మౌతుంది. భగవత్కార్యంలో ఆబోతు లాగా స్థిరచిత్తంతో దూసుకుపోవడానికి సిద్ధపడిన తరువాత సంకీర్తనను హృదయానందంగా గానం చేయాలి. రామనామ సుధారస పానాన్ని విడువకుండా కొనసాగించాలి.

నామమున్న చోట రాము డుంటాడు. రామనామ మున్న చోట హనుమంతు డుంటాడు.

యత్ర యత్ర రఘునాథ కీర్తనం
తత్ర తత్ర కృతమస్త కాంజలిం
బాష్పవారి పరిపూర్ణ లోచనం
మారుతిం నమత రాక్షసాంతకమ్

"ఎక్కడెక్కడ రామభజన సాగుతూ ఉంటుందో, అక్కడక్కడ కలిపిన చేతులను తలపై ఉంచుకొని ఆనందబాష్పములతో నిండిన కన్నులు కలిగి శోభించు రాక్షసాంతకుడైన రామదూతకు నమస్కారము.

I bow down to the heroic Hanuman, the destroyer of ogres, who is present with his palms joined above his head and with his eyes flooded with tears of joy where ever the names and praises of the Lord of the Raghus are being sung.

ఆత్మబంధువులారా! ఈ విషయంలో ఏ విధమైన సంశయమును పెట్టుకోకండి. హనుమంతుని చిత్రాన్ని ముందుంచుకోండి. లేదా కాగితముపై "జై జై పవనసుత హనుమాన్" అని వ్రాసి ఎదురుగా పెట్టుకొని, ఆనందాశ్రుపూరిత నయనాలతో, నిర్మల భక్తితో **"శ్రీరామ జయరామ జయ జయ రామ"** అని భావోద్వేగంతో పలకండి. చాలు.

వెంటనే హనుమంతుడు మీ ముందు నిలుస్తాడు. నమ్మండి. హనుమంతుని సాక్షిగా చెప్తున్నాను. ఒకవేళ మీ ముందు నిలబడ లేదంటారా! నిరాశ పడకండి. మీ వెనుకున్నాడు. అంతే.

మీకు కనిపించకపోవచ్చు. కానీ మీకు దూరంగా మాత్రం లేడు. మీ వెనుకే ఉన్నాడు. ఆయన మిమ్మల్ని చూస్తూనే ఉన్నాడు. అంతకన్నా ఏమి కావాలి? మన వెనుక హనుమంతుడుంటే భవసాగరాన్ని దాటడం అసాధ్యమా? ఆ దివ్యాత్ముని చూపు మన మీద పడితే రాముడు మన చూపుకు అందకపోతాడా!

తులసీదాస్ మహాత్ముని జీవితంలో జరిగిన ఒక సన్నివేశాన్ని భక్తులు విశేషంగా చెప్పుకుంటూ ఉంటారు. హనుమంతుడు భక్తులకు రామదర్శనం చేయిస్తాడు అనడానికి ఇదొక చక్కని ఉదాహరణ.

తులసీదాస్ చిత్రకూటంలో వసిస్తున్న రోజుల్లో ఈ సన్నివేశం జరిగినట్లు చెబుతారు.

తులసీ మహాత్ముడు ప్రతిరోజు తాను స్నానం చేసిన తరువాత చెంబులో మిగిలియున్న నీటిని ఒక జమ్మిచెట్టుమీద పోస్తూ ఉండేవాడు. ఆ చెట్టు మీద వసిస్తున్న ఒక ప్రేతాత్మ మహాత్ముడు పోసిన ఆ పావనజలం వల్ల పవిత్రురా లైంది.

కృతజ్ఞతగా తులసికి నమస్కరిస్తూ ఏదైనా వరాన్ని అడగమంటుంది. "నాకేమీ అవసరం లేదు. నీకు సాధ్యమైతే నాకు రామదర్శనం చేయించు" అన్నాడు.

"అయ్యా! నీకు రామదర్శనం నేను చేయించలేను. కానీ దాని కొక ఉపాయం చెబుతాను. నిత్యము నీవు వినిపించే రామకథను వినడానికి వచ్చే వారిలో ఒక వృద్ధుడు వెనుకగా, కాస్త దూరంగా కూర్చుని కన్నీళ్లు కార్చుతూ ఉంటాడు. అతను వికారంగా కూడా ఉంటాడు. ఆయన పాదాలు పట్టుకో. నీకు రామదర్శన మవుతుంది" అంటుంది ఆ ప్రేతం.

మరునాడు తులసీదాసు ప్రేతం చెప్పిన ఆ వృద్ధుణ్ణి గుర్తించాడు. వెళ్ళి ఆయన పాదాలు పట్టుకుంటాడు. రామదర్శనం చేయించమని ప్రాధేయపడతాడు. "నాయనా! అలాగే చేయిస్తాను. వ్యథ చెందకు. సమయం కోసం నిరీక్షిస్తూ ఉండు" అన్నాడు.

తులసీదాస్ ఒకనాడు గంధాన్ని తీస్తున్నాడు. ఒక బాలుని రూపంలో రాముడు వచ్చి తులసీదాస్ నుండి గంధాన్ని అడిగి తీసుకుంటాడు. అప్పుడు చెట్టుపై నుండి ఒక రామ చిలుక ఇలా పాడుతుంది.

చిత్రకూటకే ఘాట్‌పర్ భాయీ సంతనకీ భీర్
తులసిదాస చందన ఘిసై తిలక దేత రఘువీర్ ॥

"పవిత్రమైన చిత్రకూట ప్రదేశంలో రాముడు బాలుని రూపంలో చందనాన్ని పుచ్చుకుంటున్నాడు. పాపం! తులసీదాస్ గ్రహించ లేకున్నాడు" అని పలికింది చిలుక.

ఈవిధంగా చిలుక రూపంలో పలికి తులసీదాస్‌కి రామదర్శనం చేయించిన ఆంజనేయుడే తులసీ నుండి రామకథను ఆలకించి ఆనందించిన ఆంజనేయుడు.

ఇలాంటి సంఘటనలు, హనుమంతుడు భక్తులను ఉద్ధరించిన సన్నివేశాలు కొకొల్లలుగా ఉన్నాయి. రామనామ సుధారసాన్ని సదా పానం చేయువాడు కనుకనే పవనసుతుడు మెడను చాచి, శిరస్సును పైకెత్తి ఆబోతు లాగా నిలబడ్డాడు. లంఘించడానికి సిద్ధంగా ఉన్నాడు హనుమంతుడు.

మహేంద్రపర్వత చరియల మీద వైడూర్యమణుల లాగా ఆకుపచ్చని రంగుతో దూరానికి జలాశయం లా కన్పిస్తున్న పచ్చికమైదానంపై కొంతసేపు హాయిగా పచారు చేశాడు.

హనుమంతుడు శిరస్సును పైకెత్తి ఉన్నట్లు చూశాము. ఇప్పుడు ఆయన పాదాలు పచ్చికబీళ్ళపై నిలిచి పచార్లు చేస్తున్నట్లు చెప్తున్నాడు వాల్మీకి.

మూణ్ణాళ్ళ ముచ్చటగా గోచరించే ఈ పచ్చికబీళ్ళే ప్రపంచము లోని విషయ భోగాలు. అందుకే అవి దూరానికి జలాశయాల వలె కన్పిస్తున్నాయి అన్నాడు వాల్మీకి. లేక ఉన్నట్లు తెలిసేదే భ్రాంతి లేక మాయ.

ఈవిధమైన జలాశయాలు జీవులకు దప్పికను తీర్చలేవు. ప్రాపంచిక విషయభోగాలు ఆనందాన్ని ప్రసాదించలేవు. ఈ సత్యాన్ని గ్రహించిన ఆంజనేయుడు సముద్రలంఘనానికి ముందు పచ్చికబీళ్ళలో పచారు చేస్తూ దృష్టిని ఊర్ధ్వంగా ఆకాశం మీద నిలిపియున్నాడు.

భక్తులు ప్రపంచంలో చరిస్తున్నా దృష్టి నెప్పుడూ పరమాత్మ పైనే ఉంచి ఉంటారు. మనసులో పరమాత్మనే నింపుకొని ఉంటారు. కరచరణాదులు కర్మలలో కదులుతున్నా అంతఃకరణాన్ని అచ్యుతునికే సమర్పించి ఉంటారు.

హనుమంతుడు పచ్చికబీళ్ళపై హాయిగా విహరిస్తున్నాడు. భయంకరంగా గోచరిస్తున్న హనుమంతుని చూచి పక్షులు బెదిరిపోయాయి. ఆయన వక్షస్థలము ఢీకొని పెద్దపెద్ద చెట్లు కూలిపోయాయి. ఎదురుపడిన సింహాలను కొట్టి చంపాడు ఆ మహాబలుడు.

హనుమ విహరిస్తున్న ఆ మహేంద్రపర్వతము నలుపు, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ మొదలైన చిత్రవర్ణాల ధాతువులతో ప్రకాశిస్తోంది. దానిపై కామరూపులైన యక్షులు, కిన్నరులు, గంధర్వులు నివసిస్తూ ఉంటారు.

ఆ గిరిప్రాంతములో పెద్దపెద్ద ఏనుగులు తిరుగుతున్నాయి. హనుమంతుడు కూడా ఒక పెద్ద గజము లాగా కన్పిస్తున్నాడు. ఇక సాగరాన్ని లంఘించుటకు సిద్ధపడి రెండు చేతులు జోడించి నమస్కరించాడు.

స సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయంభువే
భూతేభ్య శ్చాంజలిం కృత్వా చకార గమనే మతిమ్

"సూర్యుడికి, ఇంద్రునికి, వాయుదేవునికి మరియు బ్రహ్మదేవునికి నమస్కరించాడు. భూతకోటికీ నమస్కరించి బయలుదేరుటకు నిశ్చయించుకున్నాడు."

కార్యారంభంలో కార్యసిద్ధికై ప్రార్థించడం, భగవత్కృపను, పెద్దల ఆశీస్సులను పొందడం మనకు సంప్రదాయం ప్రసాదించిన ఆచారము. అసమాన పరాక్రమ వంతుడైనను ఇలా అందరికీ నమస్కరించడంలో హనుమంతుడు ఎంత వినీతుడో అర్థమవుతూ ఉంది. నమ్రతే బ్రతుకుకు నాణ్యత నిస్తుంది.

I believe the first test of a truly great man is his humility.

"నిజమైన గొప్ప వ్యక్తికి నమ్రతయే ప్రథమ పరీక్ష అని నా విశ్వాసము" అంటాడు రస్కిన్.

తాను గొప్ప పరాక్రమవంతుడైనా జాంబవంతుడు చెప్పినంత వరకు అమాయకుని లాగా ఒకచోట హనుమంతుడు ఒంటరిగా కూర్చొని ఉండడము మనం చూశాము. అతి తేలికగా సాగరోల్లంఘనం చేయగలిగే శక్తి తనకున్నదని తెలిసినప్పటికీ, పెద్దల ఆశీస్సులను వాంఛిస్తూ నమస్కరించడం మహోన్నతమైన ఆయన హృదయ సౌందర్యానికి అద్దం పడుతోంది.

ఒక కార్యానికి సంబంధించిన జ్ఞానం పూర్ణంగా లేనిదే ఆ కార్యాన్ని సాధించలేము. జ్ఞానాన్ని ప్రసాదించేవాడు సూర్యుడు. కనుక ప్రథమంగా సూర్యుని ఆశీస్సులను వాంఛిస్తూ నమస్కరించాడు.

బుద్ధి ఒక కార్యాచరణకు పథకం సిద్ధం చేసిన తరువాత ఇంద్రియాలు సహకరించి కార్యరంగంలో దిగాలి. ఇంద్రియాలకు ప్రభువు ఇంద్రుడు. కనుక ఇంద్రుని ప్రార్థిస్తూ నమస్కరించాడు.

ఏ కార్యసాధన కైనా జన్మ నిచ్చిన తల్లిదండ్రుల ఆశీస్సులను పొందాలి. అప్పుడే అది దివ్యంగా ఫలప్రద మవుతుంది. అందుచేత వాయుదేవుని ప్రార్థిస్తూ నమస్కరించాడు.

అంతేకాదు. ఏ విషయంలో మనం ప్రగతిని సాధించాలనుకున్నా తెలిసో, తెలియకో అనేకమంది సహకరిస్తారు. లేనిచో కార్యం సిద్ధించదు. వారందరికీ నమస్కరించడమే భూతకోటికి నమస్కరించడం లోని అంతర్భావము.

ఆంజనేయుని ప్రజ్ఞ, భావస్ఫూర్తి, ముందువెనుక లాలోచించి ఆచరించే పద్ధతి కూడా ఇక్కడ సుందరంగా జాజ్వల్యమానం కావడం మనం స్పష్టంగా చూడవచ్చు.

కిష్కింధాకాండము చివర జాంబవంతుడు హనుమంతుని జననాన్ని గూర్చి చెప్పడం మనం చూశాము. ఉదయభానుని చూచి ఫలమని భావించి ఆంజనేయుడు సూర్యుని చేరడానికి ఎగరడము, మధ్యలో ఇంద్రుడు వజ్రాయుధంతో కొట్టడము, అది తెలిసి వాయుదేవుడు స్తంభించడము, వాయుదేవుని సంతృప్తి పరచుటకు బ్రహ్మదేవుడు హనుమంతునికి వరప్రదానం చేయడము మనము చూశాము.

పై వరుసక్రమాన్ని అనుసరించి సూర్యునికి, ఇంద్రునికి, వాయుదేవునికి, బ్రహ్మదేవునికి వరుసగా నమస్కరించాడు వాయునందనుడు. ఇవన్నీ ఆయన సునిశిత ప్రజ్ఞకు నిదర్శనాలు.

సముద్రాన్ని లంఘించడానికి హనుమంతుడు సిద్ధపడ్డాడు. వానరు లందరూ ఆంజనేయుని వైపే చూస్తున్నారు. చూస్తుండగనే పూర్ణిమా పర్వకాలంలో సముద్రము పెరిగినట్లు రాముని కార్యసాధనకై హనుమంతుడు పెరిగిపోయాడు.

చంద్రుణ్ణి చూసి సాగరం పొంగుతుంది. అలాగే రామచంద్రుని చూసికొని హనుమంతుడు పెరిగాడు. పూర్ణిమా పర్వకాలములో సాగరము ఉప్పొంగడానికి ప్రధానకారణము చంద్రుడే గాని మరొకరు కాదు. అలాగే హనుమంతుడు ఉప్పొంగి సాగరాన్ని లంఘించడానికి ఆయనలోని రామభక్తియే కారణం గాని జాంబవదాదులు కీర్తించడము కాదు. వారు అభ్యర్థించారు. తనకు ఇష్టమైన కార్యము గనుక హనుమంతుడు అంగీకరించాడు. అంతే.

హనుమంతుడు దేహాన్ని పెద్దదిగా పెంచాడు. చేతులతో, పాదాలతో మహేంద్ర పర్వతాన్ని నొక్కిపట్టాడు. ఈవిధంగా హనుమంతునిచే పీడింపబడిన మహేంద్రపర్వతము తీవ్రంగా కంపించింది. పూసిన చెట్లలోని పువ్వులన్నీ రాలిపోయాయి. రాలిన పూలు మహేంద్రపర్వతాన్ని కప్పివేయగా, దూరానికి అదొక పుష్పగిరిలా శోభించింది. మదించిన ఏనుగు మండి మదము కారినట్లు కొండనుండి నీరు స్రవించింది.

హనుమంతుడు ఆ పర్వతాన్ని తన పాదాలతో ఇంకా గట్టిగా నొక్కాడు. పర్వతం అలా పీడింపబడుతూ ఉంటే పర్వతగుహల్లో ఉండే ప్రాణులన్నీ వికృతస్వరాలతో రోదించాయి. ఆ అరుపులు దిక్కులను ప్రతిధ్వనింప చేశాయి. కొండ బ్రద్దలవుతున్నదని భావించి ఆ మహేంద్రగిరిపై వసిస్తున్న మునులందరూ పైకి ఎగిరి వెళ్ళారు. చారణులు, ఋషులు, సిద్ధులు, విద్యాధరులు ఆకాశంలో నిలిచి హనుమద్వైభవమును వీక్షిస్తున్నారు.

హనుమంతుడు రోమాలు దులిపాడు. మహామేఘం లాగా గర్జించాడు. మొదట్లో లావుగాను, చివరికి పోవుకొలది సన్నముగాను ఉండి, రోమములతో నిండిన తోకను పైకెత్తి ఝాడించాడు. గరుత్మంతుడు తన్నుకుపోతుంటే ముందువెనుకలకు ఊగే మహాసర్పం లాగా హనుమంతుని తోక ఊగిపోతూ ఉంది.

పరిఘలవంటి తన చేతులను బిగబట్టి, నడుమును సన్నము చేసి, పాదాలు ముడుచుకొని ఎగురుటకు సిద్దంగా ఉన్నాడు వాయునందనుడు. భుజాల్ని, కంఠాన్ని వంచాడు. నేత్రాలు పైకి ఎత్తాడు. దూరప్రాంతాల్ని వీక్షించాడు. ఊపిరి బిగబట్టాడు. వానరులను చూచి ఇలా పలికాడు.

యథా రాఘవ నిర్ముక్తః శరః శ్వసన విక్రమః

గచ్ఛే త్తద్వద్గమిష్యామి లంకాం రావణపాలితామ్ ॥

"రాముడు విడిచిన బాణము ఏవిధంగా వాయువేగంతో పోతుందో అలాగే రావణుడు పాలించు లంకకు నేను పోతాను."

ఇది హనుమంతుని శరణాగతి సౌందర్యము. తాను రామబాణంలా వాయువేగంతో వెళ్తాను అంటున్నాడు వాయుపుత్రుడు.

రామబాణమునకు ఎదురు లేదు. ఎందుచేత నంటే అది శరము యొక్క వైభవము కాదు. దాశరథి యొక్క వైభవము. అలాగే తాను సముద్రాన్ని లంఘించడం కూడా తన గొప్పతనము కాదని, రాముని యొక్క ప్రభావమే నని తెలుపుచున్నాడు. తనలో ఏవిధమైన కర్తృత్వభావన కూడా హనుమంతుడు పెట్టుకోలేదని అర్థమౌతూవుంది.

రామబాణానికి వైఫల్యము లేదు. అలాగే తన ప్రయాణానికి కూడా వైఫల్యము లేదని భావిస్తున్నాడు. రామబాణం మధ్యలో ఆగదు. తాను కూడా లంక అనే గమ్యాన్ని చేరేవరకు విశ్రమించేది లేదని నిర్ణయించుకున్నాడు.

రామబాణ వైభవములో ప్రధానకర్త రాముడు. బాణము నిమిత్తము. రాముని సంకల్పమే శరానికి వేగాన్ని కల్పిస్తుంది. అలాగే సముద్రలంఘనంలో తాను నిమిత్తమని, శ్రీరాముని సంకల్పమే ప్రధానమైంది అని భావించాడు హనుమంతుడు. ఇదియే కర్మయోగ రహస్యం.

నేను చేస్తున్నాననే భావన లేకుండా ఈశ్వరప్రేరితంగా కర్మలు ఆచరించి, నేను అనుభవిస్తున్నాననే భావన లేకుండా భగవదర్పితంగా ఫలాలను స్వీకరించి జీవించు వారి బుద్ధి శుద్ధి పడడమే గాక, అది ముక్తికి చక్కని బాటను నిర్మిస్తుంది.

ఈశ్వరార్పితం నేచ్ఛయాకృతం చిత్తశోధకం ముక్తిసాధకం

"నా దనేది విడిచి ఈశ్వరార్పితంగా ఆచరింపబడే కర్మలు చిత్తశోధకమై ముక్తి సాధక మవుతాయని భగవాన్ రమణమహర్షులవారు తమ ఉపదేశసార గ్రంథంలో తెలుపుతారు.

రామబాణమునకు ఓటమి లేదు. అలాగే తనకూ ఓటమి లేదు అని భావిస్తున్నాడు హనుమంతుడు. ఇది ఆయనలోని అకుంఠిత విశ్వాసానికి తార్కాణము.

ఆధ్యాత్మిక సాధకునకు అతిప్రధానమైనది విశ్వాసము. తాను పరమాత్మను పొందగలననే దృఢవిశ్వాసం సాధకునకు ఉండాలి. తన సాధన విఫలం కాదు అనే దృఢభావన స్థిరంగా ఉండాలి. అప్పుడే సాధనలో ప్రగతి లభిస్తుంది.

"నేను రామబాణంలా వాయువేగంతో దూసుకుపోతాను. లంకలో సీత కనిపించక పోయిందా! అదే వేగంతో స్వర్గానికి వెళ్తాను. అక్కడ కూడా నా తల్లి కన్పించక పోయిందా, చేతులు కట్టేసి రావణుణ్ణే తీసుకువచ్చేస్తాను.

"ఏవిధంగా నైనా కార్యాన్ని సాధించి తీరుతాను. సీతమ్మతో తిరిగి వస్తాను. లేదా రావణునితో సహా లంకను కూడా పెల్లగించి తెస్తాను;" అని పలికి, మరొక విషయాన్ని ఆలోచించకుండా **(అవిచారయన్)** ఎగురుతున్నాడు.

ఎగిరే ముందు హనుమంతుడు ఆలోచనలన్నీ అరికట్టాడు. చిత్తవృత్తులను నిరోధించ గలిగినపుడే దైవకార్యం సఫలీకృత మవుతుంది. మనసులోని ఆలోచనలను పూర్తిగా నిరోధించి సాధన లాచరించుటకు సాధకులు పూనుకోవాలి. హనుమంతుని ఆదర్శంగా తీసుకోవాలి.

సాగరంపై సమీరకుమారుడు

తాను గరుత్మంతుని వంటి వాడినని భావించి హనుమంతుడు గొప్ప వేగంతో ఆకాశంలోకి ఎగిరాడు. ఆ వేగానికి మహేంద్రగిరిపై ఉన్న చెట్లన్నీ కొమ్మలను చేతుల్లా ముడుచుకొని నలువైపుల ఎగిరిపోయాయి. పక్షులతో, పువ్వులతో నిండిన ఆ చెట్లు హనుమంతుని వెంట ఎగిరిపోతూ ఉంటే,

ప్రస్థితం దీర్ఘమధ్వానం స్వబంధు మివ బాంధవాః

"ప్రయాణమై వెళ్తున్న బంధువును బంధువు లందరు వెంబడించి సాగనంపినట్లు హనుమంతుని వెంట నడిచాయి".

మద్దిచెట్లు, ఇతర గొప్ప వృక్షాలు సైన్యం రాజును అనుసరించినట్లు అనుసరించాయి. హనుమంతుడు పయనిస్తుండగా చుట్టూ పుష్పించిన వృక్షములు కదలిపోతుంటే అదొక అద్భుత సౌందర్య సన్నివేశంగా కనిపించింది.

హనుమంతుని వెంట పయనించే వృక్షాలను వర్ణించడములో మహర్షి మనకు రెండు ఉపమానములను ఇచ్చారు. 1. చుట్టాన్ని సాగనంపే బంధువులు. 2. రాజు వెంట నడిచే సైనికులు.

ఇరువురూ అనుసరించి వెళ్తారు. కానీ బంధువులు ప్రేమతో అనుసరిస్తారు. సైనికులు వృత్తిధర్మంగా వెళ్తారు. మొదటి వారిలో ప్రేమ, అవగాహన ఉంటుంది. రెండవ వారిలో అది ఉండదు. ప్రతిఫలాపేక్షే ఉంటుంది.

సాధుమహాత్ముల్ని అనుసరించే సాధకులలో కూడా ఈవిధంగా రెండు తెగలుగా ఉంటారు. అవగాహనతో గురువును అర్థం చేసుకొని ప్రతిఫలాపేక్ష లేకుండా, భక్తి ప్రేమలతో బంధువుల్లాగా వెంట నడిచేవారు ఉంటారు.

రెండవ తెగవారిలో తాత్కాలిక ఆవేశంతో కొందరు, పేరుప్రఖ్యాతుల నార్జించవచ్చని మరికొందరు, ఆర్థిక స్వప్రయోజనాలకు ఇంకకొందరు అనుసరిస్తూ ఉంటారు. ఇవి తీరనపుడు మహాత్ములకు దూరమవుతూ వుంటారు. వారిలో కొందరు నిందించి దూరమవుతారు. మరికొందరు దూరమై నిందిస్తారు. బంధుప్రేమతో జీవించేవారు మాత్రము ఈవిధమైన బంధాలలో చిక్కరు.

మహామేఘంలా గోచరిస్తున్న హనుమంతునిపై చెట్లనుండి రాలిన పువ్వులు, పూలరేకులు, మొగ్గలు పడడంవల్ల, రాత్రిపూట మిణుగురు పురుగులతో పర్వతం శోభించినట్లు హనుమంతుడు ప్రకాశించాడు.

హనుమంతుని వెంట చెట్లే గాక ఆయన పాదతాకిడికి నుగ్గైన పర్వత మన్ను కూడా ఎగిరివెళ్ళింది. ఆ మట్టి వెళ్తూఉంటే భూదేవి వాయుపుత్రుని అనుసరించినట్లు ఉంది. "వాయనా! ఉండు. నేనూ వస్తా! నా బిడ్డ ఎలా ఉందో! ఒక్కసారి నా ముద్దుల కూతురుని చూసి వస్తా"నంటూ భూదేవి కూడా వెళ్ళినట్లుంది.

హనుమంతుడు చాలా దూరము వెళ్ళాడు. వెంబడించిన చెట్లు వేగము తగ్గి సాగరంలో పడిపోయాయి. ప్రియమైన బంధువు దేశాంతరము వెళ్ళినప్పుడు అతని బంధువులు దుఃఖ సాగరంలో మునుగునట్లు హనుమంతుడు వెళ్ళగా చెట్లన్నీ సముద్రంలో పడిపోయాయి.

హనుమంతునితో పాటు ఆయన తొడల వేగానికి ఎగిరి వెళ్ళిన చెట్లనుండి రాలిన రంగురంగుల పూలు సముద్రముపై పడ్డాయి. అప్పుడు సాగరము నక్షత్రాలతో కూడిన ఆకాశం లాగా ప్రకాశించింది.

హనుమంతుడు వాయువేగంతో పయనిస్తున్నాడు. చేతులు ముందుకు చాచి వాయుపుత్రుడు పోతూ వుంటే పర్వతముపైనుండి బయటకు వచ్చిన ఐదుతలల మహాసర్పం లాగా కన్పిస్తున్నాడు.

ఆయన కళ్ళు పచ్చగాను, గుండ్రముగాను వుండి ఉదయించిన శశిసూర్యులవలె ప్రకాశిస్తున్నాయి. ఆకాశములో తేలిపోతున్న హనుమంతుని తోక పైకి ఎత్తబడి ఇంద్రధ్వజము లాగా ప్రకాశిస్తోంది. ఆ లాంగూలము చక్రాకారంగా హనుమంతుని ఆవరించి ఉంది. ఎఱ్ఱని ముక్కుతో శోభిస్తున్న హనుమంతుని ఎఱ్ఱని ముఖము సంధ్యారాగముతో కూడిన బాల సూర్యబింబంలా అగుపిస్తోంది.

హనుమంతుడు అలా పయనిస్తూ ఉండగా ఆయన చంకల సందుల నుండి దూసుకుపోతున్న గాలి మేఘగర్జనంలా శబ్దము చేస్తోంది. ఆ మహాత్ముడు ఆకాశంలో ఎగురుతూ ఉంటే, సముద్రంపై పడిన ఆయన నీడ గాలికి నడుస్తున్న పెద్ద తెరచాప ఓడలా కన్పించింది.

వాయుపుత్రుడు ఆకాశాన ఎగురుతూ ఉంటే ఒకొక్కసారి సముద్రాన్ని త్రాగేస్తున్నట్లు అనిపిస్తుంది. ఒకొక్కసారి ఆకాశాన్ని మింగేస్తున్నట్లు అనిపిస్తుంది. అంటే హనుమ తన ప్రయాణంలో ఒకేవిధంగా పయనించడం లేదని మనకు అర్థమౌతూ ఉంది. క్రిందికి దిగుతూ, పైకి ప్రాకుతూ పయనిస్తున్నాడని గోచరమౌతూ ఉంది. కనుకనే క్రిందికి వచ్చునపుడు సముద్రాన్ని పానంచేస్తాడా అన్నట్లు, పైకి వెళ్ళేటప్పుడు ఆకాశాన్ని మింగేస్తాడా అన్నట్లు కన్పిస్తున్న దంటాడు వాల్మీకి.

హనుమంతుడు ఎటు వెళ్తూ వుంటాడో ఆ ప్రదేశము కలత చెందుతూ ఉంది. ఆయన వేగానికి సాగర తరంగాలు ఉవ్వెత్తున పర్వతమంత ఎత్తుగా లేస్తూ ఉంటే, ఆ కెరటాలను తన వక్షస్థలంతో ఢీకొంటూ ముందుకు పోతున్నాడు మారుతి.

ఈవిధంగా తన వేగంతో సాగరమునుండి లేచిన పెద్దపెద్ద కెరటాలను హనుమంతుడు లాక్కొని పోతూవుంటే భూమ్యాకాశాల మధ్య నీరు చెల్లాచెదరై, అంతటా చిమ్మబడుచూ, ఉద్యానవనాలలో శోభించే నీరుచిమ్ము గొట్టాలను గుర్తు తెస్తున్నాయి.

సాగరజలమంతా వాయువేగానికి ఆకాశానికి లేస్తూ ఉంటే, వస్త్రాన్ని ఊడబెరకగానే మానవుని దేహావయవములు కన్పించునట్లు, సాగరములో మొసళ్ళూ, తాబేళ్ళూ, మత్స్యములూ కన్పిస్తున్నాయి. అవి కలత చెందుతూ ఉంటే, వస్త్రహీనులైన మానవులు సిగ్గుపడి అటూ ఇటూ కదలినట్లుంది.

సాగరములోని గొప్పగొప్ప సర్పాలు ఆకాశంలో పయనించే హనుమంతుని చూచి గరుత్మంతుడేమో నని భీతి చెందాయి. ఆ కేసరీనందనుడు పయనిస్తూ ఉంటే ఆకాశంలో రెక్కలు లేని పర్వతము ఎగిరినట్లుంది. ఆయన ఏ మార్గాన పయనిస్తూ ఉంటే ఆ మార్గంలో క్రిందనున్న సముద్రము తొట్టి లాగా తయారవుతూ ఉంది.

సముద్రములో హనుమంతుని ఛాయ ముప్పది యోజనముల పొడవు, పది యోజనముల వెడల్పు ఉన్నట్లు చెబుతాడు వాల్మీకిమహర్షి. ఇంత పెద్దదిగా నీడ ఉన్నది కనుక హనుమంతుడు సముద్రలంఘనము చేసింది ఉదయమే నని అన్పిస్తోంది. అప్పుడే నీడ చాలా పొడవుగా పడుతుంది.

ఆకాశం లోని మేఘమండలము మధ్య మారుతి వెళ్ళేటప్పుడు

ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చన్ద్రమా ఇవ లక్ష్యతే

"మేఘాల వెనుకకు వెళ్ళినపుడు కనిపించక, మళ్ళీ మేఘాల నుండి బయటకు వచ్చి కనబడుతూ, చంద్రుడు మేఘమండలంలో ప్రయాణము చేస్తున్నట్లు అగుపించాడు. దేవతలూ, గంధర్వులూ, యక్షులూ ఆయనపై పుష్పవృష్టిని కురిపించారు.

హనుమంతుడు గగనవిహారం చేస్తూ ఉండగా, ఆ మహాత్మునికి కష్టం కలగకూడదని సూర్యుడు చల్లబడ్డాడు. ఆయన సుఖాన్ని వృద్ధి చేయడానికి వాయువు మెల్లగా వీచాడు. రామకార్యం సిద్ధించాలని అందరూ సహకరించారు.

భగవత్సేవలో శ్రమించే వారికి అందరూ సహకరిస్తారు. భగవంతుడు అందరివాడు. ఆయన కార్యము అందరిది. కనుక అందరూ తమ స్వంత కార్యాల వలె భగవత్కార్యాలలో సహకరిస్తారు. అలా కాకుంటే, సాధువులు లోకకల్యాణానికి దోహదపడే కార్యాల్ని సమాజంలో ఆవిష్కరించగలరా?

హనుమంతుడు శ్రమ లేకుండా **(విగతక్లమమ్)** అనాయాసంగా పయనిస్తున్నాడు అంటాడు వాల్మీకి. నిజమే! భగవత్సేవలో శ్రమ ఎందుకుంటుంది? అది శ్రమ తెలియని పరిశ్రమ. అలసట నెరుగని ఆనందము.

హనుమంతుని ప్రయాణాన్ని చూచి నాగులు, యక్షులు, దేవతలు, పక్షులు, ఋషులు, గంధర్వులూ, సర్పులూ అచ్చెరువంది హనుమంతుని ప్రశంసించారు. సమీరకుమారునికి సత్కారం చేయాలని సాగరుడు సంకల్పించాడు.

ఆతిథ్యాలు - అవరోధాలు

"హనుమంతుడు రామదూత. రామకార్యార్థమై సముద్రలంఘనం చేస్తున్నాడు. ఇతనికి సాయం చేయడం నా ధర్మం. రామకార్యంలో నా వంతు పాత్రను నేను పోషించాలి.

"పూర్వము ఇక్ష్వాకు వంశంలో జన్మించిన సగరుడు నన్ను వృద్ధి చేశాడు. ఇక్ష్వాకువంశ తిలకమైన రాముని కార్యాన్ని సఫలం చేయుటకు ఈనాడు హనుమంతుడు లంకకు వెళ్తున్నాడు. రామకార్యార్థమై వెళ్తున్న ఆంజనేయునికి నేను సాయం చేయకపోతే లోకం నన్ను నిందిస్తుంది. ఆంజనేయుడు అలసట లేకుండా పయనించాలి. నామీద కొంచెంసేపు విశ్రమించి వెళ్ళేలా నేను సహకరిస్తాను" అని సాగరుడు విశాలభావకు డయ్యాడు.

సాగరుడు ఈవిధంగా ఆలోచించి తనలో మునిగియున్న మైనాకపర్వతముతో భాషించాడు.

"ఓ మైనాక! పర్వతరాజా! పాతాళంలో ఉన్న రాక్షసులు పైకి రాకుండా ఇంద్రుడు నిన్ను ఇక్కడ అడ్డంగా ఉంచాడు. పైకి, క్రిందికి, అడ్డానికి పెరిగే శక్తి నీకు వుంది. కనుక నా మాటను శ్రద్ధగా ఆలకించి, నీవు పైకి లే!

"పరాక్రమశాలి, బుద్ధిశాలి, రామదూత అయిన హనుమంతుడు రామకార్యార్థమై గగనంలో విహరిస్తూ వస్తున్నాడు. నీ మీదుగా వస్తున్నాడు. ఇక్ష్వాకువంశ రాజులు నాకు పూజ్యులు. నీకు పూజ్యతములు. వారి కార్యార్థమై వెళ్తున్న హనుమంతునికి సాయం చేయడం మన ధర్మం.

కర్తవ్య మకృతం కార్యం సతాం మన్యు ముదీరయేత్

"చెయ్యవలసిన పని చెయ్యకపోతే పెద్దలు కోపగించుకుంటారు."

"మైనాకుడా! నీవు సాగరజలాల నుండి పైకి లే! పూజనీయుడైన మన అతిథి హనుమంతుడు నీ మీద కొంతసేపు విశ్రమిస్తాడు. అలసట తీరిన తరువాత ప్రయాణం సాగిస్తాడు.

"మైనాకా! రాముడు సాధుసత్తముడు. సీతమ్మ కష్టాల్లో ఉంది. ఈ మహత్కార్యంలో పయనించే ఆంజనేయునకు అలసట కలిగితే కలుగవచ్చు. ఈ మూడు విషయాల్ని మనసులో ఉంచుకొని నీవు పైకి లే!" అన్నాడు సాగరుడు.

సాగరుని మాటలు విని శ్రేష్ఠమైన మైనాకపర్వతం పైకి లేచింది. బంగారు శిఖరాలు గల ఆ మైనాకపర్వతం సముద్రజలాలను చీల్చుకొని పైకి వచ్చింది. వెంటనే ఆకాశమంతా స్వర్ణకాంతితో ధగధగమని మెరిసిపోయింది.

ఉన్నతమైన ఆ మైనాకపర్వతాన్ని హనుమంతుడు చూశాడు. తనకు విఘ్నం కల్పించాలని ఆ పర్వతం ఎదురుగా వచ్చిందని భావించాడు. అంతే. గాలి మేఘాన్ని చెదరగొట్టినట్లు, తన వక్షస్థలముతో మైనాకుని ఢీకొని క్రిందికి పడగొట్టాడు. హనుమంతుని వేగాన్ని తెలిసికొని మైనాక సంతోషించింది.

నీళ్ళలో పడిన మైనాక మళ్ళీ పైకి లేచి, గగనమున సంచరిస్తున్న హనుమంతుని సమీపించింది.

"వానరోత్తమా! రాముని వంశములోని వారు పూర్వము సముద్రాన్ని వృద్ధి చేశారు. రామ కార్యార్థమై వెళ్తున్న నీకు సేవ చేయాలని సాగరుడు అభిప్రాయ పడ్డాడు. నీకు సహాయము చేస్తే, రఘువంశీయులకు సహాయము చేసినట్లు అవుతుందని సాగరుడు భావించాడు.

కృతేచ ప్రతి కర్తవ్యం ఏష ధర్మః సనాతనః

"మేలు చేసిన వారికి తిరిగి మేలు చేయడం ప్రాచీనమైన ధర్మము. నూరు యోజనముల దూరము నీవు ప్రయాణం చేయాలి. కొంతసేపు నీవు విశ్రమించి వెళ్తే బావుంటుందని సముద్రుని అభిప్రాయము.

"కపివరా! ఇక్కడ తియ్యనివి, మంచి పరిమళము గలవి అయిన కందమూల ఫలా లున్నాయి. వాటిని ఆరగించు. కొద్దిసేపు విశ్రమించి వెళ్ళు.

దుష్కరం కృతవాన్కర్మ త్వమిదం వానరోత్తమ
నిపత్య మమ శృంగేషు విశ్రమస్వ యథా సుఖమ్

"వానరోత్తమా! నీవు ఎవ్వరూ చేయలేని పని చేశావు. నా శిఖరాల మీద వాలి సుఖంగా విశ్రమించు. తరువాత వెళ్దువు గానీ!

"కపిశ్రేష్ఠుడా! మరొక విషయం కూడా నువ్వు గమనించాలి. నీకూ మాకూ దగ్గర సంబంధ ముంది. నీవు మాకు అతిథివి. అతిథి సామాన్యుడైనా అతనిని దేవునిలా చూడమంటుంది సనాతన ధర్మము. అందులో నీలాంటి శ్రేష్ఠపురుషుడు అతిథిగా వచ్చినపుడు వేరే చెప్పాలా!

"అయ్యా! దేవతలలో శ్రేష్ఠుడైన వాయుదేవుడు నీ తండ్రి. వేగంలో నీవు అతనితో సమానుడవని ప్రత్యక్షంగా మేము చూస్తున్నాము. నిన్ను పూజిస్తే వాయుదేవుని పూజించినట్లే. కనుక నీకు ఆతిథ్య మిచ్చి నిన్ను గౌరవించాలని నేను కుతూహల పడుతున్నాను. దానికి కారణం కూడా ఉంది. చెబుతాను. విను.

"పూర్వము పర్వతాలకు రెక్కలు ఉండేవి. అందుచేత గిరులు విహంగాల వలె ఆకాశంలో విహరిస్తూ ఉండేవి. వాటిని చూచి, అవి ఎక్కడ పైన పడతాయో అని దేవ, ఋషి గణాలు భయపడుతుండేవారు.

వారి భయాన్ని పోగొట్టాలని భావించిన దేవేంద్రుడు వజ్రాయుధంతో పర్వతపక్షాలను ఖండించాడు. నా పక్షములను ఖండించాలని ఇంద్రుడు నన్ను సమీపిస్తూ ఉండగా, వెంటనే మీ తండ్రియైన వాయుదేవుడు నన్ను దూరంగా కొనిపోయి సాగరంలో పడేశాడు. అందుచేత నా పక్షములు నశింపకుండా ఉన్నాయి.

"కపిశ్రేష్ఠుడా! నాకు సాయం చేసిన వాయుదేవుడు నాకు పూజ్యుడు. ప్రత్యుపకారంగా అతిథివైన నిన్ను సేవించాలని నేను భావించాను. అయ్యా! దయచేసి నీవు మా ఆతిథ్యమును స్వీకరించు. నాకు, సముద్రునికి సంతోషాన్ని, సంతృప్తిని కలిగించు. మా సేవలు అందుకో. కాసేపు విశ్రమించి వెళ్ళు" అన్నది మైనాక.


మైనాకుని మాటలను ఆలకించిన హనుమంతుడు చిన్న చిన్న వాక్యాలతో, పొడి మాటలతో, విడి పలుకులతో సమాధానం చెప్పడం గమనించదగిన విశేషం. సాధారణంగా మనం ఏదైనా తొందర పనిమీద వెళ్ళేటప్పుడు ఆత్మీయులైనా సరే, పిలిచి మాట్లాడగనే, వారికి చిన్న చిన్న మాటలతో తొందరగా సమాధానం చెప్పి వెళ్తూవుంటాము. ఇక్కడ హనుమంతుడు అలాగే చెబుతాడు మైనాక పర్వతముతో. ఆయన పొడి వాక్యాలలోని సౌందర్యాన్ని చూడండి.

ప్రీతోఽస్మి కృతమాతిథ్యం మన్యురేషోఽపనీయతాం ॥
త్వరితే కార్యకాలో మే అహశ్చాప్యతి వర్తతే
ప్రతిజ్ఞాచ మయా దత్తా న స్థాతవ్య మిహాన్తరే ॥

"సంతోషం(**ప్రీతోఽస్మి**).ఆతిథ్య మిచ్చినట్లే (**కృతమాతిథ్యం**). కోప్పడకు (**మన్యురేషో ఽపనీయతాం**). చాలా తొందర పని ఉంది (**త్వరితే కార్యకాలోమే**). ప్రొద్దుపోతోంది (**అహశ్చాప్యతి వర్తతే**). నేను శపథం చేశాను (**ప్రతిజ్ఞాచ మయా దత్తా**). మధ్యలో ఆగకూడదు (**న స్థాతవ్య మిహాన్తరే**)".

ఈవిధంగా విడి మాటలతో, పొడి పలుకులతో మైనాకునికి సమాధాన మిచ్చి, ప్రేమతో మైనాకుని శిఖరాలను స్పృశించి, ఆనందంతో ఆకాశమార్గాన ముందుకెళ్ళాడు ఆంజనేయుడు. సాగరమైనాకులు హనుమంతుని విషయంలో సంతసించి ఆశీర్వాద వాక్యములతో గౌరవించారు.

అవసరమైన కార్యమును సాధించుటకు తొందరగా మనం వెళ్ళేటప్పుడు ఎదురుగా వచ్చి పలకరించిన స్నేహితుని, "అవసరమైన పని ఉంది-మళ్ళీ వస్తాను" అని అతని భుజం తట్టి వెళ్ళువట్లు, ఆంజనేయుడు మైనాకుని భుజం తట్టి ముందుకెళ్ళడం చాలా ముచ్చటగాను, వాస్తవంగాను కనిపిస్తోంది.



ఈ మైనాకుని సన్నివేశము ద్వారా మనం గ్రహించవలసిన సదుపదేశాలు కూడా ఉన్నాయి.

సముద్రుడు తెలిపిన అతిథిపూజ, మైనాకుడు చూపిన కృతజ్ఞత పరమ ఆదరణీయాలు. వీటిని సనాతన ధర్మాలన్నాడు వాల్మీకి. ఇంటికి వచ్చిన అతిథిని గౌరవించడం, ఉపకారికి ప్రత్యుపకారం చేయడం ఈ రెండు ధర్మాలను మనం ఈ సందర్భములో అవగతం చేసికొని వంటపట్టించుకోవాలి.

ఇక హనుమంతుని విషయానికొస్తే, కర్తవ్యదీక్ష ప్రధానంగా తెలుస్తూ ఉంది. ప్రభు కార్యంలో వ్యక్తిగత సుఖాలకు విలువ నివ్వకూడదు. తన సుఖాల వల్ల ప్రభుకార్యానికి ఆలస్యం జరుగకూడదనే గొప్ప ఆదర్శమును హనుమంతుడు ప్రదర్శించాడు.

ఆధ్యాత్మిక సాధకులు కాలాన్ని సద్వినియోగ పరచుకోవాలి. శ్రమలకు జంకకూడదు. అలసటలను, ఆవేదనలను దగ్గరకు రానివ్వకూడదు. అప్పుడే ఆంజనేయుని లాగా మనం కూడా కార్యసిద్ధిని పొందగలం.

సాధకులైన వారు గాని, సాధువులు గాని ఇక్కడ మరొక సూక్ష్మవిషయాన్ని గ్రహించాలి. ఆధ్యాత్మికంగా శ్రమించే వారిని చూసి ఆత్మీయు లైనవారు దిగులు చెందుతూ ఉంటారు. ఇలా కష్టపడితే ఆరోగ్యం చెడిపోదూ! శ్రమకు తగ్గ విశ్రాంతి కావాలి. ఆహారం కావాలి అంటూ ఏవేవో తినిపిస్తుంటారు. వాళ్ళ మాటల నాలకిస్తూ పోతే చివరికి పెరిగేది దేహమే కాని ప్రతిభ కాదు.

ఆత్మీయులైనా సరే, ఈ విషయంలో సాధకులు లేదా సాధువులు స్వీయనిర్ణయాలతో వర్తిస్తూ ఉండాలి. మైనాకుడు ప్రేమతో ఆతిథ్య మిచ్చినా ఆంజనేయుడు అంగీకరించలేదు. ఆతిథ్యాన్ని నిరాకరించి ఆదరణను స్వీకరించాడు. తన దారిలో తాను వేగాన్ని పుంజుకున్నాడు.

మైనాకపర్వతము బంగారు శిఖరాలతో శోభిస్తూ ఉండింది. ఆధ్యాత్మిక సాధకునకు ప్రథమ విఘ్నము కాంచనమే. "నన్ను పొంది విశ్రమించు - నన్ను పొంది సుఖించు" అని సాధకుని ఉద్రేక పరుస్తుంది. ఈవిధమైన ఉద్రేకానికి లొంగిన వారు ఉన్నతిని సాధించలేరు.

సాధారణంగా లౌకికులు కూడా అంటూ ఉంటారు. "ఏదోనండి. నాలుగు రాళ్ళు వెనకేసుకుంటే, ఆ తరువాత కడుపులో చల్ల కదలకుండా విశ్రాంతి తీసుకోవచ్చు. కృష్ణ రామ అనుకుంటూ పడి ఉండొచ్చు" అని.

ఆచరణలో ఇది ఎంత కష్టమో మనం నిత్యజీవితంలో అనేక మందిని చూస్తూ ఉంటాము. నాలుగు రాళ్ళు వెనకేసుకోవడం కాదు కదా, నాలుగు వందల రత్నాలు ముందేసు కున్నా వారికి శాంతి ఉండదు. విశ్రాంతి ఉండదు.

"ఇంకా - ఇంకా" అనే పంకా తిరుగుతూనే ఉంటుంది. ఆశకు అంతముండదు. రామకృష్ణ పరమహంస చెప్పినట్లు ఏడు గోతాల వాడి కథలాగే ఉంటుంది.

కనుక సాధకులైన వారు కాంచనానికి లొంగకూడదు. ధనం విశ్రాంతి నిస్తుందనేది కల్ల. విశ్రాంతిని దూరం చేసేదే ధనం. అందుకని హనుమంతుడు మైనాకుని ఆతిథ్యాన్ని స్వీకరించనూ లేదు. అలాగని నిరాకరించనూ లేదు. చేత్తో స్పృశించి వదలిపెట్టాడు. తన మనసును ఖాళీగా ఉంచుకున్నాడు. అందువల్లనే తేలికగా తేలిపోయాడు ఆకాశంలో.

సాధుమహాత్ముల దగ్గరికి మనం వెళ్ళినప్పుడు మనం ఏది సమర్పించినా వారు స్పృశించి ప్రక్కవారికి ఇస్తూ ఉంటారు. వారు తినరు. దాచుకోరు. మనసును వాటి మీదికి వెళ్ళనివ్వరు. వేటినీ మనసులోనికి రానివ్వరు. అందుచేత వారి మనసులో సదా రాముడే ఉంటాడు. శ్యాముడే ఉంటాడు. శివుడే ఉంటాడు.

హనుమంతుని వేగాన్ని చూచి దేవతలు, సిద్ధులు, గంధర్వులు ఆలోచించారు. ఎలాగైనా హనుమంతుని పరీక్షించాలని భావించారు. నాగమాత యైన సురసతో ఇలా పలికారు.

"సురసా! వాయుపుత్రుడైన హనుమంతుడు గొప్ప వేగంతో సముద్రాన్ని దాటుతున్నాడు. నీవు పర్వతమంత రూపాన్ని ధరించు. భయంకరమైన రాక్షసి రూపంలో ఆకాశమంత నోరు తెరచుకొని అతని ప్రయాణానికి విఘ్నము కలిగించు. ఏదైనా ఉపాయం పన్ని హనుమంతుడు నిన్ను జయించి ముందుకు వెళ్తాడా? లేక దిగులుపడి ఆగిపోతాడా? చూడాలని మేము కుతూహల పడుతున్నాము".

దేవతల మాటలను ఆలకించిన సురస వెంటనే వారు చెప్పిన రూపాన్ని ధరించింది. హనుమంతునికి అడ్డుగా వచ్చి నిలిచింది.

"వానరోత్తమా! ఆగు. నిన్ను దేవతలు నాకు ఆహారంగా ఇచ్చారు. నిన్ను తినేస్తాను. నా నోట్లోకి రా!" అంది సురస.

సురసను చూచి హనుమంతుడు భయపడలేదు. చేతులు జోడించి సురసకు నమస్కరించాడు పవనసుతుడు. "అమ్మా! నేను రామకార్యార్థమై వెళ్తున్నాను. ఈ మహత్కార్యానికి నీ వంతు నీవు కూడా సాయం చేయాలి. ఒకవేళ నీకు నా మాట సమ్మతం కాకపోతే, నన్ను విడిచిపెట్టు. సీతమ్మను దర్శించి, ఆ వార్తను రామునికి వినిపించి, వెంటనే వచ్చి నీ నోట్లో ప్రవేశిస్తాను. ఇది నా శపథం. నమ్ము" అన్నాడు హనుమ.

"ఓ కపివరా! అదేం కుదరదు. నీవు నా నోట్లో పడాల్సిందే" అని పలికి దేహాన్ని పెంచేసింది సురస.

"నీవు ఎంత విశాలంగా పెరిగినా నన్ను మ్రింగలేవు. చూడు నా శక్తి" అని మనసులో రాముని స్మరిస్తూ దేహాన్ని పెంచాడు వాయునందనుడు కూడా.

సురసాదేవి అంతకన్నా ఎక్కువగా దేహాన్ని పెంచింది. హనుమంతుడు క్రుద్ధుడై ఇంకా పెంచాడు తన శరీరాన్ని. అంతకు మించి మళ్ళీ పెరిగింది సురస. హనుమంతుడు ఇంకా. సురస మరింకా.

ఆధ్యాత్మిక సాధనలో ప్రగతినిరోధకమైన అనేక విఘ్నాలు వస్తుంటాయి. విఘ్నాలు కల్పించే వారితో ఘర్షణకు దిగితే మన కాలమూ వృథా అవుతుంది. బలమూ క్షీణిస్తుంది.

అలాంటి పరిస్థితులు ఎదురైనపుడు ఒకటే మార్గముంది. వాళ్ళవైపు చూడకుండా మన భక్తిని హనుమంతుని లాగా పెంచుకుంటూ పోవాలి. ధ్యానసమయాన్ని ఎక్కువ చేయాలి. జపంలో మాలల సంఖ్య పెంచాలి. పూజాకాలాన్ని పొడిగించాలి. పెద్దగా సంకీర్తన చేయాలి. అంతే. వచ్చినవి వచ్చిన దారినే పోతాయి. మన దారి మనకు సుగమ మవుతుంది. సులభ మవుతుంది. సుఖప్రద మవుతుంది. శుభప్రద మవుతుంది.

సురస ఇంకా పెద్ద రూపాన్ని ధరించగనే హనుమంతుడు వెంటనే బొటనవ్రేలు వంటి ప్రమాణము కలవాడై సురస నోటిలోనికి ప్రవేశించి వెంటనే బయటకు వచ్చాడు.



"ఓ దాక్షాయణీ! సురసాదేవీ! నీ నోట్లోకి నన్ను రమ్మని పలికావు. నీవు చెప్పినట్లే నీ నోట్లోకి వెళ్ళి వచ్చాను. నీకు నమస్కారము. ఇక నన్ను వెళ్ళనీ," అన్నాడు ఆంజనేయుడు.

సురస తన నిజరూపమును ధరించింది. "వానరవీరా! సుఖంగా వెళ్ళిరా! సీతను ధర్మాత్ముడైన రామునితో చేర్చు" అన్నది. హనుమంతుడు చేసిన ఈ దుష్కర మైన కర్మకు దేవతలంతా హనుమను స్తుతించారు. పవనసుతుడు మళ్ళీ వేగాన్ని పుంజుకొని గగనవిహారం చేశాడు.

ఆధ్యాత్మిక ప్రయాణంలో సురస విఘ్నాన్ని కల్పించాలని చూస్తుంది. సురస ఎవరో కాదు. రసనేంద్రియమే సురస. షడ్రసోపేతమైన రుచులకు అలవాటు పడిన నాలుకే సురస.

రుచిని జయించినపుడే భగవంతుని మీద అభిరుచి ఏర్పడుతుంది. జిహ్వను జయించిన వాడు జగత్తునే జయించగలడు. హనుమంతుడు సురసను జయించినట్లు సాధకులు జిహ్వను జయించాలి. పాయసము కావాలని నాలుక కోరితే, తులసితీర్థాన్ని త్రాగించి తృప్తి చెందమని చెప్పండి.

పెడ్తూ పోతే నాలుక తింటూ నడుస్తుంది. చాలు అనదు. దానికి పెరిగే గుణమే కాని తరిగే గుణ ముండదు. కొందర్ని చూస్తే చాలా ఆశ్చర్యమేస్తుంది. స్నేహితులతో మాట్లాడుతూ మధ్యమధ్యన గడ్డిపోచలు లాగి నములుతూ ఉంటారు. మొక్కలు త్రుంచి, ఆకులు త్రుంచి నములుతూ ఉంటారు. ఇదంతా సురస యొక్క కార్యమే.

రసనేంద్రియానికి రసపానం చేయించాలి. రామనామ రసపానం చేయించాలి. పానకము త్రాగించాలి. రామనామ పానకం త్రాగించాలి. గోపన్న అలాగే త్రాగించాడు తన నాలుకకు నామపానకాన్ని.

'నేనొనరించు పాపము లనేకము లైనను నాదు జిహ్వకుం బానక మయ్యె
మీ పరమ పావన నామము'

అని భద్రాచల రామదాసు దాశరథీశతకంలో రచించారు.

హనుమంతుడు ఆకాశంలో చాలా ఎత్తున వేగాన్ని పుంజుకుంటూ ముందుకు సాగుతున్నాడు. అలా పయనిస్తున్న పవనసుతుని సింహిక అనే రాక్షసి చూసింది. చాలా కాలానికి మంచి భోజనము దొరికిందని సంతోషించింది.

సింహిక హనుమంతుని నీడను పట్టుకొని లాగుతూ ఉంది. హనుమంతుని వేగం తగ్గుతోంది. అది ఆంజనేయుడు గుర్తించాడు. ఎదురుగాలికి ఓడ వేగము తగ్గినట్లు తన పరాక్రమము తగ్గిపోతూవుందని ఆంజనేయుడు గుర్తించాడు. పైకి, క్రిందికి, అడ్డానికి చూశాడు.

లవణసాగరంలో ఒక పెద్ద జంతువు రూపము కన్పించింది హనుమకు. తన నీడను ఆకర్షిస్తూ వేగాన్ని నిరోధిస్తున్నది ఆ జంతువే నని గ్రహించాడు. సుగ్రీవుడు చెప్పిన జంతువు ఇదే అని పోల్చుకున్నాడు. అది సింహికయే నని భావించి వర్షాకాలంలో మేఘం లాగా తన దేహాన్ని విస్తృతం చేశాడు.

అది చూచిన సింహిక తన నోటిని పాతాళం లాగా తెరచింది. మేఘగర్జనం చేస్తూ హనుమంతుని వద్దకు పరుగెత్తింది. హనుమంతుడు పూర్వం లాగా తన దేహాన్ని హ్రస్వంగా మార్చి సింహిక నోటిలో ప్రవేశించాడు.

సింహిక దేహంలో ప్రవేశించిన హనుమంతుడు వాడియైన గోళ్ళతో ఆమె శరీరంలోని గుండెను, మర్మస్థానాలను చీల్చేశాడు. వాయువేగంతో మళ్ళీ బయటకు వచ్చేశాడు.

సింహిక మరణించి క్రిందపడింది. దేవ సిద్ధ గంధర్వాదులు హనుమంతుని ప్రశంసించారు. గొప్ప దుష్కరమైన కర్మ నాచరించినట్లు శ్లాఘించారు. హనుమంతుని లాగా ధైర్యము, సూక్ష్మదృష్టి, బుద్ధి, నేర్పు అనే నాలుగు లక్షణాలు ఎవరిలో ఉంటాయో అట్టివారు ఏ కార్యమునైనా సాధించగలరు అని పలికారు.

సింహిక విచిత్రమైన రాక్షసి. కనుక భూమిపై నుండాలి. అలా ఉండక సాగరంలో జీవిస్తుంది. తాను ఉండవలసిన చోట ఉండదు. పోనీ ఉన్నచోట తృప్తిగా ఉంటుందా? అసలుండదు.

సముద్రంలో ఎన్నో ప్రాణు లున్నాయి. సింహిక వాటిని భక్షించదు. ఆకాశంలో ఎగిరే పక్షుల్ని లాగికొని భక్షిస్తుంది. అందువలన దీని బ్రతుకే ఒక విచిత్రం.

సింహిక ఎవరో కాదు. అసూయ. అసూయ ఎప్పుడూ ఎవరో ఒకర్ని హింసిస్తూనే ఉంటుంది. హింసకు అలవాటు పడింది కనుకే అది సింహిక.

తనకన్నా ఉన్నతుల్ని చూసి సహించని గుణమే అసూయ. కనుకనే అసూయా ప్రతిరూపమైన సింహిక సాగరములోని ప్రాణుల్ని భక్షించకుండా ఎత్తైన ప్రదేశాన ఎగిరే పక్షుల్ని పట్టి భక్షిస్తుంది.

ఉన్నతస్థాయిలో ఉన్నవారిని చూచి అసూయాపరులు సహించలేరు. క్షణంలో సింహికలుగా మారుతారు. ఉన్నతుల ఔన్నత్యాన్ని పాడుచేయడానికి నీడలా ఉంటారు. సింహిక కూడా నీడనే పట్టుకొని హనుమను ఆకర్షించింది.

అసూయాపరులు ఆత్మజ్ఞానాన్ని పొందలేరు. హనుమంతుడు సింహికను వధించినట్లు సాధకులు అసూయారోగాన్ని పోగొట్టుకోవాలి. అసూయను దూరం చేసుకున్న వారే ఆచార్యుల కృపకు, ఆదిదేవుని కృపకు పాత్రులై తరిస్తారు.

ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యా మ్యనసూయవే

"అర్జునా! నీవు అసూయ లేని వాడవు కనుక రహస్యమైన ఈ జ్ఞానాన్ని నీకు బోధిస్తున్నాను" అని ప్రవచించాడు గీతలో శ్రీకృష్ణపరమాత్మ.

హనుమంతుడు సింహిక నోటిలో ప్రవేశించి, సింహిక దేహాన్ని చీల్చుకొని బయటకు వచ్చాడు. సముద్రలంఘనం ప్రారంభించే ముందు తాను రామబాణంలా సాగిపోతానని శపథం చేశాడు.

తన శపథం భగ్నం కాకుండా వ్యవహరించాడు. హనుమంతుడు ఆగలేదు. సింహిక నోటిలో ప్రవేశించి బయటకు రావడం అనేది ఒక మలుపు తిరగడం వంటిదే గాని ఆగడం మాత్రం కాదు.

హనుమంతుడు నూరు యోజనములు దాటాడు.

రామభక్తి విశేషముచే హనుమంతుడు నూరు యోజనముల పొడవుగల సాగరాన్ని సునాయాసంగా దాటేశాడు. ఇదంతా రామభక్తి వైభవమే. ఈ విషయాన్ని త్యాగరాజస్వామి ఒక కీర్తనలో గానం చేస్తారు.

అప్ప రామభక్తి యెంతో గొప్పరా మా || యప్ప ||
త్రిప్పటలను దీర్చి కంటి రెప్ప వలెను గాచుమా || యప్ప ||
కపి వారిధి దాటునా కలికి రోట గట్టునా
అపరాధి త్యాగరాజు కానందము చాలునా మా || యప్ప ||

రామభక్తి ఎంత గొప్పదో వర్ణించలేక తన్మయు లౌతున్నారు త్యాగరాజస్వామి.

వానరుడు వారిధిని దాటాడా? రామకార్యము అనగానే తాను వానరుడని మరచిపోయాడు హనుమంతుడు. వాలాన్ని జాడించి దేహాన్ని పెంచేశాడు. అనాయాసంగా అంభోధిని దాటేశాడు. ఇదంతా భక్తి వైభవమే నంటారు త్యాగరాజస్వామి.

శ్రీకృష్ణపరమాత్మను యశోద రోటికి బంధించింది కదా! చతుర్దశ భువనాలను తన కుక్షిలో నింపుకున్న పరమాత్మను త్రాటితో కట్టి బంధించడము భక్తివైభవమే కదా! అంటారు త్యాగరాజస్వామి.

అపరాధములు చేసిన వారిని కూడా రామభక్తి ఉద్ధరిస్తుంది అనడానికి తానే ప్రబల తార్కాణమంటూ తన భక్తిహృదయ వైశాల్యాన్ని వ్యక్తం చేశారు త్యాగరాజస్వామి.

అక్కడొక గొప్ప వనం కన్పించింది. హనుమంతుడు క్రిందికి దిగాడు. అక్కడ అనేక వృక్షములచే మనోహరంగా కప్పబడియున్న లంకాద్వీపము గోచరించింది.

హనుమంతుడు తన దేహాన్ని ఆపాదమస్తకం పరీక్షించి చూసుకున్నాడు. ఇంత పెద్ద దేహాన్ని చూసి రాక్షసులు సందేహిస్తారని భావించాడు. వెంటనే దేహాన్ని తగ్గించాడు. అవిద్యను పోగొట్టుకొనిన ఆత్మజ్ఞాని స్వరూపానుభూతిని పొందినట్లు, హనుమంతుడు తన నిజరూపాన్ని పొందాడు.

హనుమంతుడు గొప్పదైన పర్వతముపై దిగాడు. ఆ పర్వత శిఖరాగ్రమున ఉన్న లంకా పట్టణాన్ని చూశాడు.

ఇక్కడికి సుందరకాండములో ప్రథమసర్గ పూర్తయింది. హనుమంతుడు సాగరాన్ని దాటి లంకలో ప్రవేశించాడు.

ఈ సర్గలో 'దుష్కరమ్' అనే పదాన్ని నాలుగుచోట్ల ఉపయోగించాడు వాల్మీకి. దుష్కరమైన నాలుగు కార్యాలు హనుమంతుడు సాధించినట్లు చెబుతాడు. అవి 1. అవరోధము లేకుండా సాగరాన్ని లంఘించడం. 2. మైనాకపర్వతాన్ని వక్షస్థలంతో ఢీకొని పడగొట్టడం. 3. సురస నోటిలో ప్రవేశించి బహిర్గతం కావడం. 4. సింహికను వధించడం.

ప్రతి సాధకుడు దుష్కరమైన ఈ నాలుగు కార్యాలను ధృతి, దృష్టి, మతి, దాక్ష్యము లనే నాలుగు లక్షణముల ద్వారా సాధించాలని హనుమ ఆచరించి చూపాడు.

లంకాప్రవేశం

మరొకరికి సాధ్యము కాని సముద్రలంఘనం చేసి, అలసట లేకుండా చేరి, త్రికూట పర్వతము మీదున్న లంకాపట్టణాన్ని చూశాడు హనుమంతుడు. అక్కడున్న వృక్షాలన్నీ హనుమంతునిపై పూలను రాల్చాయి. అదొక పూలవానలా ఉండింది. రాలిన పువ్వులచే కప్పబడిన పవనసుతుడు గుట్ట పోసిన పూలకుప్పలా అగుపించాడు.

"నేను ఎన్నో వందల యోజనాల దూరము దాటగలను. నూరు యోజనముల దూరము గల ఈ సముద్రము నాకొక లెక్కా!" అని భావించాడు హనుమ. అతడు సాటిలేని పరాక్రమవంతుడు. ఎగిరే వాళ్ళలో శ్రేష్ఠుడు. కనుకనే సునాయాసంగా సాగరాన్ని దాటి లంక చేరాడు.

కపివరుడు పర్వతాల మీద సంచరించాడు. పుష్పించిన చెట్ల మీద విహరించాడు. వనాలను, గాలిచే మెల్లగా కదులుతున్న వివిధ వృక్షాలను, పద్మములు, కలువలతో నిండిన సరస్సులను, మైదానాలను, నదులను, చెరువులను చూసుకుంటూ సాగిపోయాడు సమీర నందనుడు.

అందమైన లంకానగరాన్ని చూశాడు ఆంజనేయుడు. లంక చుట్టూ కలువలతో, పద్మాలతో శోభిస్తున్న అగడ్త ఒకటుంది. రావణుడు సీతను అపహరించి ఉన్నాడు కనుక రాముడు ఏ క్షణాన్నైనా రావచ్చునని భావించి లంక చుట్టూ ఆయుధములు ధరించి రాక్షసులు కాపలా ఉన్నారు. నగరం చుట్టూ బంగారు ప్రాకార ముంది.

లంకానగరంలో భవనాలు చాలా ఎత్తుగా ఉన్నాయి. శరత్కాల మేఘాల్లాగా తెల్లగా ఉన్నాయి. ఏడు, ఎనిమిది అంతస్తుల మేడ లున్నాయి. అది దేవేంద్రుని అమరావతియా! అన్నట్లుంది.

ఆ పట్టణము అందమైన పడుచులా అనుతోంది. ప్రాకారమే దాని జఘనం. చుట్టూ వున్న అగడ్తలో నిండియున్న జలము దానికి వస్త్రము. ఆయుధాలే శిరోజాలు. బురుజులే కుండలాలు. ఈవిధంగా స్త్రీ లా వెలిగిపోతూ, ఆకాశంలో ఎగిరిపోతున్నదా అన్నట్లున్న లంకా నగరాన్ని చూశాడు హనుమ. ఉత్తరద్వారము వద్దకు వెళ్ళాడు.

విశ్వకర్మ ఒకప్పుడు నిర్మించిన లంకాపట్నంలో శూలాలు, ఆయుధాలు ధరించి సంచరిస్తున్న భయంకరమైన రాక్షసుల్ని చూసి, పాములు కాపలా వున్న గుహలా భావించాడు లంకను. దాని చుట్టూ ఏర్పాటు చేసియున్న రక్షకుల్ని, చుట్టూ ఉన్న సముద్రాన్ని చూచి హనుమంతుడు ఇలా భావించాడు.

"వానరు లందరూ ఇక్కడికి వచ్చి మాత్రం ఏం చేస్తారు? ఈ లంకలోని రాక్షసుల్ని దేవతలు కూడా ఓడించలేరు. ఇతరు లెవ్వరూ ప్రవేశించడానికి అవకాశం లేకుండా రావణుడు పాలిస్తున్న ఈ లంకకు వచ్చి రాముడు మాత్రం ఏమి చెయ్యగలడు? ఈ రాక్షసుల విషయంలో సామ దాన భేద దండోపాయాలేవీ పని చెయ్యవు.

"వానరులలో కూడా అందరూ ఇక్కడికి చేరలేరు. అంగదుడు, నీలుడు, ధీమంతుడైన సుగ్రీవుడు, నేను మాత్రమే చేరగలము;" అని ఆలోచిస్తున్నాడు ఆంజనేయుడు.

లంకానగరము త్రికూటపర్వతము మీద ఉంది. స్థూల, సూక్ష్మ, కారణ దేహముల సంఘాతమే త్రికూటము. దేహంలో వివిధ అవయవాలు అందంగా అగుపిస్తూ మోహాన్ని కలిగించినట్లు లంకానగర శోభ మోహాన్ని కల్పిస్తోంది.

లంకను చూచిన హనుమంతుడు "దీనిని జయించడం సాధ్యమా!" అనే ఆలోచనలో పడ్డాడు. నిజమే. దేహభ్రాంతి అలాంటిది. దానిని అందరూ జయించలేరు.

శక్యతే ఘన కల్లోలా భీమా లంఘయితుం నదీ
న తు తారుణ్య తరలా తృష్ణా తరలితాన్తరా ।

"మహా కల్లోలమై, భయంకరమైన నదిని దాటవచ్చునేమో గాని యౌవనముచే చంచలమై, భోగతృష్ణచే కలుషితమైన దేహభ్రాంతి అనే సంకల్పాన్ని మాత్రము దాటుట సాధ్యపడదు" అని యోగవాసిష్ఠము.

సముద్రాన్ని దాటి వానరు లందరూ రాలేరని భావిస్తున్నాడు హనుమంతుడు. అంగదుడు, నీలుడు, సుగ్రీవుడు, హనుమంతుడు మాత్రమే సాగరాన్ని దాటి రాగలరు అని అభిప్రాయ పడ్డాడు.

అవును. భవసాగరాన్ని అందరూ దాటలేరు. కొందరే దాటగలరు. వారే ఈ నలుగురు. ఈ నలుగురిలో ఏ ఒక్కరిలా కాగలిగినా అట్టివారు అవలీలగా దాటగలరు.

గ్రీవము అంటె మెడ లేక కంఠము. సుగ్రీవుడు అంటె చక్కని కంఠము గలవాడు అని అర్థము. అనగా నామయోగి అని అర్థము. ఎవడైతే భగవన్నామమును సదా కీర్తించుచుండునో అట్టివాడు దేహభ్రాంతిని తొలగించుకొని భవసాగరాన్ని దాటుతాడు. నామయోగి మనసు సదా నామము నందు రమించునే కాని అన్యవిషయముల మీదికి పోదు.

జహీ మధుకర్ అంబుజ రసఖాట్
క్యోం కరేల ఫలధావై
సూరదాస ప్రభు కామధేను తజీ
చేరీకౌన్ దుహోయీ...........
మేరో మన అనతకహా సుఖ్ పాయో
జైసె ఉడిజహాజ్ కో పంఛీ
పుని జహాజ్ పై ఆవె *॥ మేరో ॥*

"పద్మము వందలి మకరందాన్ని త్యజించి తుమ్మెద తుమ్మచెట్టు నాశ్రయిస్తుందా! కామధేనువు సమీపమునవే ఉండగా మేకపోతు గళమున వున్న కుచములను పిండుకొనే అవసర మేముంది?

నా మనసు మరొకచోట సుఖించలేదు.

నావను విడిచి ఎగిరిన పక్షి మళ్ళీ నావనే ఆశ్రయించినట్లు నా మనసు పరమాత్మ పాదాలనే ఆశ్రయించి ఉంటుంది" అని గానం చేశాడు సూరదాస్.

సుగ్రీవుని లాగే అంగదుడు కూడా దాటగలడు. 'అం' అంటే ఆద్యుడు లేదా పరమాత్మ. 'గద' అంటే స్తుతించువాడు అని అర్థము. అనగా స్మరణభక్తుడు. భగవంతుని ఎవరైతే సదా స్మరిస్తూ ఉంటారో వారే అంగదులు.

స్మరణ కీర్తనల యందు లగ్నమైన మనసుగల అంగద సుగ్రీవుల వలె నీలుడు, ఆంజనేయుడు కూడా దాటగలరు. నీలుడు అగ్నిదేవుని కుమారుడు. అగ్ని పవిత్రమైనది. పవిత్రతను సూచిస్తుంది.

న హి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే

"జ్ఞానాని కన్నా పవిత్రమైనది ఈ ప్రపంచములో మరొకటి లేదు అని భగవద్గీత. కనుక జ్ఞానమార్గంలో చరించు నీలుడు కూడా దాటగలడు.

ఆంజనేయుడు మంత్రస్వరూపుడు. యంత్రము నీటిని పైకి పంపునట్లు, మంత్రము జీవన ప్రవాహాన్ని ఊర్ధ్వంగా తిప్పుతుంది. కనుక మంత్రము నాశ్రయించిన వారు కూడా భవసాగరాన్ని దాటగలరు. దేహభ్రాంతిని జయించగలరు.

ఈవిధంగా సుగ్రీవుడు, నీలుడు, అంగదుడు, హనుమంతుడు-ఈ నలుగురు మాత్రమే దాటగలరని భావించిన ఆంజనేయుడు మళ్ళీ తనలో తాను ఇలా ఆలోచించుకున్నాడు.

"ఈ ఆలోచన లన్నీ ఇప్పుడెందుకు? ఇంతకీ సీత బ్రతికి ఉందో లేదో ముందు తెలుసుకోవాలి. నేను ఎలాగైనా లంకాపట్టణములో ప్రవేశించాలి. ఈ లంకను రక్షిస్తున్న రాక్షసులు బలవంతులు. అంతే కాదు. క్రూరులు కూడా. ఈ రూపంతో లంకలో ప్రవేశించుట నాకు సాధ్యము కాదేమో!

"ఈ రాక్షసులు ఉగ్రతేజులు. మహావీర్యులు. వీళ్ళని ఏమరచి సీతను వెదకాలి. ఇది చాలా పెద్ద కార్యము. దీనిని సాధించాలంటే నేను చిన్న రూపాన్ని ధరించాలి. ఎలాగైనా ఈ రాత్రికే నేను లంకలో ప్రవేశించాలి. ఇదియే నాకు తక్షణకర్తవ్యం;" అని నిర్ణయించుకొని దురాధర్షమైన లంకానగరంలో ప్రవేశించడము ఎలాగా అని హనుమంతుడు ఆలోచించ సాగాడు.

లంకలో ప్రవేశించగనే గొప్పదైన సాగరాన్ని దాటి ఎవరెవరు రాగలరు? అని ఆలోచించాడు. ఇది భావికార్యము. భావస్వప్నము. సాధారణంగా భవిష్యత్తులో ఎలా ఉంటుందా? అనే విషయము పైననే సాధకులు తమ దృష్టిని మరల్చి ఆలోచిస్తూ ఉంటారు. ఈ ఆలోచనా సుడిలో పడి ప్రశస్తమైన వర్తమానాన్ని పాడుచేసుకుంటూ ఉంటారు.

అందుకే హనుమ వెంటనే ఆలోచనా ప్రవాహాన్ని నిరోధించాడు. సీతమ్మ జీవించి ఉందో లేదో ముందుగా తెలుసుకోవాలి. ఇప్పుడు అప్రస్తుతమైన ఆలోచన లెందుకు? అని మనసును వారించాడు. ఆలోచనా మార్గాన్ని మార్చుకున్నాడు.

అనవసరమైన ఆలోచనలు మనసులో సాగకుండా సాధకులు జాగ్రత్తపడాలి. ఆంజనేయుని వలె అంతరేక్షణ జరుపుకొని ఎప్పటికప్పుడు మనసును శుద్ధి చేసుకుంటూ పోవడం అలవరచుకోవాలి.

"రావణుడు దురాత్ముడు. వాడికి తెలియకుండా సీతను వెదకాలి. ఎలా? నా ప్రవర్తన వల్ల మహాత్ముడైన శ్రీరాముని కార్యము విఘ్నం కాకూడదు. దేశకాలాదులు గమనించకుండా ప్రవర్తించే దూత, సూర్యోదయం అంధకారాన్ని పోగొట్టునట్లు కార్యాన్ని పాడుచేస్తాడు.

"దూత చేయవలసిన కార్యాన్ని ప్రభువులే నిర్ణయిస్తారు. అయినా బుద్ధిలేని దూత వల్ల కార్యము విఫల మౌతుంది.

ఘాతయన్తి హి కార్యాణి దూతాః పండిత మానినః

"మేము గొప్ప తెలివిగల వాళ్ళము అని విర్రవీగే దూతలు కార్యాన్ని పాడుచేస్తారు.

"రావణుణ్ణి వధించాలని రాముడు సంకల్పించి ఉన్నాడు. నన్ను రాక్షసులు చూశారంటే రామకార్యం చెడిపోతుంది. అయినా రాక్షసుల కంట పడకుండా లంకలో ప్రవేశించడం సాధ్యం కాదేమో! వీళ్ళకు తెలియకుండా లంకలో గాలి కూడా దూరలేదు అనిపిస్తోంది.

"ఈ రూపంతో నేను ఇక్కడుంటే ప్రమాదం తప్పదు. నేను ఎలాగైనా రాముని కార్యం సాధించాలి. నేను చిన్నవాణ్ణయి పోతాను. రాత్రికి లంకలో ప్రవేశిస్తాను. రావణుడి ఇల్లంతా గాలిస్తాను. సీతమ్మను చూస్తాను;" అని ఆలోచించిన ఆంజనేయుడు సూర్యాస్తమయానికి నిరీక్షిస్తున్నాడు.

హనుమంతుడు గొప్ప దేహము కలవాడు. సముద్రలంఘనంలో పర్వతరూపుడై ప్రకాశించాడు. అట్టి అద్భుతరూపుడైన హనుమంతుడు చిన్నవాడుగా మారాలని సంకల్పించాడు.

పెద్ద మనసు గలవారే చిన్నవారుగా చరించాలని సంకల్పిస్తూ ఉంటారు. చరిస్తూ ఉంటారు కూడాను. అలా చిన్నవారైనపుడే పెద్దపెద్ద కార్యాలను సాధించ గలుగుతారు. అహంకారాన్ని ప్రక్కకు నెట్టి తాను చిన్నవాడినని ఎవరు భావిస్తారో అట్టివారే ఆధ్యాత్మిక జీవనంలో కృతకృత్యు లవుతారు. నమ్రత నాశము నెరుగదు.

సూర్యే చాస్తం గతే రాత్రౌ దేహం సంక్షిప్య మారుతిః
వృష దంశక మాత్రః సన్ బభూ వాద్భుత దర్శనః

"సూర్యుడు అస్తమించాడు. రాత్రి పడింది. హనుమంతుడు తన శరీరాన్ని పిల్లి అంత చిన్నదిగా మార్చాడు. అద్భుతదర్శనుడై కనిపించాడు".

హనుమంతుని అద్భుత దర్శనుడుగా వర్ణించిన ఈ శ్లోకమే చాలా అద్భుత మైనది. హనుమంతుడు లంకలో ప్రవేశించడానికి సూర్యాస్తమయం కొరకు నిరీక్షించాడు.

సాధారణంగా ఒక క్రొత్త ప్రదేశానికి వెళ్ళేటప్పుడు చీకటి పడకముందే వెళ్ళాలని మనం త్వరపడుతూ ఉంటాం. కానీ ఇక్కడ విచిత్రమైన విషయం చీకటి పడాలని ఎదురు చూడడం. ఇదొక సౌందర్యం.

సజ్జనుల్ని కనుగొనడానికి చీకటి పడక ముందే ప్రయత్నించాలి. దుర్జనుని కనిపెట్టాలంటే చీకటి పడినపుడే సాధ్యం. పగలంతా మంచిగా చరిస్తూ, రాత్రి కాగానే చెడును ఆవిష్కరించుకుంటూ దుర్జనులు అలమటిస్తూ ఉంటారు.

రావణుడు దుర్జనుడు. దుర్మార్గుడు. దురాత్ముడు. అట్టి వానిని పరిశీలించి పరీక్షించ డానికి రాత్రివేళే అనువైన సమయము.

రాత్రి అంటే చీకటి ఆవరించిన సమయము. అజ్ఞానమే చీకటి. అజ్ఞానము ఆవరించిన వేళ జీవులు మోహములో చిక్కుకొని ఉంటారు.

అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జంతవః

"అజ్ఞానముచే ఆవరించబడి జీవులు మోహమును పొందుచున్నారు" అని భగవద్గీత-కర్మసన్యాసయోగములో భగవానుడు తెలుపుతాడు.

రాత్రివేళ జీవులు అజ్ఞాన మోహాదులలో మైమరచి ఉంటారు. సత్యాన్ని అన్వేషించడానికి సాధకునకు అనువైన సమయము అదే. అందుచేత తన అన్వేషణను రాత్రి సమయము నందే కొనసాగించాలని హనుమంతుడు నిర్ణయించుకున్నాడు.

ఈ విషయాన్ని సత్యాన్వేషణ చేయు సాధకుని స్థాయినుండే గాక, సత్యదర్శనము చేయు జ్ఞానియొక్క స్థాయి నుండి కూడా పరిశీలించాలి. అందరూ నిద్రించే వేళ జ్ఞాని జాగరణలో ఉంటాడు. అందరూ దీప్తులైన సమయంలో జ్ఞాని సుప్తుడై ఉంటాడు.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః

"సర్వభూతములకు ఏది రాత్రియో దానిలో జ్ఞాని మెలకువతో ఉంటాడు. భూతములకు ఏది పగలో దానిని జ్ఞాని రాత్రిగా దర్శిస్తాడు." అని భగవద్గీత-సాంఖ్యయోగము నందు చెప్పబడింది.

అనిత్యమైన దృశ్యమాన జగత్తును నిత్యమని భ్రమించి, విషయాభిలాషులు విషయ సుఖాలలో రమిస్తూ ఉంటే, జ్ఞాని అట్టి జీవనానికి విలక్షణుడై ఉంటాడు. జ్ఞానికి అది రాత్రి లాంటిది.

అలాగే ఏ బ్రహ్మానందస్థితి విషయాభిలాషులకు అంధకార బంధురమై రాత్రిలా గోచరిస్తూ ఉంటుందో అట్టి దివ్యస్థితిలో జ్ఞాని సదా ఓలలాడుతూ ఉంటాడు. అది పగలు వలె అతనికి సుస్పష్టం. అనుభవ రూపం

ప్రబుద్ధోఽపి సుషుప్తిస్థః సుషుప్తిస్థః ప్రబుద్ధవాన్
తుర్య మాలంబ్య కాయాన్త స్తిష్ఠామి స్తంభితస్థితిః

"నేను మేల్కొని యున్నను గాఢనిద్రయందు ఉన్న వానివలె ఉన్నాను. గాఢనిద్ర యందున్నను మేల్కొని యున్నాను. నేను తురీయస్థితిని ఆలంబనముగా చేసికొని దేహమునందు స్థిరముగా యున్నాను" అని అన్నపూర్ణోపనిషత్తు.

లంకలో ప్రవేశించాలని నిశ్చయించుకొనిన తరువాత హనుమంతుడు పిల్లి అంత చిన్న దేహాన్ని ధరించాడని **(వృషదంశక మాత్రః సన్)** అద్భుతంగా అగుపిస్తున్నాడని **(బభూవాద్భుత దర్శనః)** వాల్మీకి వర్ణించాడు.

పిల్లిని ఇక్కడ ఉపమానంగా గ్రహించడం ఒక విశేషం. ఎన్నో జంతువు లుండినా హనుమంతుడు పిల్లి అంత దేహాన్నే ధరించాలని అభిప్రాయపడడం ఆయన సునిశిత ప్రజ్ఞా విశేషానికి నిదర్శనం.

చీకటిలోని వస్తువులు మన కంటికి కనిపించవు. కానీ పిల్లికి సుస్పష్టంగా గోచరిస్తాయి. హనుమ చీకట్లో అన్వేషించాలని నిర్ణయించుకున్నాడు. కనుక మార్జాలము వలె వెళ్ళడం సందర్భోచితం. కనుకనే హనుమను అద్భుతదర్శనుడుగా వర్ణించాడు వాల్మీకి.

అద్భుతదర్శనుడు అంటే అద్భుతముగా అగుపించువాడు అని ఒక అర్థము. అద్భుతమును దర్శించువాడు అని మరొక అర్థము. ఈ రెండవ అర్థమును బట్టి చూస్తే ఈ ప్రపంచంలో అద్భుతమైనది ఏది? అది ఆత్మయే.

తదాది మధ్యాన్త విహీన మేకం విభుం
చిదానంద మరూప మద్భుతం ॥

"పరమాత్మ ఆదిమధ్యాంత రహితుడు. అద్వయుడు. సర్వవ్యాపి. చిదానంద స్వరూపుడు. రూపరహితుడు. అద్భుతమైన వాడు" అన్నది అథర్వణవేదము. కనుక ఆత్మయే అద్భుత మైనది. అట్టి ఆత్మను దర్శించినవాడు కనుక హనుమంతుడు అద్భుతదర్శనుడు.

హనుమంతుడు సముద్రమును దాటే సమయంలో పర్వతరూపుడై గోచరించాడు. ఇప్పుడు అతి సూక్ష్మమైన రూపాన్ని ధరించాడు.

ఘనకీర్తి శోభిస్తుండినా లఘుజీవనానికి అలవాటుపడిన వారే ఆధ్యాత్మికంగా అభివృద్ధిని సాధిస్తారు. ఒక్కసారి ఉన్నతుడు అనిపించుకొనిన వ్యక్తి సామాన్యుడుగా చరించ లేడు. భక్తులే అలా ఉండగలరు. జ్ఞానులే అలా చరించగలరు. వారి ఔన్నత్యాన్ని మరచి సాధారణంగా జీవించడం లోనే వారి అసాధారణ ప్రతిభ ఇమిడి ఉంది. నమ్రత తెలిసిన బ్రతుకులే నాణ్యంగా ప్రకాశిస్తాయి. భగవద్గీతలోని క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము నందు శ్రీకృష్ణ పరమాత్మ తెలిపిన అమానిత్వాది లక్షణాలు ఈవిధమైన ప్రవర్తననే ప్రోత్సహిస్తున్నాయి. ధృవీకరిస్తున్నాయి.

పొద్దు పోయింది. హనుమంతుడు తొందరగా ఎగిరి లంకలో ప్రవేశించాడు. ఎత్తైన మేడలు కన్పించాయి. కొన్ని భవనాలు బంగారు స్తంభాలతో, కొన్ని భవనాలు వెండి స్తంభాలతో శోభిస్తున్నాయి. ఆ భవనాల మీద పసిడి కుండలు ప్రకాశిస్తున్నాయి. వైడూర్య మాణిక్యములచే పైభాగము గచ్చు చేయబడి ఉంది. గృహద్వారాలన్నీ బంగారుతో చేయబడి ఉన్నాయి. అక్కడంతా బలవంతులైన రాక్షసులు కాపలా ఉన్నారు.

కాంచన మున్నచోట కాపలా తప్పదు. కాంచనాన్ని హిందీలో **"సోనా"** అంటారు. 'సోనా' అంటే బంగారము అని ఒక అర్థము. నిద్ర అని మరియొక అర్థము. ఈ రెండిటిలో ఒకటుంటే మరొకటుండదు. బంగారు (సోనా) వచ్చింది అంటే నిద్ర (సోనా) పోయిందని భావము. అందుకే కదూ! డబ్బున్న వారికి నిద్ర పట్టదు. ఒకవేళ అతను నిద్రించినా, కాపలా వాడన్నా మేల్కొని ఉంటాడు.

కాంచనానికి కడదశ కల్లోలమే. బ్రతుకుకు గమ్యం భగవంతుడు కావాలే గాని బంగారము కాకూడదు. 'లంక' లో కాంచనము కావలసినంత. 'లంక' అనే పదంలో అంతంలో 'క' కార ముండడమే ఒక విశేషము.

'క' కారము ఒక నగరానికి కాని, లేదా దేశానికి గాని చివర ఉంటే ఆ నగరాలు లేదా దేశాలు కాంచనమయంగా ఉంటాయని చెప్తూ ఉంటారు. 'లంక', 'ద్వారక', 'అమెరికా' - ఇలాంటి పేర్లు విన్నప్పుడు అది నిజమే ననిపిస్తోంది.

బంగారున్నచోట భయం తప్పదు. కాంచనము కంగారు పుట్టించక పోదు. లంకలో ఉన్నంత కాపలా అయోధ్యలో లేదు. మిథిలలో కూడా మనం చూడలేదు. భయ మున్న చోటే భద్రత ఎక్కువగా ఉంటుంది.

అధర్మపరులకే భయం అధికంగా ఉంటుంది. కనుక వారికే భద్రత కూడా ఎక్కువగా అవసరమై ఉంటుంది. ధర్మాత్ములైన దశరథ జనకాదులకు భద్రత అవసరం లేదు. రావణాసురుడికి మాత్రం చాలా అవసరం. రావణాసురుని తరువాత అంత భద్రతా సిబ్బందిని మరి ఏ రాజ్యములోనూ మనం చూడలేకపోయాం. యుగాలు గడచిన తరువాత మళ్ళీ ఈనాడు ప్రజాస్వామ్య వ్యవస్థలో చూడగలుగుతున్నాం. యుగాలు నడిచినంత మాత్రాన చరిత్ర పునరావృతం కాకుండా ఉంటుందా! రావణుడి కాష్ఠం ఆరేది కాదంటారు కదా!

లంకాపట్టణ వైభవము వాయుపుత్రునికి విస్మయాన్ని కల్గించింది. మిశ్రమభావాలతో పతమత మయ్యాడు మారుతి. ఈ లంకను జయించుట సాధ్యమా! అనే శంకతో కూడిన దైన్యము ఒకవైపు, వైదేహిని వీక్షించ బోతున్నామనే ఆశతో కూడిన సంతోషము మరొకవైపు హనుమంతుని కదిలించి వేశాయి.

చంద్రోదయ మైంది. సహస్ర కిరణాలతో తారకల మధ్యకు తరలి వచ్చాడు తారాపతి. వెన్నెల అనే చాందనీతో లోకాన్ని కప్పేశాడు. హనుమంతునికి సాయం చేయడానికి వచ్చాడా! అప్పట్లున్న చంద్రుడు శంఖం లాగా, పాలలాగా, తామరతూడు లాగా తెల్లగా శోభించాడు. సరోవరంలో విహరించే రాజహంస లాగా ముచ్చటగా కన్పిస్తున్న చంద్రుని హనుమంతుడు చూశాడు.

గురుదేవుని సహాయం లేకుండా గమ్యాన్ని చేరలేము. లక్ష్యాన్ని సాధించలేము. గురు దర్శనం తరువాత ఆత్మదర్శన మవుతుంది. సాధకునకు గురుచంద్రుని దర్శన మైనట్లు ఆంజనేయునికి చంద్రదర్శన మైంది.

చంద్రుణ్ణి మనం చూడగలం. చంద్రుడు చల్లగా ఉంటాడు. ఆహ్లాదాన్ని కల్గిస్తాడు. సూర్యుణ్ణి మనం దర్శించలేము. కానీ చంద్రునికి వెలుగు సూర్యుని నుండి వచ్చిందే.

సూర్యుని ఎలా చూడలేమో, ఆత్మజ్ఞాన భాస్కరుని మనం చూడలేము. పరిమితమైన మన దృష్టి, అట్టి దృష్టికి ఆధారమైన ఆత్మను దర్శించలేదు.

అతః న వాక్ గచ్ఛతి యథా అగ్నిః దాహకః ప్రకాశకః
అపి సన్ నహి ఆత్మానం ప్రకాశయతి దహతి వా, తద్వత్

"ఎందువలన అనగా, దహించడం, ప్రకాశింప చేయడం అనే ఈ రెండూ స్వతస్సిద్ధమైన అగ్ని తనను తాను ఎలా దహింప చేసుకోలేదో, ప్రకాశింప చేసుకోలేదో, అలాగే సమస్తాన్ని ప్రకాశింప చేసే ఆత్మను వేరొక పదార్థము ప్రకాశింప చేయలేదు. ప్రవర్తింప చేయలేదు" అని శ్రీశంకరాచార్యుల వారు ఉపనిషద్భాష్యంలో చెబుతారు.

సూర్యుని చూడలేనట్లు ఆత్మను మనం దర్శించలేము. కానీ సూర్యుని ప్రకాశంతో భాసించే చంద్రుని మనం ఆనందంగా చూసినట్లు ఆత్మజ్ఞాన భాస్కరుని తేజముతో విరాజిల్లే

గురుచంద్రుని మనం దర్శించగలం. చంద్రుని లాగా చల్లనైన గురువు మనల్ని మెల్లమెల్లగా నడిపించి గమ్యాన్ని చేర్చుతాడు.

హనుమంతునికి చంద్రదర్శన మైంది. గురుసహాయంతో ఆత్మదర్శన మగునట్లు చంద్రుని సహాయంతో హనుమకు సీతమ్మ దర్శనం జరుగుతుంది అని భావము.

లంకలో లంకిణి

చంద్రోదయం కాగానే హనుమంతుడు లంకలో ప్రవేశించాడు. హాయిగా వీస్తున్న సముద్రగాలి వల్ల లంకాపట్టణము చల్లగా ఉంది. లంకలోని భవనాలు శరత్కాల మేఘాల్లా ప్రకాశిస్తున్నాయి. లంక చుట్టూ స్వర్ణ ప్రాకారముంది. మందమారుతం మెల్లగా వీస్తోంది. ఆ గాలికి మేడల బురుజులపై కట్టిన పతాకాల చిరుగంటలు మెల్లని సవ్వడితో మ్రోగుతున్నాయి.

పవనసుతుడు ప్రాకారాన్ని సమీపించాడు. లంకాపట్టణాన్ని చూచి హనుమంతుడు ఆశ్చర్యచకితు డయ్యాడు. నివ్వెరపోతూ అవలోకించాడు.

స్వర్ణమయమైన గృహద్వారాలు, వైడూర్య మాణిక్యాలు పొదిగిన అరుగులు, వజ్రాలతో, ముత్యాలతో గచ్చు చేయబడి యున్న ప్రదేశాలు, అక్కడక్కడ అందం కొరకు ఉంచబడిన బంగారు ఏనుగులు, హాయిగా విహరిస్తున్న క్రౌంచపక్షులు, మయూరాలు, రాజహంసలు - ఆశ్చర్యంతో అన్నివైపులా కలయచూశాడు కపివరుడు.

లంకలోని మేడలన్నీ గాలికి తేలిపోతూ గగనవిహారం చేస్తున్నట్లున్నాయి. నగరంలో సుశ్రావ్యంగా సంగీతధ్వనులు, ఆభరణాల గలగలలు విన్పిస్తున్నాయి. అదంతా చూసి హనుమంతుడు ఎంతగానో ఆనందించాడు.

"ఈ లంక చాలా ఉన్నతమైన పట్టణము. సిరిసంపదలతో తులతూగుతోంది. సుందరమై, శుభప్రదంగా ఉంది. ఆయుధాలు ధరించి బలవంతులైన రాక్షసులు సదా దీనిని రక్షిస్తున్నారు. ఈ నగరాన్ని ఎవరు బలంతో ఎదుర్కోగలరు?" అనే శంక కలిగి హనుమంతుడు దిగులుపడ్డాడు.

"ఈ లంక ఎంత గొప్పదైనా, బలం కలది అయినా రాముని పరాక్రమము ముందు, లక్ష్మణుని పరాక్రమము ముందు నిలువలేదు" అనే ఆలోచన రాగానే ఆనందంతో ఉప్పొంగి పోయాడు అంజనీసుతుడు.

సాధనదశలో సాధకుని మనసు అసంతృప్తికి గురిఅవుతూ ఉంటుంది. నేను భగవంతుని పొందగలనా? మాయను జయించగలనా? అజ్ఞానాన్ని అంత మొందించగలనా? అనే ప్రశ్నలు కదులుతాయి. వెంటనే ఆంజనేయుని లాగా, సాధకులు దిగులు పడుతూ ఉంటారు.

"రాముని పరాక్రమం లాగా భగవత్కృప నాకు తోడుగా ఉంటుంది. లక్ష్మణుని పరాక్రమము లాగా వివేకము నన్ను నడిపిస్తుంది" అనే భావన రాగానే నిరాశాపత్రాలు రాలిపోతాయి. ఆశాపల్లవాలు తొడుగుకుంటాయి.

హనుమంతుడు లంకలో ప్రవేశించాడు. లంకాధిదేవత కళ్ళల్లో పడ్డాడు. భయంకరమైన నోరు తెరచి, వికృతమైన నేత్రాలతో హనుమంతుని ముందు నిలబడింది. పెద్ద శబ్దం చేసింది.

కస్త్వం కేన చ కార్యేణ ఇహ ప్రాప్తో వనాలయ
కథయస్వేహ యత్తత్త్వం యావత్ప్రాణా ధరన్తి తే

"ఓ వనవాసీ! ఎవరు నువ్వు? ఏ పనిమీద వచ్చావు? నీ ప్రాణాలు నిన్ను వీడక ముందే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పు.

"ఈ లంక లోకి ప్రవేశించడం అంత సులభమైన పని కాదు. నా ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పు" అన్నది లంకిణి.

"ఇంతకీ, నువ్వెవరు? భయంకరంగా కన్పిస్తున్న నీవు నన్నెందుకు అడ్డగిస్తున్నావు?" అని ఎదురుప్రశ్న వేశాడు హనుమ.

"ఈ రాక్షసరాజ్యానికి రావణాసురుడు ప్రభువు. అతని ఆజ్ఞను అనుసరించి నేను ఈ లంకాపట్టణాన్ని రక్షిస్తూ ఉంటాను. నన్ను కాదని ఎవడూ లోనికి వెళ్ళలేడు. ఇప్పుడు చూడు. నిన్ను ఇక్కడే చంపేస్తాను. హాయిగా నిద్రపోదువు గానీ.

"వానరుడా! నేను నగరదేవతను. లంకిణీని. నువ్వు అడిగావు కనుక చెప్పాను. చెప్పు ఇక. నీ విషయ మేమిటి?" అన్నది లంకిణి.

"అబ్బే! ఏమీలేదు. ఈ లంకానగరము చాలా అందంగా ఉంది. చూడు, ఆ బురుజులు, ప్రాకారాలు, వనాలు ఎంత బావున్నాయో! చూడాలనిపించింది. ముచ్చటపడి వచ్చాను. చూడాలని చాలా సరదాగా ఉంది నాకు;" అన్నాడు హనుమంతుడు.

హనుమంతుని మాటలు విని మండిపడింది లంకిణి. "ఓరి! నీబుద్ధి మండ! వానరాధమా! నన్ను జయించకుండా ఎవ్వరూ లంకలో అడుగు పెట్టలేరురా!" అని గద్దించింది లంకిణి.

"హే శుభప్రదా! నా మాట విను. నేనేమీ చెయ్యను. ఒక్కసారి చూసేసి ఎలా వచ్చానో అలా వెళ్ళిపోతాను;" అన్నాడు ఆంజనేయుడు.

లంకిణి క్రుద్ధురాలైంది. భయంకరంగా అరుస్తూ ముందు కొచ్చి హనుమంతుని అరచేతితో చరిచింది ఒక దెబ్బ. ఆ దెబ్బకు వాయుపుత్రుడు పెద్దగా అరచాడు.

ఆంజనేయుడికి ఓపిక తగ్గింది. పౌరుషం పెరిగింది. ఎడమచేతి పిడికిలి బిగించుకుంది. పిడికిలితో ఒక్కదెబ్బ కొట్టాడు లంకిణిని. స్త్రీ అని అంతటితో సరిపెట్టుకున్నాడు.

హనుమంతుడు కొట్టగానే లంకిణి గిరగిర తిరిగి, ముఖాన్ని వికారంగా పెట్టి, కళ్ళు తిప్పేసి, దభామని పడింది నేలమీద. అది చూచి, "ఛీ! అనవసరంగా కొట్టాను అబలను" అని పశ్చాత్తాపం చెందాడు పవనసుతుడు.

లంకిణి భయపడి పోయింది. గర్వాన్ని గాలిలో కలిపేసింది. గద్గదస్వరంతో, "హరిసత్తమా! దయపెట్టు. కాపాడు. హే మహాబాహో! స్త్రీని వధించకూడదు అనే నియమాన్ని నీలాంటి వీరులు దాటవచ్చా!

"కపివరా! నేను లంకిణిని. నీవు గొప్ప పరాక్రమవంతుడివి. పైగా నన్ను ఓడించావు. నేనొక మాట చెప్తా. కుదురుగా విను.

"హరీశ్వరా! లోగడ బ్రహ్మదేవుడు నాకొక విషయం చెప్పాడు. నిజంగానే. ఏం చెప్పాడో తెలుసా! ఏరోజైతే ఒక వానరుడు నిన్ను ఓడిస్తాడో ఆరోజుతో రాక్షసులకు ఆయువు మూడినట్లే అన్నాడు.

"ఓ ప్లవంగమా! నిన్నిప్పుడు చూశాను. ఇక చూడవలసింది ఆ బ్రహ్మదేవుడు చెప్పిందే. ఇక లాభం లేదులే! బ్రహ్మ మాటకు తిరుగుంటాదా?

"సీత కారణంగా రావణునికి, వాడి కారణంగా రాక్షసు లందరికీ ఉపద్రవం చుట్టుకుంది. మరి, ఇంకా చూస్తావేం! పో! లోపలికి! చూడాల్సిందంతా చూడు. చెయ్యాల్సిందంతా చేసెయ్.

"నీకు తెలీదులే. ఇది నందికేశుని శాపం. నీకు ఇక అడ్డమే లేదు. నీ ఇష్ట మొచ్చినట్లు తిరుగు. సీత ఎక్కడుందో ముందు తెలుసుకో;" అన్నది లంకిణి. లంకిణి అలా పలికినా, హనుమంతుడు మాత్రం ద్వారము గుండా కాకుండా గోడ దూకి పట్టణంలో ప్రవేశించాడు.

సీతాన్వేషణ కార్యంలో నిమగ్నుడై యున్న హనుమంతుని లంకిణి అడ్డగించింది. లంకలో ప్రవేశించకుండా పెద్ద ఆటంకంగా నిలిచింది.

అహం తు నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ!

"ఓ వానరుడా! నేను లంకానగరాన్ని. ఇది వాస్తవం" అన్నది లంకిణి.

"అహం" అంటూ ప్రారంభించింది. ఇదియే అహంభావన."నేను"అనే దేహాత్మభావము.

లంకానగరాన్ని దేహంగా మనం తెలిసికొని ఉన్నాము. నేనే లంక అంటున్నది లంకిణి. ఇదియే దేహాత్మభావము.

సీతాన్వేషణలో హనుమంతునికి లంకిణి అవరోధము. సత్యాన్వేషణలో సాధకులకు అహంభావన ఆటంకము. లంకిణిని జయించనిదే హనుమంతుడు లోనికి ప్రవేశించలేడు. అహంభావాన్ని పోగొట్టుకోనిదే సాధకుడు అంతర్ముఖుడు కాలేడు. దేహాభిమానం గలవారు అవ్యక్తస్వరూపమైన ఆత్మను దర్శించలేరు.

క్లేశోఽధికతర స్తేషాం అవ్యక్తాసక్త చేతసాం
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భి రవాప్యతే ॥

అవ్యక్తమైన ఆత్మయందు మనసు నిలిపే వారికి కష్టము అధికంగా ఉంటుంది. అవ్యక్త పరబ్రహ్మము దేహాభిమానుల చేత అతికష్టంగా పొందబడుతూ ఉంది అని భగవద్గీత-భక్తియోగము.

లంకిణి హనుమంతుని **"కస్త్వం?"** నువ్వెవరు? అని ప్రశ్నించింది. **"కేన చ కార్యేణ ఇహప్రాప్తః"** ఏ పనిచేత ఇక్కడికి వచ్చావు? అని అడిగింది. హనుమంతుని **"వనాలయా"** వనవాసీ! అని సంబోధించింది. ఈ శ్లోకపాదాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి.

నువ్వెవరు? అని లంకిణి పవనసుతుని ప్రశ్నించిందే గాని, ఆయన ఎవరో కూడా ఆమే చెప్పేసింది. వనాలయా! వనము నందు సంచరించువాడా అని అర్థము.

"వనం" అంటే వననీయము, అనగా భజనీయము అనే అర్థాన్ని అరణ్యకాండము నందు శబరి వృత్తాంతములో చూశాము. "తద్వనం" అనే విషయాన్ని ముచ్చటించుకున్నాం.*

'వన' శబ్దము బ్రహ్మమునే సూచించింది కనుక వనాలయా! అనగానే కేనోపనిషత్తు ననుసరించి బ్రహ్మము నందు చరించువాడా అని అర్థము. బ్రహ్మవిదుడు అని భావము.

మరొక విచిత్ర మేమిటంటే, లంకిణీ పలికిన శ్లోకపాదంలో 'కేన' అనే పదం ఉండడము. 'వనం' అంటే బ్రహ్మము అనే భావం కేనోపనిషత్తులో నిర్దేశింపబడింది. ఆంజనేయుని వనాలయా! అని సంబోధిస్తూ, అదే శ్లోకపాదంలో 'కేన' అనే పదప్రయోగం జరగడం వల్ల హనుమంతుని బ్రహ్మవిదుడు గానే లంకిణి గుర్తించినట్లు స్పష్ట మౌతోంది.

లంకిణీని జయించి హనుమంతుడు లంకలో ప్రవేశించాడు. హనుమంతుని స్వేచ్ఛగా ప్రవేశించమని లంకిణీ చెప్పినా, హనుమంతుడు అలా వెళ్ళకుండా ప్రాకారం మీదుగా లంకలో ప్రవేశించాడు. లంకలో దిగేటప్పుడు ముందుగా ఎడమకాలు పెట్టి దిగాడు.

సుగ్రీవుని హితం కోరి హనుమంతుడు ఎడమకాలు ముందుగా పెట్టాడు అంటాడు వాల్మీకి. అదికూడా శత్రువుల శిరస్సు మీద పెట్టినట్లుంది అంటాడు. బుద్ధిమంతుడైన హనుమంతుడు బృహస్పతి వచనమును మనసులో పెట్టుకొని ఇలా చేశాడు.

ప్రయాణ కాలే చ గృహప్రవేశే వివాహ కాలేఽపి చ దక్షిణాంఘ్రిమ్
కృత్వాగ్రతః శత్రు పుర ప్రవేశే వామం నిదధ్యాపురతో నృపాలః

"ప్రయాణము చేసేటప్పుడు, గృహప్రవేశము నందు, కళ్యాణకాలమందు ముందుగా కుడికాలు పెట్టి ప్రవేశించాలి. శత్రువుల పురంలో ప్రవేశించునపుడు ముందుగా ఎడమకాలు పెట్టాలి" అని బృహస్పతి వచనము.

రామకార్యమును నెరవేర్చుట ద్వారా సుగ్రీవునికి హితము చేయాలని భావించి, రావణుని వినాశమును కాంక్షించి, శత్రువు తలపై పెట్టినట్లు లంకలో ఎడమకాలు పెట్టి లోనికి ప్రవేశించాడు.

మహేంద్రగిరి నుండి ఎగిరినది మొదలు రావణుని అంతఃపురములో ప్రవేశించే వరకు హనుమంతుడు మూడు విఘ్నాలను ఎదుర్కొన్నాడు. అవి 1. సురస 2. సింహిక 3. లంకిణి.

సురస ఆకాశంలో సంచరిస్తుంది. సింహిక నీటిలో చలిస్తుంది. లంకిణి నేలపై సంచరిస్తుంది.

ఉన్నతంగా కన్పించేది సురస. అగాధంగా అగుపించేది సింహిక. రెంటికి మధ్యలో గోచరించేది లంకిణి.

ఆకాశంలా విశాలమైనది, ఉన్నతమైనది మనస్సు. నీటిలా అగాధమైనవి, విషయాలు కనిపించగానే ద్రవీభవించేవి ఇంద్రియాలు. మృణ్మయమైనది, మట్టిలో పుట్టి మట్టిలో కలిసేది దేహము.

సురస మనసుకు సంకేతము. సింహిక ఇంద్రియాలకు ప్రతిరూపము. లంకిణి పాంచ భౌతిక శరీరానికి ప్రతీకము. ఈ మూడింటిని జయించిన వానికే సీతమ్మ దర్శనం లభిస్తుంది. దేహేంద్రియ మనోబుద్ధులను జయించిన వాడే ఆత్మదర్శనం చేయగలడు. ఈ మూడు స్థాయిలలో సాధకుడు ఉన్నతంగా చరించాలి.

---

* చైతన్యరామాయణం. ప్రథమభాగము ... పుట 518

సీతాన్వేషణము ప్రారంభించిన తరువాత హనుమంతుడు మూడు పర్వతాలను ఎక్కాడు. దేహము, ఇంద్రియాలు, మనస్సు అను ఈ మూడింటిలోను ఉన్నతుడుగా, అతీతుడుగా చరించాలి అనేదే అలా ఎక్కడములోని అంతర్భావము.

స్వయంప్రభను దర్శించే ముందు వానరులందరూ దాహంతో ఉన్నప్పుడు ప్రథమంగా పర్వత మెక్కారు. రెండవది మహేంద్రగిరి. మూడవది లంకలో అరిష్టగిరి.

అంతఃపురంలో ఆంజనేయుడు

లంకానగరం ఎంతో సుందరంగా ఉంది. ఏ గృహాన్ని చూసినా, లోపల నుండి నవ్వులు, వాద్యములు వినిపిస్తున్నాయి. రకరకాలైన అందమైన మేడలు చూస్తూ ముందుకు వెళ్ళాడు వాయుపుత్రుడు.

కొన్ని గృహాల్లో నుండి స్త్రీలు పాడుతున్నట్లు ధ్వనులు వినిపిస్తున్నాయి. ఐశ్వర్యవంతుల ఇళ్ళల్లో స్త్రీలు నడిచేటప్పుడు వినిపించే అందెల రవళులు, వడ్డాణం మువ్వల శబ్దాలు వినిపిస్తున్నాయి.

కొన్నిచోట్ల వైఖరీజప మంత్రాలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల రాక్షసులు వేదాలు వల్లెవేయడం వినిపించింది. రావణుని స్తుతిస్తున్న రాక్షసులు కూడా కొందరు కనిపించారు.

లంకలో అనేక విధాలుగా కనిపిస్తున్న రాక్షసులను చూశాడు హనుమంతుడు. కొందరు యజ్ఞదీక్షలో ఉండి జటలు ధరించి ఉన్నారు. కొందరు ముండనము చేయించుకొనియున్నారు. కొందరు దర్భలు చేతులలో పట్టుకొని ఉన్నారు.

కొందరు ఖడ్గములు, ధనుర్బాణములు, నూరుమందిని ఒకేసారి చంపగల శతఘ్నులనే ఆయుధములను ధరించి ఉన్నారు. కొందరు పుష్పమాలలు ధరించి, చందనాది సుగంధలేపనాలతో శోభిస్తున్నారు. దివ్యమైన ఆభరణాలను అలంకరించుకొని ఉన్నారు.

పురమధ్యమున లక్షమంది సైన్యము సదా సర్వసన్నద్ధముగా, సావధానంగా ఉండడం చూశాడు హనుమంతుడు.

పర్వతశిఖరము మీద మనోహరంగా ప్రకాశిస్తున్న రావణుని భవనాన్ని చూశాడు. దానికి సువర్ణ తోరణాలు వ్రేలాడుతున్నాయి. అది స్వర్గంలా భాసిస్తోంది. బలవంతులైన రాక్షసులు వేల సంఖ్యలో నిలబడి దానికి కాపలా ఉన్నారు. ఆ భవనంలోకి హనుమంతుడు రహస్యంగా ప్రవేశించాడు. రావణుని భవన ప్రాకారమంతా బంగారమే.

ఈలోగా చంద్రుడు ఆకాశం మధ్యకి చేరాడు. తెల్లని వెన్నెలను వెదజల్లుతున్నాడు ఆ చంద్రుడు. ఆవులమందలో పచారు చేయు ఆబోతు లాగా ముచ్చటగా కనిపిస్తున్నాడు చంద్రుడు.

చల్లని వెన్నెల రాత్రి చుక్కలతేడు తారాపథంలో వెలిగే ముచ్చటను ఎంతో సుందరంగా అంత్యానుప్రాసలతో వర్ణిస్తాడు ఆదికవి. ఇది సుందరకాండలో ఐదవ సర్గ.

హంసో యథా రాజత పంజరస్థః
సింహో యథా మన్దర కన్దరస్థః
వీరో యథా గర్విత కుంజరస్థః
చంద్రో విబభ్రాజ తథామ్బరస్థః

"వెండి పంజరంలో శోభిస్తున్న రాజహంస లాగా, మందరపర్వత గుహలో ప్రకాశించు సింహము లాగా, మదపుటేనుగు నెక్కి ఊరేగే వీరుని లాగా ఆకాశాన చంద్రుడు వెలిగి పోతున్నాడు."

చల్లని వెన్నెలను వర్షిస్తూ లోకుల బాధలను తొలగిస్తున్నాడు. ప్రాణులకు ఉల్లాసాన్ని కల్పిస్తున్నాడు. సముద్రాన్ని ఆనందంతో పొంగిస్తున్నాడు. అట్టి చంద్రుని చూశాడు హనుమంతుడు.

షోడశకళా పరిపూర్ణుడైన చంద్రుడు వాడియైన కొమ్ములు గల ఆబోతు లాగా, ఎత్తైన శిఖరాలు గల శ్వేతగిరిలా, బంగారుతొడుగు దంతాల ఏనుగులాగా గగనాన ప్రకాశిస్తున్నాడు.

ఆకాశాన మెల్లమెల్లగా చంద్రుడు పైకి వస్తూవుంటే పెద్ద రాతిబండపై నిలబడ్డ సింహం లాగా, సమరరంగాన ప్రవేశించిన గొప్ప ఏనుగు లాగా, సింహాసనాన్ని అధిష్ఠించిన రాజు లాగా ప్రకాశిస్తున్నాడు.

గగనాన చంద్రశోభ ఈవిధంగా ప్రకాశిస్తోంది. రాక్షసులు మాంసభక్షణము ప్రారంభించారు. ఇలా చూస్తూ నడుస్తున్నాడు హనుమంతుడు. కాలం గడచిపోతోంది. రాక్షసులు ఆదమరచి నిద్రిస్తున్నారు. దీర్ఘ నిఃశ్వాసములను విడుస్తున్న రాక్షసులతో లంకాపట్టణము బుసలుకొట్టే సర్పాలతో నిండిన మడుగు లాగా కనిపించింది.

హనుమంతుడు సుందర దేహములు గల ఎందరో స్త్రీలను చూశాడు. పుష్పాలతో కప్పబడిన పక్షుల్లాగా భర్తల ఒడిలో కూర్చుని యున్న స్త్రీలను కూడా చూశాడు. ఇందరు కనిపిస్తున్నారు కానీ సీతమ్మ జాడ మాత్రం తెలియలేదు. ఎన్నోచోట్ల వెదికాడు వాయుపుత్రుడు. సీతమ్మ కనిపించలేదు. చింతాక్రాంతు డైనాడు. కొన్ని క్షణాలు అలా జడునివలె ఉండిపోయాడు. సంతోష హీనుడయ్యాడు.

ఎలాగో ప్రయత్నించి చివరికి రావణుని అంతఃపురం లోనే ప్రవేశించాడు హనుమంతుడు. సింహాలు అడవిని రక్షించునట్లు బలవంతులైన రాక్షసులు ఆ రావణుని భవనాన్ని కాపలా కాస్తున్నారు.

రావణుని భవనానికి ఉన్న ముఖద్వారాలన్నీ వెండితో, బంగారుతో అలంకరించబడి ఉన్నాయి. ఆసనములన్నీ రత్న మాణిక్యాలతో పొదగబడి ఉన్నాయి. ఆ భవనంలో ప్రధానంగా అందమైన స్త్రీలే ఉన్నారు. వాళ్ళ ఆభరణముల సునాదములు వీనుల కింపుగా వినిపిస్తున్నాయి. భేరీమృదంగనాదాలు, శ్రావ్యమైన శంఖధ్వనులు వినిపిస్తున్నాయి. ఆ భవనంలో నిత్యార్చనలే కాకుండా అప్పుడప్పుడు అనేకములైన హోమాలు కూడా జరుగుతూ ఉంటాయి. రావణుని భవనంలో ఎక్కడ చూచినా అమూల్యమైన రత్నాలే కన్పిస్తున్నాయి. రావణుని భవనము లంకానగరానికే తలమానికమని భావించాడు హనుమంతుడు.

అక్కడనుండి బయలుదేరి ప్రహస్తుని భవనం మీదికి దుమికాడు ఆంజనేయుడు. అక్కడనుండి మహాపార్శ్వుని భవనం మీదికి ఎగిరాడు. కొన్నిక్షణాలు తరువాత కుంభకర్ణుని భవనం మీదికి, ఆ తరువాత విభీషణుని భవనం మీదికి దూకాడు. అలాగే ఎన్నో ప్రాసాదాలను గాలించాడు.

హనుమంతుడు రావణుని శయనమందిరానికి వచ్చాడు. అక్కడ ఉన్న ఆసనాలు, శయనాలు, పాత్రలు అన్నీ సువర్ణమయమే. అది కుబేరభవనం లాగా కన్పించింది పవన సుతునికి.

బంగారు కిటికీలకి మణులు, వైడూర్యాలు పొదిగి యున్నారు. గోడలన్నీ బంగారు నగిషీలతో ప్రకాశిస్తున్నాయి. ఇంతలో రావణుని పుష్పకవిమానం హనుమంతుని కంటపడింది. అది భూతలస్వర్గంలా భాసిస్తోంది. రత్నశోభితమై ప్రకాశిస్తోంది. హంసలు మోయుచున్నట్లు, ఆకాశంలో తేలిపోతున్నట్లు అనిపిస్తోంది.

దాని ప్రక్కగా వెళ్తే దివ్యమైన ఉద్యానవనాలు అందంగా అగుపిస్తున్నాయి. మనోహరమైన వృక్షపంక్తితో, సుగంధభరితమైన పుష్పసంపదతో మనోజ్ఞంగా ఉన్నాయి ఆ వనాలు. ఆ ఉద్యానవనాలలో దివ్యమైన పువ్వులతో నిండిన సరోవరా లున్నాయి. అందమైన రావణుని సుందరభవనాన్ని మళ్ళీ ప్రవేశించి చూశాడు హనుమ. అన్నీ కనిపిస్తున్నాయి, అయోనిజ అగుపించడం లేదు.

అవ్యక్త రేఖా మివ చంద్రరేఖాం
పాంసు ప్రదిగ్ధామివ హేమ రేఖామ్
క్షతప్రరూఢామివ బాణరేఖాం
వాయు ప్రభిన్నామివ మేఘరేఖామ్ ॥

"సీతమ్మ స్పష్టంగా కనిపించని చంద్రరేఖ లాగా ఉంటుంది. దుమ్ము కమ్మిన బంగారుతీగ లాగా ఉంటుంది. లోపల పచ్చిగా వుండి పైకి మానినట్లున్న బాణఘాతము లాగా ఉంటుంది. గాలికి చెదరిన మేఘరేఖ లాగా ఉంటుంది. అట్టి సీతమ్మ కనిపించలేదు" అని హనుమ భావించాడు.

ఈవిధంగా భావించిన హనుమంతుని భావసౌందర్యము అసమాన మైనది. అద్భుత మైనది.

మబ్బుల చాటున కనిపించీ, కనిపించని చంద్రరేఖ ఉండీ లేనట్లే ఉంటుంది. అలాగే సీతమ్మ కృంగి, కృశించి తేజోహీనమై ఉంటుంది అనుకుంటాడు వాయుపుత్రుడు.

మరోవిధంగా చూస్తే, ధూళి కప్పిన సువర్ణతీగలా ఉంటుంది అనుకుంటాడు. బంగారు సహజంగా కాంతిమయమే. కానీ పరాగము కప్పినపుడు మలినంగా కన్పిస్తుంది. అంతమాత్రాన బంగారుకి మలిన మంటదు. అలాగే సీతమ్మ సహజసౌందర్యము తరిగేది కాదు. కానీ లంకలో ఈనాడు ఆమెను క్రమ్మియున్న విషాద దుమ్ము వల్ల సీతమ్మ అలా కాంతిహీనంగా కన్పించవచ్చు అని ఆలోచిస్తాడు ఆంజనేయుడు.

పైకి మానినట్లు కనిపించినా, లోపల పచ్చిగానే యున్న బాణపు దెబ్బలాగా, సీతమ్మ ఒకవేళ పైకి దుఃఖంతో కనిపించకపోయినా, ఆమె ఆంతర్యం రామవిరహ వ్రణంతో బాధపడుతూనే ఉంటుంది అని చింతిస్తాడు హనుమంతుడు.

శోభాయమానంగా గోచరించే పూర్ణమేఘాన్ని గాలి చెదరగొట్టినపుడు, ఆ మేఘము చెదరిపోయి మేఘఖండాల్లా తెలియునట్లు, పూర్ణశోభతో విరాజిల్లే సీతమ్మతల్లిని రావణుడు

అపహరించడం వల్ల కలత చెందిన ఆమె మనసు వికలమై, దేహాంగములు కూడా పూర్ణశోభను కోల్పోయి మేఘఖండాల్లాగా తెలుస్తూ ఉంటాయని ఊహిస్తాడు సమీరకుమారుడు.

అట్టి సీతమ్మ కనిపించలేదని తీవ్రంగా వ్యథచెందాడు. విషాదంతో కుమిలిపోయాడు.

రావణశాల

సీతమ్మను అన్వేషిస్తూ హనుమంతుడు రావణుని విశాలమైన ప్రధానభవనం లోకి ప్రవేశించాడు. రావణుడు వివాహం చేసుకున్న స్త్రీలు, రావణుడు ఇష్టపడి ఎత్తుకొని వచ్చిన స్త్రీలు అనేకమంది ఉన్నారా భవనంలో.

కుబేరుని ఐశ్వర్యమూ, ఇంద్రుని సంపద, యముని కలిమి ఎంతో, అంతకు మించే ఐశ్వర్యం ఉంది రావణుని భవనంలో. అక్కడే గొప్పదైన పుష్పకవిమాన ముంది. పూర్వము దానిని బ్రహ్మదేవుని కొరకు విశ్వకర్మ నిర్మించాడు. కుబేరుడు కఠోరమైన తపస్సు చేసి దానిని బ్రహ్మదేవుని నుండి పొందాడు. రావణుడు బలప్రయోగం చేత కుబేరుని ఓడించి అతని నుండి పుష్పకవిమానాన్ని అపహరించాడు.

వివిధములైన మృగాల బొమ్మలతో చెక్కిన బంగారు, వెండి స్తంభాలతో ఆ విమానము శోభిస్తోంది. అందులో ఎన్నో మనోహరమైన గదులున్నాయి. అది అగ్ని సూర్య ప్రకాశంతో ప్రభవిస్తోంది. దానికి బంగారు మెట్లున్నాయి. స్ఫటిక మాణిక్యాలతో నిర్మించిన అందమైన కిటికీ లున్నాయి. ఇంద్రనీల, మహానీల మణులు పరచిన ఆసనా లున్నాయి.

వాటిని చూస్తూ రావణుడున్న ప్రదేశానికి వెళ్ళాడు హనుమంతుడు. అదొక పెద్ద శాల. అనేకమైన స్తంభాలతో ప్రకాశిస్తున్న ఆ రావణశాలలో మాణిక్యాలు, వెండి, బంగారము, ముత్యాలు, వగడాలు మొదలైన వాటితో చేసిన అలంకరణలు అద్భుతంగా శోభిస్తున్నాయి.

ఆ శాల మధ్యలో ఒక రత్న తివాసీ పరచబడి ఉంది. దానిమీద సాగరాలు, నదులు, వనాలు, భవనాలు మొదలైన చిత్రవిచిత్రమైన బొమ్మలు గోచరిస్తూ అదొక ప్రత్యేక ప్రపంచమా అన్నట్లుంది. దివ్యసుగంధ పరిమళాలతో గుబాళిస్తోంది.

ఆ శాల హంస లాగా తెల్లగా ఉంది. లక్ష్మీదేవికి పుట్టిల్లా అన్నట్లుంది. దాని వైభవాన్ని చూచి ఆంజనేయుడు ఆశ్చర్యపడ్డాడు. అది స్వర్గమా! లేక ఇంద్రుని అమరావతియా! అని సందేహంలో పడ్డాడు.

ఆ భవనంలో బంగారు దీపాలు దివ్యంగా వెలుగుతున్నాయి. కదలకుండా నిశ్చలంగా ఉన్న ఆ దీపశిఖలు, ధ్యానస్థితిలో ఉన్నట్లున్నాయి. హేమాహేమీలైన ఆటగాళ్ళ చేతిలో ఓడిపోయి దిగులుతో కదలకుండా కూర్చున్న జూదగాళ్ళలాగా ఉన్నాయి ఆ దీపాలు.

పరచిన రత్నతివాసీల మీద చాలామంది అందమైన స్త్రీలు శయనించి ఉన్నారు. రంగు రంగుల విలువైన వస్త్రాలను ధరించి ఉన్నారు. రకరకాల పుష్పమాలలు వేసుకొని ఉన్నారు. మత్తుగా తాగి నిద్రిస్తున్న ఆ మగువలు హంసలు, భ్రమరాలు గల పద్మసరోవరంలా కనిపిస్తున్నారు. మనోహరమైన దేహకాంతితో శోభిల్లే నారీమణు లున్న ఆ భవనము శరత్కాలంలో నక్షత్రాలతో ప్రకాశిస్తున్న నిర్మలాకాశంలా గోచరిస్తోంది.

స్త్రీల మధ్య నున్న రావణుడు తారకల మధ్య ప్రకాశించే చంద్రునిలా వెలిగిపోతున్నాడు. చంద్రకిరణాల్లాగా తెల్లని ముత్యాలహారాలు ధరించిన ఆ స్త్రీలు నిద్రిస్తున్నా హంసల్లాగా అగుపిస్తున్నారు.

రావణుడు మేల్కొనియుండే సమయంలో ఆ స్త్రీలను చూచే ధైర్యం ఎవ్వరికీ లేదు. రావణుడు నిద్రిస్తున్నాడు కనుక ఇదే అవకాశ మన్నట్లు కదలకుండా చూస్తున్నాయట ఆ భవనంలో వెలిగే బంగారు దీపాలు.

ఈ స్త్రీ లందరూ రావణుని ప్రతాపానికి లొంగినవారే. కామానికి తలవంచినవారే. రావణుడు యుద్ధంలో గెలిచి తీసికొని వచ్చిన స్త్రీలు కొందరయితే, కామానికి లొంగి, వశమైన స్త్రీలే మిగిలిన వారందరూ. ఇష్టం లేకుండా వచ్చినవారు అక్కడెవ్వరూ లేరు.

రావణుని భార్యలలో అందరికీ అతడంటే ప్రాణమే. వాళ్ళంతా మంచి కుటుంబాలనుండి వచ్చినవారే. పిచ్చెక్కించే పడచులే. నేర్పు గలవారే. బుద్ధి గలవారే. ఆకర్షించ గలిగినవారే.

రావణుడు బలవంతంగా ఎత్తుకొని వచ్చింది ఒక్క సీతమ్మనే. "సీతమ్మ ఉత్తమురాలు. ఈ విషయంలో సంశయము లేదు. ఇంత గొప్పవాడైన రావణుడు చాలా నీచమైన పని చేశాడు" అని హనుమంతుడు ఆలోచించాడు. దుఃఖించాడు కూడాను.

అందమైన శయ్యపై రావణుడు నిద్రిస్తున్నాడు. చందనాన్ని ఒంటికి రాసుకొని, పరిమళాలను వెదజల్లే పూలదండలను మెడలో ధరించి, బంగారు వస్త్రాలతో మహేంద్రుని వలె శోభిస్తూ, మెత్తని పడకపై పవ్వళించి మత్తుగా నిద్రిస్తున్నాడు.

పానశాలలో పవనసుతుడు

త్రాచుపాము బుసలు కొట్టునట్లు దీర్ఘ నిఃశ్వాసములను విడుస్తున్న రావణుని సమీపించాడు హనుమంతుడు. అతణ్ణి చూడగనే కలత చెంది, భయపడి దూరంగా వెళ్ళాడు హనుమ. అవునుమరి. రావణుని ప్రతాపం, పరాక్రమం సామాన్యమైనవా!

హనుమంతుడు మరొక అరుగు నెక్కి రావణుని పరీక్షగా చూశాడు. రావణుడు శయనిస్తున్న ఆ పడక మదపుటేనుగు పడుకొని యున్న నదిలా అనింది హనుమంతుని నేత్రాలకు. ఎత్తైన భుజాలు కలిగిన కొండలాంటి రావణుని శరీరము ఉన్నతమైన రెండు శిఖరాలతో శోభించే మందరపర్వతంలా ఉంది.

సుందరాంగులైన భామ లందరూ రావణుని చుట్టూ బారులు తీరినట్లు పడి నిద్రిస్తున్నారు. కొంతదూరంలో మంగళకరమైన మంచం కనిపించింది. రత్నవైడూర్యాలు పొదిగి, ముత్యాల సరాలతో మెరుస్తున్న ఆ మంచం మీద దివ్యాభరణాలు ధరించిన ఒక అందమైన సుందరి శయనిస్తూ ఉంది.

ఆమెను కొన్ని క్షణాలు అదేపనిగా చూశాడు హనుమంతుడు. ఆమె ప్రకాశము ఆ భవనానికే నూతన శోభను ప్రసాదిస్తోంది. ఆమె రావణునికి ప్రాణతుల్యమైన ప్రియురాలు. పట్టపురాణి. ఆమె అందాన్ని, ఆభరణాలను చూసి ఆమె సీతయై ఉంటుందని భావించాడు హనుమ.

సీతమ్మను కనుగొన్న ఆనందంలో ఒళ్ళు మరచిపోయాడు కపివరుడు. అధికానందంతో ఊగిపోయాడు.

ఆస్ఫోట యామాస చుచుమ్బ పుచ్ఛం
ననన్ద చిక్రీడ జగౌ జగామ
స్తమ్భా నరోహ న్నిపపాత భూమౌ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్

"హనుమ ఎగిరి దుమికాడు. తోకను అందుకొని ముద్దెట్టుకున్నాడు. ఆడాడు. తనలోతాను పాడుకున్నాడు. ఇటు, అటు తిరిగాడు. ఎగిరాడు. స్తంభాలెక్కి క్రిందపడ్డాడు. తన ప్రకృతిని సహజంగానే ప్రదర్శించాడు" అన్నాడు వాల్మీకిమహర్షి.

హనుమంతుడు మళ్ళీ ఆలోచించాడు. ఈమె సీత ఎలా అవుతుంది? అని తనను తానే ప్రశ్నించుకున్నాడు. రాముడికి దూరమైన సీత నిద్రకు కూడా దూరమౌతుంది. అలంకరించు కుంటుందా? తిని, తాగి అలా పడి ఉంటుందా? పరపురుషుడు దేవేంద్రుడైనా సరే సీత అంగీకరించదు. ఈమె సీత కానేకాదు అని నిర్ణయించుకున్నాడు పవిత్రాత్ముడైన పవనసుతుడు.

ఆ పానశాలలో మత్తెక్కి పడివున్న ఎందరో మగువలను చూశాడు హనుమంతుడు. ఆడి అలసినవారు, పాడి అలసినవారు ఎలాపడితే అలా నిద్రిస్తున్నారు. వారి మధ్యలో రావణుడు నిద్రిస్తున్నాడు సభ్యత, సంస్కారము లేకుండా.

తాసాం మధ్యే మహాబాహుః శుశుభే రాక్షసేశ్వరః
గోష్ఠే మహతి ముఖ్యానాం గవాం మధ్యే యథావృషః

"గొప్ప బాహువులు కలిగిన రావణుడు గోశాలలో ఆలమందల మధ్య ఆబోతులా పడి ఉన్నాడు."

అరణ్యంలో ఏనుగుల మధ్య పడివున్న మహాగజంలా ప్రకాశిస్తున్నాడు. రావణుని భవనంలో పానశాల నంతా తిరిగి చూశాడు హనుమంతుడు.

పానభూమిలో వివిధ మృగాల మాంసాలను చూశాడు. తినగా మిగిలిన కోడిమాంసాన్ని, నెమళ్ళ మాంసాన్ని చూశాడు. అనేక భక్ష్యాలను, చోష్యాలను, లేహ్యాలను కూడా చూశాడు. ఆ పానశాల నిప్పు లేకనే మండుతున్నట్లుంది.

అక్కడ మణులు పొదిగిన బంగారు, వెండి పాత్రలలో నింపబడివున్న మద్యాన్ని కూడా చూశాడు. అక్కడ స్త్రీల శయనములను కూడా చూశాడు. వివిధ భంగిమలలో పడుకొనియున్న స్త్రీలను చూచిన తరువాత హనుమంతుడు చింతాక్రాంతు డయ్యాడు. నిద్రిస్తున్న ఆ స్త్రీలను చూడడం వల్ల ధర్మహాని జరిగిందేమో నని భీతిచెందాడు.

"నిద్రిస్తున్న స్త్రీలను ఇక్కడ చూడడం వల్ల ధర్మలోపం జరిగి ఉంటుందా? పరుల భార్యలను నేను ఎప్పుడూ చూసేవాణ్ణి కాను. ఈనాడు తప్పనిసరిగ చూడవలసి వచ్చింది.

"సీత స్త్రీ. ఆమెను అన్వేషించడానికి నేను వచ్చాను. స్త్రీని స్త్రీలమధ్య వెదకాలే గాని మరొకచోట అన్వేషించలేను కదా! అందువల్ల నిష్కపట హృదయంతో నేను సీతమ్మను వెదికాను. ఆమె తప్ప అందరూ కనిపించారు నాకు.

కామందృష్టా మయా సర్వా విశ్వస్తా రావణస్త్రియః
న హి మే మనసః కిం చిద్వైకృత్య ముపపద్యతే

"పురుషు లెవ్వరూ లేనందున ఇష్టము వచ్చినట్లు పరుండియున్న రావణుని భార్యలను నేను చూశాను. ఈ మాట నిజమే. కానీ వారిని చూచినా నా మనసు ఎలాంటి వికారానికీ లోను కాలేదు.

"మనసును బట్టే కదా ఇంద్రియాలు ప్రవర్తిస్తాయి. నా మనసు మాత్రము ఏ వికారమూ లేక నిశ్చలంగా ఉంది" అని తనలో తాను భాషించుకున్నాడు హనుమంతుడు.

రావణుని భవనంలోకి హనుమంతుడు ప్రవేశించినది మొదలు పానశాలలో తన పవిత్రహృదయాన్ని మన ముందు వెల్లడి చేసే వరకు హనుమంతుని పాత్రలోని వైశద్యమును మనం విశ్లేషించి అవగతం చేసుకుంటే, ఆ అవగాహన మన జీవననౌకకు చుక్కానిలా పనిచేస్తుందని నా అభిప్రాయము.

రావణుని భవనంలో అప్సరసల వంటి స్త్రీలను హనుమంతుడు చూశాడు. విశేష సౌందర్యం కలిగిన వనితలను వీక్షించాడు. రావణుని అమోఘ సంపదను చూశాడు. కుబేర దేవేంద్రాదులు రావణునికి సరిపోరు అనే నిర్ణయానికి వచ్చాడు.

ఆ రావణశాలలో విచిత్ర భంగిమలలో పడియున్న చాలామంది సుందరీమణులను చూశాడు. బట్టలు తొలగిపోయి నిద్రిస్తున్న వారిని కూడా చూశాడు. అలాగని చూడడం మానేయలేదు. పరిశీలించి మరీ చూశాడు.

పూర్వము తానెప్పుడూ ఈవిధంగా స్త్రీలను చూచి ఎరుగడు. అస్ఖలితబ్రహ్మచారి అయిన ఆంజనేయుడు ఏ కార్యార్థమై అక్కడికి వచ్చాడో ఆ కార్యాన్ని సాధించాలి కదా? మరి అన్వేషించక ఏమి చేస్తాడు? పగటిపూట రావణుని భవనం లోకి ప్రవేశించడం సాధ్యమా! అన్వేషణకు రాత్రికాలమే అనువైన సమయము.

సీతమ్మ స్త్రీ కనుక ఆమెను స్త్రీల మధ్యే అన్వేషించాలి. అందుకని పరిశీలించి, పరీక్షించి మరీ అన్వేషించాడు. మత్తెక్కి పడివున్న రావణుని మగువలకు మేనులపై వస్త్రా లున్నాయో, లేవో ఎలా తెలుస్తుంది? ఈవిధమైన పరిస్థితి ఉంటుందని హనుమ మాత్రం ఎలా ఊహిస్తాడు?

సభ్యత, సంస్కారాలకు దూరమై పశువుల్లా క్రీడిస్తుంటారని ఆంజనేయుడు ఎలా ఆలోచించగలడు? అందుకనే కవి ఆ సన్నివేశాన్ని సున్నితంగా విమర్శించాడు. ఆవులమందలో ఆబోతు లాగా రావణుడు పడి ఉన్నాడన్నాడు. విచక్షణ కొరవై సహజాతాలతో జీవించే జంతువు లాగా ఉంది రావణుని పరిస్థితి అని చక్కని చురకవేశాడు వాల్మీకి.

మనోహరరూపం గల స్త్రీలను ఎందరిని చూసినా తన యెదపై ముద్రలేవీ పడలేదని చెప్పిన హనుమంతుని పవిత్రహృదయం మనందరికి ఆదర్శం.

కన్ను చూచినా మనసు దానిని అనుసరించలేదు అన్నాడు. మనసు పవిత్రంగా ఉన్నందున ఇంద్రియాల వ్యాపారము వల్ల మాలిన్యము అంటలేదని తృప్తిచెందాడు. దీనినే శమము అంటారు.

ఇంద్రియాలు ఎంతగా ప్రకోపించినా మనసును నిగ్రహించుకో గలిగితే అందరూ హనుమంతులే అవుతారు. మనసును జయించిన వాడు ప్రపంచాన్నే జయించగలడు. పర్వతాల్ని పెకలించగలడు. సాగరచలనాన్ని నిరోధించగలడు. వాయుగమనాన్ని ఆపగలడు. అగ్నితేజాన్ని చల్లబరచగలడు. ఇవన్నీ చేసిచూపాడు మనసును జయించిన మారుతి.

హనుమంతుడు రావణశాలలో ఎన్ని అశ్లీల దృశ్యాలను చూచినా వాటి ప్రభావం ఆయనమీద పడలేదు. అంటే ద్రష్టయైన తాను దృశ్యములైన విషయాలకు విలక్షణుడై, సాక్షియై నిలిచాడు. అప్పుడే అట్టి అలౌకిక స్థితి సాధ్యపడుతుంది.

న సాక్షిణం సాక్ష్యధర్మాః సంస్పృశన్తి విలక్షణమ్
అవికార ముదాసీనం గృహధర్మాః ప్రదీపవత్

"గృహధర్మాలు దానిని ప్రకాశింపచేసే దీపాన్ని అంటనట్లు, సాక్ష్యధర్మాలు వాటిని దర్శించే ద్రష్టను స్పృశించలేవు" అని కుండికోపనిషత్తు ప్రవచించింది.

రావణశాలలో మన మనసుల్ని రాపిడి పట్టే మరొక సన్నివేశం ఉంది. ఇది చాలా సున్నితమైన విషయం. అపార్థాల మనసును ప్రక్కకు నెట్టి, ఆవేశ ప్రవృత్తిని వెనుక పడేసి, సూక్ష్మబుద్ధితో అర్థం చేసుకోవాలి.

ఈ సన్నివేశంలో రెండు ప్రధాన విషయాలు మనకు గోచరిస్తాయి.

1. రావణుని భోగజీవితాన్ని చూసి హనుమంతుడు వెలిబుచ్చిన అభిప్రాయం.

2. మండోదరిని చూసి సీతని భ్రమించి ఆనందించిన స్వభావం.

బభూవ బుద్ధిస్తు హరీశ్వరస్య
యదీదృశీ రాఘవ ధర్మపత్నీః
ఇమా యథా రాక్షస రాజభార్యాః
సుజాత మస్యేతి హి సాధుబుద్ధేః

రావణశాలలో ఉత్తమ స్త్రీలైన రావణుని భార్యలను, రావణుని చూచినపుడు సాధుబుద్ధి యగు హనుమంతుడు ఈవిధంగా భావించాడు.

1. "రావణుని భార్యలు ఎలా ఉన్నారో శ్రీరాముని ధర్మపత్ని అయిన సీత కూడా అలాగే ఉన్నచో రావణుని జన్మ శోభించి ఉండేది."

ఇది మ్రింగుడుపడని ప్రథమ విషయం.

రావణుని గుణాలను అనుసరించి బలవంతము లేకుండా రావణుని భార్య లందరు వశమైనట్లు, సీత కూడా రావణునికి వశమై ఉన్నట్లయితే ఇతని జన్మ తరించి ఉండేది అని శ్లోకభావం సూటిగా కన్పిస్తోంది.

ఈవిధమైన దుష్టభావం దుర్బుద్ధికి ఉండవచ్చు నేమోగాని సద్బుద్ధి యైన హనుమంతునికి కలిగే అవకాశం లేదు. ఈ శ్లోకంలోనే సాధుబుద్ధిగా వాల్మీకి హనుమంతుని వర్ణించిన విషయం మరవరాదు అంటూ వ్యాఖ్యాతలు అనేక అర్థాలను, అభిప్రాయాలను చెప్పుకుంటూ పోయారు.

ఈ విషయమై భిన్నాభిప్రాయాలు కలగడానికి కారణం వాల్మీకి వాడిన "బభూవ" అనే పదమే. 'బభూవ' అంటే కలిగినది అని భావము. రావణుని భార్యలను చూసినపుడు హనుమంతునకు ఈ భావము కలిగింది అన్నాడు వాల్మీకి. ఆ కలిగిన భావము వాస్తవానికి ఎలాంటిది? అంటూ దాని స్వభావ స్వరూపాలలోకి దూసుకొని పోయారు వ్యాఖ్యాతలు. దూసుకుపోయారే గాని దాచుకో గలిగింది ఏమి తెచ్చారు? అంటే, అది ప్రశ్నార్థకంగానే మిగిలిపోతుంది.

బభూవేతి .... భావం కలిగింది, అంటే -

1. రాఘవ ధర్మపత్నీ ఈదృశీ యది స్వయంవరా త్పూర్వమే వాస్య ధర్మపత్నీ చేత్ అస్య సుజాతం సుకృతం.

"రాముని ధర్మపత్ని యగు సీత స్వయంవరానికి పూర్వమే రావణుని భార్యలలో ఒకతై ఉంటే రావణునికి మేలు జరిగి ఉండేది."

పై శ్లోకానికి ఈవిధంగా అర్థాన్ని త్రవ్వి తీశాడు ఒక వ్యాఖ్యాత. అయితే ఇలా వ్యాఖ్యానించడం వల్ల ఆయన ఏమి సాధించా లనుకున్నాడో అర్థంకాదు. ఇలా వ్యాఖ్యానిస్తే హనుమంతునిపై ఈగ వాలదు అని మాత్రం ఆయన అభిప్రాయపడి ఉంటాడు అని నిశ్చయంగా చెప్పవచ్చు.

అప్పుడా, ఇప్పుడా, ఎప్పుడు అనేవి ప్రక్కనపెడితే ఆవిధంగా హనుమంతుడు ఎందుకు ఆలోచించవలసి వచ్చింది? అదే వాస్తవ మైతే, సూటిగా ఆ విషయాన్ని ప్రస్తావించవచ్చు కదా!

ఈ వ్యాఖ్యతో అంగీకరించనివారంతా **ఇయ మసాధ్వీ బుద్ధిః** ఇది చెడ్డ ఆలోచన అని కొట్టిపారేశారు.

2. రాక్షసరాజ భార్యాః యథా స్వభర్తృ విశిష్టాః సకలభోగ విశిష్టాః తథా రాఘవ ధర్మపత్నీ ఈదృశీ స్వభర్తృ సహితా యది అస్య రావణస్య సుజాతం శోభన మితి సాధుబుద్ధే ర్హరీశ్వరస్య హనుమతో బుద్ధి ర్బభూవ!

"రాక్షసరాజైన ఈ రావణుని భార్యలు తమ భర్తతో కూడి సకలభోగాలను ఎలా అనుభవిస్తున్నారో, అలాగే రాముని అర్ధాంగి అగు సీత తన భర్తతో కూడియున్నచో ఈ రావణునికి శుభము కలిగి ఉండేది అని సాధుబుద్ధియైన హనుమంతుడు భావించాడు".

ఇలా వ్యాఖ్యానించడంలో వ్యాఖ్యాత మనోభిప్రాయం గ్రహించడం అంత కష్టమేమీ కాదు. ఈ వ్యాఖ్యాత ఉన్న భావాన్ని గ్రహించే ప్రయత్నాన్ని విస్మరించి, దీనిని ఒక సమస్యాపూరణంగా స్వీకరించి పరిష్కారానికి తంటాలు పడ్డాడు.

సీతను రావణుడు రామునికి తిరిగి సమర్పించినట్లైతే, రావణుని భార్యలు రావణుని వద్ద ఉన్నట్లే సీత రామునివద్ద ఉంటుంది. అప్పుడు రావణుడు రాముని చేతిలో మరణించడు. కనుక రావణుని జన్మ ధన్యమౌతుంది. ఇదీ ఈ వ్యాఖ్యాత మనోభిప్రాయం. రావణుని మీద ఈయనకు వచ్చిపడిన వల్లమాలిన సానుభూతే కానీ వ్యాఖ్యలో వాస్తవ వైశిష్ట్యము లేదు.

3. రాఘువధర్మపత్నీ యథా రావణేన బలాదానీతా ఇమా రాక్షస భార్యా స్తథా సుగ్రీవేణ బలాద్ధృతా యది తదా హరీశ్వరస్య సుగ్రీవస్య సుజాతం హీతి సాధు బుద్ధేః

"రాముని భార్యయైన సీతను రావణుడు అపహరించినట్లే, ఈ రావణుని భార్యలు కూడా బలాత్కారముగా సుగ్రీవునిచే అపహరించ బడినచో సుగ్రీవునికి చాలా మంచి జరిగేది అని సాధుబుద్ధియైన హనుమంతుడు భావించాడు."

ఇక ఈ వ్యాఖ్య ఎంత విడ్డూరమో మీకే తెలిసిపోతోంది కదూ! రావణుడు అధర్మంగా ప్రవర్తించాడు కనుక సుగ్రీవుడు కూడా అధర్మంగా ప్రవర్తించాలని హనుమంతుడు కోరుకుంటాడనే ఆలోచన ఈ వ్యాఖ్యాత ఎలా చేయగలిగాడో అర్థంకాదు. ఆంజనేయుడు అలా అభిలషించడమే ఆయన సాధుబుద్ధికి తార్కాణమని ముక్తాయింపు ఇవ్వడం ఏమీ బాగులేదు.

ఇలాంటి వ్యాఖ్యలు చాలా ఉన్నాయి ప్రాచుర్యంలో. రావణుడు తన భార్యలతో సుఖించునట్లు, రాముడు కూడా తన అర్ధాంగితో ఆనందాన్ని అనుభవించినచో, రావణుని ఈ సంపద నశించకుండా అవిచ్ఛిన్నంగా కొనసాగి ఉండేది. ఇదే ఆంజనేయుని హృదయవాణి అనేది చాలామంది వచ్చే విషయమైంది.

ఇదికూడా అంత సమంజస మనిపించదు. ఎందుకంటే, రావణుని భోగానుభవము రామునిలో చూడాలని హనుమంతుడు అభిలషించడు. రావణునిది ధర్మవిరుద్ధమైన భోగము. రాముడు ధర్మాత్ముడు.

ఇంతకీ, అసలు విషయానికొస్తే, ఉన్నది ఉన్నట్లు గ్రహించడమే మంచిది. రావణుని వైభవము వాయుపుత్రునికి అమిత విస్మయాన్ని కల్గించింది. ఇంద్రభోగాన్ని తలదన్నే రావణభోగానికి అర్రులుచాచి ఎందరో స్త్రీలు దాసీ లయ్యారు. ఒకవేళ, అతిలోకసౌందర్యవతి, అసమాన రూపవతి అయిన సీత కూడా లొంగిపోయి ఉంటే మాత్రం రావణుడి జన్మ ధన్యమైనట్లే. ప్రపంచంలో ఉన్నత భోగా లనుభవించిన వ్యక్తిగా రావణుడే మిగుల్తాడు.

ఈ ఆలోచన ఆ సమయంలో హనుమంతునికి రావడంలో ఆశ్చర్యమేమీ లేదు. హనుమంతుడు ఇలా భావించాడు అంటే, అదేదో ఆంజనేయునికి దోషాన్ని అంటగట్టినట్లు అవుతుందని ఎవ్వరూ భావించ నక్కరలేదు.

దేవతాస్త్రీలే దాసీ లయ్యారు కదా! మానవమాత్రురాలు సీతమ్మ లొంగిపోయి ఉంటుందేమో అనే ఆలోచన అసమంజస మేమీ కాదు. అదియును గాక సీతమ్మను గూర్చి హనుమంతునికి పెద్దగా తెలియదు కూడాను. గతంలో ఆమె నెప్పుడూ చూచి కూడా ఎరుగడు.

ఇలా భావించిన తరువాత ఎందుకో హనుమంతుని పవిత్రహృదయం తన సంకల్పాన్ని సంశయించింది. సీతమ్మ దేవత కాకపోవచ్చు. కానీ లొంగిపోయిన దేవతాస్త్రీల కన్నా శ్రేష్ఠురాలు. ఆమె రాముని అర్ధాంగి. ఆమె లొంగే ప్రసక్తే లేదు. అనవసరంగా దుష్టుడైన ఈ రావణుడు ఆమెను అపహరించాడు అని దుఃఖిస్తాడు పసిబిడ్డ లాంటి పవనసుతుడు.

పునశ్చ సోఽచింత యదార్తరూపో
ధ్రువం విశిష్టా గుణతో హి సీతా
అథాయ మస్యాం కృతవాన్మహాత్మా
లంకేశ్వరః కష్టమనార్యకర్మ

"హనుమంతుడు చింతాక్రాంతుడై పునరాలోచన చేశాడు. సుగుణవతి యైన సీతమ్మ శ్రేష్ఠురాలు. గొప్పవాడైనా, ఈ రావణుడు సీత విషయంలో చాలా చెడ్డపని చేశాడు."

ఇదీ వాస్తవం. తన ఆలోచన సరియైనది కాదని గుర్తించి హనుమ పశ్చాత్తాపంతో పరితపించాడు. భక్తునికి చెడుసంకల్పాలు రావు అని చెప్పడం సరికాదు. రాకపోతే చాలా మంచిది. కానీ వచ్చినపుడు, అంతమాత్రాన చెడు అని భావించకూడదు.

భోగులకు చెడుసంకల్పాలు వస్తాయి. అరుదుగా జన్మాంతర సంస్కారాల వల్ల, స్వభావాల వల్ల భక్తులకు కూడా వస్తాయి. భోగులకు చెడుసంకల్పాలు రాగానే వారు చెడిపోతారు. లేదా, చెడడానికి పోతారు. కానీ భక్తుల పరిస్థితి వేరే. వారు తమ తప్పును తామే తెలుసుకొని సరిచేసుకుంటారు. అదే భక్తులలో విశిష్టలక్షణము.

ఇక రెండవ విషయం ...

2. మండోదరిని చూచి, సీత అని భ్రమించి ఆనందించిన స్వభావం.

శుభలక్షణురాలగు రావణుని సతీమణిని చూచి సీతయే నని భ్రమించాడు మారుతి. ఆ సమయంలో హనుమంతుడు తోకను జాడించడం, తోకను ముద్దెట్టుకోవడం, ఎగిరి దుమకడం అన్నీ చేశాడు.

హనుమంతుడు ఎంతో సంతోషించాడు. కదూ! వాస్తవానికి అది అంతగా ఆనంద పడవలసిన సన్నివేశమేనా? రావణుని శాలలో సీతమ్మను ఊహించగలమా?

రావణుడు ఎందరో స్త్రీలను తెచ్చుకున్నాడు. కానీ సీతమ్మతల్లిని తెచ్చినప్పుడే వాల్మీకి కన్ను రావణునిపై పడింది. అది సహించరాని, క్షమించరాని నేరంగా పరిగణింపబడింది. అందుచేతనే హనుమంతుడు రావణశాలలో మండోదరిని చూచి, సీతమ్మ అని కుప్పిగంతులు వేసినపుడు వాల్మీకి తట్టుకోలేకపోయాడు.

నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్

"తన వానరస్వభావాన్ని ప్రదర్శించాడు" అని నిర్మొహమాటంగా అనేశాడు.

ఇది ముమ్మాటికీ సత్యం. కానీ వెంటనే ఆంజనేయుడు దుఃఖిస్తాడు. మా అమ్మ ఇక్కడ ఉంటుందా? రాముడికి దూరమై నిద్రిస్తుందా? ఇలా ముస్తాబవుతుందా? కాదు. ఈమె సీత కాదు అనుకుంటాడు.

మనసు ఎప్పుడూ ఒకేలా ఉండదు. దారి తప్పుతూ నడవడం దాని లక్షణం. మనసు తప్పుదారిలో దించగానే దానినే ఒప్పుగా భావించి చరించేవారు విషయాభిలాషులు. తప్పును తెలిసికొని మళ్ళీ దారిలోకి వచ్చేవారు విజ్ఞానవంతులు. స్వభావ కక్ష్యను అధిగమించేవారు. హనుమంతుడు రెండవ కోవలోనివాడు.

ఇంతవరకు హనుమకు రామునిమీదే ఉన్నాయి భక్తిప్రేమలు. రామకార్యమే ప్రధానంగా ఉంది. తాను ఇంకా సీతామహాతల్లిని చూడలేదు. ఆమెను చూచిన తరువాత హనుమ ఎలా ఉంటాడో మనం చూడాలిమరి.

ఆంజనేయుని అంతరాలాపము

సీతమ్మను ఎలాగైనా దర్శించాలని హనుమంతుడు ఆ భవనంలో లతాగృహాలన్నీ వెదికాడు. చిత్రగృహాలన్నీ చూశాడు. నిశాగృహాలన్నీ గాలించాడు. అన్నీ చూశాడు. కానీ సీతమ్మ కనిపించలేదు.

"ఎంత గాలించినా ఆమె జాడ తెలియలేదు. సీత చచ్చిపోయి ఉంటుంది. మహాపతివ్రత అయిన సీత తన శీలాన్ని పోగొట్టుకొనేందుకు అంగీకరించి ఉండదు. అందు వలన దుష్టుడైన రావణుడు తన మాట వినలేదని సీతను చంపేసి ఉంటాడు.

"సీతను చూడకుండా తిరిగివెళ్ళి సుగ్రీవుని ఎలా చూచేది? ఆమెను చూడాలని ఎంత గానో వెదికాను. నా శ్రమ ఫలించలేదు. నేను తిరిగి వెళ్ళి అంగదాదులకు ఏమని చెప్పాలి? ఛీ. నేను దిగులు పడకూడదు.

అనిర్వేదః శ్రియో మూల మనిర్వేదః పరం సుఖమ్
అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః

"నిర్విచారమే శ్రేయాలకు మూలం. విచారము లేకపోవుటే గొప్ప సుఖాలకు కారణము. విచారము లేని ప్రవర్తనే సదా కార్యసిద్ధిని సమకూర్చుతుంది.

"నేను నిరాశ చెందకుండా ప్రయత్నిస్తాను. ఇంకా చూడని ప్రదేశా లేవైనా ఉంటే వాటిని కూడా చూస్తాను;" ఇలా ఆలోచించి దూరంగా ఉన్న చిన్న చిన్న గృహాలు కూడా వెదికాడు. రావణుని భవనంలో నాలుగు అంగుళాల ప్రదేశాన్ని కూడా హనుమంతుడు విడిచిపెట్టకుండా వెదికాడు అన్నాడు వాల్మీకి.

హనుమంతుడు విద్యాధరస్త్రీలను చూశాడు. చందురుని వంటి మోము గల నాగ కన్యల్ని చూశాడు. కానీ సీత మాత్రం కనిపించలేదు. హనుమంతుడు మళ్ళీ నిరాశ చెందాడు. నిరుత్సాహంతో నీరసపడ్డాడు.

వానరుల ప్రయత్నాలన్నీ ఫలించలేదు. తన సముద్రలంఘనం కూడా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఏమిచేయాలో తెలియక చింతాక్రాంతు డయ్యాడు.

రావణుని భవనాన్ని విడచి దూరంగా వచ్చి ఒకచోట కూర్చున్నాడు హనుమ. సీత కనిపించలేదు. తనలోతాను ఇలా మాట్లాడుకున్నాడు మారుతి.

"రాముణ్ణి సంతోషపెట్టాలని ఎంతో ఉత్సాహంతో వెదికాను. అయినా సీత కనిపించలేదు. సీత రావణుని గృహం లోనే ఉన్నట్లు చూసినట్లు చెప్పాడు కదా సంపాతి! మరి, ఏమైనట్లు?

"రావణుడు సీతను అపహరించి తెచ్చేటప్పుడు పూజ్యురాలైన జానకి సముద్రములో పడి మరణించి ఉంటుందా! లేక, ఆమె సౌందర్యానికి అసూయ చెంది, రావణుని భార్యలు ఆమెను మ్రింగేసి ఉంటారేమో!

"రాముణ్ణే ధ్యానిస్తూ ఆ తల్లి చచ్చిపోయి ఉంటుందేమో! ఎంతగా దుఃఖించి ఉంటుందో! లేక గోరువంకలాగా సీతమ్మను ఎక్కడైనా బంధించారేమో!

"ఏది ఏమైనా సీతమ్మను గూర్చి రామునికి అప్రియమైన మాట చెప్పకూడదు. రాముడికి సీతంటే ఎంతో ప్రేమ. అప్రియమైన మాట వినగానే పర్యవసానం ఎలా ఉంటుందో!

"ఎటొచ్చీ, నాకు చుట్టుకుంది మొత్తానికి. చెబితే ఒకబాధ. చెప్పకపోతే మరొకబాధ. ఏం చేసేదబ్బా! అంతా అయోమయంగా ఉందే! అనుకున్నదంతా తారుమారైందే!

"జానకిని చూడకుండా తిరిగి నేను కిష్కింధకు వెళ్తే నేనేమి సాధించినట్లు? ఇక్కడికి దేనికొచ్చినట్లు? తోక జాడించుకొనుటకా? సీత కనిపించలేదు అన్నానా! అంతే. ఇక రాముడు కళ్ళు మూసేస్తాడు.

"అబ్బబ్బ.... ఆ మాట భయంకరం. దుర్వాక్యం. అది విని రాముడు భూమిమీద నిలవడు. అది చెప్పకూడదు. నేను చెప్పను. రాముడు లేకుంటే లక్ష్మణుడు మాత్రం మిగుల్తాడా! అది తెలిసి, భరతుడు ఉంటాడా! భరతుణ్ణి విడిచి శత్రుఘ్నుడు ఉంటాడా!

"పుత్రులు పోయిన తరువాత తల్లులైన కౌసల్యాసుమిత్రాకైకేయిలు ఎందుకుంటారు? వాళ్ళూ పోతారు. పాపం! సుగ్రీవుడు ఎంతో మంచివాడు. ఇదంతా చూసిన తరువాత ఉండమన్నా ఉండడు.

"భర్త యైన సుగ్రీవుని వెనుకాలే రుమ వెళ్తుంది. ముందే వాలి మరణంతో అదోలా ఉంది తార. ఇక సుగ్రీవుడు కూడా వెళ్ళాడని తెలిస్తే ఆవిడ కూడా చెప్పకుండా పోతుంది.

"నాన్న, చిన్నాన, అమ్మ, పిన్నమ్మ అందరూ పోయిన తరువాత అంగదుడు ఎందు కుంటాడు? ఇదంతా చూచి వానరులు భరించగలరా! అరచేతుల్తో వీపులు బాదేసుకుని, పిడికిళ్ళతో తలలు కొట్టేసుకొని వెంటవెంటనే వెళ్ళిపోతారు.

"ఇక కొండల్లో గానీ, కోనల్లో గానీ, కొమ్మలమీద గాని, కొంపలమీద గాని వెతికినా ఒక్క కోతి కూడా కనిపించదు.

"ఏమి చెయ్యాలి? నేను వెళ్ళానా, అటు ఇక్ష్వాకువంశం, ఇటు వానరరాజ్యం అంతా గల్లంతై పోతుంది. ఊహు.... నేను పోను. సీత విషయం తెలియకుండా కిష్కింధలో కాలు పెట్టను.

"నేను పోలేదనుకో. "ఇంకావస్తాడు - ఇంకావస్తాడు" అని ఎదురుచూస్తూ వాళ్ళందరూ పోకుండా ఉంటారు. ఇదే మంచిదిలా ఉంది.

"సీత కనపడకపోతే ఎట్లా? ఇంకేముంది? నా నియమాల్ని నేను విడిచిపెట్టను. చెట్టుక్రింద కూర్చుంటా. చేతిలో పడిందే తింటా. లేకపోతే, ఒకపని చేస్తా. సముద్రపు ఒడ్డున పెద్దపెద్ద వనా లున్నాయి. దుంపలు, పండ్లు బాగా దొరుకుతాయి అక్కడ. నీళ్ళు కూడా తియ్యగా ఉంటాయి. తినేసి అలా ఉండిపోతా!

"ఇదంతా ఎందుకులే! బెడద! మంటేసుకొని దూకేస్తా! ప్రాయోపవేశం చేసేస్తా! నా దేహం విషయమా! ఇంక నాకెందుకు? తినెయ్యనీ జంతువుల్ని. కాకుల్ని కూడా.

"లేదంటే నీళ్ళల్లో పడిపోతా! ఇది మహర్షులు కూడా నచ్చే మార్గం. బావుంటుంది. అలా బావుండ దనుకుంటే చెట్టు క్రింద పద్మాసన మేసుకొని కూర్చుంటా మునిలాగా. దేనికైనా సిద్ధమే తిరిగి వెళ్ళడాన్ని మినహాయిస్తే.

వినాశే బహవో దోషా జీవన్ భద్రాణి పశ్యతి

"చావులో అన్నీ దోషాలే. బ్రతికుంటే ఎన్నో శుభాలు చూడవచ్చు.

"అయితే నేనింక చావను. బ్రతికున్న వాళ్ళే కదా ఏనాడైనా కలుసుకునేది!" అంటూ దుఃఖించాడు మారుతి.

ఆంజనేయుని విషాదము తారాస్థాయి నందుకుంది. అదొక మలుపు తిరిగి కోపంగా పరిణమించింది.

"సరే, ఇక సీత విషయం వదిలేస్తా. వీడి కథ తేల్చేస్తా. మహా బలవంతుడట. చూస్తా. వాడి పదిబుర్రలు పగలగొట్టేస్తా. మసి చేసేస్తా. కసి తీర్చుకుంటా.

"లేదంటే, పశువును లాక్కెళ్ళినట్లు వీణ్ణి సముద్రం మీద పైపైనే ఎత్తుకొని పోతా. రాముడి ముందు పడేస్తా" అని మండిపడుతూ మళ్ళీ తన ఆలోచనల్ని ఇంకోవైపు త్రిప్పుకున్నాడు.

"ఇక, ఇలా కాదులే. సీత కనిపించే వరకు లంకను మళ్ళీమళ్ళీ వెదకడమే. పోనీ రాముడ్నే ఇక్కడికి తీసికొనివస్తే ఎలా ఉంటుంది? అదికూడా వద్దులేబ్బా!

"రాముణ్ణి తీసుకొనివచ్చామే అనుకుందాం . సీత అప్పుడు కూడా కనిపించ లేదనుకో. రాముడికి కోపం వచ్చిందంటే అనవసరంగా కోతుల్ని కాల్చేస్తాడు.

"ఆహారాన్ని నియమంగా తీసుకుంటూ, ఇంద్రియాల్ని నియమించుకొని ఇక్కడే ఉండిపోతా. అంగద సుగ్రీవులన్నా హాయిగా ఉంటారు.

"ఆ వనంలో పెద్ద పెద్ద అశోకచెట్లున్నాయి. అక్కడ వెతకలేదు నేను. ఇప్పుడు పోయి వెతుకుతా. అందరికీ నమస్కరించి వెళ్తా. రాక్షసుల అంతు తేల్చేస్తా. ఇక్ష్వాకుల ఇంటి మహాలక్ష్మి సీతమ్మను రామునికి అప్పచెప్పేస్తా" అని తనలోతాను భాషించుకొని, నూతనోత్తేజాన్ని పొంది, నైరాశ్యాన్ని విడచిపెట్టి అశోకవన ప్రవేశానికి ఉద్యుక్తు డయ్యాడు.

నమోఽస్తు రామాయ స లక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై
నమోఽస్తు రుద్రేన్ద్ర యమానిలేభ్యో
నమోఽస్తు చంద్రార్క మరుద్గణేభ్యః

"లక్ష్మణ సమేతుడైన రామునకు నమస్కారం. జనకుని కుమార్తెయైన సీతామహాదేవికి నమస్కారం. రుద్రునకు, ఇంద్రునకు, యమునకు, వాయుదేవునకు నమస్కారం. చంద్రునకు, సూర్యునకు, మరుద్గణములకు నమస్కారము."

Hail to Sri Rama accompanied by Lakshmana, as well as to that god like lady, the daughter of Janaka! Hail to Rudra, Indra, Yama and the Wind-God! Hail to the Moon-God, the Sun-God and the hosts of Wind-Gods

కార్యసిద్ధికి పురుషప్రయత్నం ఒక్కటే సరిపోదు. దైవానుగ్రహం కూడా కావాలి. సముద్ర లంఘనం చేయబోయే ముందు హనుమంతుడు బ్రహ్మేంద్రాది దేవతలకు నమస్కరించాడు. సాగరాన్ని సునాయాసంగా దాటాడు.

లంకలో సీతాన్వేషణము ప్రారంభించాడు. ఎంత వెతికినా సీతమ్మ కనిపించలేదు. వెతకడానికి మిగిలిన ఒకే ఒక చోటు అశోకవనం. అక్కడికి వెళ్తూ హనుమంతుడు ప్రార్థన చేస్తున్నాడు.

తిరిగి తిరిగి ప్రయత్నించినా కార్యం సఫలం కాలేదు. తన కృషిలో సఫలం కానిది దైవకృపతో ఫలిస్తుంది అని భావించాడు. బ్రహ్మాది దేవతలకు నమస్కరించిన తరువాత సముద్రలంఘనం సఫలమైంది. లంకను చేరిన తరువాత సీతాన్వేషణానికి ముందు కూడా ప్రార్థించి ఉండవలసింది అని ఆంజనేయుని అంతర్యము స్పందించింది. వెంటనే ప్రార్థించడం ప్రారంభించాడు హనుమ.

మొదట్లో ఎవరికైనా ఆరంభశూరత్వ ముంటుంది. ఏ కార్యాన్నైనా తానే సాధించ గలడని మానవుడు భావిస్తూ ఉంటాడు. ఊహించిన ఫలితం రానపుడు, భావించింది తలక్రిందు లైనపుడు తన జీవితంలో భగవంతుని అవసర మేమిటో తెలిసి వస్తుంది. అప్పుడు మరో ఆలోచన లేకుండా భగవంతునికి శరణాగతు డవుతాడు. హనుమ అదే చేశాడు.

హనుమంతుడు పరమాత్మను ప్రార్థించి అశోకవనంలో ప్రవేశిస్తాడు. సీతమ్మను దర్శిస్తాడు. కార్యసిద్ధి లభిస్తుంది. మనం కూడా ప్రతి కార్యాన్ని ప్రారంభించబోయే ముందు భగవంతుని ప్రార్థించే సదాచారాన్ని అలవరచుకోవాలి.

ఒకొక్కసారి మనం తెలిసి కూడా మరచిపోతూ ఉంటాము. అలాంటి పరిస్థితుల్లో కార్యాచరణములో కూడా మధ్యలో ప్రార్థించవచ్చు. హనుమ అదే చేశాడు. మన పూర్వీకులు భోజనం చేస్తూ చేస్తూ మధ్యలో తినడం ఆపి "గోవిందా - గోవిందా" అని గోవిందనామస్మరణం చేసేవారు. అలా చేయడం వల్ల తాము స్వీకరించే ఆహారం అమృతతుల్యంగా మారుతుందని భావించేవారు. అది యథార్థం కూడా.

నమోస్తు రామాయ సలక్ష్మణాయ అంటూ ప్రార్థనను ప్రారంభించాడు హనుమంతుడు. లక్ష్మణసమేతుడైన రామునికి నమస్కారము అంటాడు. సీతాలక్ష్మణ సమేతుడైన రామునకు అని అనలేదు. రామునితో ప్రస్తుతం లక్ష్మణుడే ఉన్నాడు. సీతమ్మ లంకలో ఉంది. అందుకని ఆమెను ప్రత్యేకంగా ప్రార్థించాడు రామలక్ష్మణులతో కలపాలనే ఉద్దేశ్యంతో.

దేవ్యైచ తస్యై జనకాత్మజాయై దేవి యైన జనకపుత్రికి నమస్కారము అంటున్నాడు సీతమ్మను ప్రార్థిస్తూ. ఇక్కడే సీతమ్మను 'దేవి' శబ్దంతో కీర్తించడం జరిగింది. సీతమ్మ 'సీతాదేవి' అనే శుభకరనామంతో ఇక్కడే పిలువబడుతోంది.

'దేవీ' అంటే **దివ్యతీతిదేవీ** - అనగా ప్రకాశించునది అని అర్థము. **'దివుక్రీడాయామ్ -** అంటే క్రీడించునది అని కూడా భావము.

ప్రకాశించునది అనే అర్థాన్ని గ్రహించినపుడు జ్ఞానప్రకాశము అని అర్థం చేసుకోవాలి. సీతమ్మ ఎక్కడుందో హనుమకు తెలియాలి. అట్టి జ్ఞానాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తూ, 'దేవీ' అని స్తుతిస్తున్నాడు.

ఇక రెండవ అర్థం, క్రీడించునది అనే అర్థాన్ని గ్రహించినపుడు ఈ జగన్నాటకమంతా ఆమె క్రీడయే. ఆమె ఆడించే ఆటయే. అగుపించడము, అగుపించకపోవడము కూడా ఆమె సంకల్పమే.

ఒక వస్తువును మనం చూడాలి అనుకున్నప్పుడు కేవలం మన కళ్ళల్లో ఉండే ప్రకాశం సరిపోదు. ఆ చూడబడే వస్తువు కూడా ప్రకాశింపబడాలి. అంధకారంలో వస్తువు మనకు అగుపించదు. సూర్యచంద్రాగ్నుల ప్రకాశం లోనే అది మనకు గోచరిస్తుంది.

వస్తువు ప్రకాశంలో ప్రత్యక్షం కానపుడు మనం చూసినా, ఉపయోగ ముండదు. కనుక సీతమ్మను తనకు ప్రత్యక్షం కమ్మని ప్రార్థిస్తూ 'దేవీ' అని స్తుతిస్తున్నాడు హనుమ.

'దేవీ' అని చెప్పి సరిపెట్టుకోలేదు. **'జనకాత్మజ'** అనికూడా ప్రార్థించాడు. జనకుని కుమార్తెగా సీతమ్మను వర్ణించాడు. ఎందుకో తెలుసా! పిల్లలు లేరని నిరాశ చెందియున్న జనకునికి నాగేటిచాలు నుండి లభించింది సీతమ్మ.

యజ్ఞమును నిర్వహించాలని సంకల్పించి, జనకుడు యజ్ఞభూమిని దున్నేటప్పుడు నాగేటిచాలు నుండి సీతమ్మ లభించింది. జనకుని ప్రయత్నము లేకుండా సీతమ్మే జనకుని కరుణించి కనిపించింది. నాగేటిచాలులో ప్రకాశించింది **(దేవి)**. అంతా ఆమె చిద్విలాసమే **(దేవి)**.

సీతమ్మ లభిస్తుందని జనకుడు నాగలి పట్టుకోలేదు. అయినా అయోనిజ విదేహరాజును కరుణించింది. నిరాశను పోగొట్టి ఆనందాన్ని ప్రసాదించింది.

"అమ్మా! నేను అశోకవనంలో ప్రవేశిస్తున్నా. నిన్ను వెతకడానికి నాకు మిగిలిన ప్రదేశము అదొక్కటే. ఎక్కడ వెతికినా, నీవు కనిపించలేదు. ఇక్కడయినా కన్పిస్తావని నేను వెతకడంలేదు. తండ్రియైన జనకుని కరుణించినట్లు, బిడ్డయైన ఆంజనేయుని కూడా అనుగ్రహించి నీవే అభివ్యక్తం కావాలి;" అని భావించాడు హనుమ. అందుచేతనే సీతమ్మను జనకాత్మజగా వర్ణించాడు.

జనకుడు యజ్ఞకర్మను నిర్వహించునపుడు సీతమ్మ జనకునికి ప్రాప్తించింది. స్వార్థము లేకుండా లోకకళ్యాణము కొరకు ఆచరించేది ఏదయినా యజ్ఞకార్యమే. జనకుని లాగా తనదికూడా యజ్ఞకర్మయే కనుక తనను కూడా కరుణించమని ప్రార్థిస్తూ హనుమంతుడు **నమః** - నమస్కారము అంటున్నాడు.

నమ ఇతి ద్వే అక్షరే - నమః అనేది ఒక పదము కాదు రెండు అక్షరములు అనికదా! 'మః' అంటే నాది. 'న' అంటే కాదు అని భావము. **నమః** అంటే నాదికాదు అని అర్థము.

ఇది రాముని కార్యమే కాని తనది కాదని, కర్తృత్వభావనను త్యజించి, యజ్ఞకార్యంగా సంభావించి సీతమ్మను ప్రార్థించాడు హనుమంతుడు.

పిలిచేవాడు బిడ్డ. పలికేది తల్లి.
అడిగేవాడు బిడ్డ. అందించేది తల్లి.
బిడ్డది ఆవేదన. తల్లిది ఆప్యాయత.
బిడ్డది ప్రేమ. తల్లిది త్యాగం.

చూడాలి మరి ఈ సత్యం మారుతి విషయంలో ఎలా ఉంటుందో!

సీతారాములకు, దేవతలకు, సుగ్రీవునకు నమస్కరించి, నలువైపుల వీక్షించి అశోకవనము వైపు వెళ్ళాడు హనుమంతుడు. రాముని కార్యాన్ని సాధించాలి. రావణుని కంట పడకుండా ఉండాలి అనుకొని తన దేహాన్ని బాగా కుదించి చిన్నదిగా చేసుకున్నాడు.

అశోకవన ప్రవేశము

అశోకవనం ప్రాకారం ఎక్కాడు ఆంజనేయుడు. ప్రాకారం మీద నుండి అశోకవనాన్ని వీక్షించాడు. తొలివసంతం లోనే పుష్పించి వున్న రకరకాల చెట్లను చూశాడు.

అశోకవృక్షాలు, మద్దిచెట్లు, పొన్నచెట్లు, సంపెంగచెట్లు, మామిడిచెట్లు, వెలగచెట్లు బాగా పూసి ఉన్నాయి. అక్కడ నుండి చెట్ల మీదికి విడిచిన బాణంలా ఉరికాడు కపిశ్రేష్ఠుడైన హనుమంతుడు.

అక్కడ చెట్లను తీగలు అందంగా అల్లుకొని ఉన్నాయి. వివిధ రకాల పువ్వులతో ఆ వనం శోభాయమానంగా ఉంది. ఆ వనమంతా కాసిన చెట్లు, విరగబూసిన చెట్లతో ఆ తోపు అంతా జీబుగా పెరిగి ఉంది. చెట్లనిండా పండ్లే. కోకిలల కుహూకారాలు, తుమ్మెదల నాదాలు, నెమళ్ళ క్రేంకారాలు ఆ వనమంతా ప్రతిధ్వనిస్తున్నాయి.

హనుమంతుడు చెట్లపై దూకాడు. అంతవరకు ఆ చెట్లపై నిద్రిస్తుండిన పక్షులన్నీ లేచి ఎగిరిపోయాయి. ఎగిరే పక్షుల రెక్కలు చెట్ల కొమ్మలకు తగలగానే చెట్లు జలజలమని పూలను రాల్చాయి. ఆ పువ్వులన్నీ పవనసుతునిపై పడ్డాయి. హనుమను పువ్వులు కప్పగా అతడు పూలకొండలా భాసించాడు.

అలా పడిన పువ్వులను దులుపుకోకుండా హనుమంతుడు చెట్లమీద దుముకుతూ వుంటే, అతణ్ణి చూచిన వారంతా వసంతుడేమో అనుకున్నారు. హనుమంతుడు అలా చెట్లపై దుముకుతుంటే చెట్ల చివరి ఆకులు, పువ్వులు, పండ్లు రాలిపోయాయి. అప్పుడు ఆ చెట్లు ఎలా అగుపించాయో తెలుసా! జూదంలో డబ్బు పోగొట్టుకున్న ఆటగాళ్ళు తమ ఒంటిమీదున్న బట్టల్ని, నగల్ని వొలిచి జూదంలో పెట్టినపుడు ఎలా ఉంటారో అలా ఉన్నాయి ఆ చెట్లు. మరికొన్ని వృక్షాలయితే గాలివానకు దెబ్బతిన్న చెట్లులా నిలిచి ఉన్నాయి.

మనోహరమైన ఆ వనంలో కొన్ని చెట్లకు అరుగులు తీర్చబడి ఉన్నాయి. వెండి, బంగారముతో చేయబడిన ఆ అరుగులకు మణులు, మాణిక్యాలు పొదిగి ఉన్నారు.

తియ్యని జలాలు కలిగిన దిగుడుబావులు చాలా వున్నాయి. వాటి మెట్లు వెండితో చేయబడి, ముత్యాలు అతికించబడి వున్నాయి. అక్కడక్కడ కూర్చునేందుకు స్ఫటిక మాణిక్యాల చపటా లున్నాయి. దిగుడుబావుల్లో హంసలు దివ్యంగా విహరిస్తున్నాయి. చెట్లపై కోయిలలు కూస్తున్నాయి.

అక్కడ ఒక అందమైన కొండ కూడా ఉంది. ఆ పర్వతములో భవ్యంగా శోభిస్తున్న గుహలు గదుల్లాగా నివాసయోగ్యంగా ఉన్నాయి. ఇవన్నీ రావణుడు తన తపోప్రభావముచే కృత్రిమంగా సృష్టించినవే.

రావణుడు క్రీడార్థమై సృష్టించిన ఆ పర్వతము పైనుండి ఒక సెలయేరు పారుతూ ఉంది. కొండపైనుండి లేచి పడుతున్న ఆ సెలయేటిని చూస్తుంటే భర్తపై కోపించి, అలిగి పుట్టింటికి వెళ్తున్న ఇగురుబోడిలా ఉందంటాడు వాల్మీకి.

ఒక వస్తువును మనం చూడాలి అనుకున్నప్పుడు కేవలం మన కళ్ళల్లో ఉండే ప్రకాశం సరిపోదు. ఆ చూడబడే వస్తువు కూడా ప్రకాశింపబడాలి. అంధకారంలో వస్తువు మనకు అగుపించదు. సూర్యచంద్రాగ్నుల ప్రకాశం లోనే అది మనకు గోచరిస్తుంది.

వస్తువు ప్రకాశంలో ప్రత్యక్షం కానపుడు మనం చూసినా, ఉపయోగ ముండదు. కనుక సీతమ్మను తనకు ప్రత్యక్షం కమ్మని ప్రార్థిస్తూ 'దేవీ' అని స్తుతిస్తున్నాడు హనుమ.

'దేవీ' అని చెప్పి సరిపెట్టుకోలేదు. **'జనకాత్మజ'** అనికూడా ప్రార్థించాడు. జనకుని కుమార్తెగా సీతమ్మను వర్ణించాడు. ఎందుకో తెలుసా! పిల్లలు లేరని నిరాశ చెందియున్న జనకునికి నాగేటిచాలు నుండి లభించింది సీతమ్మ.

యజ్ఞమును నిర్వహించాలని సంకల్పించి, జనకుడు యజ్ఞభూమిని దున్నేటప్పుడు నాగేటిచాలు నుండి సీతమ్మ లభించింది. జనకుని ప్రయత్నము లేకుండా సీతమ్మే జనకుని కరుణించి కనిపించింది. నాగేటిచాలులో ప్రకాశించింది **(దేవి)**. అంతా ఆమె చిద్విలాసమే **(దేవి)**.

సీతమ్మ లభిస్తుందని జనకుడు నాగలి పట్టుకోలేదు. అయినా అయోనిజ విదేహరాజును కరుణించింది. నిరాశను పోగొట్టి ఆనందాన్ని ప్రసాదించింది.

"అమ్మా! నేను అశోకవనంలో ప్రవేశిస్తున్నా. నిన్ను వెతకడానికి నాకు మిగిలిన ప్రదేశము అదొక్కటే. ఎక్కడ వెతికినా, నీవు కనిపించలేదు. ఇక్కడయినా కన్పిస్తావని నేను వెతకడంలేదు. తండ్రియైన జనకుని కరుణించినట్లు, బిడ్డయైన ఆంజనేయుని కూడా అనుగ్రహించి నీవే అభివ్యక్తం కావాలి;" అని భావించాడు హనుమ. అందుచేతనే సీతమ్మను జనకాత్మజగా వర్ణించాడు.

జనకుడు యజ్ఞకర్మను నిర్వహించునపుడు సీతమ్మ జనకునికి ప్రాప్తించింది. స్వార్థము లేకుండా లోకకళ్యాణము కొరకు ఆచరించేది ఏదయినా యజ్ఞకార్యమే. జనకుని లాగా తనదికూడా యజ్ఞకర్మయే కనుక తనను కూడా కరుణించమని ప్రార్థిస్తూ హనుమంతుడు **నమః** - నమస్కారము అంటున్నాడు.

నమ ఇతి ద్వే అక్షరే - నమః అనేది ఒక పదము కాదు రెండు అక్షరములు అనికదా! 'మః' అంటే నాది. 'న' అంటే కాదు అని భావము. **నమః** అంటే నాదికాదు అని అర్థము.

ఇది రాముని కార్యమే కాని తనది కాదని, కర్తృత్వభావనను త్యజించి, యజ్ఞకార్యంగా సంభావించి సీతమ్మను ప్రార్థించాడు హనుమంతుడు.

పిలిచేవాడు బిడ్డ. పలికేది తల్లి.
అడిగేవాడు బిడ్డ. అందించేది తల్లి.
బిడ్డది ఆవేదన. తల్లిది ఆప్యాయత.
బిడ్డది ప్రేమ. తల్లిది త్యాగం.

చూడాలి మరి ఈ సత్యం మారుతి విషయంలో ఎలా ఉంటుందో!

సీతారాములకు, దేవతలకు, సుగ్రీవునకు నమస్కరించి, నలువైపుల వీక్షించి అశోకవనము నైపు వెళ్ళాడు హనుమంతుడు. రాముని కార్యాన్ని సాధించాలి. రావణుని కంట పడకుండా ఉండాలి అనుకొని తన దేహాన్ని బాగా కుదించి చిన్నదిగా చేసుకున్నాడు.

అశోకవన ప్రవేశము

అశోకవనం ప్రాకారం ఎక్కాడు ఆంజనేయుడు. ప్రాకారం మీద నుండి అశోకవనాన్ని వీక్షించాడు. తొలివసంతం లోనే పుష్పించి వున్న రకరకాల చెట్లను చూశాడు.

అశోకవృక్షాలు, మద్దిచెట్లు, పొన్నచెట్లు, సంపెంగచెట్లు, మామిడిచెట్లు, వెలగచెట్లు బాగా పూసి ఉన్నాయి. అక్కడ నుండి చెట్ల మీదికి విడిచిన బాణంలా ఉరికాడు కపిశ్రేష్ఠుడైన హనుమంతుడు.

అక్కడ చెట్లను తీగలు అందంగా అల్లుకొని ఉన్నాయి. వివిధ రకాల పువ్వులతో ఆ వనం శోభాయమానంగా ఉంది. ఆ వనమంతా కాసిన చెట్లు, విరగబూసిన చెట్లతో ఆ తోపు అంతా జీబుగా పెరిగి ఉంది. చెట్లనిండా పండ్లే. కోకిలల కుహూకారాలు, తుమ్మెదల నాదాలు, నెమళ్ళ క్రేంకారాలు ఆ వనమంతా ప్రతిధ్వనిస్తున్నాయి.

హనుమంతుడు చెట్లపై దూకాడు. అంతవరకు ఆ చెట్లపై నిద్రిస్తుండిన పక్షులన్నీ లేచి ఎగిరిపోయాయి. ఎగిరే పక్షుల రెక్కలు చెట్ల కొమ్మలకు తగలగానే చెట్లు జలజలమని పూలను రాల్చాయి. ఆ పువ్వులన్నీ పవనసుతునిపై పడ్డాయి. హనుమను పువ్వులు కప్పగా అతడు పూలకొండలా భాసించాడు.

అలా పడిన పువ్వులను దులుపుకోకుండా హనుమంతుడు చెట్లమీద దుముకుతూ వుంటే, అతణ్ణి చూచిన వారంతా వసంతుడేమో అనుకున్నారు. హనుమంతుడు అలా చెట్లపై దుముకుతుంటే చెట్ల చివరి ఆకులు, పువ్వులు, పండ్లు రాలిపోయాయి. అప్పుడు ఆ చెట్లు ఎలా అగుపించాయో తెలుసా! జూదంలో డబ్బు పోగొట్టుకున్న ఆటగాళ్ళు తమ ఒంటిమీదున్న బట్టల్ని, నగల్ని వొలిచి జూదంలో పెట్టినపుడు ఎలా ఉంటారో అలా ఉన్నాయి ఆ చెట్లు. మరికొన్ని వృక్షాలయితే గాలివానకు దెబ్బతిన్న చెట్లులా నిలిచి ఉన్నాయి.

మనోహరమైన ఆ వనంలో కొన్ని చెట్లకు అరుగులు తీర్చబడి ఉన్నాయి. వెండి, బంగారముతో చేయబడిన ఆ అరుగులకు మణులు, మాణిక్యాలు పొదిగి ఉన్నారు.

తియ్యని జలాలు కలిగిన దిగుడుబావులు చాలా వున్నాయి. వాటి మెట్లు వెండితో చేయబడి, ముత్యాలు అతికించబడి వున్నాయి. అక్కడక్కడ కూర్చునేందుకు స్ఫటిక మాణిక్యాల చపటా లున్నాయి. దిగుడుబావుల్లో హంసలు దివ్యంగా విహరిస్తున్నాయి. చెట్లపై కోయిలలు కూస్తున్నాయి.

అక్కడ ఒక అందమైన కొండ కూడా ఉంది. ఆ పర్వతములో భవ్యంగా శోభిస్తున్న గుహలు గదుల్లాగా నివాసయోగ్యంగా ఉన్నాయి. ఇవన్నీ రావణుడు తన తపోప్రభావముచే కృత్రిమంగా సృష్టించినవే.

రావణుడు క్రీడార్థమై సృష్టించిన ఆ పర్వతము పైనుండి ఒక సెలయేరు పారుతూ ఉంది. కొండపైనుండి లేచి పడుతున్న ఆ సెలయేటిని చూస్తుంటే భర్తపై కోపించి, అలిగి పుట్టింటికి వెళ్తున్న ఇగురుబోడిలా ఉందంటాడు వాల్మీకి.

అలా పర్వతము నుండి దుముకుతున్న సెలయేటికి చెట్లకొమ్మలు అడ్డంగా ఒరిగి వున్నాయి. వాటిని తోసుకుంటూ వచ్చే ఆ సెలయేటిని అడ్డుకుంటున్న చెట్లకొమ్మలు ఎలా ఉన్నాయో తెలుసా! భర్తను వదలి వెళ్ళే మగువను వద్దని వారించే బంధువుల్లా ఉన్నాయి.

అలా వెళ్ళిన సెలయేరు కృత్రిమమైనదే కనుక తిరిగి అది బయలుదేరిన చోటికే వచ్చి చేరుతుంది మరొకవైపు నుండి. అలా తిరిగి వచ్చిన సెలయేరు ఎలా ఉందంటే, భర్తపై కోపం పోగానే మళ్ళీ తిరిగి కాపురానికి వచ్చిన ఇల్లాలు వలె ఉందట.

ఆ కొండకు సమీపంలోనే ఒక కమలసరోవరాన్ని చూశాడు కపివరుడు. అది ముత్యాల ఇసుకతో ప్రకాశిస్తోంది.

అక్కడ ఒక శింశుపావృక్షము ఉంది. అది బంగారు వర్ణంతో మెరిసిపోతోంది. దాని చుట్టూ బంగారు అరుగులున్నాయి. అగ్నిలా ప్రకాశిస్తున్న బంగారు చెట్లు కూడా కొన్ని ఉన్నాయి అక్కడ. వాటి కాంతి హనుమంతునిపై పడగా అతడు కూడా పచ్చగా బంగారు ముద్దలా కనిపిస్తున్నాడు.

ఆ బంగారు శింశుపా వృక్షానికి సిరిమువ్వల గంటలు వ్రేలాడుతున్నాయి. మెల్లగా వీచే గాలికి ఆ చిరుగంటలు గలగలమని శ్రావ్యమైన ధ్వనులు చేస్తున్నాయి. ఆ వృక్షాన్ని చూచి హనుమ విస్మయంతో నిశ్చేష్టుడయ్యాడు.

పుష్పించిన కొమ్మలతో, చిగుళ్ళతో, దట్టంగా వున్న ఆకులతో రమణీయంగా శోభిస్తున్న ఆ శింశుపావృక్షాన్ని ఎక్కాడు హనుమంతుడు.

సీతమ్మ దర్శనం

శింశుపావృక్షముపై కూర్చునియున్న హనుమంతునికి దగ్గరలో అందమైన ఒక మేడ కన్పించింది. ఎత్తైన ఆ మేడ కైలాసపర్వతం లాగా తెల్లగా శోభిస్తోంది. దానికి పగడాల మెట్లున్నాయి. బంగారు అరుగు లున్నాయి. అది దివ్యంగా ప్రకాశిస్తూ ఉంది.

అక్కడ కొందరు రాక్షసస్త్రీలు ఉన్నారు. వారి మధ్య మాసినబట్ట చుట్టుకున్న స్త్రీ కనిపించింది. ఆహారం లేనందున బాగా కృశించిన ఆమె బరువుగా నిఃశ్వాసలు వదులుతూవుంది. చంద్రరేఖ లాగా సన్నగా ఉంది. పవిత్రమూర్తి లాగా కన్పిస్తోంది. పొగ నిండిన అగ్నిశిఖ లాగా ఉంది.

ఒక పచ్చని వస్త్రాన్ని కట్టుకోనుంది. ఆభరణాలేవీ లేకుండా ఉంది. పువ్వులు లేని తామరతీగ లాగా ఉంది. సిగ్గుతో తలవంచుకొని కూర్చోనుంది. కన్నీళ్ళు కార్చుతూ దీనురాలై ఉంది.

తనవారికి దూరమై, దానవుల మధ్య జీవిస్తున్న ఆమె, లేళ్ళ గుంపుకు దూరమై కుక్కల మధ్య చేరిన ఆడలేడి లాగా కన్పిస్తోంది. ఏ కష్టాలు ఎరుగని ఆమె కష్టాల కుప్పలా ఉంది అక్కడ. కన్నీటి తిప్పలా ఉంది.

"ఈమె సీతయై ఉంటుందేమో!" అని ఊహించాడు ఆంజనేయుడు. ఆనాడు ఆకాశంలో రావణుడు అపహరించి తీసికొనిపోతూ వుండిన స్త్రీ లాగానే ఉంది ఈమె అనుకున్నాడు.

ఆమె ముఖం చంద్రబింబంలా ఉంది. కనుబొమ్మలు ఎంతో అందంగా ఉన్నాయి. ఆమె దేహకాంతి చీకటిని తరిమికొడుతోంది. కురులు నల్లగా ఉన్నాయి. దంతాలు ముత్యాలను మరిపిస్తున్నాయి. దొండపండులాగే ఉన్నాయి అధరాలు. చూస్తుంటే మహాపతివ్రతలా తెలుస్తోంది. ఒక తపస్వినిలా కన్పిస్తోంది.

విహతా మివ చ శ్రద్ధా మాశాం ప్రతిహతా మివ
సోపసర్గాం యథా సిద్ధిం బుద్ధిం సకలుషామివ ॥

"క్షీణించిన శ్రద్ధ లాగా, తీరని ఆశ లాగా, పతనమైన సిద్ధి లాగా, కలుషితమైన బుద్ధి లాగా కన్పిస్తూ ఉంది ఆమె".

లేడి వంటి కన్నులుగల ఆమె నేత్రాలు నీళ్ళతో నిండున్నాయి. దేహం మాలిన్యంతో ఉంది. ముఖం దీనంగా ఉంది. ఏ ఆభరణాలూ ఒంటిమీద లేని ఆమె మబ్బు కప్పిన చంద్రుడులా ఉంది.

"ఈమె సీతేనా! కాదా!" ఇదే సందేహం హనుమంతునికి. చదువు, సంస్కారము లేనివాని మాటను పండితుడు అతికష్టంతో అర్థం చేసుకొనునట్లు, ఏ అలంకరణలు లేని ఆమెను సీతమ్మగా అతికష్టం మీద గుర్తించాడు ఆంజనేయుడు.

రాముడు చెప్పిన గుర్తులన్నీ సరిపోయాయి ఈమె విషయంలో. ఏ ఆభరణాలనైతే అపహరణ సమయంలో మూటగట్టి ఆకాశం నుండి సీతమ్మ ఆనాడు విడిచిందో ఆ ఆభరణాలు ఈనాడు ఆమె శరీరం మీద లేవు. ఇక సందేహం అవసరం లేదనుకున్నాడు హనుమంతుడు.

"ఈమెయే రాముని ధర్మపత్ని. రాముడు వ్యథచెందేది ఈమెకొరకే. ఈమె రామునివలె సుందరముగా ఉంది.

రామస్య చ యథా రూపం తస్యేయ మసితేక్షణా

"నల్లని కన్నులుగల ఈ సీతమ్మ సౌందర్యము రాముని సౌందర్యమునకు తగి యున్నది".

"ఈమె మనస్సు రాముని మీదే ఉంది. రాముని మనసు ఈమె మీదనే ఉంది. అందుకనే ఇద్దరూ ఇంకా బ్రతికి ఉన్నారు.

దుష్కరం కృతవా న్రామో హీనో యదనయా ప్రభుః
ధారయ త్యాత్మనో దేహం న శోకే నావసీదతి ॥

"సీతకు దూరమై కూడా రాముడు ప్రాణాలతో జీవిస్తున్నాడు. మరణించలేదు. ఈ పని సామాన్యులకు శక్యం కాదు;" అని భావించాడు హనుమంతుడు.

సీతమ్మను దర్శించిన ఆనందంలో ఇలా ఏవో ఏవో ఊహించుకున్నాడు పవనసుతుడు. రామప్రభువును ఎంతగానో మెచ్చుకున్నాడు. సీతారాముల్ని మనసులో పదేపదే కొనియాడుకుంటూ మళ్ళీ ఆలోచనా సాగరంలో మునిగాడు ఆంజనేయుడు.

ఆంజనేయుని ఆవేదన

మారుతి మనసులో ఏమి జరిగిందో తెలియదు. కానీ ఏదో భరించలేనిదే జరిగిపోయిందని ఆ మహాత్ముని నేత్రాలనుండి స్రవించే అశ్రువులు పలుకుతున్నాయి.

"ధర్మాత్ముడైన శ్రీరామునికి ధర్మపత్ని, వివేక వినయాలకు ప్రతిరూపమైన లక్ష్మణునికి పూజ్యురాలు అయిన సీత కూడా ఇలా బాధపడుతూ వుంది. **కాలోహి దురతిక్రమః** కాలాన్ని అతిక్రమించడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

"ఈమెకు రాముని పరాక్రమం తెలుసు. లక్ష్మణుని ప్రతాపమూ తెలుసు. అందుచేత వర్షాకాలంలో గంగానదిలాగా నిండుగా ఉంది.

తుల్యశీల వయోవృత్తాం తుల్యాభిజన లక్షణామ్

రాఘవోఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా!

"శీలము, వయస్సు, వర్తనము, వంశము, ఉత్తమ లక్షణములు గల ఈ సీతకు రాముడే తగిన భర్త. అట్టి రామునకు నల్లని కన్నులు గల ఈ సీతయే తగిన భార్య," అని భావించాడు హనుమంతుడు.

ఆంజనేయుడు సీతమ్మను ప్రథమంగా దర్శించగనే సీతారాముల ఆదర్శజీవితము నిరుపమానము అని భావించాడు. వారికి వారే సాటి అని ఆలోచించి ఆనందించాడు. వారిద్దరు పరస్పరము సర్వవిధాల సరిపోయినారని వివరించాడు. వర్ణించాడు.

సీతారాములకు మధ్య ఐదు సమాన విషయాలను ప్రస్తావించాడు. అవియే శీలము, వయస్సు, ప్రవర్తనము, వంశము, శ్రేష్ఠలక్షణాలు-ఇవన్నీ ఇరువురికీ సమాన మంటాడు.

కానీ వాక్యవిశారదుడైన వాయుపుత్రుడు అంతటితో ఆగలేదు. సీతమ్మలో రామునికన్నా ఒక లక్షణము విశేషముగా ఉన్నట్లు అభిప్రాయపడ్డాడు. **అసితేక్షణా** అని వర్ణించాడు సీతమ్మను అధికంగా.

'అసితేక్షణా' అంటే నల్లని కన్నులు గలది అని అర్థము. తొలిచూపులోనే తల్లి హృదయాన్ని పసిగట్టేశాడు పవనసుతుడు.

సీతమ్మ కళ్ళు నల్లగా ఉన్నాయి. ఆమె చల్లని తల్లి. ఉద్వేగము నెరుగని ఉల్లముగల తల్లి. ఆమె దృష్టి సదా ప్రసన్నమే. ఆమె నేత్రాలు ఎప్పుడూ ఎఱ్ఱబడలేదట. నలుపును వీడలేదట.

సీతమ్మ కన్నులలోని నల్లదనము ఆమె హృదయంలోని చల్లదనాన్ని వ్యక్త పరుస్తోంది అంటున్నాడు ఆంజనేయుడు. శాంతమైన హృదయం గలవారు రామునికి ప్రియమైనవారు అవులారని మనం గ్రహించాలి.

సీతమ్మ కొత్తబంగారం కాంతితో మెరిసిపోతోంది. లక్ష్మీదేవి లాగా మనోహరంగా కనిపిస్తోంది. ఆమెను చూస్తూ వుంటే హనుమంతుని మనసు రాముని వద్దకు పరుగులు తీసింది. ఆంజనేయుడు తనలో తాను ఇలా భాషించుకున్నాడు.

"రాముడు మహాబలవంతుడైన వాలిని కూల్చేశాడు. రావణునితో సమానుడైన కబంధుని కాల్చేశాడు. ఇంద్రుడు శంబరాసురుని వధించినట్లు భయంకరుడైన విరాధుని హతమార్చాడు. ఇవన్నీ ఎవరికొరకు చేశాడు రాముడు? విశాలాక్షియైన ఈ వైదేహి కొరకే కదూ!

"అంతేకాదు. జనస్థానంలో నిప్పులాంటి బాణాల్ని ప్రయోగించి పద్నాలుగు వేలమంది రాక్షసుల్ని నేలమట్టం చేశాడు. ఖరుణ్ణి ఖండించాడు. త్రిశిరస్సును వధించాడు. బలవంతుడైన దూషణుని తల త్రుంచాడు. ఇవన్నీ ఈమె కారణంగా చేసినవే కదూ!

"నదీనదాలకు ప్రభువైన సముద్రుణ్ణి నేను దాటి వచ్చింది ఈమెకొరకే కదూ! ఈ తల్లికొరకు రాముడు ప్రపంచాన్నంతా బుగ్గి చేసినా తప్పులేదని నా అభిప్రాయము.

"త్రిలోకాధిపత్యము ఎక్కువా! లేక సీతమ్మ ఎక్కువా! అని ఆలోచిస్తే, త్రిలోకాధిపత్యము సీతమ్మలో పదహారవవంతు కూడా కాదని నా అభిప్రాయము.

"నాగేటిచాలు నుండి పుట్టిన మహాతల్లి, జనకమహారాజు పుత్రిక, మహాపతివ్రత అయిన సీత ఈమెయే అని నా అభిప్రాయము.

"పరాక్రమవంతుడు, పూజనీయుడు, యుద్ధములో వెన్ను చూపని ధీరుడు అయిన దశరథమహారాజుకు కీర్తిమంతురాలైన పెద్దకోడలు ఈమెయే.

"ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, బుద్ధిమంతుడైన రాముని అర్ధాంగి అయిన ఈ మహాసాధ్వి ఈనాడు రాక్షసుల వశమైపోయింది.

"భోగాలను వదలి, బాధల్ని లెక్కచేయకుండా భర్త మీద ఉన్న ప్రేమచేత అరణ్యాల్లో ప్రవేశించింది. ఫలాలు, దుంపలు తిని బ్రతికింది. పతిసేవయే పరమలక్ష్యంగా భావించింది. అయోధ్యలో ఉన్నట్లే ఉండింది అరణ్యంలో కూడా. బంగారు కాంతిగల శరీరంతో సదా మందహాసాన్ని చిందిస్తూ వుండేది. అట్టి మహాతల్లి ఈ బాధల్ని భరిస్తోంది.

"దప్పికతో ఉన్నవాడు చలివేంద్రం కోసం చూస్తున్నట్లు రాముడు ఈమె కొరకే నిరీక్షిస్తున్నాడు. ఈమె లభించగనే పోయిన రాజ్యాన్ని తిరిగి పొందిన రాజులాగా రాముడు ఆనందిస్తాడు.

"ఆమెకు ఏవిధమైన కామభోగాలూ లేవు. బంధువు లెవ్వరూ దగ్గర లేరు. ఎప్పటికైనా రాముడు లభిస్తాడు అనే ఆశతోనే ఆమె బ్రతికి ఉంది. తన చుట్టూ ఏమి జరుగుతూ వుందో ఆమెకు తెలియడం లేదు.

"ఆమె చుట్టూ కాపలా వున్న రాక్షసస్త్రీలను ఆమె చూడడం లేదు. పూలచెట్ల మీద మనసు లేదు. పండ్లచెట్ల మీద దృష్టి లేదు. మనసంతా రాముని మీదనే కేంద్రీకృతం చేసి వుంది. భర్తే భూషణమని భావించే సీతకు భర్త దగ్గర లేకపోవడం చేత ఏదో పోగొట్టుకున్నట్లు కళావిహీనంగా కనిపిస్తోంది.

"సుఖాలు అనుభవించవలసిన శతపత్ర నిభేక్షణ యైన సీత ఇలా దుఃఖపడుతుంటే నా గుండె నీరైపోతూ వుంది. ఒకప్పుడు రామలక్ష్మణులు ఈమెను రక్షిస్తూ వుండేవారు. ఈనాడు రాక్షసులు కాపలా ఉంటున్నారు. కాలమెంత కర్కశమో!

ఆంజనేయుని ఆవేదన

మారుతి మనసులో ఏమి జరిగిందో తెలియదు. కానీ ఏదో భరించలేనిదే జరిగిపోయిందని ఆ మహాత్ముని నేత్రాలనుండి స్రవించే అశ్రువులు పలుకుతున్నాయి.

"ధర్మాత్ముడైన శ్రీరామునికి ధర్మపత్ని, వివేక వినయాలకు ప్రతిరూపమైన లక్ష్మణునికి పూజ్యురాలు అయిన సీత కూడా ఇలా బాధపడుతూ వుంది. **కాలోహి దురతిక్రమః** కాలాన్ని అతిక్రమించడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

"ఈమెకు రాముని పరాక్రమం తెలుసు. లక్ష్మణుని ప్రతాపమూ తెలుసు. అందుచేత వర్షాకాలంలో గంగానదిలాగా నిండుగా ఉంది.

తుల్యశీల వయోవృత్తాం తుల్యాభిజన లక్షణామ్

రాఘవోఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా!

"శీలము, వయస్సు, వర్తనము, వంశము, ఉత్తమ లక్షణములు గల ఈ సీతకు రాముడే తగిన భర్త. అట్టి రామునకు నల్లని కన్నులు గల ఈ సీతయే తగిన భార్య," అని భావించాడు హనుమంతుడు.

ఆంజనేయుడు సీతమ్మను ప్రథమంగా దర్శించగనే సీతారాముల ఆదర్శజీవితము నిరుపమానము అని భావించాడు. వారికి వారే సాటి అని ఆలోచించి ఆనందించాడు. వారిద్దరు పరస్పరము సర్వవిధాల సరిపోయినారని వివరించాడు. వర్ణించాడు.

సీతారాములకు మధ్య ఐదు సమాన విషయాలను ప్రస్తావించాడు. అవియే శీలము, వయస్సు, ప్రవర్తనము, వంశము, శ్రేష్ఠలక్షణాలు-ఇవన్నీ ఇరువురికీ సమాన మంటాడు.

కానీ వాక్యవిశారదుడైన వాయుపుత్రుడు అంతటితో ఆగలేదు. సీతమ్మలో రామునికన్నా ఒక లక్షణము విశేషముగా ఉన్నట్లు అభిప్రాయపడ్డాడు. **అసితేక్షణా** అని వర్ణించాడు సీతమ్మను అధికంగా.

'అసితేక్షణా' అంటే నల్లని కన్నులు గలది అని అర్థము. తొలిచూపులోనే తల్లి హృదయాన్ని పసిగట్టేశాడు పవనసుతుడు.

సీతమ్మ కళ్ళు నల్లగా ఉన్నాయి. ఆమె చల్లని తల్లి. ఉద్వేగము నెరుగని ఉల్లముగల తల్లి. ఆమె దృష్టి సదా ప్రసన్నమే. ఆమె నేత్రాలు ఎప్పుడూ ఎఱ్ఱబడలేదట. నలుపును వీడలేదట.

సీతమ్మ కన్నులలోని నల్లదనము ఆమె హృదయంలోని చల్లదనాన్ని వ్యక్త పరుస్తోంది అంటున్నాడు ఆంజనేయుడు. శాంతమైన హృదయం గలవారు రామునికి ప్రియమైనవారు అవుతారని మనం గ్రహించాలి.

సీతమ్మ కొత్తబంగారం కాంతితో మెరిసిపోతోంది. లక్ష్మీదేవి లాగా మనోహరంగా కనిపిస్తోంది. ఆమెను చూస్తూ వుంటే హనుమంతుని మనసు రాముని వద్దకు పరుగులు తీసింది. ఆంజనేయుడు తనలో తాను ఇలా భాషించుకున్నాడు.

"రాముడు మహాబలవంతుడైన వాలిని కూల్చేశాడు. రావణునితో సమానుడైన కబంధుని కాల్చేశాడు. ఇంద్రుడు శంబరాసురుని వధించినట్లు భయంకరుడైన విరాధుని హతమార్చాడు. ఇవన్నీ ఎవరికొరకు చేశాడు రాముడు? విశాలాక్షియైన ఈ వైదేహి కొరకే కదూ!

"అంతేకాదు. జనస్థానంలో నిప్పులాంటి బాణాల్ని ప్రయోగించి పద్నాలుగు వేలమంది రాక్షసుల్ని నేలమట్టం చేశాడు. ఖరుణ్ణి ఖండించాడు. త్రిశిరస్సును వధించాడు. బలవంతుడైన దూషణుని తల త్రుంచాడు. ఇవన్నీ ఈమె కారణంగా చేసినవే కదూ!

"నదీనదాలకు ప్రభువైన సముద్రుణ్ణి నేను దాటి వచ్చింది ఈమెకొరకే కదూ! ఈ తల్లికొరకు రాముడు ప్రపంచాన్నంతా బుగ్గి చేసినా తప్పులేదని నా అభిప్రాయము.

"త్రిలోకాధిపత్యము ఎక్కువా! లేక సీతమ్మ ఎక్కువా! అని ఆలోచిస్తే, త్రిలోకాధిపత్యము సీతమ్మలో పదహారవవంతు కూడా కాదని నా అభిప్రాయము.

"నాగేటిచాలు నుండి పుట్టిన మహాతల్లి, జనకమహారాజు పుత్రిక, మహాపతివ్రత అయిన సీత ఈమెయే అని నా అభిప్రాయము.

"పరాక్రమవంతుడు, పూజనీయుడు, యుద్ధములో వెన్ను చూపని ధీరుడు అయిన దశరథమహారాజుకు కీర్తిమంతురాలైన పెద్దకోడలు ఈమెయే.

"ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, బుద్ధిమంతుడైన రాముని అర్ధాంగి అయిన ఈ మహాసాధ్వి ఈనాడు రాక్షసుల వశమైపోయింది.

"భోగాలను వదలి, బాధల్ని లెక్కచేయకుండా భర్త మీద ఉన్న ప్రేమచేత అరణ్యాల్లో ప్రవేశించింది. ఫలాలు, దుంపలు తిని బ్రతికింది. పతిసేవయే పరమలక్ష్యంగా భావించింది. అయోధ్యలో ఉన్నట్లే ఉండింది అరణ్యంలో కూడా. బంగారు కాంతిగల శరీరంతో సదా మందహాసాన్ని చిందిస్తూ వుండేది. అట్టి మహాతల్లి ఈ బాధల్ని భరిస్తోంది.

"దప్పికతో ఉన్నవాడు చలివేంద్రం కోసం చూస్తున్నట్లు రాముడు ఈమె కొరకే నిరీక్షిస్తున్నాడు. ఈమె లభించగనే పోయిన రాజ్యాన్ని తిరిగి పొందిన రాజులాగా రాముడు ఆనందిస్తాడు.

"ఆమెకు ఏవిధమైన కామభోగాలూ లేవు. బంధువు లెవ్వరూ దగ్గర లేరు. ఎప్పటికైనా రాముడు లభిస్తాడు అనే ఆశతోనే ఆమె బ్రతికి ఉంది. తన చుట్టూ ఏమి జరుగుతూ వుందో ఆమెకు తెలియడం లేదు.

"ఆమె చుట్టూ కాపలా వున్న రాక్షసస్త్రీలను ఆమె చూడడం లేదు. పూలచెట్ల మీద మనసు లేదు. పండ్లచెట్ల మీద దృష్టి లేదు. మనసంతా రాముని మీదనే కేంద్రీకృతం చేసి వుంది. భర్తే భూషణమని భావించే సీతకు భర్త దగ్గర లేకపోవడం చేత ఏదో పోగొట్టుకున్నట్లు కళావిహీనంగా కనిపిస్తోంది.

"సుఖాలు అనుభవించవలసిన శతపత్ర నిభేక్షణ యైన సీత ఇలా దుఃఖపడుతుంటే నా గుండె నీరైపోతూ వుంది. ఒకప్పుడు రామలక్ష్మణులు ఈమెను రక్షిస్తూ వుండేవారు. ఈనాడు రాక్షసులు కాపలా ఉంటున్నారు. కాలమెంత కర్కశమో!

"ఈ అమ్మకు వాళ్ళ అమ్మ పోలికలొచ్చాయి. లేకుంటే, ఎవరు భరించగలరు ఈ కష్టాల్ని! ఒకటా, రెండా! బాధల శరపరంపరలను తట్టుకుంది ఈ తల్లి. కష్టాలు పడీపడీ మంచు పడ్డ తామరతీగెలా వుంది ఈమె. తోడు దూరమైన ఆడ చక్రవాకంలా వుంది.

"ఆమెకున్న దుఃఖం చాలదన్నట్లు పువ్వుల భారంతో వంగిన ఈ అశోకచెట్లు, ఈ వసంతవెన్నెల ఈమెకు మరీ దుఃఖాన్ని కల్గిస్తున్నాయి. సందేహం లేదు. ఈమె సీతయే" అని నిర్ణయించుకొనిన హనుమంతుడు చెట్టుకొమ్మల్లోనే ఒదిగిపోయాడు.

ఆత్మదర్శనం

నీలాకాశంలో జాబిల్లి వెలిగిపోతున్నాడు. నల్లని జలాలలో జలకమాడే రాజహంసలా కదుల్తున్నాడు. కలువపువ్వుల కుప్పలా అందంగా శోభిస్తున్నాడు. తన తెల్లని, చల్లని కిరణాలతో హనుమంతునికి సాయం చేస్తున్నాడా! అన్నట్లున్నాడు.

సీతమ్మ ముఖం పూర్ణచంద్రునిలా వెలిగిపోతోంది. కానీ బరువును మోయలేక నీటిలో మునిగిపోతున్న నావ లాగా క్రుంగిపోతోంది దుఃఖభారంతో ఆ తల్లి. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలు మూగి ఉన్నారు. హనుమ వాళ్ళను పరిశీలించి చూశాడు.

ఆ రాక్షసస్త్రీలు చాలా భయంకరంగా కనిపిస్తున్నారు. ఒకదానికి ఒక్క కన్నుంటే, ఒకదానికి ఒక్కటే చెవి వుంది. ఒకదానికి చెవులే లేవు. ఒకదాని తల గంపంత వుంది. పొట్ట వ్రేలాడుతూ వుండేది ఒకటైతే, గూనిది మరొకతె.

ఒకతె చాలా పొట్టిది. ఒకతె తాటిచెట్టంత ఉంది. గూనిది ఒకతె. వంకరటింకరది మరొకతె. ఒకదానికి పళ్ళు దూసుకొని వచ్చుంటే, ఒకదాని క్రింది పెదవి గడ్డాన్ని కప్పేసి వుంది. వాళ్ళను చూస్తుంటే ఒళ్ళు జలదరిస్తోంది. గుండె ఆగిపోయేలా భయమేస్తోంది.

తస్యాధస్తా చ్చ తాం దేవీం రాజపుత్రీ మనిన్దితామ్
లక్షయామాస లక్ష్మీవాన్ హనుమాన్ జనకాత్మజామ్

"ఆ చెట్టుక్రింద రాజకుమారి, జనకుని కుమార్తె, దోషరహిత మైనది అయిన సీతాదేవిని లక్ష్మీవంతుడైన హనుమంతుడు దర్శించాడు."

సౌందర్యోపాసనకు ఫలితం ఇక్కడ లభించింది. ఇదే సుందరకాండ అందించు ప్రసాదము. ఇదియే నిత్య సుందరమైన ఆత్మదర్శనము. ఇదియే ఆత్మసౌందర్యము. సాధకుడు ప్రయత్నించి పొందదగిన పరమ పురుషార్థము.

సీతమ్మ కనిపించక వానరులంతా నిరాశ చెందినపుడు వారిలో ఆశను రేకెత్తించి, నూతనోత్తేజాన్ని కల్పించింది సంపాతి. సంపాతి ద్వారానే సీతమ్మ ఉనికి వానరులకు తెలిసింది.

అంతకన్నా ముందే, రావణుడు సీతను అపహరించుకొని వెళ్ళినట్లు జటాయువు చెప్పింది రామలక్ష్మణులతో. విషయాన్నైతే చెప్పింది గాని వివరాలను, ఉనికిని అందించలేకపోయింది.

ఆ తరువాత, సీతమ్మ జారవిడిచిన ఆభరణాలు సుగ్రీవాదులకు దొరికాయి. జటాయువు చెప్పిన విషయము ఖరారైంది. కానీ ఉనికి, వివరాలకై అన్వేషణ ప్రారంభించవలసి వచ్చింది.

ఈ దశలో అన్వేషణమును చక్కని మలుపు తిప్పింది సంపాతి. రావణుడు సీతమ్మను ఎలా అపహరించింది చెప్పింది సంపాతియే. సీతమ్మ ఎక్కడుండేది కూడా తాను చూస్తున్నానంటూ చెప్పింది సంపాతియే.

ఈ ప్రపంచంలో ఒక్కటే సుందరమైనది. అదియే ఆత్మ. ఆ ఆత్మయే సీతమ్మ. సీతమ్మను అన్వేషించడమంటే ఆత్మాన్వేషణమే. సృష్టిలో సత్యసౌందర్యాన్ని అన్వేషించడమే. సత్యశివ రూపమైన సుందర స్వరూపాన్ని దర్శింపచేసేదే సుందరకాండము.

సీతను అన్వేషిస్తూ రామలక్ష్మణులు బయలుదేరారు. వారికి సీత ఎక్కడా కనిపించలేదు. తీవ్రంగా కలత చెందారు. ఎంతగానో దుఃఖించారు. అయినా సీతమ్మ అగుపించలేదు.

ఈ ప్రపంచంలో అందరూ నిత్యానందాన్ని అన్వేషించేవారే. పొందలేక, అలమటిస్తూ దుఃఖించేవారే. రామలక్ష్మణులు సీత కొరకు కొండలు, వాగులు, చెట్లు, పుట్టలు వెతికినట్లు, మానవు లందరూ నిత్యసుఖం కోసం వస్తువుల మధ్య, వ్యక్తుల మధ్య, విషయాల మధ్య వెతుకుతారు. రామలక్ష్మణులకు సీత లభించదు. మనకు నిత్యానందం ప్రాప్తించదు.

జటాయువు ద్వారా రావణుడు సీతను అపహరించినట్లు తెలిసింది రామలక్ష్మణులకు. విషయం తెలిసింది కాని, ఉనికి, వివరాలు తెలియలేదు. అంతకు మించి వారికి సహాయం చేయలేక జటాయువు వారినుండి నిష్క్రమించింది.

పండితుల ద్వారా, శాస్త్రాధ్యయన తత్పరుల ద్వారా స్వాధ్యాయపరుల ద్వారా మనకు కొంత వేదాంతవిషయం అందుతుంది. సీత రావణునిచే అపహరించ బడినట్లు ఆత్మ అజ్ఞానముచే ఆవరించబడింది అని మనకు వినిపిస్తుంది. ఇదికూడా విషయమే. కానీ ఇక్కడ ఉనికి, వివరాలు అందవు. కనుక అశాంతి తొలగదు. బాధలు దూరం కావు. కానీ, అన్వేషించి సాధించాలి అనే ఉత్సాహం కలుగుతుంది. ఇదికూడా వాంఛనీయమే.

పూర్వపు రోజుల్లో మన పెద్దవాళ్ళు పురాణ ప్రవచనాలను, హరికథలను, నాటకాలను, నృత్యాలను, చిత్రలేఖనాన్ని, ఉపన్యాసాలను ఈ దృక్పథం నుండే ఆదరించేవారు. ఇవన్నీ వాంఛనీయాలే. అవశ్యములే.

జటాయువు ద్వారా లభించిన విషయం ధృవపడింది సుగ్రీవునివద్ద. సీతమ్మ ఆభరణాలను సుగ్రీవుడు చూపించినపుడు విషయం దృఢమై, ధృవమై మిగిలింది.

అక్కడా, ఇక్కడా వినిన విషయాలు మహాత్ములవద్ద నిదర్శనాలుగా దర్శించినపుడు మనలోని విశ్వాసము అకుంఠితమై భాసిస్తుంది. ఇదంతా హృదయాన్ని నిర్మలంగా మార్చి, అన్వేషణామార్గమును తప్పకుండా జీవించునట్లు చేస్తాయే గాని, అపహరించబడిన వస్తువు యొక్క ఉనికిని తెలియచేయలేవు.

ఈవిధంగా స్పందించిన ముముక్షువులు కపివరులు సీతను అన్వేషించినట్లు ఆత్మను అన్వేషిస్తారు. స్వయంప్రభ విడిచిపెట్టిన మార్గంలో కపివరులకు సంపాతి కన్పించింది. మన సంస్కార ప్రకాశంలో సాధువు ప్రాప్తిస్తాడు.

సీత ఎక్కడుందో సంపాతి చెబుతుంది. రావణుడు ఎలా అపహరించాడో వివరిస్తూ చెబుతుంది. "ఇప్పుడు నేను సీతను చూస్తూ చెబుతున్నాను" అని సంపాతి చెప్పిన విషయం గమనార్హం.

ఆత్మ యొక్క అస్తిత్వాన్ని ఆచార్యుడు వివరిస్తాడు. అజ్ఞానము యొక్క స్వరూప స్వభావాలను వివరిస్తాడు. సీతను చూస్తూ సంపాతి చెప్పినట్లు ఆత్మను దర్శిస్తూ గురువు ప్రబోధిస్తాడు.

ఆత్మానం సతతం జ్ఞాత్వా కాలం నయ మహామతే

"సదా ఆత్మను దర్శిస్తూ జీవించు" అన్నది నాదబిందూపనిషత్తు.

తాను చూసిన, చూస్తున్న విషయాన్ని సంపాతి లాగా శ్రోత్రియబ్రహ్మనిష్ఠుడైన గురువు బోధిస్తాడు. కపివరులకు సంపాతి వద్దే సీతమ్మ ఉనికి, వివరాలు సుస్పష్ట మైనట్లు, గురువుల వద్దే ముముక్షువులకు ఆత్మసంబంధమైన జ్ఞానము లభిస్తుంది.

అన్వేషణా మార్గాన్ని ఇక్కడ మలుపు తిప్పింది సంపాతి. ఆధ్యాత్మికజీవన మార్గాన్ని మలుపు తిప్పేవాడు సద్గురువు.

విషయాన్ని వివరించి చెప్పిన తరువాత సంపాతి ఎగిరి వెళ్ళిపోయింది. అన్వేషించాల్సింది, దర్శించాల్సింది కపివరులే. ఇక బాధ్యత వారిమీదే ఉంది కాని సంపాతి మీద కాదు.

గురువు జ్ఞానాన్ని బోధించిన తరువాత శిష్యుని సత్యదర్శనం చేయుటకు సంసిద్ధం చేసి తాను తప్పుకుంటాడు. ఆ తరువాత భారాలు, బాధ్యతలు ముముక్షువు మీదనే ఉంటాయి.

ఈ దశలో సాధన ప్రారంభ మవుతుంది. ఆ మార్గంలో సాధకులే మనకు తోడుగా ఉంటారు. ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కల్పిస్తూ ఉంటారు. ఇదే సత్సంగము.

అంగద జాంబవంతుల సత్సంగము ఆంజనేయునికి ప్రాప్తించింది. సత్సంగ ప్రభావంతో, సంపాతి చెప్పిన విషయాన్ని ఔదలదాల్చి సముద్రాన్ని లంఘించాడు వాయునందనుడు.

గురుబోధను హృదయంలో నింపుకొని, సత్సంగముచే ప్రభావితులైన ముముక్షువులు భవసాగరాన్ని దాటేందుకు ప్రయత్నించాలి. మైనాక లాగా ఎదురయ్యే సన్మానాలకు లొంగ కూడదు. హనుమంతుడు సురసను జయించినట్లు రసనేంద్రియాన్ని జయించాలి. సింహికను వాయుపుత్రుడు వధించినట్లు హింసను విడనాడాలి. లంకిణీ దూరమైనట్లు దేహాత్మభావన, తొడిమను వీడిన పండులా దూరం కావాలి.

ఇవన్నీ జరిగిన తరువాతే హనుమంతుడు లంకలో ప్రవేశిస్తాడు. ముముక్షువు కూడా ఇలా సోపానక్రమంగా చరించిన తరువాతే అంతర్ముఖు డవుతాడు.

లంకలో ప్రవేశించిన హనుమంతునికి అందాలూ కనిపించాయి. వికారాలూ అగుపించాయి. అంతర్ముఖుడైన సాధకునికి అప్పుడే తన ఆంతరంగిక జీవితం సుస్పష్టమౌతుంది. తనలోని సద్వృత్తులూ, దుర్వృత్తులూ తేటతెల్ల మవుతాయి.

ఇది ఏదీ అర్థంకాని దశ. చీకటిదశ. రాత్రిదశ. ఆశానిరాశల పర్వమిది. విశ్వాస సంశయాల మధ్య ప్రయాణమిది. హనుమంతుడు లంకలో ఇదే అనుభవించాడు. సాధన దశలో సాధకుడు కూడా ఆంతర్యంలో అదే అనుభవిస్తాడు.

ఈ దశలోనే నిరాశ చోటుచేసుకొనే ప్రమాదముంది. అనవసరమైన సంకల్పాలు విజృంభించి, కల్లోలాలను సృష్టించే అవకాశమూ ఉంది. ఇదంతా ఎదుర్కొన్నాడు హనుమంతుడు. మనమూ ఎదుర్కోక తప్పదు.

చివరగా, విశ్వాసాన్ని దృఢం చేసుకొని, సంపాతి మాటల్ని గుర్తు తెచ్చుకొని అశోకవనం వైపు హనుమంతుడు నడచినట్లు, శ్రద్ధాభక్తులతో దృఢసంకల్పమును కలిగి, గురువు వద్ద శ్రవణం చేసిన విషయాన్ని మననం చేసుకొని మనం కూడా శోకరహితమైన హృదయవనంలో ప్రవేశించాలి. ఆత్మయే అశోకము.

హృత్పుండరీకం విరజం విశుద్ధం
విచిన్త్య మధ్యే విశదం విశోకం

"హృదయకమల మధ్యమున నిర్మలమై, శుద్ధమై, అంచితమై, అగోచరమై, అశోకమై ఆత్మ భాసిస్తోంది" అని అథర్వణ వేదము.

మన హృదయమే అశోకవనము. ఆత్మయే సీతమ్మ. అశోకవనంలో హనుమంతుడు సీతమ్మను దర్శించినట్లు, హృదయంలో మనం ఆత్మను దర్శించాలి.

"రాజకుమారి, జనకుని పుత్రిక, దోషరహితమైనది అయిన సీతాదేవిని లక్ష్మీవంతుడైన హనుమంతుడు దర్శించాడు" అన్నాడు వాల్మీకి.

సీతమ్మ జనకుని పుత్రిక. స్వయంగా అవతరించింది. ఆత్మ కూడా అంతే. తనకు తానుగా ఆత్మ వ్యక్తమౌతుంది.

సీతమ్మ దోషరహిత మైనది. "నిర్దోషం హి సమం బ్రహ్మ" ఆత్మ కూడా దోషరహిత మైనదియే.

స్వయంప్రకాశము కలిగింది కనుకనే ఆత్మ దివ్యమని కీర్తించబడింది. పై శ్లోకంలో సీతమ్మ కూడా దేవి అని పిలువబడింది.

"ఈమెయే సీత" అని హనుమంతుడు దర్శించినట్లు "అయమాత్మా బ్రహ్మ" ఈ ఆత్మయే బ్రహ్మము అని గ్రహిస్తాడు ముముక్షువు. ఇక్కడ ముముక్షువు జ్ఞాని అవుతాడు. అందుచేతనే సీతమ్మ ఇక్కడ దేవిగా వర్ణించబడింది.

అయం స దేవ ఇత్యేవ సంపరిజ్ఞాన మాత్రతః
జంతో ర్నజాయతే దుఃఖం జీవన్ముక్తత్వమేతి చ ॥

"ఇదియే ఆత్మ" అని తెలుసుకొనుట చేత జీవునికి ఇక దుఃఖము కలుగదు. అతడు జీవన్ముక్తు డవుతాడు అని యోగవాసిష్ఠము.

సీతను దర్శించిన హనుమంతునికి దుఃఖము ఉపశమించినట్లు ఆత్మను దర్శించిన వానికి శోకము లంతరిస్తాయి. ఇది అశోకము కనుక హృదయము అనే అశోకవనంలోనే ఆత్మ దర్శనీయం.

సీతమ్మను దర్శించిన హనుమంతుని లక్ష్మీవంతుడు అని కీర్తించాడు వాల్మీకి. అంటే ఐశ్వర్యవంతుడని భావము. ఈ ప్రపంచంలో నశించే సంపదల్ని గాకుండా నశించని ఆత్మ యనెడి అక్షయసంపదను ఎవరు పొందుతారో వారంతా లక్ష్మీవంతులే.

సంపాతి నుండి విషయాన్ని గ్రహించడము శ్రవణము. అంగద జాంబవంతులతో సమాగమము సత్సంగము. వేగంగా సముద్రాన్ని లంఘించడం సాధనలో, ధ్యానంలో తీవ్రత. సీతమ్మ దర్శనమే ఆత్మదర్శనం.

భావితం తీవ్రవేగేన యద్వస్తు నిశ్చయాత్మకమ్
దృశ్యం హ్యదృశ్యతాం నీత్వా బ్రహ్మకారేణ చిన్తయేత్

"ధ్యానంలో వేగం పుంజుకోగానే ఆత్మ నిశ్చయముగా అనుభూతము అవుతుంది. ఆ తరువాత దృశ్యాన్ని అదృశ్యం చేయాలి. బ్రహ్మమునే ధ్యానించాలి" అని తేజోబిందూపనిషత్తు.

సముద్రలంఘనం ఇక్కడ ధ్యానవేగము. లంకలోని దృశ్యవిషయాలపై దృష్టిని పెట్టకుండా ఉండడం దృశ్యాలను అదృశ్యం చేయడం. సీతమ్మను అన్వేషించడమనే కార్యమే తదేక ధ్యానదృష్టి.

సీతమ్మను దర్శించినందుకు హనుమ సంతోషించాడు. రామలక్ష్మణులకు భక్తితో నమస్కరించి చెట్ల ఆకుల మధ్య ఉండిపోయాడు.

అశోకవనంలో అతడే

అది తెల్లవారుజాము.

బ్రహ్మరాక్షసులు వేదాలను వల్లిస్తుండగా, వీనులకు విందైన మంగళవాద్యములతో నిద్ర లేపారు. లేచాడు అతను. ఎవరు? అతడే.

అతివలను తన్నుకొచ్చిన డేగ.

కామపంకిలంలో పడి పొరలాడే ఈగ. అతడే. రావణుడు.

నిద్ర లేచాడు. అతనిలో కామం కూడా వెంటనే మేల్కొంది. సీతమ్మను స్మృతికి తెచ్చి మతిని చెడగొట్టింది. పగ్గాలు లేని బండి కదూ! ఎటో పోయింది.

ఆభరణాలు అలంకరించుకున్నాడు. చక్కగా ముస్తాబయ్యాడు. కాసి పూసిన చెట్లున్న అశోకవనంలో ప్రవేశించాడు. బంగారు ద్వారాలనుండి లోనికి వచ్చాడు.

అతని వెనుక అందమైన స్త్రీలు వందమంది నడిచారు. కొందరు బంగారు దీపాలను, కొందరు వింజామరలను పట్టుకొని వెంట నడిచారు. కొందరు స్త్రీలు బంగారు పాత్రలలో నీరు నింపుకొని ముందు నడుస్తుండగా, మరొక స్త్రీ రత్నఖచిత పాత్రలో మద్యము నింపుకొని రావణునికి కుడివైపు నడుస్తూ అనుసరించింది.

ఒకతె బంగారు దండముగల తెల్లగొడుగును పట్టి నడిచింది. ఈవిధంగా భార్యలు రావణుని అనుసరించారు. మేఘంతో పాటు మెరపుతీగ ఉన్నట్లు రావణుని ప్రక్కన రాణు లున్నారు.

వనితల వడ్డాణముల చప్పుడు, గజ్జెల గలగలలు వినిపించాయి హనుమంతునికి. వెంటనే ద్వారం వైపు చూశాడు. రావణుడు కనిపించాడు. మథించి తీసిన పాలనురుగు వంటి పలుచని బట్టలు కట్టుకొని భుజాల మీదనుండి జారి, నేలపై జీరాడే ఉత్తరీయాన్ని విలాసంగా లాక్కుంటూ వస్తున్నాడు రావణుడు.

జీబుగా వున్న చెట్టుకొమ్మల మధ్య, ఆకులతో, పువ్వులతో శరీరాన్ని కప్పుకున్నాడు హనుమంతుడు. తన దగ్గరకే వచ్చి నిలబడిన రావణుని చక్కగా పరిశీలించి వీక్షిస్తున్నాడు.

"నేను పడకగదిలో చూసింది ఈ పశువునే" అనుకొని, ఆకుల మధ్య ఒదిగిపోయాడు ఆంజనేయుడు.

సీతమ్మ రావణుణ్ణి చూడగానే పెనుగాలికి అరటిచెట్టు చలించినట్లు వణకిపోయింది. తొడలతో ఉదరాన్ని, కరములతో కుచాల్ని కప్పుకొని కూర్చుంది. మునిగిపోతున్న ఓడ లాగా కన్పిస్తోంది. ఖండించిన చెట్టుకొమ్మ లాగా పడివుంది.

వీరులందరూ చచ్చిపోయిన సేనలా ఉంది. ఇంకిపోయిన నదిలా ఉంది. గ్రహణం పట్టిన చంద్రుడులా ఉంది. వాడిపోతున్న తామరతూడులా వుంది.

రామునికి జయము కలగాలని, రావణునికి పరాభవము జరగాలని దేవతలను ప్రార్థిస్తూ, నీళ్ళు నిండిన నేత్రాలతో అటూ ఇటూ చూస్తూ ఏడుస్తూవుంది.

రావణుడు సీతమ్మను సమీపించి ఇలా వాగుతున్నాడు.

"సీతా! నేను రాగానే, నన్ను చూడగానే ఎందుకు అలా దాచేసుకుంటున్నావు? బలవంతంగా నేను దోచేసుకుంటాననా? భయపడకు. అలాంటిదేదీ జరగదు.

"సీతా! పరస్త్రీలను హరించడము, పరుల భార్యలను అపహరించడం రాక్షసులమైన మాకు స్వధర్మమే. అయినా నీ విషయంలో నేను నా స్వధర్మాన్ని పాటించడం లేదు. మన్మథుడు నన్ను పీడిస్తున్నా, నీ మనసు నన్ను పిలిచే వరకు నిన్ను నేను తాకను.

"విశాలమైన నీ నేత్రాలు, ఆకర్షించే నీ అవయవాలు ఎవరినైనా పిచ్చివారిని చేస్తాయి. ప్రేయసీ! నిన్ను నేను మనసారా ప్రేమిస్తున్నా. కామిస్తున్నా. నా మాట నమ్ము. నన్ను ప్రేమించు. ఇలా దుఃఖించడం మానేయి.

"చూడు సీతా! దేనికి నీకు భయం? నేను ఎలాగూ నీ ప్రియుణ్ణే. నన్ను చూసి భయపడవలసిన పనిలేదు. మరోవిధంగా నీవు భయపడటానికి ఇక్కడ మనుష్యులు లేరు. రాక్షసులూ లేరు. నా మాట విను" అన్నాడు రావణుడు.

పాపాన్ని చూసి భీతి చెందేవాడు పుణ్యాత్ముడు. పాపాన్ని రహస్యంగా ఆచరించాలని భావించేవాడు రాక్షసుడు. ఎవరూ లేనిచోట, ఎవరికీ తెలియని విధంగా పాపం చేసి, పైకి ధర్మాత్ములవలె కనిపించాలని భావించి జీవించే వారంతా రాక్షసులే. రావణులే. ఈ చీకటి దొంగ లందరూ వాళ్ళను ఎవ్వరూ చూడడంలేదని భ్రమించి బ్రతుకుతుంటారు పాలుత్రాగే పిల్లుల్లాగా, జారిపడే బల్లుల్లాగా. వెనుక రామబాణం సంధింపబడి ఉందని గ్రహించలేరు.

ఆగనివాగుడు సాగుతోంది. సమాప్త మెరుగని ప్రస్తావనలు ఊపందుకొని విజృంభిస్తున్నాయి అంటువ్యాధి లాగా. రావణుడు వాగేస్తున్నాడు జోరుగా.

"ఆలోచించకు-సీతా! నన్ను పొందావంటే భోగాలన్నీ నీ పాదాలవద్ద నిలుస్తాయి. . నగలు పెట్టుకో. చందనాలు పూసుకో. పుష్పమాలలు వేసుకో. మంచి చీరలు కట్టుకో. ఇంపైన మద్యాన్ని కడుపారా త్రాగు. విలువైన శయనాలపై తూగు. ఆటలు, పాటలు, వాద్యాలు అన్నీ అనుభవించు.

"చూడు. నువ్వు - నీ ఒంటిజడ! అలాగేనా ఉండాల్సింది! ఆ మాసిన చీరేనా ఎప్పుడూ! దేనికొచ్చిన ఉపవాసా లివన్నీ. ఏమి కొరతుందని నేలమీద పడుకుంటావు? ఇవన్నీ దేనికి చెప్పు," అని పలికాడు రావణుడు.

రావణుడు పలికిన ఈ శుష్కవచనాల్ని ఇప్పుడు కూడా చాలామంది పలుకుతూనే ఉంటారు. మీరు కొద్దిగా ధ్యానం చేస్తున్నట్లు తెలిసినా, వేదాంతగ్రంథాలు చదువుతున్నట్లు విన్నా, సత్సంగాలకు వెళ్తున్నట్లు అనిపించినా, రావణుడు సీతమ్మ ముందు వాలినట్లు, మీముందు ప్రత్యక్ష మవుతారు. రావణుని బాణీలోనే మాట్లాడుతారు.

"ఎందుకొచ్చిన బాధలండీ ఇవన్నీ. నలుగురు నడిచేదే నాణ్యమైన దారి. నీతులకు పోతే మూతులు కాలిపోతాయి. ఏమిభక్తి? ధ్యానము - చింతకాయ. ఇదంతా వదిలేసి ఆ మార్గంలోకి పోతే ... దాచుకోలేనన్ని దుప్పట్లు, మంచి బట్టలు, బ్యాంక్ డిపాజిట్లు, కార్లు, సినిమాలు.... ఓహ్.... ఎన్నని!

"ఇదేంటి చెప్పు. ఎక్కువ తినకూడదు. ఎక్కడా తిరగకూడదు. కళ్ళు మూసుకొని కూర్చోవాలి. లేదా పుస్తకం తెరచుకొని పడిచావాలి. పూజలు, జపాలు, భజనలు, ధ్యానాలు ..... ఏమొస్తుంది చెప్పు వీటివల్ల;" - ఇలా మాట్లాడుతుంటారు అధునాతన రావణులు, శూర్పణఖలూను. అయితే ఇలాంటివారు తటస్థపడ్డప్పుడు ఏం చెయ్యాలి? అది ఇప్పుడు చర్చించాల్సిన విషయం కాదు. సీతమ్మ రావణుడికి ఏమి సమాధానం చెబుతుందో మనమూ అలాగే చెబుతాం. అమ్మ చెప్పినట్లు నడచుకొని మంచి బిడ్డలని పేరు తెచ్చుకుందాం!

రావణుడు సీతమ్మతో ఇంకా ఇలా అంటున్నాడు. "సీతా! నీలో ఉన్న పెద్ద తప్పేమిటో నీకు తెలుసా! నీ అందం నీకు తెలియక పోవడమే. నేను చెప్తున్నా విను. రమణులలో నువ్వు రత్నానివి. మంచి అలంకారాలు పెట్టుకో.

"బ్రహ్మదేవుడు ఎన్నో సౌందర్యాలు సృష్టించాడు. ఒకదానికంటే ఒకటి మిన్నగా సృష్టించేవాడని పేరు తెచ్చుకున్నాడు. అయినా, నిన్ను సృష్టించిన తరువాత ఆ పేరు పారేసుకున్నాడు. నిన్ను మించిన అందాన్ని ఎలా సృష్టించాలో తెలియక అతనికి పిచ్చెక్కి పోతోంది. అందుకే, సృష్టి ఆపేసి ఉంటాడని నా ఊహ. అలా కాకపోతే నిన్ను మించిన అందగత్తె మరొకతె కనిపించాలి కదా!

"సీతా! మూర్ఖత్వాన్ని వదిలేయి. నన్ను భర్తను చేసుకో. నన్ను అమాంతం ప్రేమించేయి. నీ అందమైన మందహాసం, మనోహరమైన పలువరస, లేడికళ్ళు - అన్నీ కలిసి నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నాయి.

యద్య త్పశ్యామి తే గాత్రం శీతాంశు సదృశాననే
తస్మిం స్తస్మిన్ పృథుశ్రోణి చక్షుర్మమ నిబధ్యతే

"చందమామ లాంటి నీ ముఖము ఎంత చూచినా చూడనట్లే ఉంటుంది. సీతా! నా దృష్టి నీ అవయవాలలో ఎక్కడ పడితే అక్కడే ఉండిపోతుంది, తిండికొచ్చిన చుట్టం కదలనట్లు. కాంతా!.... కాదు. కాదు. నీవు కాంతవు కాదు. అయస్కాంతవు.

"సీతా! నా సంపద అంతా నీదే. అనుకుంటే చెప్పు. ఈ ప్రపంచాన్నంతా జయించి మీ నాన్న జనకుడి కిస్తాను. త్రిలోకములందు నా మాటను అతిక్రమించేవారు లేరు.

"సీతా! నీవు నా పట్టపురాణివి. నీ ఇష్ట మొచ్చినట్లు దానధర్మాలు చెయ్యి. నా అంతఃపురంలో అప్సరసల వంటి స్త్రీలు నాకు భార్యలుగా ఉన్నారు. నీవు నా చెయ్యిపట్టుకున్న క్షణంలో వాళ్ళంతా నీ పాదాల దగ్గర చేరుతారు.

"నీవు సుఖించు. నీ బంధువుల నందరినీ సుఖపెట్టు. ముఖ్యంగా నన్ను సుఖపెట్టు.

సీతా! ఒక్కసారి నీ చుట్టూ ఏముందో చూసుకో. ఎన్ని భోగాలు, ఎంత సంపద నీ కాళ్ళదగ్గర పడిగాపులు కాస్తున్నాయో చూడు.

"పిచ్చిదానా! నారబట్టలు చుట్టుకొని నేలమీద పొర్లాడే రాముడితో ఏమి సాధించాలని? రాజ్యం కోల్పోయాడా! వనాల పాలయ్యాడా! పైగా, మునివృత్తిలో ఉన్నాడా! ఏమో, ఇంతకీ, ఉన్నాడో లేడో కూడా సందేహమే. ముచ్చటైన మాట చెప్తున్నా. విను.

ఇదం తే చారు సంజాతం యౌవనం వ్యతివర్తతే
యదతీతం పునర్నైతి స్రోతః శీఘ్ర మపా మివ

"సీతా! అందమైన యౌవనం గడచిపోతోంది. పారిన నీళ్ళు ఎలా తిరిగి రావో, పోయిన యౌవనం రమ్మన్నా రాదు. వరించిన సమయాల్ని వృథా చేసికోకూడదు. ఆ తరువాత వగచినా రావు. ఇప్పటికీ మించిపోయింది లేదు. ఆలోచించుకో" అన్నాడు రావణుడు.

పోయిన కాలం తిరిగి రాదని రావణునికి తెలుసు. కానీ తనకు పోయేకాలం వచ్చిందని తెలియడం లేదు. లేకుంటే, కాలవిలువ తెలిసినవాడు ఇలా ప్రవర్తిస్తాడా?

తిరిగి రాని కాలం లాగే తన ఆయువు కూడా తరిగిపోతోంది అనే నగ్నసత్యాన్ని గ్రహించాడా? ఇరవైవేల సంవత్సరాలు జీవించినవాడు ముప్పయి సంవత్సరాల యువతితో కలిసి యుగళగీతాలు పాడాలని కోరుకుంటాడా?

యౌవనం గతిస్తుందని తెలిసినవాడు తన గతి ఏమిటా! అని ఆలోచించ వలసింది పోయి పరుల భార్యలకు పతి కావాలని తంటాలు పడుతున్నాడు. ఇదే అజ్ఞానం.

కాలవిలువ తెలిసినవారు కాలాన్ని సద్వినియోగం చేసుకుంటారు. జీవిత లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తారు. అంతేగాని అధర్మమార్గాల్లో చరించి బ్రతుకును అన్యాయంగా మార్చుకోరు.

మాటలు ఎవరైనా చెప్పగలరు. మాయను దాటినవారే మనీషులుగా, మహర్షులుగా మిగులుతారు. మాయమాటలు పలికేవారు వారి బ్రతుకునే మారణహోమంగా మార్చుకుంటారు.

తృణప్రాయం

దుష్టుడైన రావణుని దుర్వచనాలను ఆలకించిన సీత దీనురాలై దుఃఖించింది. రాముని నిందించిన పాపికి బుద్ధిచెప్పే ప్రయత్నంలో నోరు విప్పడానికి సిద్ధపడింది.

ఆంజనేయుడు చెట్టుపై ఆకుల మధ్య ఒదిగి వింటున్నాడు. తొలిసారిగా తల్లి పలుకు వినబోతున్నాడు. అమ్మ మాట వినాలని ఆత్రుతతో ఉన్నాడు. హనుమకే కాదు. మనకు కూడా అలాగే ఉంది. అశోకవనంలో అడుగిడిన తరువాత ఇప్పుడే ప్రథమంగా సీత మాట్లాడడం వింటున్నాము. అదీ రావణునితో.

మాట్లాడే ముందు సీతమ్మ మానసికస్థితిని మనకు ఎరుకపరుస్తూ వాల్మీకి ఇలా అంటాడు.

దుఃఖార్తా రుదతీ సీతా వేపమానా తపస్వినీ
చిన్తయన్తీ వరారోహా పతిమేవ పతివ్రతా
తృణ మన్తరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా ...

"దుఃఖార్తురాలు, తపస్విని, మహాపతివ్రత అయిన సీత రామునే మనసులో స్మరిస్తూ ఒక గడ్డిపరకను మధ్యలో ఉంచి దుఃఖిస్తూ, చిరునవ్వుతో బదులు పలికింది."

రావణునితో ముఖాముఖి మాట్లాడడం మహాపతివ్రత అయిన సీతమ్మకు ఇష్టం లేదు. అందుచేత మధ్యలో గడ్డిపరక నుంచింది.

రాముని నిందించి స్వయంగా గొప్పలు చాటుకున్న రావణుని తృణప్రాయంగా చూచింది సీతమ్మ.

ఐశ్వర్యాలను, భోగాలను వర్ణించి చెప్పి సీతను లోబరుచుకోవాలని చూశాడు రావణుడు. తన పరాక్రమాన్ని గూర్చి కూడా చాటుకున్నాడు. అవన్నీ తన దృష్టిలో గడ్డిపరకతో సమానమని భావించి సీతమ్మ అలా చేసింది.

రాముడే తనకు ప్రాణం. రాముడే తనకు సర్వం. అవసరమైతే రాముని కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా భావించి త్యజించగలనని చెప్పడమే గడ్డిపరకను అలా మధ్యలో ఉంచడంలోని అంతర్భావం.

"ఓరీ మూర్ఖుడా! అనవసరంగా నా ముందు ప్రేలుతున్నావు. నా ముందు నిలిచే యోగ్యత లేదా అర్హత గడ్డిపోచకైనా ఉందేమో కాని నీకు మాత్రం లేదు;" అని భావిస్తూ గడ్డి పరక నుంచింది మధ్యలో.

గడ్డిపరకను తగలబెట్టడానికి శ్రమ అవసర ముండదు. గడ్డిపోచ లాంటి రావణుని వధించడానికి రాముడు శ్రమించ నవసరం లేదని తెలుపుటకు సీతమ్మ అలా తృణాన్ని ముందుంచింది.

గతంలో రాముడు సంకల్పించి వదలిన ఇలాంటి గడ్డిపరకే కాకాసురుని ముల్లోకాల చుట్టూ తిప్పింది. 'జాగ్రత్త' అని హెచ్చరించడము కూడా సీతమ్మ ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

అయితే ఈ సందర్భమున దీనురాలై దుఃఖిస్తున్న సీతమ్మ చిరునవ్వుతో **(శుచిస్మితా)** పలకడం ప్రారంభించింది అన్నాడు వాల్మీకి.

ఈ చిరునవ్వు వెనుక నిలిచియున్న భావసౌందర్యాన్ని కూడా గ్రహించినపుడే సీతమ్మ హృదయాన్ని మనం దర్శించగలం.

అసాధ్యమైన కార్యాన్ని సాధించగలమని ఎవరైనా ప్రగల్భాలు పలికినపుడు, అలా పలికిన వాని అజ్ఞత మనకు నవ్వు పుట్టిస్తుంది. రావణుని మాటలు సీతమ్మకు అలాగే నవ్వు పుట్టించాయి.

వీరుడనని చెప్పుకుంటున్న రావణుడు ఈ నీచకార్యం ద్వారా నవ్వులపాలు కాక తప్పదని చెప్పుటకే సీతమ్మ చిరునవ్వును చిందించింది.

చిన్నపిల్లల అర్థరహిత ప్రలాపాలకు పెద్దలు నవ్వుకున్నట్లు రావణుని మాటలకు సీతమ్మ మందహాసం చిందించింది.

తన విధికి ఒకవైపున దుఃఖిస్తూ, రావణుని అజ్ఞాన ప్రలాపాలకు నవ్వుకుంటూ, సుఖదుఃఖాల మిశ్రమరూపమే జీవితమని ఎరుకపరుస్తూ సీతమ్మ భాషించడం ప్రారంభించింది.

నివర్తయ మనోమత్తః స్వజనే క్రియతాం మనః

"నీ మనస్సును నానుండి మళ్ళించుకో. నీ రాణులపై ఉంచుకో" అన్నది నోరు విప్పగానే.

పరాక్రమాలు, సంపదలు, భోగాలు, గొప్పతనాలు-వీటిని గూర్చే ఇంతవరకు రావణుడు ప్రసంగించాడు. అవన్నీ అసంగతాలుగా కొట్టి పారేసింది సీతమ్మ.

మనసు మంచిమార్గంలో లేనపుడు ఇవన్నీ రక్షించవని చెబుతూవుంది. మనసును సంస్కరించుకోమని హితవు చెబుతోంది. మనసు చెడితే బ్రతుకే చెడిపోతుందని హెచ్చరిస్తోంది.

"నేను పరసతిని. హితమతిని. నన్ను కోరి దుర్గతిని తెచ్చుకోకు. ధర్మమార్గంలో చరించు.

"నీ భార్యల్ని రక్షించుకోవాలని నీవు ఎలా అనుకుంటావో ఇతరుల విషయం కూడా అలాంటిదే అని భావించు. పవిత్రమైన వివాహబంధాన్ని అర్థంచేసుకో.

"చంచలచిత్తులై పరభార్యలను ఆశించేవారు దుర్మరణాన్ని పొందుతారు. మనోనిగ్రహము లేని రాజు తాను నశించడమే గాక దేశాన్ని కూడా నశింపచేస్తాడు. నీవల్ల ఈ లంక అంతా నశిస్తుంది.

ఇహ సన్తో న వా సన్తి సతో వా నానువర్తసే

"నీకు బుద్ధి చెప్పే మంచివాళ్ళు ఇక్కడ ఎవ్వరూ లేరా? లేక, చెప్పినా వాళ్ళ మాట నువ్వు వినడంలేదా!" అని భావయుతంగా మాట్లాడింది సీతమ్మ.

నీకు ఎవ్వరూ బుద్ధి చెప్పలేదా! అనడము, నీవు బుద్ధిహీనుడవు అనడము రెండూ ఒకటే. కానీ, మొదట బుద్ధి చెప్పని వారిని ప్రస్తావించి, ఆ తరువాత రావణుని విషయం ప్రస్తావించింది సీతమ్మ. రావణుడు ఎలాగూ అధర్మపరుడే. కానీ ధర్మమూర్తులు ఏమైనట్లు?

ధర్మాత్ములు అనబడేవారు అసలున్నారా! లేరా! అని ధ్వజమెత్తింది సీతమ్మ.* సర్వకాలాలకు ఉపకరించే సమన్వయ సందేశాన్ని అందించింది.

సంతులు లేదా సత్పురుషులు అంటే ఎవరు? కేవలం తాము మాత్రమే సన్మార్గంలో చరించేవారు అని భావించకూడదు. తమ చుట్టూ వున్న వ్యక్తులను, సమాజాన్ని సదుపదేశాల ద్వారా సన్మార్గంలో ఉంచే బాధ్యత కూడా సత్పురుషుల మీదనే ఉంది.

---

* ఈ వాక్యము యొక్క ప్రభావం చెట్టు మీదున్న హనుమంతునిపై ఎలాంటి ప్రభావాన్ని చూపి ఉంటుందో కాస్త ఆలోచించండి.

అతను మంచివాడు కాడు. చెప్పినా వినడు అని కొందరు అంటూ ఉంటారు. మంచివాడు కాడు కనుకనే సలహాను లేదా సదుపదేశాన్ని పొందేందుకు అర్హుడయ్యాడు. మంచివానికి బోధించాల్సిన అవసరమేముంది?

దాహమున్న వానికి నీళ్ళివ్వాలి. త్రాగడము, త్రాగకపోవడము పిపాసియైన అతని మీద ఆధారపడి ఉంటుంది. నీళ్ళు ఇవ్వకుండా ఉండిపోయి, అతడు మరణించిన తరువాత, "నేను నీళ్ళిస్తే అతను త్రాగడు. లేకపోతే నేను ఇచ్చుండేవాణ్ణి" అని పలకడం ఉచితం కాదు. ముఖ్యంగా ఉత్తముల లక్షణం కాదు.

మంచివాళ్ళు చెప్పిన మంచిమాటలే ఈనాడు మంచి గ్రంథాలుగా మనముందు నిలిచి మంచి బాటను చూపుతున్నాయి. మంచి వినిపించని సమాజంలో తలఎత్తేది వంచనయే. కనుకనే బుద్ధి చెప్పేవాళ్ళు ఎవరూ ఇక్కడ లేకపోయారా? అని ప్రశ్నించింది సీతమ్మ.

కానీ, మనసును రెండోవైపు తిప్పి కూడా చూసింది ఆ మహాసాధ్వి. లంక మహా పట్టణము. అక్కడ వేదాధ్యయనతత్పరులు ఉన్నారు. తాత్త్వికు లున్నారు. సత్పురుషు లున్నారు. వారంతా రావణునికి చెప్పకుండా ఎందుకుంటారు? అలా ఉంటే, వాళ్ళు సత్పురుషు లెలా అవుతారు? అందుకే,

"బుద్ధిమంతులు చెప్పిన మాటను నీవు వినడం లేదా!" అని ప్రశ్నించింది సీతమ్మ. అజీర్ణపు రోగికి పరమాన్నం కూడా చేదుగానే ఉంటుంది. దుష్టుడైనవాడు సదుపదేశాలను వినడు. వినినా పట్టించుకోడు. వంటపట్టించుకోడు. పంట పండించుకోడు.

Many receive advice, only the wise profit by it.

"సలహాలు చాలామందికి అందుతాయి. సజ్జనులే వాటి ఫలితాల్ని పొందుతారు" అంటాడు సైరస్.

చెవిటి వానికి శంఖధ్వని లాగా పెద్దలు చెప్పినా మూర్ఖుడు వినడు. చెడుకాలము సమీపించే వారికి మంచి రుచించదు. అలాంటి వారికి చెప్పిన సద్విషయాలు ఫలితాలివ్వవు.

నష్టం సముద్రే పతితం నష్టం వాక్య మశృణ్వతి
అనాత్మని శ్రుతం నష్టం హుత మనగ్నికమ్.

"సముద్రంలో పడిన వస్తువు, వినని వానికి చెప్పిన హితవు, సత్యాన్ని గ్రహించలేని వాని శాస్త్రజ్ఞానము, అగ్ని యందు పడని హోమద్రవ్యాలు నిష్ఫలాలు" అన్నది మహాభారతము. రావణుని విషయంలో బుద్ధిమంతులు ఇచ్చిన సలహాలు కూడా అలాగే అయ్యాయేమో అని భావించింది సీతమ్మ.

"రావణా! ఈనాడు నీ మూర్ఖత్వాన్ని చూసి నీకు మంచిని చెప్పడానికి సత్పురుషులు కూడా వెనుకాడవచ్చు. రేపు నీవు నశించే కాలము దాపురించినపుడు అందరూ సంతోషిస్తారు అనే సత్యాన్ని మరచిపోకు. "మన అదృష్టం కొద్దీ వీడు మరణించాడు" అని పలుకుతా రనేది జ్ఞాపకం పెట్టుకో.

"సూర్యుని నుండి రశ్మిని వేరుచేయడం ఎలా సాధ్యపడదో, రాముని నుండి నన్ను వేరు చేయడం కూడా సాధ్యపడదు. నా మాట విను. నీవు సుఖపడా లనుకుంటే నన్ను రాముని వద్దకు చేర్చు. పదికాలాలపాటు పచ్చగా పడుండాలనుకుంటే రామునితో సఖ్యం చేసుకో.

"రాముడు శరణాగతవత్సలుడు. ఈ విషయం లోకవిదితమే. అవకాశాన్ని జార విడుచుకోకు. నన్ను రామునికి దగ్గర చేశావంటే, నీవు చావుకు దూర మవుతావు.

"ఇంద్రుడు నిన్ను ఏమీ చేయలేక పోవచ్చు. కానీ రామచంద్రుడు నిన్ను కూల్చేస్తాడు. యముడు కొంతకాలము నిన్ను పొడిగించవచ్చు. కానీ రాముడు నిన్ను ముందే త్రుంచేస్తాడు.

"రామబాణ మహిమను నువ్వు ఎరుగవు. దిక్కులు పిక్కటిల్లేలా మ్రోగే ఆ ధనుస్సు యొక్క టంకారధ్వనిని నీవు భరించలేవు. త్వరలోనే దారుణమైన రామబాణాలు లంక మీద పడతాయి.

"మేఘాలు ఆకాశాన్ని కప్పినట్లు రామబాణాలు లంకను కప్పేస్తాయి. రాక్షసు లందరూ ఊపిరి ఆడకుండా చనిపోతారు.

"చూశావుకదా నీవుకూడా ప్రత్యక్షంగా! రాముని బాణాలకు గురియై, రాక్షసులున్న జనస్థానము ఎలా హతస్థానమైందో ఒక్కసారి జ్ఞాపకం చేసుకో. రాముణ్ణి ఎదిరించే ధైర్యం లేకనే కదూ! పిరికిపంద లాగా నన్ను అపహరించావు.

"పెద్దపులుల వాసన పట్టగానే కుక్క ఎలా పరుగెత్తి పోతుందో, రామలక్ష్మణుల ముందు నీ పరిస్థితి కూడా అలాగే ఉంటుంది.

గిరిం కుబేరస్య గతోఽథవాలయం
సభాం గతో వా వరుణస్య రాజ్ఞః
అసంశయం దాశరథే ర్న మోక్ష్యసే
మహాద్రుమః కాలహతోఽశనే రివ

"పిడుగుపడే కాలంలో వృక్షము చేయగలిగే దేమీ ఉండదు. నీకు మరణకాలం సమీపించింది. నీవు కైలాసానికి వెళ్ళినా, కుబేరపట్టణమైన లంకకు వెళ్ళినా, వరుణాలయానికి వెళ్ళినా మరణాన్ని మాత్రం తప్పించుకోలేవు" అన్నది సీతమ్మ.

కైలాసము ఊర్ధ్వలోకాలకు సూచితము. లంక భూలోకానికి సూచితము. వరుణుని స్థానమైన సముద్రము పాతాళానికి సూచితము. "ముల్లోకాల యందునూ రావణునికి రక్షణ లభించదు" అంటున్నది మహాసాధ్వి సీతమ్మ.

సీతమ్మతల్లి చల్లని హృదయాన్ని ఈ సందర్భమున మనం చక్కగా దర్శించవచ్చు. రావణుడు సీతమ్మ విషయంలో చేసింది మహాపచారము. అట్టి దుష్టుడి మీద కూడా ఆమెకు సానుభూతి ఉన్నదే కానీ క్రోధము లేదు. తన విషయంలో ఘోరమైన అపరాధం చేసిన రావణుడు సుఖించే మార్గాన్ని తెలియజేస్తోంది సీతమ్మ. దయగల తల్లి అంటే ఆమే అనిపించుకుంది.

రాముడితో స్నేహం చేయమని సలహా ఇచ్చింది. అది మరణభయాన్ని తొలగిస్తుందని చెప్పింది. ఇది కేవలం ఒక్క రావణుడికే కాదు. మనందరికీ వర్తిస్తుంది.

మనసుకు శక్యమైనది సఖ్య మొక్కటే. స్నేహం లేకుండా మనసు ఉండలేదు. కానీ స్నేహప్రయోజనం తెలిసినవారు ఎవరితో స్నేహం చేయాలి, ఎవరితో స్నేహం చేయకూడదు అనేది ఆలోచించుకొని ప్రవర్తించాలి.

మన మనసెప్పుడూ నశించే వస్తువులతో, వ్యక్తులతో సఖ్యం కలిగి ఉంది. ఈ స్నేహాలు బ్రతుకుకు ఏనాడైనా ఉరిత్రాళ్ళే. సత్యరూపుడైన పరమాత్మతో సఖ్యమే నిత్యమైంది. అది మరణభయాన్ని తప్పించి రక్షిస్తుంది.

రావణుడు రాముని విషయంలో ఘోరమైన అపచారం చేశాడు కదా! అట్టి రావణుడు రాముడితో ఎలా సఖ్యం చేయగలడు? అది ఎలా సాధ్యం? అనే శంక మనకు ఏర్పడుతుంది. దానికి కూడా సీతమ్మే సమాధానం చెబుతోంది, రాముడు శరణాగతవత్సలుడని.

"శరణు" అని సమీపించిన వారిలో రాముడు దోషాలు చూడడు. అధర్మాన్ని కడిగేస్తాడు నది లాగా. పాపాన్ని ఎండగట్టేస్తాడు సూర్యుని లాగా. నిజమే మరి! గంగను క్రిందికి దించిన భగీరథుని వంశీయుడు కదూ! లోకాన్ని ప్రదీపింపచేసే సూర్యుని వంశంలో ఆవిర్భవించినవాడు కదూ!

మనం ఎన్నో తప్పులు చేసుండవచ్చు. పాపాలు చేసుండవచ్చు. నిస్సందేహంగా రామునికి శరణాగతులమై తరించవచ్చు. ఈ ఆశాలతను సహేతుకంగా పల్లవింపచేసింది సీతమ్మ.

తనను అపహరించి, నిర్బంధించి, తన జీవితాన్ని దుఃఖమయంగా మార్చిన దౌర్భాగ్యుణ్ణి కూడా మన్నించి, హాయిగా జీవించే మార్గాన్ని ప్రబోధించిన సీతమ్మ దయను ఏమని వర్ణించగలం? ఈ విషయంలో సీతమ్మ రాముని మించి జాజ్వల్యమైంది. అమ్మ అనిపించుకుంది.

ఈ క్షణం నుండి ఈ చైతన్య రామాయణంలో నేను వ్యాఖ్యానించే వాక్యాలలో 'సీతమ్మ' అని వ్రాస్తానే కాని సీత అని వ్రాయను. ఆమె మనందరికీ అమ్మ. బిడ్డనై నేను వ్రాస్తాను. బిడ్డలై మీరు చదవండి. ఎలాగూ పెద్దబిడ్డడు చెట్టుకొమ్మల మధ్య ఆకులు కప్పుకొని కూర్చొనున్నాడు మనల్ని ఆశీర్వదించడానికి.

పడకగదికా? పాకశాలకా!

వందమంది అందగత్తెల ముందు సీతమ్మ మందలించగనే మందభాగ్యుడైన రావణుని కోపం శిఖరాన్నందుకుంది.

"సీతా! బుజ్జగించే పురుషుడు స్త్రీలకు లోకువవుతాడు. అక్కడ్నుంచి స్త్రీలు పురుషుణ్ణి దాసుడులా భావిస్తారు. ఇక అతడి మాటల్ని పట్టించుకోరు. నిన్ను నేను మనసారా కామిస్తున్నాను. అందుకే, సారథి గుఱ్ఱాలను నిగ్రహించినట్లు, నేను క్రోధాన్ని స్వాధీనంలో ఉంచుకుంటున్నాను.

"ఈ కామముందే-ఇది చెడ్డది. దొడ్డదీను. అది ఎవరి మీదికి కదుల్తుందో వారి విషయంలో జాలి, స్నేహము కల్గిస్తుంది. ఈ కామం వల్లే నువ్వు బ్రతికిపోతున్నావు.

"ఆ కపటసన్యాసి రాముణ్ణి ప్రేమించే నువ్వు వధార్హురాలివి. అవమానానికి తగినదానివి. ఏం చేసేది? కామానికి కట్టుబడి నిన్ను వదిలేస్తున్నాను. నువ్వు నాతో మాట్లాడిన మాటలకు నిన్ను ముక్కలు ముక్కలుగా చీరేసి ఉండాల్సింది.

"నీకు రెండు మాసాల గడువు మాత్రమే వుంది. ఈలోగా నా పడక ఎక్కాలి నువ్వు. నన్ను నీ భర్తగా ఒప్పుకోవాలి. లేదా, రెండు మాసాలు కాగానే నువ్వు చేరేది నా పడకగదికి

కాదు. పాకశాలకి. నిన్ను ముక్కలుగా ఖండించి, కమ్మగా వండి నాకు ఉదయం భోజనంగా పెట్టేస్తారు. కడుపారా తిని తేపేస్తాను." అన్నాడు రావణుడు.

రావణుని భయంకరమైన మాటలకు రావణుని రాణులైన దేవకన్యలు కన్నీటితో దుఃఖించారు. కొందరు సీతమ్మ తల పట్టుకొని, కొందరు గడ్డం పట్టుకొని, మరికొందరు తల నిమురుతూ ఓదార్చారు. సీతమ్మ రావణునితో ఇలా పలికింది.

"నిన్ను వారించేవాళ్ళు, చెడుకార్యాల నుండి నివారించే వాళ్ళు ఉన్నట్లు లేరిక్కడ. నేను ధర్మాత్ముడైన రాముని అర్ధాంగిని. నన్ను కోరేవాడు ముల్లోకాలలో ఎవడైనా ఉంటాడా, దుష్టుడవైన నువ్వు తప్ప.

"నీవు రాక్షసుడివి. రాక్షసులలో కూడా నీచుడివి. పరాక్రమవంతుడు, పవిత్రాత్ముడు అయిన రాముని సతీమణియగు నాతో అనరాని మాటలు అనినందుకు నీవు శిక్ష అనుభవిస్తావు. ఎక్కడ దాగినా తప్పించుకోలేవు.

"రాముడు మత్తేభము వంటివాడు. నీవు చెవులపిల్లివి. లంకలో చేరి రాముణ్ణి నిందిస్తున్నావు పిరికిపందవై. ధైర్యముంటే రాముడికి ఎదురుగా నిలబడు.

"దుష్టుడా! నన్నిలా పాడుచూపు చూస్తున్నావే, నీ పిల్లికళ్ళు రాలి ఇంకా క్రింద పడలేదేమి? రాముని భార్యను నేను. దశరథమహారాజు కోడలిని. నన్ను పరుషంగా మాట్లాడిన నీ నాలుక నేలనంటలే దెందుకని?

"రావణా! నేను సంకల్పిస్తే భస్మమై పోతావు. నాకు రామాజ్ఞ లేదు. నా తపస్సు క్షీణిస్తుందని కూడా సంశయిస్తున్నాను. నీవు నన్ను అపహరించింది నన్ను ప్రేమించి కాదు. నీ చావును ప్రేమించి.

"నీవు శూరుడివా! బలశాలివా! కుబేరుని సోదరుడివా! సిగ్గులేదూ అలా చెప్పుకోవడానికి. అంత మొనగాడివైతే రాముడు లేనప్పుడు నన్ను అపహరించా వెందుకని?" అని క్రుద్ధురాలై పలికింది సీతమ్మ.

ఆమిషా లాగీ తళపే మాసా
పరదారా భోగీ రావణ తైసా
శ్రీరామ బాణాంచా పడేల్ ఫాంసా
హే లంకేశ్ లక్షేనా

"రావణా! గాలానికి ఉండే మాంసాన్ని చూసి చేప తహతహ లాడుతుంది. పరస్త్రీ కోసం నీవు కూడా అలా తపించిపోతున్నావు. రామబాణం అనే ఉరికి గురి అవుతావు. విచారించుకో" అంటుంది సీతమ్మ ఏక్‌నాథ్ విరచిత భావార్థరామాయణంలో.

సీతమ్మ మాటలకు రావణుడు రెచ్చిపోయాడు. కళ్ళు రెండింత లయ్యాయి. ఎఱ్ఱబడ్డాయి. కోడెత్రాచు లాగా బుసలు కొడుతూ రావణుడు ఇలా భాషించాడు.

"ఛీ! నీతి లేని ఆ దరిద్రుడి మీదే వుంది నీ మనస్సు! సూర్యుడు చీకటిని అంతం చేసినట్లు ఇప్పుడే నిన్ను నాశనం చేస్తాను;" అంటూ రాక్షసస్త్రీల వైపు తిరిగి ఇలా పలికాడు.

"ఏయ్! రాక్షస రమణుల్లారా! తొందరగా ప్రయత్నం చేసి ఈ జానకి నాదయ్యేలా చూడండి. బుజ్జగించో, జడిపించో, సామ దాన భేద దండోపాయాల వల్లగాని - ఏం చేస్తారో నాకు తెలీదు. ఆవిడ నా వశం కావాలి. నేను పరవశం కావాలి" అని పలుకుతూ సీతమ్మను మళ్ళీమళ్ళీ భయపెట్టాడు.

ఈలోగా ధాన్యమాలిని అనే రావణసతి ముందుకొచ్చి రావణుణ్ణి కౌగలించుకొని ఇలా మాట్లాడింది.

"మహారాజా! నీకేం తక్కువ. నాతో విహరించు. నీచమైన దేహం గల ఈ మానవస్త్రీ దరిద్రురాలు. అదెందుకు నీకు? నీ భుజాల మధ్య నలిగే భాగ్యం దాని కెక్కడుంది? దేనికైనా నొసట రాత బాగుండాలి. మనసు లేని మగువను పొందాల్సిన ఖర్మ నీకెందుకు? ప్రేమించే స్త్రీ వల్లే పురుషుడు సుఖిస్తాడు;" అని రావణుని మళ్ళీ కౌగలించుకుంది ధాన్యమాలిని. ఆ మాటలకు పొంగిపోతూ, భూమి అదిరేలా అడుగులు వేసుకుంటూ ధాన్యశాలలో ప్రవేశించాడు దానవ సార్వభౌముడు.

ధాన్యమాలిని ధన్యురాలుగా తెలుస్తోంది. సమయానికి అడ్డుపడి రక్షించింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి పరిస్థితిని చక్కబరచింది. రావణుని బలహీనతలపై స్వారి చేసి ఉత్తమురాలైన సీతమ్మను కాపాడింది. రాక్షసులలో కూడా దేవత లుంటారని నిరూపించింది.

ఈ ధాన్యమాలిని రావణుని చిన్నభార్య అని అంటారు. అతికాయుని తల్లి అనిగూడా అంటారు. ఈ విషయంలో కాస్త తికమక ఉంది.

మనం ప్రస్తుతం సుందరకాండములోని ఇరవైరెండవ సర్గలో ఉన్నాం. మున్ముందు, అంటే యాభైఎనిమిదవ సర్గలో ఈ ప్రస్తావన మళ్ళీ వస్తుంది. అక్కడ హనుమంతుడు లంకలో జరిగిన విషయాల్ని జాంబవంతునికి వివరిస్తూ, రావణునికి అడ్డుపడింది మండోదరి అంటాడు. ఇంతకీ ఈమె మండోదరియేనా? కాదా? వాల్మీకి చెప్పిన ఆమె, హనుమంతుడు చూసిన ఆమె వేరువేరా? ఒక్కరేనా? ఈ విషయాన్ని యాభై ఎనిమిదవ సర్గను వివరించేటప్పుడు చర్చిస్తాను. ఆమె పేరేదైనా, ఆమె ఎవరైనా, సాటి స్త్రీకి చేయవలసిన సాయం చేసింది. ఆదర్శ మహిళ అనిపించుకుంది.

రాక్షసబోధ

సీతమ్మను తన వశం చేయమని రాక్షసస్త్రీలకు చెప్పి రావణుడు వెళ్ళగానే రాక్షసాంగనలు జానకిని చుట్టుముట్టారు. క్రుద్ధులైన ఆ రాక్షసస్త్రీలు సీతమ్మను పరుషవాక్కులతో నిందించారు.

"సీతా! రావణుడంటే ఎవరనుకుంటున్నావు? ఘనకీర్తిగల పులస్త్యవంశీయుడు. పులస్త్యుడు బ్రహ్మమానసపుత్రుడు. ఆరుగురు ప్రజాపతులలో పులస్త్యుడు నాల్గవవాడు. పులస్త్యుని మానసపుత్రుడు విశ్రవసుడు. మహాతేజశ్శాలి. మహర్షిసత్తముడు. అట్టి విశ్రవసుని కుమారుడే ఈ రావణుడు. తెలిసిందా! రావణుడంటే ఎవరో! మా మాట విను. అతని భార్యవయిపో. నీ బ్రతుకు పండిపోతుంది;" అంటూ పలవరించ సాగారు రాక్షస నారీమణులు, వికృతాంగనలు.

"ముప్పయిముగ్గురు దేవతలనే గాక వారి ప్రభువైన ఇంద్రుని కూడా ఇట్టే జయించాడు మా రాజు. అతనికి భార్య వయితే ఎలా వెలిగిపోతావో ఆలోచించుకో" అంటూ పలికింది పిల్లికళ్ళు కలిగిన హరిజట అనే రాక్షసి.

"రావణుడు గొప్ప వీరుడు. శూరుడు. తేజోవంతుడు. యుద్ధంలో వెన్నుచూపని వాడు. అలాంటి రాజుకి భార్య కావడం నీ భాగ్యం. నీవెందుకు సందేహిస్తున్నావో నాకు అర్థం కావడం లేదు.

"మండోదరి అంటే రావణునికి చాలా ప్రియమైన భార్య. నీవు రావణుణ్ణి పెండ్లాడావంటే, మండోదరిని కూడా విడచి, నీ పంచన పడి ఉంటాడు మహారాజు;" అన్నది ప్రఘస అనే రాక్షసి.

"దేవ దానవ నాగ గంధర్వాదులను సమరరంగంలో చిత్తుచిత్తుగా ఓడించిన మహావీరుడైన రావణుడు సర్వసంపన్నుడు. మహాత్ముడు. అట్టి రాజు తనకు తానుగా వచ్చి వరిస్తే కాదంటావేమే నీచురాలా!" అన్నది వికట అనే రాక్షసి.

"రావణుని పేరు చెబితే చాలు. సూర్యుడు మండడు. వాయువు వీచడు. రావణుడు చెప్తేనే మేఘాలు వర్షిస్తాయి. అలాంటి రాజును ఎందుకు కాదంటావే," అన్నది దుర్ముఖి అనే రాక్షసి.

"దుష్టురాలా! మా మాట విని రావణుణ్ణి అమాంతం ప్రేమించేయి. అన్యులు ప్రవేశించుటకు వీలులేని అంతఃపురంలో కాలుమోపేయ్. నీవు మానవస్త్రీవి. అందుచేత మానవుడైన రాముని మీదనే మనసుపెట్టి ఉన్నావు. రాముడే కావాలంటున్నావు.

"రాముడు రాజ్యభ్రష్టుడు. కష్టాల్లో కూరుకుపోయిన వాడు. కానల్లో కాపురముండే వాడు. అతణ్ణి మరచిపో. రావణునితో చేరిపో" అని ఏకశ్రుతిలో వినిపించారు రాక్షసాంగనలందరూ దానవబోధను.

రాక్షసస్త్రీల అశ్లీలబోధ నాలకించి సీతమ్మ కన్నీళ్ళు కార్చింది. "రాక్షస వనితలారా! ఎంత ఘోరమైన మాటలు పలుకుతున్నారు! ఇలా మాట్లాడడం పాపమని మీకు అనిపించడం లేదా! మీకు కష్టమైతే నన్ను చంపి తినేయండి. నేను పాపాచరణకు సమ్మతించను.

దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః
తం నిత్య మనురక్తాస్మి యథా సూర్యం సువర్చలా!

"దీనుడు కావచ్చు. రాజ్యహీనుడే కావచ్చు. నా భర్తే నాకు ప్రభువు. సువర్చలకు సూర్యుని యందే ప్రేమ యున్నట్లు నాకు నా భర్త యందే అనురాగము.

"పతివ్రతలైన సాధ్వీమతల్లు లందరూ భర్తలనే ప్రేమించారు. భర్తలనే అనుసరించారు. అరుంధతి వసిష్ఠుని, శచీదేవి దేవేంద్రుని, రోహిణి చంద్రుని, లోపాముద్ర అగస్త్యుని, సుకన్య చ్యవనుని, సావిత్రి సత్యవంతుని, కేశిని సగరుని, దమయంతి నలుని ఎలా అనుసరించారో అలాగే నేను రాముని అనుసరిస్తాను;" అన్నది సీతమ్మ.

సీతమ్మ మాటల నాలకించిన రాక్షసాంగనలు క్రోధంతో ఊగిపోయారు. ఆయుధాలు ధరించి చుట్టూ చేరారు. పరుషవాక్కులతో నిందించారు. కొందరు గొడ్డళ్ళను చేతులతో ధరించి భయపెట్టారు. సీతమ్మ వాళ్ళు పెట్టే బాధను భరించలేక, లేచి శింశుపావృక్షము వద్దకు

"ఏయ్! రాక్షస రమణులార! తొందరగా ప్రయత్నం చేసి ఈ జానకి నాదయ్యేలా చూడండి. బుజ్జగించో, జడిపించో, సామ దాన భేద దండోపాయాల వల్లగాని - ఏం చేస్తారో నాకు తెలీదు. ఆవిడ నా వశం కావాలి. నేను పరవశం కావాలి" అని పలుకుతూ సీతమ్మను మళ్ళీమళ్ళీ భయపెట్టాడు.

ఈలోగా ధాన్యమాలిని అనే రావణసతి ముందుకొచ్చి రావణుణ్ణి కౌగలించుకొని ఇలా మాట్లాడింది.

"మహారాజా! నీకేం తక్కువ. నాతో విహరించు. నీచమైన దేహం గల ఈ మానవస్త్రీ దరిద్రురాలు. అదెందుకు నీకు? నీ భుజాల మధ్య నలిగే భాగ్యం దాని కెక్కడుంది? దేనికైనా నొసట రాత బాగుండాలి. మనసు లేని మగువను పొందాల్సిన ఖర్మ నీకెందుకు? ప్రేమించే స్త్రీ వల్లే పురుషుడు సుఖిస్తాడు;" అని రావణుని మళ్ళీ కౌగలించుకుంది ధాన్యమాలిని. ఆ మాటలకు పొంగిపోతూ, భూమి అదిరేలా అడుగులు వేసుకుంటూ ధాన్యశాలలో ప్రవేశించాడు దానవ సార్వభౌముడు.

ధాన్యమాలిని ధన్యురాలుగా తెలుస్తోంది. సమయానికి అడ్డుపడి రక్షించింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి పరిస్థితిని చక్కబరచింది. రావణుని బలహీనతలపై స్వారి చేసి ఉత్తమురాలైన సీతమ్మను కాపాడింది. రాక్షసులలో కూడా దేవత లుంటారని నిరూపించింది.

ఈ ధాన్యమాలిని రావణుని చిన్నభార్య అని అంటారు. అతికాయుని తల్లి అనిగూడా అంటారు. ఈ విషయంలో కాస్త తికమక ఉంది.

మనం ప్రస్తుతం సుందరకాండములోని ఇరవైరెండవ సర్గలో ఉన్నాం. మున్ముందు, అంటే యాభైఎనిమిదవ సర్గలో ఈ ప్రస్తావన మళ్ళీ వస్తుంది. అక్కడ హనుమంతుడు లంకలో జరిగిన విషయాల్ని జాంబవంతునికి వివరిస్తూ, రావణునికి అడ్డుపడింది మండోదరి అంటాడు. ఇంతకీ ఈమె మండోదరియేనా? కాదా? వాల్మీకి చెప్పిన ఆమె, హనుమంతుడు చూసిన ఆమె వేరువేరా? ఒక్కరేనా? ఈ విషయాన్ని యాభై ఎనిమిదవ సర్గను వివరించేటప్పుడు చర్చిస్తాను. ఆమె పేరేదైనా, ఆమె ఎవరైనా, సాటి స్త్రీకి చేయవలసిన సాయం చేసింది. ఆదర్శ మహిళ అనిపించుకుంది.

రాక్షసబోధ

సీతమ్మను తన వశం చేయమని రాక్షసస్త్రీలకు చెప్పి రావణుడు వెళ్ళగానే రాక్షసాంగనలు జానకిని చుట్టుముట్టారు. క్రుద్ధులైన ఆ రాక్షసస్త్రీలు సీతమ్మను పరుషవాక్కులతో నిందించారు.

"సీతా! రావణుడంటే ఎవరనుకుంటున్నావు? ఘనకీర్తిగల పులస్త్యవంశీయుడు. పులస్త్యుడు బ్రహ్మమానసపుత్రుడు. ఆరుగురు ప్రజాపతులలో పులస్త్యుడు నాల్గవవాడు. పులస్త్యుని మానసపుత్రుడు విశ్రవసుడు. మహాతేజశ్శాలి. మహర్షిసత్తముడు. అట్టి విశ్రవసుని కుమారుడే ఈ రావణుడు. తెలిసిందా! రావణుడంటే ఎవరో! మా మాట విను. అతని భార్యవయిపో. నీ బ్రతుకు పండిపోతుంది;" అంటూ పలవరించ సాగారు రాక్షస నారీమణులు, వికృతాంగనలు.

"ముప్పయిముగ్గురు దేవతలనే గాక వారి ప్రభువైన ఇంద్రుని కూడా ఇట్టే జయించాడు మా రాజు. అతనికి భార్య వయితే ఎలా వెలిగిపోతావో ఆలోచించుకో" అంటూ పలికింది పిల్లికళ్ళు కలిగిన హరిజట అనే రాక్షసి.

"రావణుడు గొప్ప వీరుడు. శూరుడు. తేజోవంతుడు. యుద్ధంలో వెన్నుచూపని వాడు. అలాంటి రాజుకి భార్య కావడం నీ భాగ్యం. నీవెందుకు సందేహిస్తున్నావో నాకు అర్థం కావడం లేదు.

"మండోదరి అంటే రావణునికి చాలా ప్రియమైన భార్య. నీవు రావణుణ్ణి పెండ్లాడా వంటే, మండోదరిని కూడా విడచి, నీ పంచన పడి ఉంటాడు మహారాజు;" అన్నది ప్రఘస అనే రాక్షసి.

"దేవ దానవ నాగ గంధర్వాదులను సమరరంగంలో చిత్తుచిత్తుగా ఓడించిన మహావీరుడైన రావణుడు సర్వసంపన్నుడు. మహాత్ముడు. అట్టి రాజు తనకు తానుగా వచ్చి వరిస్తే కాదంటావేమే నీచురాలా!" అన్నది వికట అనే రాక్షసి.

"రావణుని పేరు చెబితే చాలు. సూర్యుడు మండడు. వాయువు వీచడు. రావణుడు చెప్తేనే మేఘాలు వర్షిస్తాయి. అలాంటి రాజును ఎందుకు కాదంటావే," అన్నది దుర్ముఖి అనే రాక్షసి.

"దుష్టురాలా! మా మాట విని రావణుణ్ణి అమాంతం ప్రేమించేయి. అన్యులు ప్రవేశించుటకు వీలులేని అంతఃపురంలో కాలుమోపేయ్. నీవు మానవస్త్రీవి. అందుచేత మానవుడైన రాముని మీదనే మనసుపెట్టి ఉన్నావు. రాముడే కావాలంటున్నావు.

"రాముడు రాజ్యభ్రష్టుడు. కష్టాల్లో కూరుకుపోయిన వాడు. కానల్లో కాపురముండే వాడు. అతణ్ణి మరచిపో. రావణునితో చేరిపో" అని ఏకశ్రుతిలో వినిపించారు రాక్షసాంగనలందరూ దానవబోధను.

రాక్షసస్త్రీల అశ్లీలబోధ నాలకించి సీతమ్మ కన్నీళ్ళు కార్చింది. "రాక్షస వనితలారా! ఎంత ఘోరమైన మాటలు పలుకుతున్నారు! ఇలా మాట్లాడడం పాపమని మీకు అనిపించడం లేదా! మీకు కష్టమైతే నన్ను చంపి తినేయండి. నేను పాపాచరణకు సమ్మతించను.

దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః
తం నిత్య మనురక్తాస్మి యథా సూర్యం సువర్చలా!

"దీనుడు కావచ్చు. రాజ్యహీనుడే కావచ్చు. నా భర్తే నాకు ప్రభువు. సువర్చలకు సూర్యుని యందే ప్రేమ యున్నట్లు నాకు నా భర్త యందే అనురాగము.

"పతివ్రతలైన సాధ్వీమతల్లు లందరూ భర్తలనే ప్రేమించారు. భర్తలనే అనుసరించారు. అరుంధతి వసిష్ఠుని, శచీదేవి దేవేంద్రుని, రోహిణి చంద్రుని, లోపాముద్ర అగస్త్యుని, సుకన్య చ్యవనుని, సావిత్రి సత్యవంతుని, కేశిని సగరుని, దమయంతి నలుని ఎలా అనుసరించారో అలాగే నేను రాముని అనుసరిస్తాను;" అన్నది సీతమ్మ.

సీతమ్మ మాటల నాలకించిన రాక్షసాంగనలు క్రోధంతో ఊగిపోయారు. ఆయుధాలు ధరించి చుట్టూ చేరారు. పరుషవాక్కులతో నిందించారు. కొందరు గొడ్డళ్ళను చేతులతో ధరించి భయపెట్టారు. సీతమ్మ వాళ్ళు పెట్టే బాధను భరించలేక, లేచి శింశుపావృక్షము వద్దకు

చేరి విలపించసాగింది. రాక్షసస్త్రీలు అక్కడికి కూడా వచ్చారు. హనుమంతుడు చెట్టుపై నుండి ఇదంతా చూస్తూనే ఉన్నాడు.

ఈలోగా వినత అనే రాక్షసి ముందు కొచ్చింది. చాలా వికృతంగా ఉంది. సీతమ్మను సమీపించి ఇలా పలికింది.

"చూడు సీతా! నీకు అంతా మంచే జరుగుతుంది. నామాట విను. నీ భర్త పట్ల ఇంతవరకు నీవు ప్రదర్శించిన ప్రేమ అమోఘం. అద్భుతం. ధర్మయుతం. ఇక చాల్లేమ్మా! నీ భర్తమీద ఇప్పటికే చాలా ప్రేమ క్రుమ్మరించేశావు.

సర్వత్రాతి కృతం భద్రే వ్యసనా యోపకల్పతే

"శుభప్రదా! సీతా! ఎప్పుడైనా అతిగా వర్తిస్తే అగచాట్లు తప్పవు.

"ప్రేమించింది చాలులే. రాముణ్ణి మరచిపో. మంచి చీరలు కట్టుకొని, నగలు పెట్టుకొని, అంగరాగాలు అలదుకొని ప్రభుసన్నిధికి పారిపో.

"ఇంకెక్కడ రాముడే పిచ్చితల్లీ! అతని కాలం తీరిపోయింది. నీ మంచి కోరేవాళ్ళం. మా మాట విను. లేదా మేమందరము కలిసి ఒకేపని చేస్తాం. ఏమిటో తెలుసా! నిన్ను మ్రింగడము." అన్నది ఆ రాక్షసి.

"మెత్తగా ఉన్నా మనుకుంటున్నావా! చివరి మాటగా చెప్తున్నా. విను. లేదా. నీ గుండెను నమిలేస్తాను" అన్నది వికట అనే రాక్షసి.

"ఆహా(.... నీకు గుండె మీదికి పోయిందా మనసు. నా విషయం చెప్పనా! దీన్ని రావణుడు తెచ్చినప్పుడు చూడగానే నా కనిపించింది. ఏ రోజైనా దీని మాంసము, ప్రేగులు, గుండెకాయ, పుల్లదబ్బా, తలకాయ నమిలి, చప్పరించి మరీ మింగేయాలని," నాలుకతో పెదవుల్ని తడుపుకుంటూ, నోరు చప్పరిస్తూ పలికింది చండోదరి.

"ఎందుకే కాలాన్ని ఖర్చుచేయడం! ముందు దాని పీక నులివేద్దాం. చచ్చిద్ది. అది చచ్చింది అని రాజుకు చెప్తాము. సరే. పొండి. మీరు తినెయ్యండి అంటాడు." అన్నది ప్రఘస.

"సరే కానివ్వండి. ముందు చంపేస్తాం. ఆ తరువాత ఏ అవయవానికి ఆ అవయవం వేరుగా పెట్టుకుందాం. ఆ తరువాత సమానంగా కుప్పలు పోసుకుందాం.

"మళ్ళీ ఎక్కువ తక్కువలంటూ మనం పేచీలు పెట్టుకోవడం బాగుండదు. మనమంతా కలిపే తిందాం. సరే. నువ్వు పో. కల్లు తీసికొనిరా. నువ్వు పోయి పచ్చళ్ళు తీసుకురా!

"ఆ చేత్తోనే కారం, ఉప్పు కూడా పట్టుకురా! కలిపి తింటే కమ్మగా ఉంటది;" అన్నది అజాముఖి.

"నాకూ అజాముఖి చెప్పిందే నచ్చింది" అన్నది శూర్పణఖ అనే రాక్షసి. ఈవిధంగా రాక్షసాంగనలు బెదిరిస్తూ భయపెడ్తూ వుంటే దిక్కుతోచక పసిబిడ్డలా విలపించింది సీతమ్మ.

సీతమ్మ దీనాలాపము

క్రూరులైన రాక్షసాంగనల భయంకర పలుకులు విని సీతమ్మ భయకంపితురా లైంది. వారి దారుణ బెదిరింపులకు భీతిచెంది ఏడ్చింది.

"మీరేమన్నా చెయ్యండి. చంపి తినెయ్యండి. కానీ మీ మాటను నేను వినను. మీరు చెప్పినట్లు చెయ్యను" అని పలికి గుంపు నుండి దూరమైన లేడి తోడేళ్ళ మధ్య చిక్కినట్లు క్రుంగిపోయింది. వణికిపోతూ వుంది. అశోకవృక్షము యొక్క కొమ్మను పట్టుకొని బిగ్గరగా రోదించింది.

రాముణ్ణి తలచుకొని పసిబిడ్డలా విలపించింది. కన్నీళ్ళు పడి ఆమె హృదయం తడిసిపోయింది. అవధులు లేని శోకంతో కుమిలిపోయింది. పెనుగాలిలో అరటిచెట్టు లాగా భయంతో ఊగిపోయింది. ముఖమంతా కందిపోయింది.

సీతమ్మ వణకుతూ ఏడుస్తుంటే పొడవైన ఆమె జడ ప్రాకుచున్న పాములా కనిపించింది. భర్త వియోగదుఃఖముతో క్రుంగిపోతున్న ఆ తల్లిని రావణుని కఠోరవాక్కులు, రాక్షసాంగనల పరుషవాక్కులు మరీ కలతపెట్టాయి. కన్నీటి ప్రవాహం ఆగడంలేదు.

"రామా! లక్ష్మణా! అత్తా కౌసల్యా, చిన్నత్తా సుమిత్రా!" అంటూ తల్లికి దూరమైన బిడ్డలా రోదిస్తోంది. "దుష్టులైన రాక్షసులమధ్య నేను దారుణ హింసలకు గురి అవుతున్నా, నాకు చావు రావడంలేదు.

లోక ప్రవాదః సత్యోఽయం పణ్డితైః సముదాహృతః
అకాలే దుర్లభో మృత్యుః స్త్రియా వా పురుషస్య వా ॥

"స్త్రీ యైనా, పురుషుడైనా కాలం కలిసిరానిదే చావాలనుకున్నా చావలేరు-అనే సామెతను పండితులు చెబుతూ ఉంటారు. అది అక్షరాలా సత్యమే ననిపిస్తోంది.

"నేను దీనురాలను. పుణ్యహీనను. సరుకులతో నిండిన ఓడ గాలితాకిడికి సముద్రంలో మునిగిపోవునట్లు, నేను అనాథనై నశించిపోతాను. జలప్రవాహంలో పడి కొట్టుకుపోయిన ఒడ్డు లాగా కూలిపోతాను.

"కృతజ్ఞుడు, ప్రియవాది, ధర్మాత్ముడు అయిన రాముని దర్శించేవారు భాగ్యవంతులు. పుణ్యాత్ములు. భయంకరమైన విషాన్ని పానం చేసినవారు ఎలా జీవించలేరో, రామునికి దూరమైన నేను బ్రతకలేను.

"ఇంత దుఃఖం పిలవకుండా వచ్చింది కదా! ఎంత పిలిచినా మరణము రాదు ఎందుకని?" అని కన్నీరు కార్చుతూ దుఃఖించింది. ఆడగుఱ్ఱము లాగా క్రిందపడి దొర్లుతూ విలపించింది.

అశ్మసార మిదం నూన మథవాప్య జరాజరమ్
హృదయం మమ యేనేదం న దుఃఖే నావశీర్యతే

"నాది ఇనుపగుండె. అందువల్ల గట్టిగా ఉంది. పగిలిపోకుండా ఉంది. ఎంత దుఃఖము వచ్చినా బ్రద్దలగుటలేదు.

"రాముణ్ణి విడిచి క్షణమైనా ఎలా జీవిస్తున్నానో! ఛీ! ఎంత పాపిని నేను! ఇంతకీ, రామునికి దూరమైన నేను ఎందుకు బ్రతుకుతున్నట్లు? ఏ ఆశ నన్ను బ్రతికిస్తూ ఉంది?

"రాక్షసుడైన రావణుని ఎడమకాలితో కూడా నేను తాకను. రాక్షసాంగనలారా! నన్ను తిట్టండి. మీ ఇష్టమొచ్చినట్లు కొట్టండి. మండే అగ్నిలో తోసెయ్యండి. కోసి ముక్కలు చెయ్యండి. మీరు ఎంత వాగినా నా నిర్ణయం మారదు.

"రాముడు ధర్మాత్ముడు. మహాత్ముడు. జాలిగుండె కలవాడు. నా విషయంలో ఈనాడు జాలి లేనివాడయ్యాడు. నా విధివ్రాతే దానికి కారణము.

"పద్నాలుగు వేలమంది రాక్షసులను జనస్థానంలో ఒంటరిగా వధించిన వీరరాముడు ఈనాడు నన్ను కాపాడడానికి ఆలస్యం చేస్తున్నాడెందుకో! నా కొరకు విరాధుని వధించిన ఆ రాముడు ఈనాడు ఈ రావణుని వధించ డెందుకని?

"మధ్యలో సాగరముంది కదా! అందుకని వధించుట లేదా! రామబాణాన్ని ఆపే శక్తి ఎవరికుంది? నేను ఇక్కడ ఉన్నట్లు రామునికి తెలిసి ఉండదు. పాపం! జటాయువు బ్రతికుంటే నా దీనావస్థను తప్పక నా రామునికి చెప్పి ఉండేది.

"రామలక్ష్మణులు ఎలాగైనా ఇక్కడికి వస్తారు. ఈ లంకను సర్వనాశనం చేస్తారు. ఈనాడు నేనెలా దుఃఖిస్తున్నానో ఈ లంకలో ప్రతి ఇంటిలో ఇలాంటి ఆర్తనాదమే వినిపిస్తుంది.

"రాముడు ఇక్కడ పాదం మోపిననాడు లంకలో రాక్షసులు మిగలరు. కొద్ది రోజుల్లోనే లంక శ్మశానంగా మారిపోతుంది. చితిమంటలతో పొగ కమ్ముకుంటుంది. ఆకాశమంతా గ్రద్దలతో, రాబందులతో నిండిపోతుంది.

"రాక్షసవనితలారా! ఇదంతా త్వరలోనే జరిగిపోతుంది. రావణుడు కన్నుమూసే సమయం కొద్దిరోజుల్లోనే ఉంది. రాముని నారాచబాణాలతో కాలిపోయిన లంక అంధకారంతో అలమటిస్తుంది.

"అయ్యో! రాక్షసుడైన రావణుడు నాకు పెట్టిన గడువు సమీపిస్తున్నది. ఈ మరణము వాడికెందుకు రాకూడదు? నాకు ఇక్కడ ఎవ్వరూ లేరు దిక్కు! విషం కలిపి ఇచ్చేవారు కూడా లేరు. చావు కూడా నాకు శత్రువైంది.

"రాముడు నన్ను ఎందుకని వెదకడం లేదు. బహుశ నేను మరణించానని భావించారేమో! లేక నేను లేననే బాధలో రాముడు దేహాన్ని త్యజించి ఉండడు కదా!

"రాముడు బుద్ధిమంతుడు. ధర్మనిష్ఠాపరుడు. ఉన్నత భావస్పందన కలవాడు. నేను లేకున్నా జీవించగలడు. వైరాగ్యముతో అంతర్ముఖుడై నన్ను మరచినాడేమో!

దృశ్యమానే భవే త్ప్రీతిః సౌహృదం నాస్త్య పశ్యతః
నాశయన్తి కృతఘ్నాస్తు న రామో నాశయిష్యతి

"ఒకరికొకరు కనపడుతూ ఉంటేనే ఈ ప్రపంచంలో ప్రేమ నిలుస్తుంది. కనుమరుగైతే ప్రేమలు అదృశ్య మవుతాయి. అది కృతఘ్నుల విషయంలో సత్యం కావచ్చు. రాముడు అలాంటివాడు కాడు.

"నా పుణ్యం క్షీణించి పోయిందేమో! రాముడికి దూరమై జీవించుట కంటే మరణించుటే మేలు. నాలో సుగుణాలు లేవా? ఉంటే రాముడు నన్ను వెతుక్కుంటూ వచ్చేవాడు కదా!

"ఒకవేళ రామలక్ష్మణు లిద్దరూ అపక్వాహారము తింటూ సన్యాసులై పోయారేమో! లేక, దుష్టుడైన రావణుడు మాయోపాయంతో వాళ్ళను వధించాడేమో!

"ఇదంతా నాకు అగమ్యగోచరంగా వుంది. నాకు చావు వస్తే ఎంత బాగుండేది? కానీ, ఎందుకో అది కూడా నన్ను అసహ్యించుకుంటోంది.

"అందుకేనేమో మునులు సమస్తాన్ని పరిత్యజించి అరణ్యాలలో ఒంటరిగా జీవిస్తూ ఉంటారు. వారికి ప్రియము ఉండదు. అప్రియమూ ఉండదు. ద్వంద్వాలు వాళ్ళను బాధించవు.

ప్రియాన్న సంభవే ద్దుఃఖ మప్రియా దధికం భయం
తాభ్యాం హి వియుజ్యన్తే నమస్తేషాం మహాత్మనామ్

"ప్రియమైనది దూరమైతే దుఃఖం కలుగుతుంది. అప్రియమైనది చేరువైతే భయం కలుగుతుంది. అట్టి ప్రియాప్రియములను త్యజించిన మహాత్ములకు నమస్కారము.

"ఇక నాకు మరణమే శరణ్యము" అని పలికి మూగబోయిన కంఠాన్ని కదిలించలేక పోయింది సీతమ్మ.

సీతమ్మ మాటలకు రాక్షసస్త్రీలు క్రుద్ధులయ్యారు. సీతమ్మ మాట్లాడిన మాటలు దురాత్ముడైన రావణునకు చెప్పడానికి వెళ్ళారు. కొందరు రాక్షసాంగనలు సీతమ్మను సమీపించి ఇలా పలికారు.

"ఓసీ! దుష్టురాలా! పాపిష్టురాలా! ఇంకేమి వాగుతావులేవే! ఈరోజే రాక్షసస్త్రీలు చంపేస్తారు. ఇప్పుడే జరిగిపోతుందది. నీ మాంసాన్ని నమిలి నమిలి మ్రింగుతారు. చూసుకో! కాచుకో!" అని రాక్షసాంగనలు సీతమ్మను భయపెడుతున్నారు.

అంతవరకూ అక్కడ నిద్రిస్తున్న ముసలి రాక్షసి నిద్ర లేచింది. ఆవిడ పేరు త్రిజట. సీతమ్మను భయపెడుతున్న రాక్షసాంగనలను వారించింది త్రిజట.

త్రిజటాస్వప్నము

"ఛీ, ఆగండి. దుష్టులారా! ఆమెనా మీరు తినబోయేది? ఆమె జనకమహారాజు కూతురు. దశరథమహారాజు కోడలు. ఆమెను కాదు. అంత అవసర మనుకుంటే మిమ్మల్ని మీరు పీక్కుతినండి.

"ఇప్పుడే నేనొక కలకన్నాను. ఆ కల భయంకరమైంది. రోమాంచము కల్గించేలా ఉంది. ఆ కల ఏమి చెబుతుందో తెలుసా! రాముడికి జయము, రాక్షసులకు వినాశమూను. తెలిసిందా!" అన్నది త్రిజట.

త్రిజట మాటలకు రాక్షసాంగనలు భయకంపితు లయ్యారు. త్రిజట గాంచిన స్వప్నాన్ని వివరించమని అడిగారు. త్రిజట తన స్వప్నాన్ని వివరించి చెప్పింది.

"ఏనుగుదంతంతో తయారైన ఆ పల్లకి ఎంత బావుందో! అది ఆకాశంలోనే ఉంది. దానిని వెయ్యి హంసలు మోస్తున్నాయి. రాముడు పల్లకి ఎక్కి వచ్చాడు. ప్రక్కనే లక్ష్మణుడుకూడా ఉన్నాడు. తెల్లటి వస్త్రాలు, మాలలు ధరించి ఉన్నాడు రాముడు. ఆ పల్లకి ఎక్కి రాముడు లంకకు వచ్చాడు.

"సరే అదలా ఉండనీ. సముద్ర ముందా! దాని మధ్య ఒక పెద్ద కొండ. అదికూడా తెల్లగానే ఉంది. తెల్లని వస్త్రాలు కట్టుకొని సీత కొండమీద ఉన్నట్లు నాకు కనిపించింది.

"అప్పుడేం జరిగిందో చెప్పనా! కాంతి సూర్యుణ్ణి చేరినట్లు సీత రాముణ్ణి చేరింది.

"మరల, ఒక పెద్ద ఏనుగు. దానికి నాలుగు దంతా లున్నాయి. అదికూడా, ఏనుగా! లేక కొండా! అనిపిస్తోంది. రాముడు, లక్ష్మణుడు దానిపై ఎక్కి తిరుగుతున్నట్లు నాకు కనిపించింది. వాళ్ళిద్దరూ తెల్లని వస్త్రాలు, తెల్లని పూలదండలు వేసుకొని సీతను సమీపించారు.

"సీతమ్మ కొండమీద, అదే, తెల్ల కొండమీద ఉందని చెప్పానుగదా! ఆ కొండ దగ్గరికి వచ్చింది ఈ ఏనుగు. రాముడు దానిని అక్కడ నిలిపాడు. సీతమ్మ మెల్లగా ఏనుగు నెక్కింది.

"సీతమ్మ రాముడి అంకముమీద కూర్చొనుంది. నేను చూస్తునే వున్నా. సీత లేచి నిలబడి తన చేత్తో సూర్యుణ్ణి, చంద్రుణ్ణి తుడుస్తున్నట్లు నాకు కన్పించింది.

"ఇప్పుడు సీతారామలక్ష్మణులు ఎక్కిన ఆ ఏనుగు ఎక్కడుందో చెప్పుకోండి. చూద్దాం. నే చెప్పనా! లంక తలమీద ఉంది.

"ఇంకొకటి చూశా మళ్ళీ. తెల్లని రథం. దానికి ఎనిమిది ఎద్దులు కట్టి వున్నాయి. ఆ రథం మీద సీతారాములు కూర్చొని వస్తున్నట్లు కన్పించింది.

"ఆ తరువాత సీత, రాముడు, లక్ష్మణుడు ముగ్గురూ పుష్పకవిమాన మెక్కారు. చూస్తుండగనే ఉత్తరదిక్కుగా వెళ్ళిపోయారు. రాముడు విష్ణుమూర్తిలాగా ఉన్నాడే. రాముడు ప్రక్కనే లక్ష్మణుడు, సీత ఉండడం నేను చూశాను. రాముణ్ణి జయించడం ముల్లోకాలలో ఎవ్వరికీ సాధ్యంకాదని నేననుకుంటున్నా.

"చెప్తా... చెప్తా... ఇంకావుంది. రాముడు అలా కనిపించి వెళ్ళాడా! సరే. మళ్ళీ రావణుడు కన్పించాడు. ఏమి చిత్రమో! ఎఱ్ఱని వస్త్రాలు కట్టుకొని, ఎఱ్ఱని పూలదండలు వేసుకొని ఉన్నాడు. ఒళ్ళంతా తైలమే. పూసుకున్నాడు, సరే బావుంది. నూనె త్రాగేస్తున్నాడు. మత్తుగా మట్టిలో పడివున్నట్లు నాకు కన్పించాడు.

"ముండిత శిరస్సుతో, ఖండిత భుజాలతో రథం నుండి ఠపీమని క్రింద పడ్డాడు. ఒక స్త్రీ రావణుణ్ణి వీధుల్లో ఈడ్చుకుంటూ పోతోంది. ఈలోగా రావణుడు లేచి, గాడిదలు కట్టిన రథమెక్కి వెళ్ళాడు. అదికూడా దక్షిణదిక్కు వైపు వెళ్ళాడు.

"నేను చూస్తూనే ఉన్నా, ఇంతలోనే రావణుడు గాడిదమీద నుండి తలక్రిందుగా పడిపోయాడు మళ్ళీ ఠపీమని.

"ఈసారి కంగారు కంగారుగా పైకి లేచాడు. అనరాని మాటలు అనేస్తూ, పిచ్చివాడు లాగా, వస్త్రాలు లేకుండా పరుగెత్తి, దుర్గంధంతో కూడిన మలపంకంలో మునిగిపోయాడు.

"రావణుడే కాదు. నా కలలో కుంభకర్ణుడు, రావణుని కొడుకులు కూడా కన్పించారు. నూనె మాత్రం వాళ్ళు కూడా వదలలేదు. ఒళ్ళంతా నూనె తప్ప మరొకటి లేదు.

"అలా ఉందికదా! అంతే. వెంటనే, పెద్ద పంది. దానిమీద రావణుడు ఎక్కాడు. ఒక మొసలి. దానిమీద ఇంద్రజిత్తు ఎక్కాడు. ఒంటె... ఒంటె- ఆ(... ఆ ఒంటె మీద కుంభకర్ణుడు. అందరూ దక్షిణదిక్కు వైపే పోయారు.

"అబ్బ.... ఒక్క విభీషణుడు మాత్రమే. తెల్లని వస్త్రాలు కట్టుకున్నాడు. తెల్లని పూలదండలు వేసుకున్నాడు. మంచిగంధము పూసుకున్నాడు. తెల్లని గొడుగు క్రింద కూర్చున్నాడు.

"విభీషణుడి చుట్టూ మృదంగధ్వనులేనా, శంఖధ్వనులేనా, బూరలేనా, తొప్పెట్లేనా, పాటలా, ఆటలా, ఏం చెప్పేదిలే! ఇదంతా ఎక్కడని? అంతా ఆకాశంలోనే.

"ఈ రాక్షసులుండారు చూశావు. వీళ్ళకి మళ్ళీ ఎఱ్ఱని పూలే. తైలపానమే. ఇంకొకటి వినండి. మన లంకంతా సముద్రంలో మునిగిపోయింది. నేను చూశా.

"ఈ లంకాపట్టణాన్ని ఒక వానరుడు, రాముని దూతట. చూస్తుండగనే తగులబెట్టేశాడు. లంకంతా బూడిదైపోయిందిపో. రాక్షసులంతా చచ్చిపోయారు.

"ఇలా వచ్చిందే నాకు కల. మీరు జాగర్త. లేకపోతే చస్తారు. సీత రాముణ్ణి చేరినట్లే అనుకోండి. తన భార్యను మీరు బాధించారని తెలిసిందా! మిమ్మల్ని బాది మరీ చంపేస్తాడు.

"రాముడికి సీతంటే వల్లమాలినంత ప్రేమ. పైగా భర్తతో అడవికి కూడా వచ్చింది. ఆమెను తిట్టడం, బెదిరించడం చేశారో, రాముడు సహించడు. పచ్చడైపోతారు. జాగర్త.

"చెడ్డ మాటలు మానేయండి. మంచి మాటలే పలకండి. మనమంతా సీతమ బ్రతిమాలుకుందాం. లేదంటే, మనం కూడా ఆపదల్లో చిక్కుకుంటాము. మనల్ని సీతమ్మే కాపాడాలి.

"రాముడికి విజయం తప్పదు. రావణుడికి వినాశము తప్పదు. అదిగో, చూడండి. తామరాకు లాంటి ఆమె ఎడమకన్ను అదురుతోంది.

"ఇప్పుడు చూడండి, సీతమ్మ ఎడమభుజం కూడా అదురుతోంది. అదిగదిగో.... ఎడమతొడ కూడా అదురుతోంది. రాముడు చాలా దగ్గరికి వచ్చేసినట్లు ఇది చెబుతోంది.

"అది చూడండి. ఆ పక్షి చెట్టుకొమ్మపై కూర్చుని ఎలా ఆనందంగా కూస్తూవుందో. రాముడు వస్తున్నట్లు సీతకు చెప్తూ వున్నట్లుంది కదూ! సీతమ్మను ఓదార్చుతున్నట్లు ఉందికదూ!"

స్వప్నరహస్యము

హనుమంతుడు అశోకవనంలో ప్రవేశించి సీతమ్మను చూచిన తరువాత రెండు భయంకర సన్నివేశాలు మన కంటపడ్డాయి. ఆ రెండు సన్నివేశాల్లో కూడా ఇద్దరు వ్యక్తులు నాటకంలో పాత్రలలాగా ప్రవేశించి పరిస్థితిని చక్కదిద్దుతారు. ఆరిపోతుందా అనిపించే దీపాన్ని వత్తిని సరిచేసి జాజ్వల్యం చేసి వెళ్తారు. ఆ రెండు పాత్రలలో మొదటిది ధాన్యమాలిని. రెండవది త్రిజట.

సీతమ్మ వద్ద రావణుడు కాపలా ఉంచిన రాక్షసస్త్రీలలో త్రిజట ఒకతె. ఆమె వృద్ధరాక్షసి అన్నాడు వాల్మీకి. ఆమెను విభీషణుని కుమార్తెగా చాలామంది రామాయణ రచయితలు అభిప్రాయపడుతూ ఉంటారు. కావచ్చు. లేదా కాకపోవచ్చు కూడాను. రెంటికీ రుజువుల్లేవు

రావణుడు తెల్లవారుజామున సీతమ్మను బెదిరించడం, ఒక దశలో భయంకరంగా ఆమెను వధించేలా విజృంభించడం జరిగింది. అప్పుడు ధాన్యమాలిని ప్రవేశించి పరిస్థితిని అదుపులో ఉంచింది.

అలాగే, సీతమ్మను రావణుని వశం చేయాలనే ప్రయత్నంలో రాక్షసస్త్రీలు ఎంత భయంకరంగా ప్రవర్తించారో కూడా మనం చూశాం. ఆ పరిస్థితిలో త్రిజట తన స్వప్న వృత్తాంతం ద్వారా రాక్షసాంగనలను బెంబేలెత్తించింది. సీతమ్మకు శరణాగతు లయ్యేలా చేసింది.

ధాన్యమాలిని మండోదరియేనా! లేదా రావణుని కనిష్ఠభార్యనా! అనేది సంశయమే. అలాగే త్రిజట విభీషణుని కూతురా! కాదా! అనేది కూడా అపరిష్కృత సమస్యయే.

అడగకనే పెద్ద పనులు చేసిపెట్టిన రెండు అద్భుతమైన చిన్నపాత్రలు అశోకవనంలో ధాన్యమాలినీ త్రిజటలు. ఇంతకీ వీళ్ళిద్దరు ఎవరో స్పష్టంగా తెలియడం లేదు. గుర్తింపు లేకుండా, గుర్తింపును కోరకుండా మంచిపనులు చేసేవారు ఆదర్శమూర్తులు. రాక్షసుల మధ్య వున్నా దేవతలే.

రావణుని ఆజ్ఞ మేరకు రాక్షసస్త్రీలు అందరూ సీతమ్మను హింసిస్తూ ఉంటే త్రిజట నిద్రపోతోంది. భయంకరమైన తన వృత్తిధర్మం కన్నా ఆదమరచి నిద్రించడమే ఉత్తమమని భావించింది త్రిజట. చెడును వినలేని, చెడును చూడలేని ఒకతరహా వ్యక్తి త్రిజట. సరళ హృదయురాలు. ఆమెకు వచ్చిన కలను బట్టి మనస్తత్వ శాస్త్రరీత్యా ఆమె మనసును పసికట్టడం గొప్పవిషయమేమీ కాదు. వృత్తిరీత్యా తానుకూడా వారిలో ఒకతె. కానీ ప్రవృత్తిరీత్యా తాను వేరు. రాక్షసప్రవృత్తి ఆమెలో కన్పించడం లేదు. సీతమ్మను చంపే ప్రయత్నం విరమించుకోమని చెప్పింది. తన స్వప్నవృత్తాంతము ద్వారా వారి దుష్ట ప్రయత్నాన్ని ఆపింది. భవిష్యత్తును కూడా వాస్తవంగాను, కళాత్మకంగానూ కూడా చిత్రించింది.

తెల్లవారుజామున వచ్చే కల నిజమౌతుంది అంటారు. తన స్వప్నము కూడా అలాంటిదే కనుక ఇది జరిగి తీరుతుంది అంటుంది త్రిజట. తెల్లవారుజాము అంటే చీకటి అంతరించి వెలుగులు ప్రారంభమయ్యే కాలం. సీతమ్మ జీవితంలో కూడా బాధల చీకట్లు అదృశ్య మవుతాయని, ఆనందతోరణాలు శోభిస్తాయని జోస్యం చెప్పినట్లు చెప్పింది త్రిజట.

త్రిజటాస్వప్నము ఒక వింతయైన అనుభూతి. అదొక గొప్ప మానసిక పరిణామం. నాటకానికి ముందు ప్రస్తావన లాగా గోచరించి, కథలోని మలుపుల్ని, ఫలితాల్ని వివరించి చెప్పిన వింతవిధానం. మానసిక సంవిధానం.

స్వప్నే చాద్య మయాదృష్టా సీతా శుక్లామ్బరావృతా
సాగరేణ పరిక్షిప్తం శ్వేతం పర్వత మాస్థితా ॥

"తెల్లని వస్త్రాలు కట్టుకొని సముద్రము మధ్య నున్న తెల్లని కొండపై సీత ఉన్నట్టుగా స్వప్నంలో నాచేత చూడబడింది" అన్నది త్రిజట.

నాచేత చూడబడింది **(మయాదృష్టా)** అనడం చేత, త్రిజటాస్వప్నము కేవలం నిత్యజీవిత పరిశీలనలో చూడబడి, వినబడే విషయాల అసంపూర్ణ వ్యక్తీకరణమే స్వప్నంగా

మారుతుందని చెప్పడానికి అవకాశం లేకుండా చేశాయి. పైగా త్రిజట "తప్పకుండా జరిగి తీరుతుంది" అని చెప్పినట్లుగానే త్రిజటాస్వప్నం వాస్తవంలో వెలుగును చూపింది.

వాల్మీకి దర్శకత్వంలో అత్యంత రమణీయంగా రూపొందిన త్రిజటాస్వప్నములో నిజానికి త్రిజట ఒక ప్రేక్షకురాలైంది. చూసి వెళ్ళే ప్రేక్షకురాలు కాకుండా ఇతివృత్తాన్ని విశ్లేషించి విశదపరచే వైశారద్యము గల వనితగా వెలిగిపోయింది.

రాముడికి విజయం తథ్యమని చెప్పింది త్రిజట. రావణునికి వినాశము తప్పదని కూడా చెప్పింది. సీతారాముల సమాగమము అనివార్యమని కూడా చెప్పింది. మరొక వింత విషయం. హనుమంతుని లంకాదహన సన్నివేశాన్ని కూడా వివరించింది.

ఇది జరుగబోయే కథను త్రిజట దర్శించేలా వాల్మీకి చేశాడా! లేక, త్రిజట మాటల ప్రభావం తనమీద పడి లంకాదహన కార్యాన్ని హనుమంతుడు నిర్వహించాడా? అనే విషయాన్ని కూడా మనం పరిశీలించాల్సి ఉంది. ఇది కూడా తేలికైన విషయం కాదు.

పైగా స్వప్నం చూడబడింది **(దృష్టా)** అన్నది త్రిజట. ఈ 'దృష్టా' అనే పదాన్ని స్వప్న వృత్తాంతం చెప్పేటప్పుడు అనేకసార్లు వాడింది త్రిజట. హనుమంతుడు తిరిగి రాముని వద్దకు చూడామణితో వెళ్ళినప్పుడు "దృష్టాసీతా" అని ప్రారంభిస్తాడు. ఆ విషయంలో కూడా త్రిజట ప్రభావము హనుమంతునిపై పడిందేమో అని భావించడంలో సమంజసము కానిది లేదు.

కాంతి సూర్యుని చేరినట్లు సీతమ్మ రాముని చేరింది అని చెప్పిన స్వప్నవిషయము నిజానికి నిలువుటద్దంలా భాసిస్తోంది. కాంతి సూర్యునికి వేరైతే కదా తిరిగి మళ్ళీ కలిసేది! అలాగే దేహాలు వేరైనా వారి హృదయాలు కలిసే ఉన్నాయని త్రిజట భాష్యం చెప్పింది.

తెల్లని వస్త్రాలు స్వచ్ఛతకు, పవిత్రతకు చిహ్నాలు. సీతారాములు, లక్ష్మణ విభీషణాదులు శ్వేతవస్త్రాలతో శోభించడం, అలాగే హింసను వ్యక్తీకరించే ఎఱ్ఱని వస్త్రాలతో రావణ, కుంభకర్ణ, మేఘనాథ రాక్షసాదులు కన్పించడం త్రిజటాస్వప్నంలోని నైర్మల్యాన్ని మనముందు ప్రదర్శింపచేశాడు ఆదికవి.

రావణుని పుష్పకవిమానాన్ని రాముడెక్కడం, రావణుడు గాడిదపైనుండి క్రింద పడడం, ముఖ్యంగా రావణుణ్ణి ఒక స్త్రీ దక్షిణదిక్కు వైపు ఈడ్చుకొని పోవడం-ఇవన్నీ రావణ సంహారాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయి. రావణుడు నూనె త్రాగుతున్నట్లు వివరించింది త్రిజట. అది మృత్యువునకు సంకేతము.

కేకయరాజ్యంలో ఉన్న భరతుడు తన తండ్రి దశరథుని మరణాన్ని కలలో అలాగే దర్శించాడు.* అయితే దశరథుడు అప్పటికి చనిపోయి ఉన్నాడు. ఇక్కడ రావణుడు చావబోతున్నాడు. అంతే తేడా.

ముండిత శిరస్సుతో రావణుడు పడి ఉండడం వస్త్రవిహీనుడై గోచరించడం అంత్యక్రియల్ని సూచిస్తున్నాయి. నిర్మలహృదయం గల త్రిజట స్వప్నాన్ని ఇలా దర్శించింది. మున్ముందు ప్రవేశించబోయే కథాభవనానికి తలుపులు తెరచింది.

'త్రిజట' అనే పదాన్ని వినగానే ఈ శబ్దము రామాయణ కథలో సుపరిచితంగా అనిపిస్తోంది కదూ! అవును. త్రిజట లాంటిదే జటాయువు.

* చైతన్య రామాయణము - ప్రథమభాగము - పుట - 275

ఇరువురూ పరోపకార జీవనానికి అలవాటు పడ్డవారే. కథావిషయంలో అందమైన మలుపులుగా శోభించువారే. రావణవినాశాన్ని జటాయువు చెప్పి చూసింది. త్రిజట చూసి చెప్పింది. జటాయువు చెప్పిన సత్యం కల కాలేదు. కానీ త్రిజట చూసిన కల వాస్తవమైంది.

'జటా' అంటే కొమ్మ అని కూడా అర్థము. త్రిజటా జటాయువులు రామాయణ మహావృక్షంలో మనోహరమైన రెండు శాఖలుగా కన్పిస్తాయి.

'జటా' అంటే వేదాన్ని ముందువెనుకలుగా వల్లించే పద్ధతి. పూర్వాపరాలు గమనిస్తూ కథను సంవిధాన మొనర్చిన త్రిజటా జటాయువులు వేదరూపమైన రామాయణాన్ని ఋత్విక్కుల వలె సంవేద్య మొనర్చినారని భావము.

'జటా' అంటే జడ అని కూడా అర్థము. జడను అల్లినట్లు వీరిద్దరూ చక్కని సన్నివేశాలలో ఒదిగిపోయి కథను అందంగా అల్లడంలో తమవంతు పాత్రను నిర్వహించారు. అంతేకాక, చెల్లాచెదరైనా కేశాలను సుందరంగా కూర్చినపుడే అది 'జటా' అనిపించుకుంటుంది. త్రిజటా జటాయువులు కూడా భగ్నమయ్యే సన్నివేశాల్లో ప్రవేశించి, కథను భవ్యంగా, దివ్యంగా రూపు దిద్దారు.

జటాయువు ఇక మనకు కన్పించదు. జీవించే ఉంటే ఇంకా ఎన్నో మంచి కార్యాలమ జటాయువు చేయడం మనం చూసి వుండేవాళ్ళం. మంచివారు మంచి చేయకుండా ఉండలేరు కదా!

త్రిజట యుద్ధకాండములో మళ్ళీ ప్రదీప్త మవుతుంది. అక్కడ కూడా సంక్లిష్ట సన్నివేశంలో ప్రవేశించి సీతమ్మకు ఊరటను కల్పిస్తుంది.

రాక్షసులై పుట్టినంత మాత్రాన రాక్షసులుగా బ్రతుక నవసరం లేదు: బురదలో కమలం రాణిస్తుంది. ఎక్కడున్నా మనేది కాదు. ఎలా ఉన్నా మనేది ప్రధానం.

పరిస్థితులు మారుతూ ఉంటాయి. వాటి ప్రభావాలూ మారుతుంటాయి. మనసును శుద్ధి చేసుకుంటూ ప్రవర్తనలో ఒడుదుడుకులు లేకుండా జీవించే నేర్పు కలవారు తాము ఆనందంగా జీవించడమే గాక ఇతరులకు కూడా సంతోషాన్ని కల్గిస్తూ ఉంటారు. అలాంటి ఉదాత్తమైన వ్యక్తుల కోవకు చెందింది త్రిజట.

అశోకవనంలో శోకమూర్తి

త్రిజట మాటలు వింటున్న రాక్షసస్త్రీలు సీతమ్మను బాధించడం మానేశారు. సీతమ్మ తీవ్రంగా వ్యథ చెందుతూ ఉంది. సింహాల మధ్య చేరిన ఆడఏనుగు లాగా సీతమ్మ వణికిపోతోంది. అడవిలో తప్పిపోయిన చిన్నబిడ్డ దిక్కుతోచక ఏడుస్తున్నట్లు ఉందామె.

"అయ్యో! ఎన్ని బాధలు! ఎన్ని కష్టాలు! ఇన్ని వస్తున్నాయి. చావు ఏది? చావుకూడా నాలాగే కదలలేని స్థితిలో ఉందా! లేకుంటే వచ్చి నన్ను ఎందుకు కబళించదు.

"నా గుండె చూడు. ఎంతగా పాషాణమైందో! బండలా తయారైంది. కొండలా తయారైంది. వజ్రాయుధంతో కొట్టినా ముక్కలయ్యేలా లేదు.

"మంత్రం లాంటి నన్ను పొందాలని చూస్తున్నాడు ఈ మాయల మాంత్రికుడు. రాముడు రాకపోతే వీడు నన్ను శస్త్రాలతో ఖండిస్తాడు. ఇది సత్యము.

"తెల్లవారితే వధింపబడే రాజద్రోహి ఆ రాత్రంతా ఎలా జీవిస్తాడో అలా వుంది నా పరిస్థితి. పెనుగాలిలో సాగరమధ్యమున చిక్కిన ఓడలా మిగిలాను.

"పైడిలేడిని వాంఛించి కష్టాల వాతపడ్డాను. బాధల్ని కొనితెచ్చుకున్నాను. మృగరూపంలో వచ్చిన పాపాత్ముడెవరో! నా రాముణ్ణి, లక్ష్మణుణ్ణి ఏం చేశాడో! అంతా కాలవైపరీత్యం. కాలమే మృగరూపంలో వచ్చి నన్ను మోసం చేసింది.

"నా పూజాఫలము ఏమైంది? నా ధర్మనియమాలు దేనికీ కొరగాకుండా పోయాయా! నా పాతివ్రత్యానికి ఫలమేమిటి? చేసిన వ్రతాలన్నీ వృథాగా పోయినట్లేనా!

"రామా! నువ్వు గడువు పూర్తికాగానే అయోధ్యకు వెళ్తావు. నన్ను మరచిపోతావు. అందమైన స్త్రీలను వివాహం చేసికొని సుఖిస్తావు. నేను మాత్రం నిన్నే స్మరిస్తూ ప్రాణాలు విడుస్తాను."

సీతమ్మ ఈవిధంగా రోదిస్తూ వణికిపోయింది. మెల్లగా కదలి పుష్పించిన శింశుపావృక్షం దగ్గరకు వెళ్ళింది. రాముణ్ణే స్మరిస్తూ ఉంది. ఈలోగా ఏదో ఆశాలత పెనవేసుకుంది.

సంపదలు లభించిన వానిచుట్టూ సేవకులు చేరినట్లు మంగళప్రదురాలైన సీతమ్మను శుభశకునాలు వరించి వచ్చాయి.

చేపల చలనానికి సరస్సులో పద్మము కదలినట్లు సీతమ్మ ఎడమకన్ను అదిరింది. ఆమె గుండ్రని ఎడమభుజం కూడా అదిరింది. రాముడు ఎదురుగా వచ్చి నిలిచినట్లు అనిపించింది. అదే సమయానికి ఎడమతొడ అదిరింది. మాసిన ఆమె పట్టుచీర కొద్దిగా జారింది. ఈ మంగళకరమైన శకునాలను వీక్షించి, ఎండకు వాడిపోయిన మొక్క వర్షం పడగానే కళకళలాడినట్లు కళాపూర్ణమైంది. ఇలాంటి శకునాలు గతంలో ఇచ్చిన సత్ఫలితాలన్నీ సీతమ్మ స్మృతిలో మెదిలాయి. రాహువు విడిచిన చంద్రబింబం లాగా సీతమ్మ కళకళలాడింది.

శోకం మంచు కరిగినట్లు కరిగిపోతోంది. సంతాపము మబ్బు వీడినట్లు వీడిపోతోంది. వర్షాకాలమున సరస్సు నిండినట్లు ఆమె హృదయం ఆనంద సరోవరమైంది.

హనుమంతుడు చెట్టుకొమ్మల మధ్య ఆకులు కప్పుకొని కూర్చుని అంతా చూస్తున్నాడు. రాక్షసాంగనలు సీతమ్మను నిందించడం చూశాడు. త్రిజట చెప్పిన స్వప్నవృత్తాంతము విన్నాడు. సీతమ్మ పలికిన మాటలూ ఆలకించాడు.

పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాడు. రావణుని ప్రతాపమును అంచనా వేసుకున్నాడు. జానకీ వియోగాన్ని, దుఃఖాన్ని ప్రత్యక్షంగా వీక్షించాడు. సీతమ్మను ఓదార్చాలని సంకల్పించాడు.

తాను సీతమ్మతో మాట్లాడకుండా తిరిగివెళ్తే ఆమె ప్రాణత్యాగం చేసుకుంటుందేమో అని సందేహించాడు. ఆమెతో ఎలా మాట్లాడాలి? ఎప్పుడు మాట్లాడాలి? సీతమ్మ సందేశమును తీసుకున్న తరువాతనే తన తిరుగప్రయాణమని నిర్ణయించుకున్నాడు. మరి రాక్షసస్త్రీల ముందు ఎలా మాట్లాడాలి? వాళ్ళు ఏమరుపాటుతో ఉండే సమయంలో మాట్లాడాలని భావించాడు.

బుద్ధిమతాం వరిష్ఠమ్

సీతమ్మ బాధ, రాక్షసాంగనల గోల, త్రిజట కల-అన్నీ మనసులో పెట్టుకొని ఆలోచించాడు హనుమంతుడు.

"రాముడి కోసం సీతమ్మ తల్లడిల్లిపోతూ వుంది. ఎలాగైనా ఈ అమ్మను ఓదార్చాలి. అది నా ధర్మం. ఈమె దుఃఖానికి హద్దంటూ లేకుండా ఉంది. ఈమెను ఊరడించకుండా తిరిగివెళ్తే నాది అపరాధము అవుతుంది.

"దుర్భరమైన బాధతో సీతమ్మ కుమిలిపోతోంది. నేను ఓదార్చకుండా వెళ్ళిపోతే ఏం జరుగుతుంది? ఏమో, ఈ కష్టాన్ని భరించలేక ప్రాణత్యాగం చేస్తే ఏం కావాలి? ఆ తప్పు నాదవుతుంది.

"రాముడు కూడా సీతమ్మను చూడాలని పరితపిస్తున్నాడు. సీతమ్మను ఓదార్చడము ఎలా నా ధర్మమో రాముని ఓదార్చడము కూడా నా ధర్మమే. నేను తిరిగి వెళ్ళిన తరువాత "సీతమ్మ ఏమి చెప్పమన్నది?" అని రాముడు అడిగితే నేను ఏమి చెప్పాలి? సీతమ్మ దగ్గర నుండి సందేశం లేకుండా వెళ్ళి రాముని ఊరడించడం సాధ్యం కాదు.

"పోనీ, నేను వెళ్ళి, విషయాలు, వివరాలు చెప్పి, రామసుగ్రీవులను వెంటపెట్టుకొని వస్తే ఎలా ఉంటుంది? బాగానే ఉంటుంది. అంత వరకు ఈమె బ్రతికి ఉంటుందా? ఒకవేళ ఉండకపోతే ఎలా?

"సరే. సీతమ్మతో ఎలా మాట్లాడాలి? రాక్షసాంగనలు ఇక్కడే ఉన్నారు కదా! ఎలా చెయ్యాలి? పెద్ద చిక్కులో పడ్డాను. తొందరగా మాట్లాడకపోతే సీతమ్మ జీవించేలా లేదు.

"ఒకపని చేస్తే? ఇక్కడే ఉండిపోతా. రాక్షసస్త్రీలు ఏమరుపాటుగా ఉన్నప్పుడే మెల్లగా ఊరడిస్తా. మరి చిన్న దేహంతో ఉన్నానే? అదికూడా వానరరూపం. పోనీలే, మానవభాషలో మాట్లాడేస్తా.

"అయితే బ్రాహ్మణుడి లాగా సంస్కృతభాషలో మాట్లాడుతా. అలా మాట్లాడితే నన్ను రావణుడని సందేహిస్తుందేమో! అందులో వానరుడు మానవభాషలో మాట్లాడడ మంటే ఎవరికైనా విచిత్రమే కదా!

"భావం స్పష్టంగా అర్థమయ్యే లాగా మానవభాషలో మాట్లాడడమే మంచిది. నా రూపాన్ని చూసి, నా భాషను విని సీతమ్మ ఏమనుకుంటుందో! ఏముంది! ఇప్పటికే రాక్షసుల వల్ల బాధపడి ఉంది. ఆ భయం చెప్పకుండా రెండింతలై కూర్చుంటుంది.

"కామరూపుడైన రావణుడే ఇలా వచ్చాడని భావించి భయంతో కేకలేస్తే ఏం చెయ్యాలి? ఇంకేముంది? ఈ రాక్షసస్త్రీ లందరూ యమదూతల్లాగా ఆయుధాలు పుచ్చుకొని వెంట పడతారు.

"నన్ను చుట్టుముట్టి బేజారెత్తించేస్తారు. చంపేందుకు ప్రయత్నిస్తారు. అప్పుడు నా నిజరూపాన్ని ధరించి నేను చెట్లపై దుముకుతూ పోతాను. అది చూసి వాళ్ళకు మరీ భయము, సందేహమూ కల్గుతాయి.

"వాళ్ళల్లో కొందరు వెళ్ళి రావణుని గృహం నుండి పెద్ద పెద్ద రాక్షసుల్ని తీసికొని వస్తారు. వాళ్లందరూ ఖడ్గాలు, శూలాలు, ఆయుధాలు ధరించి వస్తారు.

"వాళ్ళు కొందరు ప్రయత్నించి నన్ను పట్టుకున్నారనే అనుకుందాం. అప్పుడు నేను వచ్చినట్లు సీతమ్మకు ఎలా తెలుస్తుంది? సీతమ్మ ఇక్కడున్నట్లు రామసుగ్రీవులకు ఎవరు చెప్తారు?

"పోరాటములో రాక్షసులు నన్ను చంపకుండా చూసుకోవాలి. బంధించకుండా చూసుకోవాలి. నేను లేకపోతే కష్టం. శతయోజన విస్తీర్ణము గల ఈ సముద్రాన్ని దాటేవారు వానరవీరుల్లో మరొకరు లేరు.

"నా విషయం వేరు. అవసర మనుకుంటే కొన్ని వేలమంది రాక్షసులైనా చంపేస్తాను. అంతమందిని చంపుతా ననుకో. అప్పుడు అలసిపోతాను కదా! మళ్ళీ సముద్రాన్ని దాటి పోగలనా!

"ఇప్పుడు, ఈ దశలో నేను రాక్షసులతో యుద్ధం చెయ్యడం అంత మంచిది కాదు. జయమో! అపజయమో! ఎవరికి తెలుసు! సందేహంతో కూడిన పని చెయ్యడం నాకు ఇష్టం లేదు. ప్రాజ్ఞుడైనవాడు అనుమానాల కార్యంలో తలదూర్చడు. హనుమంతుడైన నేను మరీను.

"ఎలాగైనా పని చెడకుండా చూడాలి ఇప్పుడు. మాట్లాడకుండా వెళ్తే సీతమ్మ మరణిస్తుందేమో! మాట్లాడితే మొదటికే మోసం వస్తుందేమో! దూత సరిగా వ్యవహరించకపోతే ఫలించిన కార్యాలు కూడా పాడైపోతాయి. సూర్యుడు రాగానే చీకట్లు పోయినట్లు దూత వల్ల పనులన్నీ చెడిపోతాయి.

"ముందే యుక్తాయుక్తములు పరిశీలించి నిర్ణయించుకున్న కార్యాలు కూడా దూత వైఫల్యం వల్ల చెడిపోతాయి. మేము తెలివిగలవాళ్ళం అని అహంభావనతో విర్రవీగే దూతలు పనులన్నీ చెడగొట్టి కూర్చుంటారు.

"నేను అలా చేయకూడదు. అప్పుడే నా పని చెడకుండా ఉంటుంది. బుద్ధి పాడు కాదు. సముద్రాన్ని దాటి వచ్చిన ఫలమూ దక్కుతుంది.

"ఎలాగైనా సీతమ్మతో మాట్లాడి వెళ్ళడమే మంచిది. మరి, నా మాటలు విని ఆమె భయపడకుండా ఉండాలంటే ఎలా మాట్లాడాలి? ఏమి మాట్లాడాలి?

"ఇలా చేసేస్తా. సీతమ్మ మనసంతా రాముడి మీదనే ఉంది. రాముడు ఉత్తమ గుణాలకు నిలయ మైనవాడు. శ్రేష్ఠపురుషుడు. రాముని కళ్యాణగుణాలను కీర్తిస్తాను. రాముని జీవితవిశేషాలను మధురవాక్కులతో ఈమెకు వినిపిస్తాను. ఈమె నమ్మే లాగా రామకథను తియ్యగా పలుకుతాను;" అని నిర్ణయించుకున్నాడు బుద్ధిమంతుడు, వరిష్ఠుడు అయిన హనుమంతుడు.

రమ్యమైన రామకథ

కపిశ్రేష్ఠుడైన హనుమంతుడు చెట్టుకొమ్మపై కూర్చుని రామకథను రమణీయంగా, మధురంగా చెప్పడం ప్రారంభించాడు.

హనుమంతుడు చెట్టుమీద కూర్చుని యుండగా సీతమ్మ క్రింద కూర్చుని ఉంది. కథాగానము చేయు హనుమంతుడు పైన చెట్టుకొమ్మపై కూర్చుని వక్తయొక్క ఔన్నత్యాన్ని ఋజువు చేస్తున్నాడు. సీతమ్మ క్రింద కూర్చుని వింటూ శ్రోతయొక్క నమ్రతను, భక్తి శ్రద్ధలను ప్రదర్శిస్తూవుంది.

"గొప్పదైన ఇక్ష్వాకు వంశం. ఆ వంశం లోని వాడే దశరథుడనే మహారాజు. గొప్ప యశోవంతుడు. బలశాలి. బుద్ధిశాలి. గుణశ్రేష్ఠుడు. తపోధనుడు. ఋషితుల్యుడు. ఇంద్ర సమానుడు.

"దశరథుడు దయామయుడు. అహింసావ్రతుడు. క్షుద్రుడు కాడు. భద్రుడే. సత్యపరాక్రముడు. లక్ష్మీవంతుడు. శ్రీవర్ధనుడు. రాజశ్రేష్ఠుడు. ప్రసిద్ధుడు. సుప్రసిద్ధుడు. తాను సుఖిస్తాడు. పరులను సుఖపెడతాడు.

"రాముడు దశరథుని పెద్దకొడుకు. చందురుని వంటి మోము. సమర్థుడు. ధనుర్ధరులలో శ్రేష్ఠుడు. శీలవంతుడు. గుణవంతుడు. ధర్మరక్షకుడు. సత్యసంకల్పుడు. కన్నతండ్రి కొరకు కానల కేగాడు. సోదరుడు, భార్య వెంట నడిచారు.

"రాముడి చేతిలో హతులయ్యారు రాక్షసు లెందరో. అందరూ శూరులే. వీరులే. జన స్థానంలో ఘోరయుద్ధం జరిగింది. రాముని చేతిలో ఖరదూషణులు హతులయ్యారు. అది విని రావణుడు క్రుద్ధు డయ్యాడు. మాయలేడిని సృష్టించాడు. మహిళను అపహరించాడు.

సీత ఎరుగదు దోషం. రాముడికి దూరమైంది తోషం. అరణ్య మంతా అన్వేషించాడు. కపిరాజు సుగ్రీవునితో చెలిమి చేశాడు. వాలిని వధించాడు. తమ్ముడైన సుగ్రీవుని కిష్కింధకు రాజును చేశాడు.

సీతాన్వేషణం ప్రారంభమైంది. సుగ్రీవుడు ఆజ్ఞ ఇచ్చాడు. వేలాది వానరులు వెతుకుతున్నారు. సంపాతి చెప్పింది సీత లంకలో ఉన్నదని. నూరు యోజనాల సముద్రాన్ని దాటాను నేను. చెప్పాడు రాముడు గుర్తులు. చూశాను వాటిని ఈమెలో."

ఇలా పలికి ఊరుకున్నాడు హనుమంతుడు. ఈ కథాగానం సీతమ్మను విస్మయ మొందించింది. ముంగురుల ముఖాన్ని పైకెత్తి శింశుపావృక్షాన్ని చూసింది. ఎవరూ కనిపించలేదు. అవైపు, ఈవైపు చూచింది. ఆనందంతో రాముణ్ణి స్మరించింది. రామకథను విన్నందుకు పొంగిపోయింది. శుభశకునాల ఫలితాన్ని చూసింది. కొమ్మల మాటున బాల భానువి లాగా ప్రకాశిస్తున్న సుగ్రీవుని మంత్రి హనుమంతుని చూసింది.

సీతమ్మ చూపు హనుమన్న మీద పడింది. తల్లి చూపు ప్రథమంగా తనయుని మీద పడింది. ఇదొక అపూర్వ సన్నివేశం. అనిర్వచనీయ సమావేశం.

సీతమ్మ చూపు తనపై పడ్డప్పుడు హనుమ ఎంత పరవశించి పోయాడో! రోమాంచమై ఉంటాడు. అశ్రునయనాలతో శోభించి ఉంటాడు.

ఇంతవరకూ హనుమంతుడు సీతమ్మను చూస్తూనే ఉన్నాడు. ఈ పారవశ్యం కలిగి ఉంటుందా! సీతమ్మ దృష్టి తనపై పడినప్పుడే పరవశించి ఉంటాడు.

మనం కూడా ఆత్మాన్వేషణము చేస్తూ ఉంటాం. గ్రంథాల్లో, ఆశ్రమాల్లో, ఆలయాల్లో, సమావేశాల్లో, సత్సంగాల్లో వెతుకుతూ ఉంటాం. కానీ ఒక దశలో ఆత్మ వ్యక్త మౌతుంది. అదియే ఆత్మదర్శనము. నీ ప్రయత్నం లేకుండా ఇది నీకు అందుతుంది. అదొక దివ్యానుభూతి. అదియే ప్రజ్ఞానము. బ్రహ్మ పరిజ్ఞానము. అట్టి దర్శనము అమృతత్త్వాన్ని ప్రసాదిస్తుంది.

ఏవం బ్రహ్మ పరిజ్ఞానాదేవ మర్త్యోఽమృతో భవేత్

"ఈవిధమైన బ్రహ్మపరిజ్ఞానము చేతనే నరుడు అమృత స్వరూపు డగుచున్నాడు" అని వరాహోపనిషత్తు.

ఆత్మదర్శనము కాగానే అమృతరూపు లవుతారు. సీతమ్మ దృష్టి అమృతమయదృష్టి. ఆంజనేయునికి అలౌకికానుభూతిని ప్రసాదించింది.

ఆత్మజ్ఞానము లేదా ఆత్మదర్శనము కలిగితే ఆనందించ వలసిందే గాని కల్పించి దర్శించేది కాదు. ఇలా ప్రాప్తించడమే దైవానుగ్రహమని, దైవకృప యని మనము భావిస్తూ ఉంటాము. కృషిలో లభ్యం కానిది కృపతో లభిస్తుంది. అదే ఆత్మకృప. దైవకృప. సీతమ్మ కృప.

సీతమ్మ దృష్టి హనుమపై పడదు. రామకథాగానం చేసినప్పుడే పడింది. ఎవరైతే రామకథను భక్తితో వినిపిస్తూ ఉంటారో వారిపై దైవకృప పడుతుంది. ఆత్మజ్ఞానమును బోధించేవారికి ఆత్మకృప లభిస్తుంది.

య ఇదం పరమం గుహ్యం మద్భక్తే ష్వభిదాస్యతి
భక్తిం మయి పరాం కృత్వా మా మే వైష్య త్యసంశయః

"ఎవ్వడైతే పరమరహస్యమైన ఈ జ్ఞానమును నాయందు భక్తి కలిగి నా భక్తులకు ఉపదేశిస్తాడో అతడు నన్నే పొందుతాడు. ఈ విషయంలో సందేహము లేదు;" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత-మోక్షసన్యాసయోగములో తెలిపి యున్నారు.

తన హృదయంలో నిక్షిప్తమైన పరమాత్మ జ్ఞానమును ఇతరులకు భక్తితో బోధించువాడు పరమాత్మకు ప్రియు డవుతున్నాడు. ఇదియే ఆంజనేయుని అమృతమయమైన భక్తి.

కథాదిష్వితి గర్గః

"భగవత్కథల యందు ప్రీతి కలిగి యుండుటయే భక్తి" అని గర్గాచార్యుల అభిప్రాయము అంటుంది నారద భక్తిసూత్రము.

హనుమంతుని లాగా మనం కూడా శ్రావ్యంగా భగవంతుని దివ్యస్థితిని, దివ్యగాథను భక్తులకు భక్తితో వినిపించాలి. అప్పుడు మనకు కూడా ఆత్మదర్శనం లభిస్తుంది.

అనంస్కృతాస్తు సంస్కార్యాః భ్రాతృభిః పూర్వ సంస్కృతైః

"ఎవరికి ఉపదేశము లభించి యున్నదో అట్టివారు ఉపదేశము లేని సోదరులకు ఉపదేశించడమే పరమధర్మము."

రాము డెక్కడున్నాడో హనుమంతునికి తెలుసు. సీతమ్మకు తెలియదు. తెలియక పరితపించే వారికి తెలిసిన వారు పరవశించి ఉపదేశించాలి. ఇదియే శిష్టాచార సంప్రదాయము.

చెట్టుకొమ్మల మాటున తెల్లని వస్త్రంతో, మెరుపులా ప్రకాశిస్తూ, పచ్చని శరీరంతో కనిపించాడు కపిశ్రేష్ఠుడు. సీతమ్మ అతణ్ణి చూసి ఉలిక్కిపడింది.

"ఏమిటీ వానరరూపం! చూడ శక్యం కాకుండా ఉంది. భయంకరంగా ఉంది;" అని భావించి నిర్విణ్ణురాలైంది. ఏమీ తోచక "రామా! రామా! లక్ష్మణా!" అంటూ విలపించింది.

"కోతి కన్పిస్తున్న దేమిటి? ఇది కల కాదు కదా! ఔను ఇది కలే. కోతి కలలో కనిపించకూడదు. మా తండ్రికి, లక్ష్మణసమేతుడైన రామునికి క్షేమము కలుగుగాక!

"కాదు. కల కాదు ఇది. నాకు నిద్ర పడితే కదా కల రావడానికి! రాముడికి దూరమైన నన్ను నిద్ర కూడా విడిచిపెట్టి వెళ్ళింది. నేను సదా రాముని ధ్యానంలో ఉంటాను కదా! ఆ ధ్యాసలో అవే మాటలు, అవే రూపాలు వినిపిస్తూ, కనిపిస్తూ ఉన్నాయేమో!

"కానీ, ఇతడు అలా లేడే! నాకు స్పష్టంగా కనిపిస్తున్నాడే! "ఈ వానరుడు చెప్పింది సత్యం కావాలి" అని బృహస్పతికి నమస్కరిస్తున్నా. ఇంద్రునికి వందనా లర్పించుకుంటున్నా. అగ్నిదేవునికి అంజలి ఘటిస్తున్నా. బ్రహ్మకు దణ్ణం పెడుతున్నా. ఈ మాటలు సత్యం కావాలి. ఈ వానరుడు పలికిన వచనాలు సత్యం కావాలి" అని మళ్ళీమళ్ళీ పలికింది సీతమ్మ.

సీతమ్మ చెప్పిన రామకథ

పగడం వంటి ఎఱ్ఱనైన ముఖం కలిగిన పవనసుతుడు వినయశీలుడై వైదేహిని సమీపించాడు. చేతులు కట్టి తలమీద ఉంచుకొని నమస్కరించాడు.

"ఎవరమ్మా నువ్వు? మాసిన పట్టుబట్టతో ఉన్నావు. ఏమి? ఎందుకని అలా చెట్టుకొమ్మను పట్టుకొని ఏడుస్తున్నావు? నువ్వు దేవతాస్త్రీవా! నాగకన్యవా! యక్షకన్యవా! గంధర్వకన్యవా! రాక్షసకన్యవా! కిన్నెరకన్యవా! ఎవరు నీవు? నీవు దేవతాస్త్రీవే అని నాకు అనిపిస్తున్నది.

"ఒకవేళ చంద్రుని నుండి క్రింద పడిన రోహిణీ నక్షత్రానివా! లేక అరుంధతివా! ఒక విధంగా చూస్తే నీలో అన్నీ రాజవంశస్త్రీ లక్షణా లున్నాయి. కనుక, నీవు దేవతాస్త్రీవి కావేమో అనిపిస్తోంది.

"అమ్మా! నేను అడుగుతున్నా. చెప్పు. నీకు మేలు కలుగుతుంది. జనస్థానం నుండి రావణుడు బలవంతంగా అపహరించి తెచ్చిన సీతవు నీవు కాదు కదా! నీ దైన్యము, నీ సౌందర్యము చూస్తూ ఉంటే నువ్వు రాముని భార్యవే అనిపిస్తోంది;" అన్నాడు హనుమంతుడు. హనుమంతుడు రాముని గూర్చి ప్రస్తావించుట చేత సీతమ్మ సంతోషించింది. హనుమతో ఇలా మాట్లాడింది.

"నేను దశరథుని కోడలిని. మా మామగారు రాజు లందరికంటెను గొప్పవాడు. శత్రుంజయుడు. ప్రసిద్ధుడు.

"విదేహరాజైన జనకుని పుత్రికను. మా నాన్న గొప్ప పండితుడు. నా పేరు సీత. రాముడు నా భర్త.

"నేను అయోధ్యలో పండ్రెండు సంవత్సరాలు భర్త సన్నిధిలో ఆనందంగా జీవించాను. సమస్తమైన భోగాలకు నిలయమే అయోధ్య. నా భర్తయైన రామునికి పట్టాభిషేకం చేయాలని మా మామగారు ప్రయత్నించారు.

"సన్నాహాలు జరుగుతున్నాయి. "నీవు రామునికి పట్టాభిషేకం చేస్తే నేను ఆహారం తినను. నీళ్ళు త్రాగను. చచ్చిపోతాను. నీవు నాకు వరాలిచ్చి ఉన్నావు. ఆ మాటకు కట్టుబడి రాముణ్ణి వనవాసము పంపు," అని మా చిన్నత్తగారు పట్టుపట్టింది. పాపం! మా మామగారు అది విని స్పృహతప్పి పడిపోయారు.

"పట్టాభిషేకము కంటె పితాజ్ఞను ప్రియంగా భావించి రాముడు వనవాసానికి అంగీకరించాడు. రాముడు ఇచ్చేవాడే కాని పుచ్చుకొనేవాడు కాదు. ఆపదల్లో కూడా అప్రియంగా పలకడు.

"రాముణ్ణి వదలి నేను బ్రతకలేను. అందుచేత నేను కూడా అడవికి బయలుదేరాను. అన్నయైన రాముని ప్రాణసమానంగా చూసుకొనే లక్ష్మణుడు నా కన్నా ముందే బయలు దేరాడు.

"మేము ముగ్గురము నియమవంతులమై భయంకరమైన అరణ్యములో ప్రవేశించాము. దండకారణ్యంలో మేము నివసిస్తూ ఉండగా, రామలక్ష్మణులు లేని సమయంలో దురాత్ముడైన రావణుడు నన్ను అపహరించాడు. నాకు ఆ దుష్టుడు పెట్టిన గడువు ఇక రెండు మాసాలే ఉంది. ఆ తరువాత నేను ఎలాగూ బ్రతకను;" అని రామునితో కూడిన తన ఆత్మకథను హనుమంతునికి వినిపించింది.

భారతీయ సంప్రదాయానికి తలమానికంగా తెలిసే సీతమ్మ ఎంత చక్కగా చెప్పిందో చూశారా! మొదట తన పేరు చెప్పలేదు. భర్త పేరు కూడా చెప్పలేదు. పెద్దలైన దశరథ జనకాదులను గూర్చి చెప్పూ మొదలుపెట్టింది. ఇది మన సంప్రదాయం.

ముందు మామగారైన దశరథుని పేరు చెప్పి తరువాత తండ్రియైన జనకుని పేర్కొంది. తనకు జన్మనిచ్చిన తండ్రి కన్నా తన భర్తకు జన్మనిచ్చిన తండ్రి పేరు ముందు పేర్కొనడం విశేషం. వివాహిత అత్తవారింటికే ప్రాధాన్య మివ్వాలి.

అసందర్భం అని మీరు భావించకపోతే ఒక చిన్న విషయాన్ని ప్రస్తావిస్తాను. సీతమ్మలో అలిగే లక్షణం గల స్త్రీల స్వభావం చాలా సున్నితంగా కన్పిస్తుంది ఇక్కడ బాగా పరిశీలిస్తే. తాను అడిగింది భర్త కొనిపెట్టకపోతే, గతించిపోయిన పెద్దవాళ్ళను ఉటంకిస్తూ "మా మామయ్య ఉంటేనా! మా అత్తమ్మ ఉంటేనా, నా నోటిలో మాట మిగిలి ఉండగానే, వాళ్ళు వెళ్ళి తెరిగొచ్చేవారు" అని అంటూ ఉంటారు.

అలాగే ఇక్కడ సీతమ్మ దశరథుని ఒక్క శ్లోకంలో కీర్తించి, మరొక శ్లోకంలో జనకుని, తనను, రాముని ప్రస్తావించింది.

"సంవత్సరం కావస్తున్నా రాముడు వచ్చి నన్ను తీసుకొని పోలేదు. మా మామగారు ఉంటేనా?" అనే శ్లేష అక్కడ వినిపిస్తోంది సూక్ష్మంగా. దారుణమైన బాధల మధ్య ఆమాత్రం కినుక ఉండతగిందే.

మరి, అలాంటప్పుడు జనకుని ఎందుకని విస్మరించింది? అనే సందేహం మీకు రావచ్చు. **విదేహస్య దుహితా** - నేను విదేహరాజు కుమార్తెను అన్నది సీతమ్మ. జనకుడు అనకుండా విదేహరాజు అని చెప్పడమే విశేషం.

ఆయన విదేహుడు. తన దేహమే తనకు తెలియని జ్ఞాని. శుద్ధవైరాగ్య పురుషుడు. అందుచేత తండ్రి నుండి తాను పెద్దగా ఆశించడం లేదని అభిప్రాయపడి ఉంటుంది సీతమ్మ.

సంశయ విచ్ఛేదనము

"అమ్మా! వైదేహీ! రాముడు క్షేమంగా ఉన్నాడు. నీ క్షేమం అడిగాడు. రాముడు పంపగా నేను దూతనై వచ్చాను. రాముడు వేదశాస్త్ర పారంగతుడు. బ్రహ్మాస్త్రవిదుడు.

"నీ భర్తకు తమ్ముడైన లక్ష్మణుడు గొప్ప తేజోవంతుడు. నీ విషయంలో చాలా దుఃఖిస్తున్నాడు. శిరస్సు వంచి నీకు నమస్కారం చెప్పమన్నాడు." ఆ మాటలు వినగానే సీతమ్మ హృదయం ఆనందసాగరమైంది.

కల్యాణీ బత గాథేయం తాకికీ ప్రతిభాతి మా
ఏతి జీవన్త మానన్దో నరం వర్ష శతాదపి

"మనిషి జీవించి ఉండాలే కాని నూరు సంవత్సరాలకైనా ఆనందం కలుగుతుంది అనే సామెత లోకంలో ఉంది. అది నిజమని నమ్ముతున్నాను" అన్నది సీతమ్మ.

వారిరువురూ పరస్పరం స్నేహపాత్రు లయ్యారు. విశ్వాసముతో మాట్లాడుకున్నారు. సీతమ్మ దుఃఖాన్ని చూసి హనుమంతుడు మెల్లమెల్లగా సీతమ్మకు దగ్గరగా వెళ్తున్నాడు. ఎప్పుడైతే హనుమంతుడు తనకు సమీపంగా వస్తున్నాడో అతడు తప్పక రావణుడై ఉంటాడని సీతమ్మ సంశయించింది.

కొమ్మను పట్టుకొని నిలబడియున్న సీతమ్మ చెట్టును విడిచి కూర్చుంది. వానర రూపము ధరించి వచ్చిన రావణునితో మాట్లాడినందుకు సీతమ్మ దుఃఖిస్తోంది.

ఏమి చేయాలో హనుమకు తెలియలేదు. చేతులెత్తి నమస్కరించాడు. భయపడి యున్న ఆ తల్లి నమస్కరిస్తున్న హనుమంతుని వైపు చూడలేదు.

హనుమ అలా నమస్కరించే వున్నాడు. సీతమ్మ చూచింది. దీనురాలై ఇలా పలికింది. "నీవు రావణుడివి కాదనిపిస్తోంది. నిన్ను చూస్తూ వుంటే నాకు ఆనందము కలుగుతోంది. నీవు రామదూతవే. నా సంశయము తొలగింది. నీకు శుభం కలుగుతుంది.

"నాయనా! నాకు రామకథ చాలా ఇష్టం. ప్రాణం. అందుకే నిన్ను అడుగుతున్నా. రాముని సుగుణాలను వినిపిస్తావా! నా మనస్సును ఎంతగానో ఆకర్షిస్తున్నావు;" అన్నది సీతమ్మ.

హనుమంతుడు వానరరూపమున వచ్చిన రావణుడేమో నని సీతమ్మకు సందేహం కలిగింది. అప్పుడు హనుమంతుడు ఏమీ చేయలేదు. చేతులెత్తి నమస్కరించాడు. సూర్యుని ముందు మంచుగడ్డలా సీతమ్మ సంశయం కరిగిపోయింది.

ఎప్పుడు భగవంతుని విషయంలో గాని, శాస్త్రవిషయంలో గాని, సాధనవిషయంలో గాని సందేహాలు తలెత్తుతాయో అప్పుడు మనం కూడా అదే చేయాలి. ఆలయానికి వెళ్ళి భగవంతునికి నమస్కరించాలి. లేదా ఏకాంతంగా ఒకచోట కూర్చుని భగవంతునికి నమస్కరించాలి. పరమాత్మను ప్రార్థించాలి. వెంటనే సంశయవిచ్ఛేదనము జరిగిపోతుంది.

ఈ సత్యాన్ని నేను నా అనుభవంలో కూడా చూశాను. ప్రత్యక్షంగా గురుసాన్నిధ్యములో కూర్చుని శాస్త్రాన్ని అధ్యయనం చేసే అదృష్టానికి నోచుకోని నాకు ఎన్నో సంశయాలు కలుగుతుండేవి. సందేహనివారణకు నేను ఎవ్వరినీ గతంలో కూడా ఆశ్రయించేవాణ్ణి కాదు. చేతులు జోడించి నమస్కరిస్తూ పరమాత్మకు నివేదించేవాణ్ణి. ముంజేతికంకణం లాగా నా మనసులో సమాధానాలు పరచబడేవి.

న మే భక్తః ప్రణశ్యతి నా భక్తుడు నశించడు. **సంశయాత్మా వినశ్యతి** సంశయగ్రస్తుడు నశిస్తాడు. ఇది గీతాచార్యుని సత్యసందేశము. నమ్మి చెడిన వారు లేరు.

"తల్లీ! రాముడు సూర్యుని లాగా తేజోమయుడు. చంద్రుని లాగా అందగాడు. కుబేరుని లాగా రాజు. మహావిష్ణువు లాగా కీర్తిమంతుడు. సత్యభాషి. మధురభాషి. రూపవంతుడు. భాగ్యవంతుడు. సౌందర్యవంతుడు. రూపుదాల్చిన మన్మథుడు.

"అవసరాన్ని గుర్తించి క్రుద్ధుడవుతాడు. అవసరమైతే వధిస్తాడు. నిన్ను అపహరించిన రావణుడికి పట్టబోయే గతి నీవే చూస్తావు. రావణుణ్ణి వధించబోయే రాముడే నన్ను దూతగా నీవద్దకు పంపాడు. నీ కుశలాన్ని అడిగాడు. లక్ష్మణుడు కూడా నమస్కరించి కుశల మడిగాడు. రాముని స్నేహితుడు సుగ్రీవుడు కూడా నీ క్షేమం అడిగాడు.

"అమ్మా! కొద్దిరోజుల్లోనే కోట్లకొలది వానరులతో కూడి వచ్చిన రామలక్ష్మణ సుగ్రీవాదులను నీవు చూస్తావు. నేను సుగ్రీవుని మంత్రిని. నన్ను హనుమంతుడు అంటారు. సముద్రాన్ని లంఘించి వచ్చాను. నిన్ను చూడాలని రావణుడి తలమీద పాదంపెట్టి మరీ వచ్చాను. తల్లీ! నేను రావణుణ్ణి కాను. నన్ను అనుమానించకు. నేను హనుమను. నీ బిడ్డను;" అన్నాడు హనుమంతుడు.

హనుమ చెప్పిన రామకథను విని సంతోషించింది సీతమ్మ. "నాయనా! నీకు రామునితో ఎక్కడ కలిగింది సంబంధం? నీకు లక్ష్మణుడు ఎలా తెలుసు? నరులకు, వానరులకు స్నేహమెలా కలిగింది? ఏదీ, రాముని గుణాలను, లక్షణాలను వివరించు. లక్ష్మణునివి కూడా" అన్నది సీతమ్మ. రామలక్ష్మణుల రూపవైభవాన్ని వర్ణించుటకు హనుమంతుడు ఉపక్రమించాడు.

రూప గుణ సౌందర్యము

సీతమ్మ కోరిన పిమ్మట రామలక్ష్మణుల రూపసౌందర్యాన్ని, గుణసౌందర్యాన్ని హనుమంతుడు చెప్ప నారంభించాడు. "అమ్మా! రామలక్ష్మణుల రూపసౌందర్యము, గుణ సౌందర్యము నీకు తెలియనిది కాదు. నా అదృష్టము వల్ల నన్ను చెప్పమని అడుగుతున్నావు. చెప్తాను. విను." అంటూ ప్రారంభించాడు హనుమ.

ఇది తన అదృష్టంగా చెబుతూ అదృష్టానికే చక్కని నిర్వచన మిచ్చాడు హనుమ. భగవంతుని రూప గుణ సంకీర్తనము చేయువారే ఈ ప్రపంచంలో అదృష్టవంతులు. నిజమైన భాగ్యవంతులు. వెలితి లేనివారు. కొరత లేనివారు. భక్తుల అదృష్టాన్ని శ్లాఘిస్తూ అన్నమాచార్యులు ఒక కీర్తనలో చక్కగా గానం చేస్తారు.

చాలు చాలు నీ హరియే మాకును
సకల క్రియలకు నాయకుడు
నాలుకు తుదనే యీత డుండగా
నలుగడ నెవ్వరి వెదికేము ॥చాలు॥
ఏలినవాడట లక్ష్మీవిభుడట యేమిటను గొరత మాకికను
నాలో నున్నాడు బ్రహ్మతండ్రియట నా కాయుష్యము బాతా
పాల జలధిపై దేవుని వారము పాడి మాకు నిక నేమరుదు
ఆలింపగ నేమింతటి వారము అన్యుల కిక జెయి చాచేమా ॥చాలు॥

"చాలు. మాకు చాలు. ఇది మాకు చాలు. మా పనుల కన్నిటికీ ప్రభువు శ్రీహరియే. అతడు మా నాలుక చివరనే ఉన్నాడు. నాలుగు వైపుల మేము ఎవరిని వెదకాలి?

ఇతడే మాకు ఏలిక. ఇతడే మమ్ము ఏలిన వాడు. సంపదపతి. ఇక మాకు కొరత ఎలా ఉంటుంది?

ఆయువు పోసే బ్రహ్మకు తండ్రి ఇతడే. అట్టి శ్రీహరి నాలోనే ఉన్నాడు. ఇక ఆయువుకు మాకు కొరత ఎక్కడిది?

మా శ్రీహరి సదా పాలసముద్రములోనే ఉంటాడు. పాడి కొరత మా కుంటుందా!

బాగా ఆలోచిస్తే, భగవత్కృప చేతనే మేము ఇంతటి అదృష్టముతో శోభిస్తున్నాము. ఇక అన్యుల నాశ్రయించి చేయి చాపాల్సిన అవసరము మాకు ఎక్కడుంది;" అని పరమాత్మను కీర్తించే తన అదృష్టానికి తృప్తి చెందుతూ పలికాడు తాళ్ళపాక అన్నమాచార్యులు.

హనుమంతుడు కూడా రాముని గుణానుకీర్తనము తన అదృష్టంగా భావిస్తూ వర్ణించుట కుపక్రమించాడు.

రామః కమల పత్రాక్షః సర్వసత్త్వమనోహరః
రూప దాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజే

"జానకీ! రాముడు పద్మపత్రనేత్రుడు. సర్వప్రాణుల మనసులను ఆకర్షించువాడు. రూప దాక్షిణ్యములు కలవాడు. సుగుణములతోనే పుట్టినవాడు."

రాముని రూపసౌందర్యమును వర్ణించుటకు ప్రారంభించి ప్రథమంగా **"రామః"** అన్నాడు హనుమంతుడు. **జగత్ప్రథమ మంగళమ్** జగత్తులో ప్రథమ శుభకర నామము రామనామము అన్నాడు కాళిదాసుమహాకవి. **రామో రమయతాం శ్రేష్ఠః** ఇతరులను రమింపచేయుటలో శ్రీరాముడు శ్రేష్ఠపురుషుడై యున్నాడు. తన మంజుల రూపము చేత, రమణీయ కళ్యాణగుణముల చేత లోకాన్నిరంజింప చేయువాడై రాముడని కీర్తించబడినాడు.

చూచేవారిని రాముడు ఎలా రంజింప చేస్తాడో చెప్తూ **"కమల పత్రాక్షః"** అని కీర్తించాడు హనుమంతుడు. కమలదళలోచనుడని శ్లాఘిస్తున్నాడు. అనగా జ్ఞాననేత్రము కలవాడు. జ్ఞానము ఎవరినైనా ఆకర్షిస్తుంది. జ్ఞానము ప్రకాశస్వరూపము. సూర్యుని వెలుగు అంధకారమును అదృశ్యము చేయునట్లు, రాముని దృష్టి అజ్ఞానమును ధ్వంసం చేస్తుంది. రాముని నయన సౌందర్యము వర్ణనాతీతము. రాముని నేత్రాలు విశాలములు. పద్మపత్రాల వలె చల్లనివి. ప్రేమ కరుణలతో నిండినవి. కనుక రాముని కమలనయనదృష్టి శుభకరము. శుభప్రదము.

"రామః కమల పత్రాక్షః" అని వాల్మీకి శ్లాఘిస్తే, **"శుభేక్షణ రామః"** అని వ్యాసుడు కీర్తించాడు. చూచేవాడు రాముడు. చూడబడేవాడు కూడా రాముడే అగుచున్నాడు. రాముని చూచేవారు, రామునిచే చూడబడేవారు వీరిద్దరే సుకృతాత్ములు ఈ ప్రపంచములో.

కమలదళలోచనుడైన రాముడు సర్వసత్త్వ మనోహరుడు. సర్వులను ఆకర్షించువాడు. మానవులనే గాక పక్షుల్ని, వానరుల్ని, మృగాల్ని, సర్పాల్ని ఆకర్షించిన కళ్యాణరాముడు.

దివ్యమైన రూపముతో పాటు, దివ్యమైన దయ గలవాడై రూపదాక్షిణ్య సంపన్ను డయ్యాడు. ఈ కమనీయ, రమణీయ గుణాలన్నీ నేర్చుకున్నవి, ఒకొక్కటిగా పేర్చుకున్నవి కావు. "ప్రసూతః" పుట్టుకతోనే కలిసి పుట్టాయి అని రాముని రూపసౌందర్యాన్ని అద్భుతంగా వర్ణించేందుకు ఉపక్రమించాడు వాయుపుత్రుడు.

"అమ్మా! రాముడు సూర్యునిలాగా తేజోవంతుడు. భూమిలాగా సహనవంతుడు. బృహస్పతిలాగా బుద్ధిమంతుడు. దేవేంద్రునిలాగా కీర్తిమంతుడు.

"రాముడు ధర్మంలో చరిస్తాడు. తన నాశ్రయించిన వారిని ధర్మమార్గంలో నడుపుతాడు. రాముడు కాంతిమంతుడు. అర్చనీయుడు. బ్రహ్మచర్యవ్రతము నాచరిస్తాడు. సాధువులకు మేలు చేస్తాడు. కర్మరహస్యము తెలిసినవాడు.

"రాజనీతిజ్ఞుడు. విద్యావంతుడు. వినయవంతుడు. శత్రుంజయుడు. విశాలబాహుడు. కంబుకంఠుడు. శుభాననుడు. ప్రతాపవంతుడు. శ్రీమంతుడు. ఆశ్రితులను అనుగ్రహించుట యందు ఆసక్తి కలవాడు. ప్రియవాది;" అని చెబుతూ సాముద్రిక శాస్త్రరీత్యా రాముని రూపములోని శుభలక్షణాలను నఖశిఖపర్యంతం వర్ణించాడు వాయుపుత్రుడు. అయితే నరులకు, వానరులకు సఖ్యమెలా కలిగింది? అని సీతమ్మ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతున్నాడు.

"అమ్మా! గొప్ప వీరుడైన లక్ష్మణుడు రాముని పినతల్లి కొడుకు. అనురాగంలో గాని, రూపంలో గాని, గుణాలలో గాని రామునితో సమానుడు.

"తల్లీ! నిన్ను అన్వేషిస్తూ సంచరిస్తున్న రామలక్ష్మణులు మమ్మల్ని కలుసుకున్నారు. తమ్ముడైన సుగ్రీవుని కొట్టి కిష్కింధ నుండి తరిమేశాడు వాలి. మేమంతా సుగ్రీవుని సేవిస్తూ ఋష్యమూకంలో ఉండిపోయాం. ఆ పర్వతం మీదికి వాలి రాడు. అతనికి శాపముందిలే.

"ఒకరోజు రామలక్ష్మణులు ధనుర్ధారులై పర్వత సమీపానికి వచ్చారు. సుగ్రీవుడు వాళ్ళిద్దరిని చూశాడు. అంతే. తనను చంపడానికి వాలి ఎవరినో పంపి ఉంటాడని భావించి ఒకటే దౌడు. కొండపైకి ఎక్కి కూర్చున్నాడు.

"నన్ను వెళ్ళి మాట్లాడమని సుగ్రీవుడు ఆజ్ఞాపించాడు. నేను వెళ్ళి రామలక్ష్మణులకు నమస్కరించాను. వాళ్ళతో మాట్లాడాను. వారిని నా భుజంపై కూర్చోబెట్టుకొని పర్వతమెక్కి సుగ్రీవాదులున్న చోటికి చేర్చాను.

"రామసుగ్రీవు లిద్దరూ చెట్టపట్టా లేసుకొని చెలికాళ్ళు అయ్యారు. అగ్నిసాక్షిగా స్నేహం చేశారు. ఆ అగ్ని వెలిగించింది కూడా నేనే. వాళ్ళిద్దరూ పరస్పరం మనసు లిచ్చిపుచ్చుకున్నారు.

"పాపం! సుగ్రీవుని భార్య రుమను వాలి అపహరించాడు. సుగ్రీవుని కొట్టి తరిమాడు. అది తెలిసి రాముడు సుగ్రీవుని ఊరడించాడు; ఊరకే ఏడ్చేస్తుంటే.

"ఇక, నీవు లేకపోవడంవల్ల రామునికి కలిగిన దుఃఖాన్ని లక్ష్మణుడు సుగ్రీవునికి చెప్పాడు. సుగ్రీవుడు చాలా బాధపడ్డాడు.

"రావణుడు నిన్ను అపహరించి తీసుకొని పోయేటప్పుడు వానరుల్ని చూసి నీవు నగలమూటను పడేశావు కదా! అవి సుగ్రీవుడి వద్దే ఉన్నాయి. అవి తెచ్చి రాముడికి చూపించారు. కానీ వాడు నిన్ను ఎక్కడికి తీసికొని వెళ్ళాడో తెలియకపోవడం చేత దారి చెప్పలేకపోయారు.

"నగలమూటను రామునికి నేనే చూపాను. వాటిని చూడగానే రాముడు మూర్ఛిల్లాడు. ఆ నగల్ని ఒడిలో పెట్టుకొని రాముడు చాలాసేపు దుఃఖించాడు. నేలపై పడి రోదించాడు. నేను ఏవో ఏవో మాటలు చెప్పి రాముణ్ణి లేపి కూర్చోబెట్టాను.

"అమ్మా! సదా నిన్నే తలచుకుంటూ రాముడు అగ్నిపర్వతంలా ఉన్నాడనుకో. అసలు నిద్రే లేదు రామునికి. భూకంపము పర్వతాన్ని కుదిపేసినట్లు, నీవు లేవనే బాధ రాముణ్ణి క్రుంగదీస్తూ ఉంది.

"సుందరమైన దృశ్యాలు కూడా రాముణ్ణి సంతోషపెట్టలేక పోతున్నాయి. అమ్మా! రాముడు త్వరగా నిన్ను స్వీకరిస్తాడు. ఈ పదిబుర్రల పాపిని తగలేస్తాడు. దాంట్లో సందేహం వద్దు.

"రామసుగ్రీవులు మిత్రులైనపుడు, వాళ్ళిద్దరు కలబోసుకుని ఒక శపథం చేసుకున్నారు. రాముడు వాలిని చంపాలి. సుగ్రీవుడు సీతమ్మ ఎక్కడుందో అన్వేషించాలి. అదీ షరతు వాళ్ళ చెలిమిలో.

"ఆ తరువాత, రాముడు వాలిని కూల్చేశాడు. సుగ్రీవుణ్ణి రాజును చేశాడు. రాముడు చెప్పినట్లు చేశాడు. ఇక సుగ్రీవుడు చేయాలికదా! అదే, మేమంతా వెదకడం.

రామ సుగ్రీవయో రైక్యం దేవ్యేవం సమజాయత
హనుమన్తం చ మాం విద్ధి తయో ర్దూత మిహాగతమ్

"అమ్మా! సీతాదేవీ! రామసుగ్రీవుల మధ్య స్నేహం ఇలా ఏర్పడింది. హనుమంతుణ్ణి నేను. వారిద్దరూ పంపగా వచ్చాను దూతనై." అన్నాడు హనుమంతుడు. నరులకు, వానరులకు

ఎలా సఖ్యం కుదిరింది? అని అడిగిన సీతమ్మ ప్రశ్నకు ఈవిధంగా సమాధానం చెప్పాడు ఆంజనేయుడు.

"తల్లీ! సుగ్రీవుని ఆజ్ఞచే మేమందరమూ నిన్ను వెదకడం ప్రారంభించాము. ఒకొక్క దిక్కునకు వేలాదిమంది వానరులు వెళ్ళారు. వాలిపుత్రుడైన అంగదుని నాయకత్వంలో మేమంతా దక్షిణదిక్కుగా బయలుదేరాము.

"నువ్వేమో కన్పించకపోతివి! ఇక ప్రాయోపవేశం చేయాలని నిర్ణయించుకున్నాం. అక్కడ మాకు జటాయువు సోదరుడు సంపాతి అనే గృధ్రరాజు కనిపించాడు. తమ్ముడైన జటాయువు మరణించిన విషయం మా ద్వారా విని చాలా ఏడ్చాడు.

"నీవు లంకలో ఉన్నట్లు మాకు సంపాతి చెప్పాడు. మేము సంతోషించి బయలుదేరాము. నిన్ను చూడాలనే ఆసక్తితో సముద్రతీరం చేరాము. అమ్మో! ఆ సముద్రాన్ని చూడగానే అందరూ భయపడి కూలబడ్డారు.

"నేను లేచాను. ముందుగా వాళ్ళ భయాన్ని తొక్కేసి, వెంటనే జమాయించి ఎగిరేశాను ఆకాశంలో. సాగరాన్ని దాటి లంకలో దూకేశాను.

"అందరూ నిద్రపోయేటప్పుడు లోపలికి వచ్చేశాను. ఏడిపించే రావణుణ్ణి చూశాను. ఏడుస్తున్న నిన్ను చూశాను. తల్లీ! నువ్వు ఏ దోషమూ తెలియని తల్లివి. నేను రామదూతను. ఉన్నదున్నట్లు చెప్పాను. నన్ను నమ్ము. అనుగ్రహించు తల్లీ!

"రాముడు క్షేమంగా ఉన్నాడు. లక్ష్మణుడు కూడా క్షేమంగానే ఉన్నాడు. సుగ్రీవుని ఆజ్ఞచే నిన్ను అన్వేషిస్తూ ఈ దిక్కుగా వచ్చాను నేను. అమ్మా! నేను కోరిన రూపం ధరించగలను.

"నా అదృష్టంకొద్దీ నిన్ను చూడగలిగాను. నేను వెళ్ళి, నిన్ను చూశానని చెప్తే, వానరుల దుఃఖం కూడా పోతుంది. అమ్మా! నా భాగ్యమే భాగ్యము. నిన్ను చూశానన్న కీర్తి నాకు దక్కింది.

"తల్లీ! మాల్యవంతం అనే పర్వత మొకటుంది. అది పర్వతా లన్నిటిలోకి గొప్పది. అక్కడనుండి కేసరి అనే వానరుడు గోకర్ణపర్వతానికి వెళ్ళాడు. నేను ఆ కేసరి కుమారుణ్ణి.

"సముద్రతీరాన శంబసాదనుడనే రాక్షసుడు ఉండేవాడు. దేవతలు, ఋషులు కోరితే మా నాన్న ఆ రాక్షసుని వధించాడు. నేను ఆ కేసరి భార్యకు వాయుదేవుని అనుగ్రహంచే జన్మించాను.

"చిన్నప్పుడు నేనొక పని చేశాలే. అందువల్ల నాకు హనుమంతుడు అనే పేరు ప్రసిద్ధమైంది. అమ్మా! నువ్వు నన్ను అనుమానించ కూడదని, రాముని గుణవైభవాన్ని, రాముని చరితమును వర్ణించాను. అనతికాలంలోనే రాముడు నిన్ను గ్రహిస్తాడు." అని పలికాడు వాయుపుత్రుడు.

దుఃఖంతో క్రుంగిపోతున్న సీతమ్మ హనుమంతుని మాటల్లోని ఋజుత్వాన్ని విశ్వసించింది. సహేతుకంగా ఉండడం చేత హనుమంతుని మాటల్లో దోషం లేదని గ్రహించింది. ఆంజనేయుడు రామదూతయే అని నమ్మింది.

సీతమ్మ చాలాకాలానికి సంతోష ఛాయల్ని చూడగలిగింది. అతిశయించిన ఆనందంతో ఉక్కిరిబిక్కిరియై ఆనందబాష్పాలు రాల్చింది. రాహువు విడిచిన చంద్రునిలా శోభించింది.

"తల్లీ! అంతా నీకు చెప్పాను కదా! ఏడవకు. నీ కొరకు నన్ను ఏమి చెయ్యమంటావో చెప్పు. నేను తిరిగి వెళ్ళిపోతాను" అన్నాడు వాయునందనుడు.

ముద్దుటుంగరము - ముక్తి సాధకము

సీతమ్మ మారు పలకలేదు. తనను వైదేహి పూర్తిగా నమ్మడం లేదేమో అనే సందేహ మొచ్చింది హనుమంతునికి. ఆమెకు విశ్వాసాన్ని పూర్ణంగా కల్పించాలని భావించి మళ్ళీ ఇలా పలికాడు.

వానరోఽహం మహాభాగే దూతో రామస్య ధీమతః
రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగులీయకమ్ (1)
ప్రత్యయార్థం తవానీతం తేన దత్తం మహాత్మనా
సమాశ్వసిహి భద్రం తే క్షీణ దుఃఖ ఫలాహ్యసి ॥ (2)

మహాభాగే=గొప్ప భాగ్యవంతురాలా!, అహం=నేను, ధీమతః=బుద్ధిమంతుడైన, రామస్య=రాముని యొక్క, దూతః=దూతను, వానరః=వానరుడను. దేవి=ఓ సీతాదేవీ! రామనామాంకితమ్=రామనామము చెక్కిన, ఇదమ్=ఈ, అంగులీయకం చ=ఉంగరమును కూడా, పశ్య=చూడు.

భావము :- 1. గొప్ప భాగ్యము గల ఓ తల్లీ! నేను బుద్ధిమంతుడైన రాముని దూతను. వానరుణ్ణి. రాముని పేరుగల ఈ ముద్రికను చూడు.

మహాత్మనా=మహాత్ముడైన, తేన=ఆ రామునిచే, దత్తమ్=ఇవ్వబడినది, తవ=నీయొక్క, ప్రత్యయార్థమ్=నమ్మకము కొరకు, ఆనీతమ్=కొనిరాబడినది, సమాశ్వసిహి=ఆశ్వాసము పొందుము, తే=నీకు, భద్రమ్=శుభమస్తు, క్షీణ దుఃఖఫలా=నశించే దుఃఖముతో ఉన్నదానవు, అసి హి=ఐతివి కదా!

భావము :- 2. ఈ ఉంగరము మహాత్ముడైన రాముడు ఇచ్చింది. నీకు నమ్మకము కలుగుట కొరకు తీసుకొని వచ్చాను. స్వాంతనము పొందు. నీకు శుభం కలుగుగాక! నీ దుఃఖఫలము అదృశ్యమయ్యే సమయము ప్రాప్తించింది.

Meaning :- I am a monkey and a messenger of the wise Sri Rama, O highly blessed One! Also behold, O Godlike Lady, this ring marked with the name of Sri Rama handed over by that exalted Soul and brought to gain your confidence. Be reassured, may good betide you. The fruit which you have been reaping in the form of suffering has certainly come to an end.

ఈ రెండు శ్లోకాలు సుందరకాండము 36వ సర్గ ప్రారంభంలో 2,3 వరుసససంఖ్యాలలో ఉన్న అమూల్య రత్నాలు. నిత్యపారాయణానికి దివ్యమైన శ్లోకాలు. అందుచేత దోషరహితంగా చెప్పుకోడానికి ప్రతిపదార్థం కూడా ఇచ్చాను. భావస్ఫూర్తితో ఈ రెండు శ్లోకాలను నిత్యము పఠించమని మనవి చేస్తున్నా.

సీతమ్మ మొదట హనుమంతుని నమ్మలేదు. రావణుడని భావించింది. తరువాత రాముని రూప గుణ సౌందర్యాలను వర్ణించాడు హనుమ. అప్పుడు పూర్ణంగా నమ్మింది.

తనను సీతమ్మ పూర్ణంగా విశ్వసించిన తరువాత హనుమంతుడు రామనామాంకితమైన అంగుళీయకమును ప్రదానము చేయడం వింతగానే తోస్తుంది. ఇది ముందే ఇచ్చుండాలి. నమ్మకము కొరకే తెచ్చినట్లు కూడా చెప్పాడు. ఆ మాటే వాస్తవమైతే ముందే ముద్రికను సీతమ్మకు ఇచ్చి ఉండాలి.*

అలా చేయకుండా, జానకి పూర్ణంగా విశ్వసించిన తరువాత రామనామము గల ముద్దుటుంగరాన్ని సీతమ్మకు ఇచ్చాడు. ఈ విషయాన్ని ఆధ్యాత్మికంగా అర్థం చేసుకోవాలి. హనుమంతుడు ఈ సందర్భమున పరమాత్మ ఆజ్ఞ చేత, పరమాత్మ కార్యాన్ని నిర్వర్తించడానికి అరుదెంచిన గురుదేవుడుగా భాసిస్తున్నాడు. ఈ కోణంలోనుండి విషయాన్ని అర్థం చేసుకోవాలి.

ప్రథమంగా హనుమంతుడు సీతమ్మకు రామకథను వినిపించాడు. కానీ అతడు రావణుడేమో అనే సందేహం కలిగింది సీతమ్మకు. అందుచేత హనుమంతుని విశ్వసించలేక రోదించింది. ఇది ప్రథమదశ శిష్యునికి.

గురువు శాస్త్రాన్ని అందిస్తాడు. శిష్యుడు ఆలకిస్తాడు. అయినా నమ్మడు. ఇతడు కపట గురువేమో అని భావిస్తాడు. అనేకమంది చేత మోసపోయి ఉంటాడు కనుక దయామయుడైన గురువును కూడా దగాకోరుగా భావిస్తాడు.

హనుమంతుడు "అమ్మా" అని పిలుస్తున్నా, సీతమ్మకు నమ్మకం కలగలేదు. రావణాసురుడు కూడా పంచవటిలో అలాగే ప్రవర్తించాడు. ఈ లంకలో అమ్మ అనే పదానికి అర్థం లేదు అనుకుంటుంది సీతమ్మ.

సద్గురువు జ్ఞానబోధ చేస్తూ మన జీవితంలో ప్రవేశించినా, గతంలో, తాయెత్తులు కట్టించుకొని, కుంకంపూజలు చేసి, దానాలిచ్చి, వ్రతాలు ఆచరించి, దగాకోర్లను చూసిన అంతఃకరణ అనుభవజ్ఞానం కల ఆచార్యుని తేలిగ్గా నమ్మలేదు. సీతమ్మ కూడా అందుకే హనుమంతుని విశ్వసించలేక పోయింది.

హనుమంతుడు రామకథ చెప్పినా సీతమ్మ విశ్వసించలేదు కనుక ఆ తరువాత రాముని గుణవైభవాన్ని, స్వరూపవైభవాన్ని హనుమ కీర్తించాడు. గురువు కూడా రెండవదశలో అంతర్భావాలను, నిజవైభవాన్ని తెలియచేస్తూ తాత్త్విక సందేశాన్ని అందిస్తాడు.

ఈ దశలో సీతమ్మ హనుమను విశ్వసించింది. ఉపనిషద్రహస్యాల్ని వివరించి శిష్యుని అంతఃకరణము లోని సంశయాల్ని గురువు తొలగిస్తాడు. అప్పుడు శిష్యుడు సీతమ్మ లాగా గురువును పూర్ణంగా విశ్వసిస్తాడు. ఇప్పుడు శిష్యుడు శ్రద్ధావంతు డయ్యాడు.

శాస్త్రస్య గురువాక్యస్య సత్యబుద్ధిః శ్రద్ధా!

"శాస్త్రవిషయము నందును, గురువచనము నందును సత్యబుద్ధిని కలిగి వుండుటయే శ్రద్ధ" అంటారు శ్రీశంకరాచార్యస్వామి.

* లేక, మరచిపోవడమనే తన ప్రత్యేకతను ఇక్కడ కూడా మారుతి ప్రదర్శించాడా?

శిష్యునికి శ్రద్ధ కుదిరింది. ఇప్పుడు గురువు మంత్రోపదేశం చేస్తాడు. అదియే రామనామాంకితమైన ముద్రిక. అంగుళీయకము.

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం శ్రద్ధ గలవానికి జ్ఞానము ప్రాప్తిస్తుంది అని భగవద్గీత. గురుదేవుని మీద, శాస్త్రవిషయము మీద విశ్వాసం కలగగానే జ్ఞానం లభిస్తుంది. అదియే రామనామము చెక్కబడియున్న ఉంగరము.

మనసును పరమాత్మ యందు లగ్నము చేయుటకే మంత్రము. నామము మనలను నామి యైన పరమాత్మ భావాలతో నింపుతుంది. అంగుళీయకము సీతమ్మకు రాముని దర్శింపచేసింది. నామము భక్తునికి నారాయణుని దర్శింపచేస్తుంది.

ముద్దుటుంగరములో రాముడు ముద్దుముద్దుగా కనిపిస్తున్నాడు జానకికి. ఉంగరము రాముడు కాదు. కానీ రాముడు ఉంగరంలో దర్శన మిస్తాడు. ఉంగరము ద్వారా తన ఉనికిని గుర్తు చేస్తాడు.

భక్తుడైన వానికి విగ్రహములో పరమాత్మ మంజులంగా గోచరిస్తాడు. విగ్రహము పరమాత్మ కాదు. కానీ పరమాత్మ విగ్రహంలో కూడా ఉన్నాడు. విగ్రహం ద్వారా నీలో విగ్రహాన్ని నిలిపి, ఆ తరువాత తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు.

"వానరోహం, దూతః" అని తనను గూర్చి చెప్పుకున్నాడు హనుమంతుడు."నేను వానరుణ్ణి, రామదూతను" అన్నాడే కాని తన పేరు చెప్పలేదు ఈ రెండు శ్లోకాల్లోనూ. రామ నామాంకిత ముద్రికను అందించే దశలో గురువు పేరు లేనివాడు. అందుకే హనుమంతుడు తన పేరు చెప్పలేదు. అనామధేయుడే ఆచార్యుడు. అన్ని రూపాలు తానే అయినవాడు. అన్ని నామాలు తానే అయినవాడు.

పేరు నాశించేవాడు గురువు కాలేడు. విలువ రామనామానికే గాని తనకు కాదు. అందువలన నేను రామదూతను అన్నాడు హనుమంతుడు. పైగా వానరుణ్ణి అని చెప్పుకున్నాడు.

వానరుడు అంటే కోతి అని భావించ నవసరం లేదు. వా-నరా! "నరుడేనా?" అమోఘమైన శాస్త్రవిషయాలను వివరించి గురువు బోధిస్తున్నా, ఇతడు సామాన్యమైన మానవుడే నేమో! నాలుగు పుస్తకాలు చదివి, రెండు మాటలు చెప్తున్నాడేమో అని అవగాహన లేనివారిచే శంకించబడి వానరుడుగా తెలుస్తుంటాడు.

రామనామమే రామనామాంకితమైన ముద్రిక. దానిని రాముడు ఇచ్చాడు అంటున్నాడు హనుమంతుడు. గురువు మనకు ఇచ్చే మంత్రము గురువు నుండి వచ్చింది కాదు. భగవంతుడు గురువు ద్వారా అనుగ్రహించింది. గురుహస్తమే గోవిందుని హస్తమని మనం భావించాలి. గురుదేవుని చల్లని చూపుల్లోనే పరమాత్మ అనుగ్రహం నిండి ఉంటుంది.

"భద్రం తే!" నీకు శుభము కలుగుతుంది అన్నాడు హనుమంతుడు. ప్రభుముద్రికను పొందిన వారికి శుభములు చేకూరుతాయి. నామము నాలకించు వారికి శుభం కలుగుతుంది. గురుదేవుని అమృతగళము నుండి మంత్రమును శ్రవణం చేసినవారికి శుభం కలుగుతుంది. ఇది కలగాలనే ముముక్షువులు సదా వాంఛిస్తూ ఉంటారు.

భద్రం కర్ణేభి శ్శృణుయామ దేవాః

"మేము సదా శుభమైన దానినే మా వీనులతో విందుము గాక!" అని ఉపనిషద్రుషులు అధ్యయనం చేసేవారు.

గురువు నుండి శుభాన్ని ఆలకించి, శుభఫలాన్ని పొందే శిష్యులు శుభచరితులు. కనుకనే హనుమంతుడు సీతమ్మను **మహాభాగే** గొప్ప భాగ్యము కలదానా! అని సంబోధించాడు. గురువును పొందిన శిష్యులే ఈ ప్రపంచంలో భాగ్యవంతులు.

చివరగా "నీ దుఃఖఫలము నశించే సమయము సమీపించింది" అన్నాడు హనుమంతుడు. గురుమంత్రము దుఃఖమును శాశ్వతముగా నశింపచేస్తుంది. అంతేకాదు. శాశ్వతమైన ఆనందమును ప్రసాదిస్తుంది. స్వరూపజ్ఞానమును కలిగించి తరింప చేస్తుంది.

అధిష్ఠానం సమస్తస్య జగతః సత్య చిద్ఘనమ్
అహమస్మీతి నిశ్చిత్య వీత శోకో భవే న్మునిః

"సమస్తమైన జగత్తునకు అధిష్ఠానమై, సత్యచిద్ఘనస్వరూపమైన పరబ్రహ్మము నేనై యున్నాను అని నిశ్చయజ్ఞానము కలిగిన మననశీలుడు దుఃఖము నుండి విడిపడు చున్నాడు" అని రుద్రహృదయోపనిషత్తు ప్రవచించింది. ఈ దుఃఖనాశము కలుగుతుందని రామనామాంకితమైన ముద్రిక నిస్తూ హనుమంతుడు సీతమ్మను ఊరడించాడు.

ఉంగరము రామునిదే గాని హనుమంతునిది కాదు. ఉంగరాన్ని అందుకొనేది కూడా సీతమ్మే గాని హనుమంతుడు కాదు. హనుమంతుడు సీతారాముల మధ్య కేవలం సంధానకర్త మాత్రమే.

అలాగే మంత్రము గాని, నామము గాని పరమాత్మదే గాని గురువుది కాదు. మంత్రాన్ని గ్రహించే భాగ్యవంతుడు శిష్యుడు. జీవబ్రహ్మల మధ్య సంధానకర్తగా గురువు వ్యవహరిస్తాడు.

రామకార్యమే గాని తాను ఏవిధమైన స్వార్థము ఎరుగడు హనుమంతుడు. పరమాత్మ కార్యమే గాని తనదంటూ, తనకంటూ ఏదీ లేనివాడు గురుదేవుడు.

దివ్య దర్శనానుభూతి

గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్
భర్తార మివ సంప్రాప్తా జానకీ ముదితా భవత్

"సీతమ్మ భర్తయొక్క చేతికి అలంకారమైన ఉంగరమును తీసికొని చూస్తూ భర్తను పొందినంత ఆనందాన్ని పొందింది."

హనుమ ఇచ్చిన ఉంగరాన్ని తీసుకున్నది సీతమ్మ. దానిని చూస్తూ రాముణ్ణే చూసినట్లు ఆనందాన్ని పొందింది. గురువు నుండి మంత్రాన్ని గ్రహించిన శిష్యుడు మంత్రాన్ని సాక్షాత్తు భగవత్స్వరూపంగా దర్శించాలి.

విగ్రహము రూపము. మంత్రము శబ్దము. శబ్దరూపాలలో భగవచ్చైతన్యాన్ని దర్శించడానికి సాధకుడు ప్రయత్నించాలి. భగవంతుని రూపాన్ని చూసినా, లేదా శబ్దాన్ని విన్నా సాక్షాత్తు భగవంతునే దర్శించినట్లు అనుభూతిని పొందాలి. భావస్ఫూర్తి లేనివారికి దైవదీప్తి కలుగదు.

ఉంగరాన్ని ఇక్కడ **కరవిభూషణమ్** అనే పదంతో చెప్పడంలో మహర్షి ఏదో తన హృదయంతో మాట్లాడుతున్నాడు. ఉంగరము కరవిభూషణము. అంటే చేతికి అలంకారము.

చేయి పనిచేయుటకు ఉపయోగిస్తుంది. చేతులతో మనము ఎన్నో కార్యాలు చేసి వుంటాము. ఎంతో ధనాన్ని సంపాదించి ఉంటాము. ఎన్నో గౌరవాలు అందుకొని ఉంటాము. ఎన్నిటినో పట్టుకొని ఉంటాము.

ఎన్ని చేసినా మనసులో వెలితి తొలగిందీ కాదు. బ్రతుకులో వెలుగు వచ్చిందీ లేదు. ఇప్పుడు చేతికి అలంకారము వచ్చింది. ఇక మనం చేయవలసిన పని ఏదో తెలిసింది. గురువు ఇచ్చిన మంత్రాన్ని సదా మననం చేయడమే. లభించిన నామాన్ని వదలకుండా స్మరించడమే. ఈ కార్యమే మనము ఇక ఆచరించ వలసింది. ఈ అభిప్రాయంతోనే వాల్మీకి అంగుళీయకమును కరవిభూషణంగా వర్ణించారు.

రామునికి దూరమైన సీతమ్మ ఎంతగానో దుఃఖించింది. రామవిరహంలో క్రుంగిపోతోంది. బంగారులేడిని వాంఛించి, రాముని ప్రయత్నించి దూరం చేసుకుంది. ఈరోజు పరితపిస్తూ దుఃఖిస్తోంది.

రాముని కొరకు సీతమ్మ పరితపిస్తూ ఉంది. కనుకనే రాముడు ముద్రికను పంపాడు. పరమాత్మకు దూరులమై దుఃఖించే మనం కూడా పరమాత్మ కొరకు పరితపించగనే భగవంతుడు గురువు ద్వారా మంత్రాన్ని అనుగ్రహించి మనల్ని ఆనందింప చేస్తాడు.

పసిడిలేడిని వాంఛించి పరమాత్మను దూరం చేసుకుంది సీతమ్మ. ప్రాపంచిక విషయ భోగాలను వాంఛించి మనం కూడా పరమాత్మను దూరం చేసుకుంటాం. సీతమ్మ ముద్రికను పొంది సంతోషించినట్లు మనం కూడా నామాన్ని పొంది ఆనందించాలి.

తతః సా హ్రీమతీ బాలా భర్తృ సందేశ హర్షితా
పరితుష్టా ప్రియం కృత్వా ప్రశశంస మహాకపిమ్

“భర్త యైన రాముని నుండి హనుమంతుడు తెచ్చిన వార్తను బాల యైన సీతమ్మ అందుకుంది. కాస్త సిగ్గుపడింది. చాలా ఆనందించింది. ప్రియమైన పలుకుతో హనుమంతుని ప్రశంసించింది.” అంటున్నాడు వాల్మీకి.

హనుమంతుని నుండి రాముని వార్తను అందుకొనిన సీతమ్మను ‘బాల’ అని వాల్మీకి చెప్పడం గొప్ప విశేషం. ఒక్క సీతమ్మే కాదు. గురువు వద్ద మంత్రాన్ని గ్రహించాలని భావించే వారంతా బాలలై ఉండాలి. అప్పుడే అర్హు లవుతారు.

బాలలకు ఈర్ష్య లుండవు. అసూయ లుండవు. అభిమాన అహంకారా లుండవు. నిర్మలహృదయులై ఉంటారు. నిష్కాపట్యంతో మెలుగుతారు. అలాంటివారే గురుమంత్రాన్ని గ్రహించుటకు అర్హు లవుతున్నారని శిష్యుని యొక్క అధికారి లక్షణాన్ని “బాల” అనే పదం ద్వారా వాల్మీకి సూచిస్తున్నాడు.

రామనామాంకిత ముద్రికను అందుకోగానే సీతమ్మ సిగ్గుపడింది **(హ్రీమతీ)** అంటున్నాడు వాల్మీకి. హనుమ ప్రదానము చేసిన ఆ ఉంగరాన్ని చూడగానే సీతమ్మ ఎందుకు సిగ్గుపడింది? సిగ్గుపడవలసిన అవసర మేముంది? ఇక్కడ వాల్మీకి హృదయాన్ని మనం వెతికి పట్టుకోవాలి. రామనామాంకిత ముద్రికను చూడగానే ఈ ఉంగరాన్ని రాముడు కరవిభూషణంగా ధరించి యుండిన రోజులలో జరిగిన సంఘటనలు మదిలో మెదిలుంటాయి. గిలిగింతలు పెట్టుంటాయి. లేకపోతే సిగ్గుపడవలసిన అవసరమే లేదు.

1. “చాలు. ఇక తినలేను” అని భోజనం వడ్డిస్తున్న సీతమ్మను చెయ్యి ముందుకు చాచి రాముడు వారించినపుడు, ఈ ఉంగరమే ముందు కనిపించేది. ఆ ముద్రిక యందలి మణిలో ఒకొక్కసారి సీతమ్మ ప్రతిబింబం కూడా కనిపించేది. ముద్రికలోని తన ప్రతిరూపాన్ని చూసుకొని సీతమ్మ పరవశించి పోయేది. నేను రామునికి దూరంగా లేను అని భావించుకొని ఆనందించేది. ఈనాడు అదే ఉంగరాన్ని చూస్తోంది. రాముని చూస్తూ, “రుచిగా ఉందికదా! ఇంక కొద్దిగా తినండి” అని సీతమ్మ పలికిన పలుకులు గుర్తుకు వచ్చి ఉంటాయి.

2. “సీతా! ఇలా రా!” అని ఏదో రహస్యం చెప్పడానికి రాముడు చెయ్యి చాచి, వ్రేళ్ళు కదిలిస్తూ పిలిచినపుడు, వ్రేలికున్న ఈ ఉంగరమే కనిపించేది. రాముడు తనకు దగ్గరగా రమ్మని పిలిచినప్పుడంతా ఈ ఉంగరమే కనిపించేది. రాముడు ఏమి చెప్పేవాడో, సీతమ్మ తల్లి ఏమి విన్నదో అవన్నీ గుర్తు వచ్చి ఉంటాయి. సిగ్గేసి ఉంటుంది.

ఆనాడు రాముడు దగ్గరికి రమ్మని పిలిచినప్పుడల్లా ముందుగా ఈ ఉంగరమే కనిపించేది. ఇప్పుడు కూడా ముందుగా ముద్రికే కన్పించింది. రాముడికి నన్ను దగ్గర చేయడానికే వచ్చిందేమో! అనే భావన సీతమ్మ మదిలో మెదిలుంటుంది. సిగ్గు దొరలి వచ్చుంటుంది.

3. “నా కొరకు నా మిత్రులు నిరీక్షిస్తున్నారు. నాకిప్పుడు సమయం లేదు నీ మాటలు వినడానికి. మళ్ళీ పిలుస్తాలే. వెళ్ళు” అని రాముడు సీతమ్మతో పలికిన వేళల్లో, “వెళ్ళు” అని చేత్తో సంజ్ఞ చేసినపుడు, కరవిభూషణమైన ఈ ఉంగరము కనిపించేది.

“ఏమే! ముద్రికా! రాముని కరాన్ని అలంకరించి, నన్ను “వెళ్ళు-వెళ్ళు” అనేదానివి కదా! ఇప్పుడు నా చేతికి చిక్కావు. ఇప్పుడేమంటావు? రాముడంటే నీకు చాలా ఇష్టంకదూ! నన్ను కూడా దూరంగా పంపేసి నీవే ఉండేదానివి కదూ! మరి ఇప్పుడు రాముడికి దూరమై నాలాగే ఎలా ఉండగలుగుతున్నావు? మరి రాముడి వద్దకు వెళ్దామా! చెప్పు. రాముడు ఎక్కడున్నాడో చెప్పు. నీకు తెలిసి ఉంటుంది. నువ్వు అక్కడ్నుంచే వచ్చావు కదా!

“ముద్దుటుంగరమా! నీవెంత మంచిదానివే! నేనే నిన్ను అర్థం చేసుకోలేక పోయాను. ఆనాడు “వెళ్ళు-వెళ్ళు” అంటూ నన్ను కొన్ని క్షణాలు దూరం చేసి ఆనందించేదానివి. పాపం! ఈరోజు నేను రామునికి నిజంగానే దూరమయ్యాను. ఆ వియోగాన్ని నీవుకూడా భరించలేక పోయావు. దూరమైన నన్ను రామునికి దగ్గరకు చేర్చాలని పరుగెత్తుకుంటూ వచ్చావా! సముద్రాన్ని దాటి వచ్చావా!” అని ముద్రికతో మాట్లాడుతూ సీతమ్మ సిగ్గుపడుతోంది.

4. రాముడు తన అమృతహస్తముతో సీతమ్మను ఎప్పుడు స్పృశించినా ముందు ఈ ముద్రిక స్పర్శ తగులుతూ ఉండేది. అది జ్ఞాపకమొచ్చి ఉంటుంది. సీతమ్మ సిగ్గుపడుతోంది.

5. సతీపతుల మధ్య ఎప్పుడైనా గిల్లికజ్జాలు వచ్చినపుడు కొన్ని నిముషాలు సీతారాములు పరస్పరం మాట్లాడుకోకుండా ఉండేవారు. కాని ఇద్దరూ ఉండలేకపోయేవారు. మళ్ళీ ఎలా కలిసిపోవాలో తెలిసేది కాదు. అప్పుడు రాముడు తన ఉంగరాన్ని తీసి నేలపై పడేసేవాడు బాగా కనిపించేలాగా. సీతమ్మ ఇదే అదననుకొని "ఇదిగోనండీ! మీ ఉంగరం ఇక్కడ పడిఉంది" అని ఇస్తే "అబ్బ! దొరికావా! వెతకలేక విసిగిపోయాను" అనేవాడు. ఎవరినో?

మళ్ళీ ఇద్దరూ ఆనందంగా మాట్లాడుకొనేవారు. "ముద్రికా! రాముడు నిన్ను పారేసుకుంటే నేను వెతికి ఇచ్చేదాన్ని కదా! ఈరోజు రాముడు నిన్ను కాదు. నన్ను పారేసుకుని అన్వేషిస్తున్నాడు. ప్రత్యుపకారబుద్ధితో నన్ను రామునికి అందించాలని వచ్చావా?" అని భావించి సీతమ్మ సిగ్గుపడుతోంది. ఆ తరువాత, రాముని ఆనవాలు లభించినందుకు సీతమ్మ సంతోషించింది **(సంతుష్టా).**

గురువు మంత్రమనే ముద్రికను శిష్యునకు ప్రసాదించినపుడు మొదట సిగ్గు పుడుతుంది. ఆ తరువాత ఆనందం కలుగుతుంది.

దివ్యమైన ఆధ్యాత్మికబాటను వదలి ఇంతకాలం దూరంగా ఉన్నానే అని సాధకునకు సిగ్గు పుడుతుంది. పోనీలే! ఈనాడైనా నాకు గురువు అనుగ్రహం లభించింది. మంత్రం ప్రాప్తించింది. ఇక హాయిగా మంత్రయోగినై జీవిస్తాను. నామయోగినై బ్రతుకుతాను అని ఆనందం కలుగుతుంది.

సీతమ్మ హనుమంతుని చూచి, "కపిశ్రేష్ఠా! నీవు గొప్ప పరాక్రమవంతుడివి. సమర్థుడివి. ప్రాజ్ఞుడివి. కాకపోతే, ఒంటరిగా ఈ రాక్షసుల మడుగులోకి ప్రవేశించగలవా? మొసళ్ళకు నిలయమైన నూరు యోజనములు దూరముగల ప్రదేశాన్ని గోష్పాదం లాగా దాటేశావు.

"వానరోత్తమా! నాకు భలే ఆశ్చర్యంగా ఉంది. రావణుడంటే నీకు భయమున్నట్లే లేదు. నీలో తడబాటు వెతికినా కనిపించడం లేదు. నీవు సామాన్యమైన వానరుడివి కావు.

"రాముడు పంపగా వచ్చినవాడవే. నీవు రామదూతవే. నీతో నిర్భయంగా మాట్లాడవచ్చు. నీ శక్తిసామర్థ్యాలు అంచనా వేయకుండా రాముడు పంపడు. అందులోనూ నావద్దకు అసలే పంపడు.

"రాముడు సత్యవ్రతుడు. ధర్మజ్ఞుడు. లక్ష్మణుడు గొప్ప తేజోవంతుడు. స్నేహపాత్రుడు. వాళ్ళిద్దరూ క్షేమంగా ఉన్నారు. అదంతా నా అదృష్టం. నాయనా! నాకు ఒక విషయం అర్థం కావడం లేదు. ఈ లంకను రాముడు ప్రళయాగ్ని లాగా దగ్ధం చేయలేదు ఎందుకని?" అన్నది సీతమ్మ.

రాముడు ఆర్తజనరక్షకుడు కదా! సాధుజనపోషకుడు కదా! శరణాగతవత్సలుడు కదా! అరణ్యంలో రాక్షసుల్ని వధించుట మానమని నేను చెప్పినపుడు, సాధువుల బాధల్ని నేను చూడలేను. వారిని రక్షించుట నా ధర్మం అని రాముడు పలికాడు కదా! మరి, నా విషయంలో ఆయన ఆర్తత్రాణ పరాయణత్వం ఏమైంది? ఎక్కడికి పోయింది? అది పరుల విషయం లోనే గాని స్వజనులకు వర్తించదా! మరి ఇంతకాలం నన్ను రక్షించకుండా, రావణుని శిక్షించకుండా ఎందుకున్నట్లు అనే నిష్ఠూరము సీతమ్మ మాటల్లో దాగివుంది.

సాధారణంగా మనం ఈరోజుల్లో కూడా తల్లుల నోటిగుండా ఇలాంటి మాటలు వింటూ ఉంటాం. తాము చెప్పింది భర్త తీసికొని రానపుడు, "ఆ(.... ఆయనికి ఇంటి విషయం పట్టుతుందా! బయటవాళ్ళు బాగుంటే చాలు. ఇంట్లోవాళ్ళు ఏమైపోయినా ఫరవాలేదు" అని నిష్ఠూరంగా మాట్లాడుతుంటారు.

"నాయనా! రామలక్ష్మణుల శక్తియుక్తులు నాకు తెలియనివి కావు. నన్ను వారు రక్షించడం లేదంటే అది వారి తప్పు కాదు. నేను ఇలా దుఃఖాన్ని ఆరగిస్తూ పడి ఉండాలని నా నొసట రాసి వుంది. అంతే.

"రాముడు మనసులో దుఃఖించడం లేదు కదా! *దైన్యంతో లేడు కదూ! హనుమా! నేను దూరంగా ఉన్నాను కదా! రాముడికి నామీద ప్రేమ తగ్గలేదు కదా! నన్ను ఈ బాధా సుడిగుండం నుండి ఉద్ధరిస్తాడా? అయోధ్యలో కౌసల్య, సుమిత్ర, భరతుడు క్షేమంగా ఉన్నట్లు వార్తలేమైనా తెలిశాయా! రాముడు లంకకు వస్తే, భరతుడు అయోధ్య నుండి కూడా సైన్యాన్ని పంపుతాడా! వానరాధిపతి సుగ్రీవుడు కూడా వస్తాడు కదా! లక్ష్మణుడు కూడా ఉంటాడు. అందరూ కలిసి దుష్టుడైన ఈ రావణుణ్ణి చంపేస్తారులే. నేను తొందరలోనే చూస్తాను వీడి శవాన్ని.

న చాస్య మాతా న పితా చ నాన్యః
స్నేహా ద్విశిష్టోఽస్తి మయా సమో వా

"రాముని ప్రేమించుటలో తల్లి గాని, తండ్రి గాని, బంధువులు గాని నాతో సమానులు కారు." అన్నది సీతమ్మతల్లి.

మనమందరమూ కూడా అలాగే భావించాలి. అందరికంటె నేను భగవంతుని ఎక్కువగా ప్రేమిస్తాను. ఎక్కువగా భక్తి చేస్తాను. అసమాన భక్తిప్రపత్తులతో చరిస్తాను అని సీతమ్మ లాగా భావించాలి.

"తల్లీ! నీవు ఇలా బాధపడుతున్నట్లు రాముడికి తెలియదు. నేను వెళ్ళి చెప్పగానే రాముడు పెద్ద సైన్యంతో బయలుదేరి వస్తాడు. రాముడికి అడ్డు నిలిచే వారుండరు. అమ్మా! నీవు లేవనే దుఃఖంతో రాముడు కృంగిపోతున్నాడు.

"ఓ సీతాదేవీ! మేము పర్వతాల మీద చరిస్తూ వుంటాము. కందమూలాలు తిని బ్రతుకుతూ ఉంటాము. పర్వతాల మీద, కందమూలాల మీద ఒట్టుపెట్టి చెబుతున్నా. నువ్వు తొందరలోనే రాముణ్ణి చూస్తావు.

"అమ్మా! నువ్వు లేవనే బాధతో రాముడు మాంసం తినడంలేదు. మద్యము సేవించుట లేదు. కందమూలాలే తింటున్నాడు. దేహం మీద ఈగలు వ్రాలినా, దోమలు కుట్టినా పట్టించుకోవడం లేదు. నిన్ను తప్ప అన్యమైన విషయాలను ఆలోచించడం లేదు.

"నిద్రపోవడమే లేదు. కొద్దిగా నిద్రపడితే చాలు. "సీతా-సీతా" అంటూ కలవరిస్తాడు. మేల్కొంటాడు. మళ్ళీ దుఃఖం మామూలే;" అన్నాడు హనుమంతుడు.

సా రామ సంకీర్తన వీతశోకా
రామస్య శోకేన సమాన శోకా
శరన్ముఖే సాంబు దశేష చన్ద్రా
నిశేవ వైదేహ సుతా బభూవ ॥

*చైతన్య రామాయణము, ద్వితీయభాగము, పుట-65

రాముడు తన కొరకు బాధపడుతున్నాడని తెలిసి సీతమ్మ కూడా రామునితో సమానమైన దుఃఖాన్ని అనుభవించింది. కానీ హనుమంతుడు చేసిన రామగుణానుకీర్తనము వలన కొంత శోకము ఉపశమించింది. ఒకేకాలంలో సుఖదుఃఖాలు ఆమెను కుదిపేస్తూ వుంటే, శరత్కాల ఆరంభము నందు కొద్దికొద్దిగ మేఘాలు గల వెన్నెలరాత్రిలా ప్రకాశించింది సీతమ్మ.

రాముడు మద్యము త్రాగడం లేదని హనుమంతుడు చెప్పిన విషయాన్ని సాగదీసి సాగదీసి నరాలు త్రెంచుకోనవసరం లేదు. రాముడు మద్యం త్రాగుతాడని హనుమంతునికి తెలీదు. రాముడు సేవించడం హనుమంతుడు చూడనూ లేదు.

సుగ్రీవుడు త్రాగుతాడు. వాలి త్రాగేవాడు. రాజులు మద్యము సేవిస్తారు అనేది హనుమంతుని ఊహ. రామునిలో అది ఎప్పుడైతే కనిపించలేదో, సీతావియోగం వల్లనే రాముడు సేవించడం మానేసి ఉంటాడని భావించి హనుమంతుడు ప్రస్తావించాడు. అంతే.

మాతను తరలించే ప్రయత్నంలో మారుతి

జీవితం పడుగుపేకలనే సుఖదుఃఖాలతో నేసిన వస్త్రం. జీవితంలో ఎప్పుడూ సుఖమే ఉంటుందని చెప్పలేము. అలాగని దుఃఖమే ఉంటుందని కూడా చెప్పలేము. సుఖదుఃఖాల సమ్మేళనమే జీవితం. త్రాసులోని సిబ్బిల్లాగా ఎప్పుడు ఏది క్రింద ఉంటుందో ఏది పైన ఉంటుందో తెలియదు. కావడికుండల్లాగా నిండేదెప్పుడో, ఖాళీ అయ్యేదెప్పుడో కూడా తెలియదు. అదే జీవితమంటే.

రాముడు సీతమ్మను మరచిపోలేదని, ఆమెనే స్మరిస్తున్నాడని హనుమంతుడు చెప్పినపుడు సీతమ్మకు చాలా ఆనందం కలిగింది. కానీ దుర్భరమైన దుఃఖంతో కుమిలిపోతున్నాడు అని చెప్పినపుడు తీవ్ర ఆవేదన కలిగింది. ఇంతకీ, ఇలా మాట్లాడుతున్న ఆంజనేయుడు తనను సంతోష పెడుతున్నాడో, బాధపెడుతున్నాడో కూడా సీతమ్మకు అర్థంకాలేదు. హనుమనే అడిగింది సీతమ్మ.

అమృతం విష సంసృష్టం త్వయా వానర భాషితమ్
యచ్చ నాన్యమనా రామో యచ్చ శోక పరాయణః

"నాయనా! రాముడు నన్నే తలుచుకుంటున్నాడని చెప్పావు. తీవ్రంగా దుఃఖిస్తున్నాడనీ చెప్పావు. ఏమిటో! నీ మాటలు విషము కలిపిన అమృతంలా ఉన్నాయి.

"సుఖదుఃఖాల్లో మానవుడు స్వేచ్ఛాజీవి కాడు. పాశబద్ధుల్ని చేసి ఈడ్చుకొని పోతుంది విధి. విధిని దాటడం ఎవరికీ శక్యం కాదు. నేను, రాముడు, లక్ష్మణుడు, ఎలాంటి కష్టాల్లో చిక్కుకొని పోయామో చూడు.

"నడిసముద్రంలో నావ మునిగిపోగా తీరాన్ని చేరేందుకు ఈది ఈది అలసిపోతున్న వానిలాగా ఉన్నాడు రాముడు. నాయనా! రామునికి దూరమై సంవత్సరకాలము పూర్తి కాక ముందే నన్ను రక్షించాలని రామునితో చెప్పు. ఆ తరువాత నేను ఉండను.

"విభీషణుడు రావణుని తమ్ముడు. మంచివాడు. అతని పెద్దకూతురు నల. నన్ను రామునికి అప్పగించమని విభీషణుడు ఎంత చెప్పినా రావణుడు వినలేదట. ఈ విషయం తన తల్లి చెప్పమన్నదని నల నాతో చెప్పింది.

దుష్టుడైన రావణుడు ఎవరి మాటా వినడు. వాడికి వచ్చుచెప్పే శక్తి మృత్యువుకే ఉంది.

"లక్ష్మణుని సహాయం కూడా లేకుండా జనస్థానంలో రాముడు పద్నాలుగు వేలమంది రాక్షసుల్ని వధించాడు. రావణుడికి కూడా అదే గతి రాసిపెట్టుంది.

శరజాలాంశుమాన్ శూరః కపే రామ దివాకరః
శత్రు రక్షోమయం తోయ ముపశోషం నయిష్యతి ॥

"హనుమా! సూర్యుడు కిరణాలనే శరాలతో నీళ్ళను ఇంకించునట్లు వీరుడైన రాముడు తన బాణాలతో శత్రువులైన రాక్షసుల్ని ఎండగట్టేస్తాడు." అంటూ కళ్ళల్లో నీళ్ళు నిలవగా మాట్లాడలేక ఉండిపోయింది సీతమ్మ.

"అమ్మా! దుఃఖించకు. నిన్ను ఇప్పుడే శోకవిముక్తురాలిని చేస్తాను. నిర్దోషీ! నీ బిడ్డడైన హనుమ వీపుమీద ఎక్కు. ఇప్పుడే నిన్ను రాముని వద్దకు చేర్చుతాను.

"నిన్ను వీపున కూర్చోబెట్టుకొని సునాయాసంగా నేను సముద్రం దాటుతాను. తల్లీ! సంశయించకు. రావణునితో కలిపి ఈ లంకనంతా మోసే శక్తి కూడా నాకుంది.

"హోమంలో వేసిన హోమద్రవ్యాన్ని అగ్నిదేవుడు దేవేంద్రునకు అందించునట్లు నిన్ను నేను ప్రస్రవణ పర్వతము మీద వున్న రామునికి అప్పగిస్తాను. ఈ లంకలోని వారు నావెంట పరుగిడలేరు.

"తల్లీ! నేను ఇక్కడికి ఎలాగైతే వచ్చానో, నిన్ను వీపుపై ఎక్కించుకొని అదే వేగంతో వెళ్తాను. ఈ విషయంలో సందేహాన్ని విడిచిపెట్టేయి;" అన్నాడు హనుమంతుడు. హనుమంతునితో సీతమ్మ ఇలా పలికింది.

"హనుమా! ఇంత దూరము సముద్రము మీద నన్ను మోసుకొని ఎగరాలని ఎలా భావిస్తున్నావు?

తదేవ ఖలు తే మన్యే కపిత్వం హరి యూథపా!

"వానర సేనానాయకా! నువ్వు వానరుడ వనిపించుకున్నావు.

"ఇంత చిన్న శరీరంతో నన్ను మోసుకొని రాముని దగ్గరకు పోవడమా! అదీ సముద్రం మీద ఆకాశంలో." అన్నది సీతమ్మ.

ఆ మాటలు విన్న హనుమంతుడు తనకు క్రొత్త అవమానం జరిగినట్లు భావించాడు. తన బల మేమిటో తెలియక సీతమ్మ అలా భావిస్తూ, ఏదో ఏదో మాట్లాడేస్తోంది. తన శక్తిని ఆమెకు చూపడమే మంచిదని భావించాడు.

హనుమంతుడు చెట్టుపై నుండి క్రిందికి దుమికాడు. సీతమ్మకు విశ్వాసాన్ని కల్గించడానికి పెరగడం ప్రారంభించాడు. సీతమ్మ చూస్తూనే వుంది. ఈలోగా అతడు మేరుపర్వత మంతగా పెరిగాడు. మందరపర్వత మంత అయ్యాడు. ప్రజ్వలించు అగ్ని ముద్దలా గోచరించాడు. అతని ముఖం బాగా ఎర్రబడి వుంది. కోరలు వజ్రాల్లా

మెరుస్తున్నాయి. గోళ్ళు భయంకరంగ ఉన్నాయి. పర్వతాకారుడై శోభిస్తున్న పవనసుతుడు సీతమ్మతో ఇలా భాషించాడు.

"తల్లీ! చూడు. నా స్వరూపాన్ని! పర్వతాలు, వనాలు, కోట బురుజులు, ప్రాకారాలు, మేడలు, రాజైన రావణునితో సహా ఈ లంకాపట్టణాన్నే మోసుకొని పోగలను.

"ఇక సంశయించకు తల్లీ! నాతోపాటే వచ్చి రాముని దర్శించు. దుఃఖాన్ని పోగొట్టుకో" అన్నాడు.

"ఓ కపిశ్రేష్ఠా! నీ ధైర్య మేమిటో, నీ బల మెలాంటిదో నాకు తెలిసింది. వాయుదేవుని వంటి వేగము గల నిన్ను ఎవ్వరూ అడ్డగించలేరు. నీ తేజస్సు అగ్ని లాంటిది అని నాకు అర్థమైంది.

"నాయనా! సామాన్యుడైతే సముద్రాన్ని దాటి ఈ లంకకు రాగలడా! నన్ను నీవు తీసికొని పోగలవు. ఆ విషయంలో నాకు సందేహం లేదు. కానీ రాముని కార్యము పాడుకాకుండా మనం ఆలోచించాలి.

"హనుమా! నేను నీతో రానడం సముచితమేనా! ఆలోచించు. నీవు వాయువేగంతో వెళ్తూ వుంటావు కదా! నాకు కంగారెత్తదూ! నీవు ఎత్తున ఆకాశంలో పోతూ ఉంటావు కదా! క్రిందనే భయంకరమైన సముద్రం ఉందికదా! కళ్ళుతిరిగి నేను సముద్రంలో పడిపోనూ!

"నువ్వు నన్ను తీసికొని పోతున్నావని రాక్షసులు వెళ్ళి రావణునికి చెప్పరూ! అప్పుడు ఆయుధాలు, శూలాలు ధరించి రాక్షసులు ఆకాశంలో నిలిచి నీతో పోరాడరూ! అప్పుడు నన్ను రక్షిస్తావా! వారితో యుద్ధం చేస్తావా! చెప్పు.

"హనుమా! ఒకవేళ, నువ్వు వాళ్ళ నెదిరించి యుద్ధం చేస్తావు. అంతవరకు బాగుంది. అదంతా చూసి, నేను భయపడి నీ వీపు మీదనుండి సముద్రంలో పడిపోతే! అప్పుడు రాక్షసులు నన్ను పట్టుకొచ్చి మళ్ళీ ఇదే చెట్టుక్రింద కూర్చోబెట్టరా!

"అప్పుడు రాక్షసులకి కోపం వచ్చి నన్ను చంపేస్తే! జయాపజయాలు ఎలా ఉంటాయో ఎవరికి తెలుసు? నన్ను రాక్షసులు చంపేస్తే నీవు వచ్చిన కార్యాన్ని ఏమి సాధించినట్లు?

"నీవు రాక్షసుల నందరినీ మట్టుపెట్టగలవు. అందులో సందేహం లేదు. మరి, వారి నందరినీ నీవే చంపేస్తే, రాముడు ఇక ఏమి చెయ్యాలి? రాముని వైభవానికి దానివల్ల భంగం వాటిల్లదా!

భర్తు ర్భక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర
న స్పృశామి శరీరం తు పుంసో వానర పుంగవ ॥

"వానరోత్తమా! పాతివ్రత్యధర్మాన్ని పురస్కరించుకొని నేను రాముణ్ణి తప్ప మరి ఏ పురుషుని కూడా ముట్టుకోను.

"నాయనా! రాముడే ఇక్కడికి వచ్చి, రావణుని వధించి, నన్ను ఇక్కడనుండి తీసికొని పోవడమే సముచితమని నా అభిప్రాయము. రాముని పరాక్రమాన్ని నేను విన్నదాన్ని కాదు. చూచినదానిని. దేవ, గంధర్వ, రాక్షస, నాగాదులు యుద్ధములో రాముని ఎదుట నిలువలేరు.

"నాయనా! నీవు వెళ్ళి రామలక్ష్మణులను వెంటపెట్టుకొని రా! త్వరగా వచ్చి నా దుఃఖాన్ని పోగొట్టు;" అన్నది సీతమ్మ.

సీతమ్మ మాటలను ఆలకించిన హనుమంతుడు చేతులు జోడించి నమస్కరిస్తూ సీతమ్మతో ఇలా పలికాడు.

"అమ్మా! సీతాదేవీ! మంచి విషయం చెప్పావు. మహోన్నతంగా పలికావు. పాతివ్రత్య ధర్మానికి మకుటాయమానంగా ఉన్నాయి నీ మాటలు. నా వీపుమీద ఎక్కి నూరు యోజనముల దూరము ఒక స్త్రీ ఆకాశంలో ప్రయాణం చేయడం తేలికైన పని కాదు. చాలా కష్టమైన పని.

"తల్లీ! రాముని తప్ప పరపురుషుని తాకను అని నువ్వు చెప్పిన రెండవ కారణము మహాత్ముడైన ఆ రాముని భార్యవగు నీకు చెల్లింది కాని మరొకరు అలా పలుకలేరు.

"జననీ! నేను చూసిందంతా రాముడితో చెప్తాను. నువ్వు చెప్పిందంతా చెప్తాను.

"అమ్మా! నీ పరిస్థితి చూసి నా మనసు కరిగిపోయింది. రాముని బాధను కూడా నేను చూచిఉండడం చేత, రామునికి మేలు చేయాలని సంకల్పించాను.

"లంక మహాపట్టణము. సులభంగా జయించేది కాదు. పైగా ఇక్కడికి రావడానికి మధ్యలో గొప్ప సముద్రముంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకున్నాను. అదియును గాక నిన్ను తీసికొని వెళ్ళే శక్తిసామర్థ్యములు కూడా నాకున్నాయి. ఈ కారణాల వల్ల నేను అలా పలికాను. తప్పయితే క్షమించు" అన్నాడు హనుమ.

సీతమ్మ పరపురుషుని తాకదు కనుక, రాముని కీర్తిపతాకం ఎగిరేలా రాముడే తనను తీసికొని పోవాలని అభిప్రాయపడడం వలన, హనుమ వీపుపై కూర్చుని వెళ్ళడానికి సీతమ్మ నిరాకరించింది.

అయితే ముందుగా సీతమ్మ వెలిబుచ్చిన అభిప్రాయాలు ఎన్నో ఉన్నాయి. కళ్ళు తిరిగితే ఎలా? జారిపడితే ఎట్లా? రాక్షసు లెదుర్కొంటే కష్టం గదా! అంటూ ఎన్నో ప్రశ్నలు వేసింది సీతమ్మ. అవన్నీ పరిశీలిస్తే ఏదో అనవసరంగా ప్రసంగించినట్లు ఉంటుంది. కానీ సూక్ష్మంగా పరిశీలిస్తే మాతృదేవి హృదయసౌందర్యం వెల్లడి అవుతుంది. ఆమెకు హనుమ చిన్నబిడ్డగా అనుతున్నట్లు ప్రతి వాక్యంలోనూ వెల్లడి అవుతుంది.

అమ్మ నుండి ఆనవాలు

"అమ్మా! నాతో కూడా రాముని వద్దకు రావడానికి నీకు ఇష్టము లేదుకదూ! పోనీ, రాముడికి చూపేందుకు ఆనవాలు ఏదైనా ఇస్తావా!" అని అడిగాడు హనుమంతుడు.

హనుమంతుని మాటలను విని సీతమ్మ ఒక్కక్షణం స్తంభించిపోయింది. మరికొన్ని క్షణాలు చలించిపోయింది. హనుమ రాముని వద్దకు వెళ్తున్నాడు. రాముని చూస్తాడు. రామునితో భాషిస్తాడు. హనుమది ఎంత అదృష్టమో! తనది ఎంత దురదృష్టమో!

సీతమ్మ కళ్ళు వర్షించడం ప్రారంభించాయి. ఎలాగో కుదుటపడి, కన్నీటితో కూర్చిన అక్షరాలతో మాటలను అల్లింది మెల్లగా. "హనుమా! మంచి ఆనవాలు చెప్తా, రాముడికి వినిపించు" అన్నది.

"మేము చిత్రకూటంలో ఉండే రోజుల్లో జరిగిన సంఘటన ఇది. మేము ఆ పర్వతం మీద ఉన్నాము. మందాకిని అక్కడికి చాలా దగ్గరలో ఉంది. నీళ్ళకి కొరత లేదు. కందమూల ఫలాలు పుష్కలంగా లభించేవి. రంగురంగుల పువ్వులు పరిమళాలను వెదజల్లుతుండేవి. అందమైన ఆ వనాల్లో తిరిగి, తిరిగి, అలసిపోయి రాముడు, నేను అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాం.

"ఇంతలో అక్కడికి ఒక కాకి వచ్చింది. అది నన్ను స్తనాలమీద ముట్టెతో పొడవడం ప్రారంభించింది. నేను మధ్యలో మట్టిబెడ్డలు విసిరి దానిని తరిమాను. అది అలా పోతుంది. మళ్ళీ వచ్చి పొడుస్తుంది.

"నాకు ఆ కాకిపై కోపం వచ్చింది. దాన్ని తరిమేందుకు నేను లేచాను. నా మొలనూలు వదులైంది. బట్ట కొద్దిగా జారింది. రాముడు అది చూసి నవ్వాడు. నాకు సిగ్గూ, కోపము రెండూ వచ్చాయి. నేను రామునికి దగ్గరగా వచ్చి కూర్చున్నాను. నన్ను రాముడు ఊరడించాడు.

"ఆ తరువాత అలసివున్న నేను రాముడి ఒడిలో పడుకొని నిద్రించాను. నేను నిద్రించి లేచిన తరువాత రాముడు నా ఒడిలో పడుకొని నిద్రించాడు.

"రాముడు నిద్రిస్తున్నాడు. ఆ కాకి మళ్ళీ వచ్చింది. మళ్ళీ ముట్టెతో మాంసం కోసం నా స్తనాల్ని పొడుస్తోంది. రక్తము కారింది. ఆ చుక్కలు రాముడిమీద పడ్డాయి. రాముడు లేచాడు. నా పరిస్థితిని చూచి ఇలా ప్రశ్నించాడు.

"సీతా! నీ స్తనముల్ని గాయపరచిం దెవరు? పడగ విప్పిన ఐదుతలల సర్పంతో ఆడుకోవాలని ముచ్చటపడే ఆ మందభాగ్యు డెవరు? అని పలుకుతూ ఎదురుగా వున్న ఆ దుష్ట కాకిని చూశాడు. దాని కాలిగోళ్ళు రక్తంతో తడిసి వున్నాయి.

"ఆ కాకి ఇంద్రుని కొడుకట. పర్వతాల్లో వసిస్తూ ఉంటాడట. వేగంలో వాయుదేవునితో సమానుడట. రాముడు క్రుద్ధుడయ్యాడు. అంతే. మేము కూర్చునియున్న దర్భాసనం నుండి ఒక దర్భ తీశాడు. దానిపై బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు. ఆ దర్భ ప్రళయాగ్నిలా ప్రజ్వలించింది. ఆ కాకి మీదికి దూకింది.

"మంత్రమయమైన ఆ దర్భ తరుముతూ ఉంటే కాకి దిక్కులు వెతుకుతూ పరుగెత్తింది. లోకాలన్నీ తిరిగింది. దర్భ వెంబడిస్తూనే ఉంది. ఇంద్రలోకం వెళ్ళింది. ఋషిగణాల్ని ఆశ్రయించింది. దేవతల్ని శరణు కోరింది. అందరూ తమవల్ల కాదని చెప్పారు. తిరిగి తిరిగి మళ్ళీవచ్చి రాముణ్ణే శరణు కోరింది.

"ఆ కాకి చంపదగినదే కదూ! అయినా, శరణాగతవత్సలుడైన రాముడు దానిని క్షమించి రక్షించాడు. మరి రాముడు ఆ దర్భను అభిమంత్రించాడు కదా! బ్రహ్మాస్త్రము వృథా పోవచ్చా! ఏమి చేయాలో చెప్పమని ఆ కాకినే అడిగాడు రాముడు.

"నా కుడికన్ను లొట్ట చెయ్యి" అన్నది ఆ కాకి. రాముడు విడిచిన ఆ దర్భ కాకి యొక్క కుడికన్ను పొడిచింది. ఈవిధంగా తన కుడికన్ను పోగొట్టుకొని ప్రాణాల్ని రక్షించుకుంది ఆ కాకి.

"రామునికి, దశరథునికి నమస్కరించి, రాముని వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయింది ఆ కాకి.

"హనుమా! ఈ వృత్తాంతము రాముడికి, నాకూ తప్ప మరెవ్వరికీ తెలియదు. దీనిని ఆనవాలుగా చెప్పు. రాముణ్ణి నాథునిగా పొందిన నేను అనాథనై దుఃఖిస్తున్నానని చెప్పు" అంది సీతమ్మ.

దోషం చేసినా, శరణు అనగానే ఆనాడు రాముడు కాకిని రక్షించాడు కదా! ఈనాడు నేను ఎంతగా మొత్తుకుంటున్నా నా మొర వినడెందుకని? నన్ను రక్షించ డెందుకని? అనే నిష్ఠూర వచనాలు కూడా ఆమె మాటల్లో దాగున్నాయి.

"హనుమా! అన్ని ధర్మాలలోకి దయయే ఉత్తమ ధర్మమని రాముడే నాకు చెప్పాడు. రాముడు ఇంద్రసమానుడు. అలాంటి రాముడు రాక్షసుల్ని ఎందుకు వధించడం లేదు? నా విషయంలో రామునికి తహతహ ఏమాత్రం ఉన్నా ఆ రాక్షసుల్ని బుగ్గిచేసి ఉండేవాడు.

"పోనీ, లక్ష్మణు డేమయ్యాడు? లక్ష్మణుడు మహావీరుడు. శత్రుంజయుడు. నన్ను రక్షించడానికి ఎందుకు ప్రయత్నించలేదు. అన్నగారి ఆజ్ఞ లేదా! రాముడు అగ్ని లాంటివాడు. లక్ష్మణుడు వాయువు లాంటివాడు. వాళ్ళిద్దరినీ ఎదిరించేవారు ముల్లోకాలలో లేరు. అలాంటివారు నన్ను ఎందుకు ఉపేక్షించారు?

మమైవ దుష్కృతం కించి న్మహదస్తి న సంశయః
సమర్థావపి తౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ ॥

"నేనే ఏదో పాపము కొద్దోగొప్పో చేసి ఉంటాను. అందుచేతనే సమర్థులు, శత్రుంజయులు అయిన రామలక్ష్మణులు నన్ను రక్షించకుండా ఉపేక్షిస్తున్నారు" అన్నది సీతమ్మ కన్నీళ్ళతో.

సాధకులైన వారికి ఇక్కడ ఒక సందేశ ముంది. మన బ్రతుకుల్లో కష్టాలు కుప్ప తెప్పలుగా వచ్చి పడినప్పుడు మనం సుడిగాలికి వృక్షాలు చలించినట్లు, చలించిపోతూ ఉంటాము. భగవంతుడు మనల్ని రక్షించలేదని నిష్ఠూరంగా పలుకుతూ, ఇచ్చిన తలనీలాల నుండి పెట్టిన పులిహోర వరకు చేసిందంతా చదివేస్తూ ఉంటాము.

భగవంతుడు మనల్ని రక్షించలేదని వాపోతూ ఉంటామే గాని, మన వెనుక గతంలో మనం చేసిన పాపాలు పర్వతరూపాలై ఉన్నాయని గ్రహించలేకపోతూ ఉంటాము. అలా గ్రహించగలిగితే కర్మఫలాల నందించే అదృశ్యహస్తాన్ని దర్శించి ప్రశాంతంగా జీవించ గలుగుతాము.

సీతమ్మ బాధను చూచి హనుమంతుడు బాగా చలించిపోయాడు. "తల్లీ! సీతాదేవీ! నీ వియోగాన్ని భరించలేక పర్వతం లాంటి రాముడు గాలికి చలించే వృక్షంలా కదలిపోతున్నాడు. చింతాక్రాంతుడైన రాముణ్ణి చూచి లక్ష్మణుడు దుఃఖాన్ని ఆపుకోలేక పోతున్నాడు. సత్యము మీద ఒట్టుపెట్టి చెప్తున్నాను.

"అమ్మా! అదృష్టం కలిసి వచ్చింది. నీవు అగుపించావు. ఇది ఆవేదనకు సమయం కాదు. త్వరలోనే దుఃఖాలన్నీ సమసిపోయే కాలం రాబోతోంది. రామలక్ష్మణు లిద్దరూ శీఘ్రంగా లంకకు వస్తారు. లంకను దగ్ధం చేస్తారు. రావణుణ్ణి, అతని బంధువుల్ని వధించి నిన్ను తీసుకొనిపోతారు.

"అమ్మా! రామునికి ఏమి చెప్పమంటావు? లక్ష్మణునికి ఏమి చెప్పమంటావు? సుగ్రీవునికి, వానరులకు ఏమి చెప్పాలి?" అని నమస్కరిస్తూ పలికాడు ఆంజనేయుడు.

కౌసల్యా లోక భర్తారం సుషువే యం మనస్వినీ
తం మహార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ ॥

"ఉత్తమురాలైన కౌసల్య లోకకళ్యాణము కొరకై ఏ రాముని కన్నదో అట్టి రాముణ్ణి నాకు మారుగా నీవు శిరమొడ్చి నమస్కరించి క్షేమ మడుగు;" అని భావయుతంగా పలికింది సీతమ్మ.

కౌసల్యను సీతమ్మ మనస్వినిగా వర్ణించింది. గొప్ప మనసు గలది అని అర్థము. అంటే కౌసల్యాదేవి రాముణ్ణి గొప్ప మనసుతో కన్నది అని భావము.

తమ బిడ్డలు యోగ్యులై తమను రక్షించాలని, తమ వంశప్రతిష్ఠను పెంపొందించాలని సాధారణంగా భావిస్తుంటారు. మనసున్న వాళ్ళు అలా ఆలోచించకుండా ఉండలేరు.

ఉత్తమ మనసు కలిగినవారు తమ బిడ్డల వల్ల లోకకళ్యాణము జరగాలని భావిస్తూ ఉంటారు. అవిధమైన సంకల్పముతోనే సంతానాన్ని పొందుతారు. ఆ సంకల్పంతోనే పెంపొందిస్తారు. కౌసల్య రాముణ్ణి విశాలభావంతో కన్నది. కనుక శరణాగతులైన వారిని రక్షించడం తన ధర్మంగా పెట్టుకున్నాడు రాముడు. ఎందరినో రక్షించాడు కూడాను.

లోకకళ్యాణము కొరకు అవిర్భవించిన రాముడు నన్ను రక్షించడా! రాముని కార్యాన్ని రామునికి గుర్తు చేయాలా! నా క్షేమం నాకన్నా రామునికే బాగా తెలుసు. భగవంతుడు తప్పక రక్షిస్తాడు అనే దృఢసంకల్పం ఒక్కటే శరణాగతులకు ఉండాలి. "నేను పొరపాటుగా మాట్లాడుతున్నా నేమో" అనుకుంటుంది సీతమ్మ.

అందుచేతనే తన క్షేమాన్ని విస్మరించి రాముని క్షేమాన్ని కోరుతోంది. శిరము వంచి తనకు మారుగా నమస్కరించమని హనుమంతునితో చెప్పింది. తనకంటూ ఇక ఏ సంకల్పాలు లేవని, రాముని సంకల్పమే నెరవేరుతుందని భావించడమే శిరస్సును వంచి నమస్కరించడం లోని అంతర్భావము.

"హనుమా! నా మరిది లక్ష్మణుడు సుమిత్ర ముద్దుబిడ్డ. ఉత్తమ భోగాలను విసర్జించాడు. సంపదల్ని విడనాడాడు. తల్లిదండ్రుల్ని విడిచి అన్నతో కూడా కానలలో దూరాడు.

"గొప్ప బాహువులు కలవాడు. మంచి మనసు గలవాడు. ప్రసన్న మైనవాడు. నన్ను తల్లిలా చూసుకొనేవాడు. రాముడే తండ్రని భావించేవాడు. పెద్దలంటే చాలా భక్తి. మితభాషి. మధురభాషి. ఏ పనైనా చెప్పు, చక్కగా చేసి పెడతాడు.

"లక్ష్మణుడు దగ్గర ఉండడం వల్ల రాముడు గతించిన తండ్రిని మరచిపోగలిగాడు. అట్టి లక్ష్మణుని క్షేమం నేను అడిగానని చెప్పు హనుమా!

"కానీ, ఒక్కమాట. అంతా నీమీదే ఆధారపడి ఉంది. నీ ప్రయత్నమే నాకు దుఃఖాన్ని దూరం చేస్తుంది" అన్నది సీతమ్మ.

హనుమంతుడు సీతమ్మకు క్రొత్తవాడు. ప్రథమంగా హనుమంతుని చూచినపుడు సీతమ్మ అనుమానించింది కూడాను. అట్టి హనుమంతునే కర్తవ్యపరాయణుడుగా ఇప్పుడు

గుర్తించి మాట్లాడుతోంది. హనుమంతుని మీద అంత ప్రగాఢవిశ్వాసాన్ని పెంచుకుంది. అది హనుమంతునిలోని ప్రసన్న శ్రేష్ఠత్వము.

పవిత్రు లైనవారు కొన్ని నిముషాల పరిచయం లోనే సూటిగా వెళ్ళి మన హృదయంలో నిలిచిపోతారు. ద్వంద్వబుద్ధి పరాయణులు దశాబ్దాలు దగ్గరున్నా హృదయానికి దూరంగానే ఉండిపోతారు.

జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ
ఊర్ధ్వం మాసాన్న జీవేయం సత్యేనాహం బ్రవీమితే ॥

"రామా! నేను ఒక్క నెలరోజులే జీవిస్తాను. అది దాటితే మిగలను.-సత్యము చెబుతున్నాను.

"పాపాత్ముడైన ఈ రావణుడు నన్ను అవమానకరంగా బంధించి ఉన్నాడు. నీవు త్వరగా వచ్చి రక్షించాలి. హనుమా! ఇవి నా మాటలుగా రామునితో చెప్పు. మాటిమాటికి చెప్పు నాయనా!" అని పలికి, కొంగులో కట్టుకొని వున్న చూడామణిని తీసి, "ఇది రామునికి ఇవ్వు" అని పలికి హనుమంతునికి ఇచ్చింది సీతమ్మ.

హనుమంతుడు శ్రేష్ఠమైన ఆ మణిని గ్రహించాడు. సీతమ్మకు ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. హనుమంతుడు చూడామణిని గ్రహించగానే కంపించిపోయినట్లు చెప్పాడు వాల్మీకి. హనుమంతుడు తిరుగ ప్రయాణానికి మానసికంగా సిద్ధమయ్యాడు.

వాయుపుత్రుని వినయశీలములు

"హనుమా! నీకు నేను ఇచ్చిన వస్తువును చూడగానే రామునికి ఆనవాలు బాగా తెలుస్తుంది. చూడామణిని చూడగానే కౌసల్యాదశరథులు, నేను రామునికి జ్ఞాపకము వస్తాము. నాయనా! నా విషయంలో ఏమేమి చేయాలో అంతా నీవే ఆలోచించాలి.

త్వ మస్మిన్ కార్య నిర్యోగే ప్రమాణం హరిసత్తమ
హనుమన్ యత్న మాస్థాయ దుఃఖ క్షయకరోభవ ॥

"హనుమంతుడా! ఈ కార్యనిర్వహణలో నీవే ఆలోచించాలి. నీ ప్రయత్నముతో నా దుఃఖాన్ని పోగొట్టు" అన్నది సీతమ్మ. **తథేతి** - "అలాగే" అన్నాడు హనుమంతుడు.

ఇక్కడ నాదొక్క సలహా. జీవితమొక భయంకర సంగ్రామము. ఎప్పుడు, ఏవైపునుండి, ఏవిధమైన కష్టా లొస్తాయో, దుఃఖా లొస్తాయో తెలియదు. వాటిని పోగొట్టుకొనే ప్రయత్నంలో మనం ఎంతో శ్రమిస్తూ ఉంటాము.

మీకు కష్టాలు వచ్చినప్పుడు గాని, బాధలు ఎదురైనపుడు గాని, సమస్యలు భయంకరంగా తలెత్తినపుడు గాని, వాటి పరిష్కారానికి మీరు యత్నించబోయే ముందు, హనుమంతుని మనసులో భక్తితో ప్రార్థించి, పై శ్లోకాన్ని మూడుసార్లు ధ్యానించండి. తరువాత మీ ప్రయత్నాన్ని సాగించండి. ఆంజనేయుడు మీకు అండగా ఉండి మీ కార్యాన్ని సఫలీకృతం చేస్తాడు.

దేనికైనా విశ్వాస ముండాలి. విశ్వాసము పర్వతాల్ని కదిలిస్తుంది. సాగరచలనాన్ని నిరోధిస్తుంది. సూర్యచంద్రుల గమనాన్ని అడ్డగిస్తుంది.

కార్యభారాన్ని స్వీకరించమని, దుఃఖాన్ని పోగొట్టమని సీతమ్మ ప్రార్థించగానే హనుమంతుడు "తథేతి" "అలాగే" అన్నాడు. అంతకన్నా మనకు ఏమికావాలి? మారుతి మాటను విశ్వసించి మనుగడను మహోన్నతంగా తీర్చిదిద్దుకుందాం.

హనుమంతుడు ప్రయాణానికి సిద్ధమవుతూ ఉండడం చూసి సీతమ్మ కన్నీరు పెట్టుకుంటూ ఇలా అంది.

"హనుమా! అందర్నీ అడిగానని చెప్పు. నేను ప్రాణాలతో ఉండగానే రాముడు వచ్చేలా చూడు.

"నాయనా! పోనీ, రేపు పోకూడదా! (వసైకాహం) ఈరోజు విశ్రాంతి తీసుకొని పోతే ఎలా ఉంటుంది? నిన్ను చూస్తూ వుంటే నాకు ఉపశమనం లభిస్తోంది.

"హనుమా! నన్నొక సందేహము పట్టి పీడిస్తోంది. వానర భల్లూక రామలక్ష్మణాదులు ఈ సముద్రాన్ని దాటి ఎలా రాగలరు ఇక్కడికి? నువ్వు, వాయుదేవుడు, గరుత్మంతుడు - మీ ముగ్గురే దాటగలరని నా మనసు చెబుతోంది.

"అదే నిజమైతే, మరి నా విషయము ఎలా? నాయనా! నువ్వే ఆలోచించాలి. కార్యసాధనలో నిన్ను మించినవారు లేరు. హనుమా! రాముడు యుద్ధంలో రావణుని వధించి, నన్ను రక్షిస్తేనే అది ఆయన స్థాయికి తగినట్లు ఉంటుంది;" అని పలికింది సీతమ్మ.

"తల్లీ! మాకు సుగ్రీవుడు నాయకుడు. ఎలాగైనా నిన్ను రక్షించాలని సుగ్రీవుడు దృఢ నిశ్చయముతో ఉన్నాడు. నన్ను మించిన కపులు సుగ్రీవుని వద్ద వేలమంది ఉన్నారు. భూమిమీద గాని, ఆకాశము మీద గాని వారి గమనాన్ని ఎవ్వరూ అడ్డగించలేరు. అమ్మా! నీకు తెలియదు. వాళ్ళు చేసే పనులు పరమాద్భుతంగా ఉంటాయి. ఈ భూమిని ఆకాశమార్గాన వాళ్ళు ఎన్నోసార్లు ప్రదక్షిణం చేసి ఉన్నారు.

మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సన్తి తత్ర వనౌకసః
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవ సన్నిధౌ ॥

"తల్లీ! సుగ్రీవుని దగ్గర ఉండే వానరుల్లో కొందరు నాకంటే గొప్పవారు. కొందరు నాతో సమానులు. నాకంటె తక్కువవారు లేనేలేరు.

"నేనే ఇలా సముద్రాన్ని దాటి వచ్చానంటే ఇక వాళ్ళమాట చెప్పాలా! చూడమ్మా! ఒక పనివి చేయడానికి సామాన్యుల్ని పంపుతారు. కానీ శ్రేష్ఠుల్ని పంపరు కదా!" అంటాడు వినయవంతుడైన వాయుపుత్రుడు.

విద్య వినయముతో కూడినపుడు అది స్వర్ణానికి సువాసన అబ్బినట్లు ఉంటుంది. అహంకారముతో కలిస్తే అధోగతి పాలవుతుంది.

తనతో సమానులు, తనకన్నా గొప్పవారే గాని తనకంటె తక్కువవారు సుగ్రీవుని సన్నిధిలో లేరని హనుమంతుడు చెప్పడం ఎంత ఆశ్చర్యకరం. నిజమే. భక్తుడైనవాడు నీచాన్ని ఎప్పుడూ దర్శించడు.

సమయస్ఫూర్తితో కూడిన వాక్చాతుర్యము, నమ్రతతో కూడిన జ్ఞానము హనుమంతునిలో ఈ సందర్భమున ఎంతో దివ్యంగా ప్రకాశించాయి. తాను కార్యకర్తనే కాని శ్రేష్ఠుణ్ణి కాను అంటాడు. కార్యాచరణలో సామాన్యులు కన్పిస్తారే గాని శ్రేష్ఠులు కనిపించరు కదా! అని సహేతుకంగా పలికాడు హనుమంతుడు.

శ్రేష్ఠుడు ఎవరో మనం ఇక్కడ గ్రహించాలి. రామకార్యంలో సామాన్యునిలాగా మెలిగేవాడే శ్రేష్ఠుడు. వినయవంతుడు ఎన్నడైనా విశాలహృదయుడే. విశాలహృదయులే పరమాత్మను తమలో నింపుకోగలరు. నిలుపుకోగలరు.

"అమ్మా! నీవు దుఃఖించకు. వానరనాయకు లందరూ ఒక దుముకులో ఇక్కడుంటారు. రామలక్ష్మణులు నా భుజాలపై కూర్చుని సూర్యచంద్రులలాగా ప్రకాశిస్తూ వస్తారు. ఈ లంకనంతా బాణాలతో కప్పేస్తారు;" అని పలకగానే, హనుమంతుని వచనాలతో ఊరడిల్లిన సీతమ్మ ఆంజనేయునితో ఇలా పలికింది.

త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర
అర్ధ సంజాత సస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా ॥

"హనుమంతా! సగం మొలిచిన పైరు వర్షం పడగానే కళకళలాడినట్లు, నీ మాటలు విని నేను సంతోషిస్తున్నాను.

"హనుమా! నేను చెప్పిన కాకి వృత్తాంతము చెప్పడం మరచిపోకు. చక్కని ఆనవాలు అది. నాయనా! ఇంకొక్కటి కూడా చెప్తా. ఒకనాడు నా నుదుట తిలకం చెరిగిపోయింది. అప్పుడు రాముడు మణిశిలతో బొట్టుపెట్టాడు. అదికూడా జ్ఞాపకం చెయ్యి. రాముణ్ణి తొందరగా రమ్మని చెప్పు. ఈ రాక్షసులు పెట్టే బాధలు నేను ఇక భరించలేను;" అంది సీతమ్మ.

"అమ్మా! చూడామణిలాగా రామునికి ఆనందాన్నిచ్చే వస్తువు ఇంకొకటి ఉంటే, అదికూడా ఇస్తావా!" అని అడిగాడు హనుమంతుడు.

భగవంతుడు భక్తుని ఉద్ధరించాలంటే ముందుగా భక్తుడి నుండి గురువు ద్వారా భగవంతునికి ఆనవాలు అందాలి. ఈ ఆనవాలు రెండువిధాలుగా ఉంటాయి. అవి 1. చూపేవి 2. చెప్పేవి. మొదటిది రూపానికి, రెండవది శబ్దానికి సంకేతము.

భక్తుడు పంపే ఆనవాలును భగవంతుడు చూస్తాడు. వింటాడు. మన ఆచరణను పరమాత్మ చూస్తాడు. మనం ఉచ్చరించే మంత్రాన్ని, కీర్తించే నామాన్ని లోపలనుండి వింటూ వుంటాడు.

సీతమ్మ చెప్పిన కాకి కథ, చెరిగిన బొట్టు వింత—ఈ రెండూ చెప్పే విషయాలుగా ఆనవాలు ఇచ్చింది. చూపే విషయంలో ఒక్క చూడామణినే ఇచ్చింది. ఇంకేదైనా మంచిది ఉంటే ఇవ్వమని హనుమంతుడు అడుగుతున్నాడు.

అలా అడిగేవాడే గురువు. శిష్యుడు ఒక సత్కార్యాన్ని చేయగానే సంతోషపడిన గురువు అలాగే ఆనందాన్నిచ్చే ఇంకొక మంచి కార్యాన్ని చేసి చూపిస్తావా! అని అడుగుతాడు.

శిష్యులచేత ఈవిధంగా గురువు సత్కార్యాలు ఆచరింప చేయడం వారిని ఉద్ధరించుటకే. అది అర్థంగాని సామాన్యులు గురువేదో తమని కర్మ సుడిగుండంలో పడదోస్తున్నట్లు ఇదై పోతారు. అదైపోతారు. చివరికి ఏదో అయిపోతారు.

"నాయనా! హనుమా! నా కేశభూషణమైన మణిని నీకిచ్చాను. అది చూడగానే రాముడు నీ మాటలు నమ్ముతాడు" అంది సీతమ్మ.

కేశభూషణమైన చూడామణి తల మీదుంటుంది. అది ఇవ్వడము అంటే మనసును పూర్ణంగా సమర్పించిందని భావము. కేశములు సంకల్పాలకు సంకేతము కదా! ఎవరు వారి మనసును పూర్ణంగా సమర్పిస్తారో వారే కదా పరమాత్మకు అత్యంత ప్రియులు.

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః

"నీ మనస్సును నాయందు నిలుపు. నీ బుద్ధిని నాయందు ప్రవేశపెట్టు. ఆ తరువాత నీవు నాయందే ఉంటావు. ఇందులో సందేహము లేదు" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత-భక్తియోగంలో తెలుపుతారు.

హనుమంతుడు తలవంచి సీతమ్మకు నమస్కరించాడు. తిరిగి వెళ్ళుటకు బయలుదేరాడు. హనుమంతుడు దేహాన్ని పెంచసాగాడు.

అది చూచిన జానకి "నాయనా! రామలక్ష్మణుల్ని అడిగానని చెప్పు. సుగ్రీవుని అడిగానని చెప్పు. అందరినీ అడిగానని చెప్పు"అంటోంది ఆత్రుతగా. ఆమె మాటలను విని హనుమ ఎగిరాడు. కానీ అది తిరుగప్రయాణానికి కాదు. ఆ వనంలోనే ఒకచోట దిగాడు సీతమ్మకు కనపడకుండా.

వానర వీరావేశం - వననాశం

"సీతమ్మను చూశాను. చేయవలసిన పని కొద్దిగా ఉండిపోయింది. సామదానభేద దండోపాయాల్లో ఇక్కడ బాగా అతికేది దండోపాయమే.

"రాక్షసులు కదా! సామోపాయం నిష్ప్రయోజనం. ధనంతో మదించి యున్నారు కదా! దానోపాయము కూడా నిరుపయోగమే. బలవంతులు కాబట్టి భేదోపాయానికి లొంగరు. ఎటొచ్చీ, దండోపాయమే మేలై ఉంటుంది. పరాక్రమమే ఇక్కడ పనిచేసి తీరుతుంది. కొందరి నైనా నేను వదిలించేస్తే మిగిలిన వారికి బుర్ర పనిచేస్తుంది.

"కార్యసాధన అంటే చెప్పిన పని చేయడం మాత్రమే కాదు. దానికి వైరుధ్యం లేకుండా మరికొన్ని పనులు కూడా సాధించడమే కార్యసాధకుని లక్షణం.

ఏ కార్యాన్ని సాధించడానికైనా ఒకే మార్గము ఉండదు. అనేక మార్గా లుంటాయి. కనుక ఒక కార్యాన్ని సాధించడానికి అనేక మార్గాలు తెలిసినవాడు ఎవడో అతడే కార్యసాధకుడు.

"ఇంతకీ, శత్రువు బలం ఎంత? తెలియాలి కదా! అదేదో నేనే తెలుసుకొని వెళ్ళి సుగ్రీవునికి చెబితే పని కాస్త సులువు అవుతుంది. ప్రభుకార్యాన్ని నేను చాకచక్యంతో నిర్వహించినట్లే అవుతుంది.

"ఇప్పుడు నాకు, రాక్షసులకు సమరం రేగాలి సులభంగా. దానివల్ల నా బలానికి సార్థకత ఏర్పడుతుంది. రావణుడికి కూడా నన్ను గురించి తెలిసి వస్తుంది. నాకుకూడా రావణుని బల మేమిటో, వాడి మంత్రుల శక్తి ఏమిటో, అనుచరుల సామర్థ్య మేమిటో తెలుస్తుంది. ఇక ఆలోచన అనవసరం. కజ్జాకి కాలుదువ్వడమే ముందున్న కార్యం.

"ఈ ఉద్యానవనం చాలా బావుంది. అనేక రకాలైన చెట్లతో, పుష్పాలతో, లతలతో మనోహరంగా ప్రకాశిస్తూ నందనవనాన్ని మరిపిస్తోంది. ఆరిపోయిన అడవిని అగ్నిదేవుడు కాల్చినట్లు కళకళలాడే ఈ వనాన్ని కపివీరుడు కల్లోలం చేసేస్తాడు. అప్పుడు రావణుడికి కోపం వస్తుంది. నాపైకి సైన్యాన్ని పంపుతాడు. అదే కదా నాకు కావలసింది, నేను కోరుకునేది.

"రానీ. ఎంత సైన్యము వస్తుందో! వచ్చిన వాళ్ళందరినీ పక్షపాతం లేకుండా పిడికిటి పోట్లతో పైలోకానికి పంపిస్తాను. ఆ తరువాత నేను సుగ్రీవుడి వద్దకు వెళ్తాను." అని ఆలోచించి, రావణుని తలచుకొని క్రుద్ధుడై, వాయువు చెట్లను పడద్రోయునట్లు వాయు పుత్రుడు వృక్షాల్ని విరగగొట్టాడు.

చెట్లు విరిగి పడుతుంటే పక్షులన్నీ గొప్ప శబ్దం చేశాయి. హనుమంతుడు విజృంభించాడు. చెట్లు విరిచేశాడు. సరోవరాల గట్లు త్రెంచేశాడు. మెట్లు కొట్టేశాడు. కొద్ది సేపట్లోనే ఆ వనమంతా కళాహీనమైన కాంతలా కన్పించింది.

ఉద్యానవనం లోని లతాగృహాలను హనుమంతుడు దుళ్ళగొట్టేశాడు. చిత్రగృహాలను గుల్ల చేసేశాడు. మృగాల్ని, సర్పాల్ని మట్టుబెట్టాడు. జాతి కట్టడాలను, విడిదిగృహాలను పడగొట్టేశాడు. చూస్తుండగనే శోభాయమానమైన వనము శోకముతో నిండిన శ్మశానంలా గోచరించింది. అశోకలతా ప్రతానమైన ఉద్యానవనము శోకలతా ప్రతానమైంది.

జరగవలసింది అంతా జరిగిపోయింది. ఇక రావణుని వద్దనుండి రాక్షసులు రావడమే ఆలస్యము. వారికొరకు ఎదురుచూస్తూ ఉద్యానవన ప్రవేశద్వారము వద్ద నిలబడ్డాడు పవనసుతుడు.

చెట్లు విరిగిపడుతున్న శబ్దాలు, కల్లోలంగా వినిపిస్తున్న పక్షుల అరుపులు విని లంకలోని వారంతా భయభ్రాంతులకు లోనయ్యారు. పక్షులు, మృగాలు బెదిరి అటూఇటూ పరుగెత్తాయి. భయాన్ని కల్పించే శకునాలు కన్పించాయి.

నిద్రిస్తున్న రాక్షసమహిళలు మేలుకున్నారు. ధ్వంసమైన వనాన్ని, దారుణరూపంతో గోచరించే హనుమంతుని చూశారు. వాళ్ళను ఇంకా భయపెట్టాలని భావించిన హనుమంతుడు దేహాన్ని బాగా పెంచేశాడు.

"ఎవడువీడు! ఎవరివాడు? ఇక్కడి కెందుకొచ్చినట్లు? ఎక్కడనుండి వచ్చాడు? నీతో ఏదో మాట్లాడినట్లు ఉన్నాడే! ఏం మాట్లాడాడు?" అని రాక్షసాంగనలు సీతమ్మను ప్రశ్నించారు.

యూయమే వాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి
అహిరేవ హ్యహేః పాదాన్ విజానాతి న సంశయః

"అతడెవరో, ఏమి చేయగలడో మీకే తెలియాలి. పాముపాదాలు పాముకే తెలుస్తాయి. సందేహం లేదు.

"ఇతణ్ణి చూసి నాకూ భయం వేసింది. అతడెవరో నాకు తెలియదు. కామరూపియైన రాక్షసుడై ఉంటాడని భావించాను" అన్నది సీతమ్మ. సత్యాసత్యములను బేరీజు వేసుకుంటూ చాలా జాగ్రత్తగా మాట్లాడింది.

హనుమంతు డెవడో తనకు తెలియదని సీతమ్మ రాక్షసాంగనలకు తెలిపే ఈ సన్నివేశంలో ఒక అందమైన శ్లోకాన్ని అందిస్తాడు వాల్మీకి.

అథా బ్రవీత్తదా సాధ్వీ సీతా సర్వాంగ సుందరీ
రక్షసాం భీమ రూపాణాం విజ్ఞానే మమకా గతిః

రాక్షసాంగనల మాటలు వినిన పిమ్మట సాధ్వి, సర్వాంగసుందరి అయిన సీత ఇలా పలికింది. "భయంకర రూపాలు ధరించే రాక్షసుల్ని తెలుసుకొనే జ్ఞానము నాకెక్కడుంది" అన్నది సీతమ్మ.

ఈ సందర్భములో సీతమ్మను సర్వాంగసుందరిగా వర్ణించాడు వాల్మీకి. ఇంతవరకు కృశాంగిగా, శోకమూర్తిగా వర్ణింపబడిన సీతామహాసాధ్వి ఇప్పుడు సర్వాంగసుందరిగా వర్ణించబడింది.

సీతమ్మ మనసు తేలిక పడింది. ఊరడిల్లింది. అందుచేతనే ఆమె సర్వాంగసుందరియై శోభిస్తోంది.

రాముని వార్త సీతమ్మకు అందింది. రామనామాంకిత ముద్రిక లభించింది. మరల రామునితో కలిసి జీవించే భాగ్యము లభిస్తుంది అనే విశ్వాస మేర్పడింది. హృదయము తేలిక పడింది. మనసు ప్రసన్నతను పొందింది. మనసులోని నైర్మల్యము దేహాన్నంతా వ్యాపించింది. వాడిపోయిన దేహసుమం తిరిగి వికసించింది. అందుచేత సీతమ్మ సర్వాంగసుందరిగా తెలుస్తోంది.

"హనుమంతు డెవరో తనకు తెలియదు. పాముపాదాలు పాముకే తెలియాలి" అనిన సీతమ్మ పలుకులను పాఠకులు అపార్థం చేసుకుంటారేమో నని భావించి, "సాధ్వీ" అని వర్ణించాడు ఈ సందర్భంలో సీతమ్మను వాల్మీకి.

సాధ్వీ అంటే పతివ్రత. ఆమె సాధ్వి కనుక ఆమె మాట 'సాధు', అంటే బాగుగా ఉన్నది అని అర్థము. సాధ్వియైన సీతమ్మ పలికిన వాక్యము సాధువాక్యమే నంటున్నారు వాల్మీకి.

"నాకేం తెలుసు" అనే మాట వ్యంగ్యార్థముతో కూడింది. తెలిసిన విషయాన్ని అప్రయోజకులతో ప్రస్తావించవలసి వచ్చినప్పుడు, "నాకేం తెలుసు" అని మనం కూడా అంటూ ఉంటాము. నీవు మహాప్రాజ్ఞుడవు. నీవు అడిగే విషయం నాకు ఎలా తెలుస్తుంది? అనే శ్లేష మన మాటల్లో ఇమిడి ఉంటుంది.

సీతమ్మ కూడా అలాగే భాషించింది ఈ సందర్భములో. అందుచేత ఆమెది సాధు వచనమైంది. అంతేగాని, సీతమ్మ మాటల్లో అసత్యము చోటు చేసుకుంది అని భావించకూడదు.

హనుమంతుణ్ణి చూసి భయపడి కొందరు రాక్షసాంగనలు పరుగులు తీశారు. కొందరు సీతమ్మరక్షించాలని అక్కడే ధైర్యంగా ఉండిపోయారు. ఈ విషయాన్ని రావణుడికి చెప్పడానికి కొందరు వెళ్ళారు.

"మహారాజా! ఎవడో వానరు డొకడు అశోకవనంలో ఉన్నాడు. వాడిది పెద్ద శరీరం. భయంకరంగా ఉంది. వాడు సీతతోకూడా ఏదో మాట్లాడాడు. మేము చెప్పమని అడిగాము. ఎంత ప్రశ్నించినా సీత వాణ్ణి గురించి చెప్పడంలేదు.

"మొత్తానికి వాడు దూతగా వచ్చుంటాడని మా నమ్మకం. ఇంద్రుడైనా పంపి ఉండాలి. కుబేరుడైనా పంపి ఉండాలి. లేదా, వీడు రాముడివద్ద నుండైనా వచ్చి ఉండాలి.

"వచ్చినవాడు ఊరకున్నాడా చూస్తూ. అదేమి లేదు. చెట్లు పడగొట్టడమేనా, గట్లు కొట్టేయడమేనా, మేడలు కూల్చేయడమేనా! ఎన్నని! వాడు చెయ్యని పని లేదు. వనాన్నంతా వల్లకాటి లాగా మార్చేశాడు.

"తమాషా ఏమిటో తెలుసా! వాడు వనాన్నంతా పాడుచేశాడు. కానీ సీత కూర్చుని ఉంది కదా! ఆ చోటుని వాడు తాకనే లేదు. అలా ఎందుకు చేసుంటాడు? సీత కోసమైనా వాడు దాన్ని రక్షించి ఉండాలి. లేదా అలసిపోయి వదిలేసి ఉండాలి. కాదుకాదు. వాడికి అలుపు ఎక్కడిది? సీత కోసమే వాడు దానిని ముట్టలేదు. రాజా! వాడికి దండమును విధించు.

"ఎంత ధైర్యం వాడికి? నీ మనసు పడిన మగువతో వాడు మాట్లాడుతాడా! దానవేశ్వరా! సీతతో వాడు మాట్లాడడం మొదటి తప్పు. వనాన్ని పాడుచేయడం రెండవ తప్పు. వాడికి ఏ శిక్ష విధిస్తారో! మీ ఇష్టం" అన్నారు రాక్షసాంగనలు.

రాక్షసస్త్రీల మాటలు వినగానే రావణుడు భయంకరంగా క్రుద్ధుడయ్యాడు. గుడ్లప్పగించాడు. హోమాగ్నిలాగా మండిపడ్డాడు.

తస్య క్రుద్ధస్య నేత్రాభ్యాం ప్రాపతన్నస్ర బిన్దవః
దీప్తాభ్యామివ దీపాభ్యాం సార్చిషః స్నేహ బిన్దవః

"మండే దీపం నుండి మంటతో కూడిన నూనెచుక్కలు క్రింద రాలినట్లు, క్రుద్ధుడైన రావణుని నేత్రదీపాల నుండి కన్నీటి చుక్కలు రాలాయి;" అన్నాడు వాల్మీకి.

మండే దీపం నుండి నూనెచుక్కలు రాలినప్పుడు వాటిలో నూనె ఉంటుంది. మంటకూడా ఉంటుంది. అలాగే రావణునిలో కూడా సీతమ్మ మీద స్నేహము, హనుమంతునిపై కోపము ఈ రెండూ మిశ్రితమై ఉన్నాయని కవిహృదయము స్పందిస్తోంది.

హనుమంతుని పట్టి బంధించుటకు తనతో సమానమైన కింకరులు అనే రాక్షసుల్ని పంపాడు రావణాసురుడు. రావణుని ఆజ్ఞను శిరోధార్యంగా భావించి ఎనభైవేల మంది బయలుదేరారు. గొప్ప ఆయుధములు ధరించి వెళ్ళారు.

ముఖద్వారం వద్ద సిద్ధంగా ఉన్న హనుమంతుని చూశారు. మిడుతలు అగ్నిలో పడినట్లు హనుమంతుని మీదికి వెళ్ళారు. ఆయుధాలతో హనుమంతుని కొట్టసాగారు.

వాళ్ళను చూసి హనుమంతుడు వాలాన్ని జాడించాడు. నేలపై వేసి కొట్టాడు. ఆ శబ్దము లంకంతా వినిపించింది. దేహాన్ని పెద్దదిగా పెంచేశాడు. బిగ్గరగా అరచాడు. ఆ శబ్దానికి ఆకాశంలో విహరిస్తున్న విహంగాలు క్రిందపడి మరణించాయి.

జయత్యతి బలో రామో లక్ష్మణశ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః
దాసోఽహం కోసలేన్ద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః 1
హనుమాన్ శత్రు సైన్యానాం నిహన్తా మారుతాత్మజః
న రావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్ 2
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః
అర్దయిత్వా పురీం లంకా మభివాద్య చ మైథిలీమ్ 3
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్ ॥ 4

భావము:- 1. "అతిబలుడైన రామునికి జయం. మహాబలుడైన లక్ష్మణునికి జయం. రామునిచే పాలింపబడు సుగ్రీవ మహారాజుకు జయం.

2. శత్రుసంహారకుడు, వాయుపుత్రుడు అయిన నా పేరు హనుమంతుడు. శ్రమ లేకుండా కార్యములను సాధించే రామునికి నేను దాసుణ్ణి.

3. నేను వేల కొలది రాళ్ళు, చెట్లు ప్రయోగిస్తూ యుద్ధము చేయునపుడు వెయ్యిమంది రావణులు కూడా నా ఎదుట నిలువలేరు.

4. రాక్షసులందరూ వీక్షిస్తూ ఉండగా, నేను లంకాపట్టణాన్ని నాశనం చేసి, సీతకు నమస్కరించి, నేను వచ్చినపని పూర్తిచేసుకొని వెళ్తాను".

హనుమంతుడు రాక్షసులతో పోరాడుటకు ముందుగా పలికిన ఈ నాలుగు శ్లోకాలు చాలా విశిష్టమైనవి. సుందరకాండములో హనుమంతుడు పలికే ఈ నాలుగు శ్లోకాలను విజయశ్లోకాలు అంటారు. శత్రువులను జయించుటకు ఈ శ్లోకాలు దివ్యాయుధాలు.

శత్రువులు బయట ఉండేవారు కారు. అంతశ్శత్రువులే బాహ్యంలో శత్రువుల్ని తయారు చేస్తారు. బాహ్యాభ్యంతరాలలో శత్రువులను జయించుటకు ఈ శ్లోకాలు అద్భుతంగా పనిచేస్తాయి.

హనుమంతుని వివరాలు చెప్పమని సీతమ్మను రాక్షసస్త్రీలు అడిగినపుడు సీతమ్మ చెప్పకుండా దాచిపెట్టింది. కానీ హనుమ తనకు తానే నిర్భయంగా వెల్లడి చేశాడు. తన పేరు చెప్పాడు. తానెవరో చెప్పాడు. తన శక్తిసామర్థ్యా లేమిటో చెప్పాడు. ఎందుకు వచ్చాడో చెప్పాడు. ఏమి చేయనున్నాడో కూడా చెప్పాడు.

దాసోఽహం. నేను దాసుణ్ణి. అసమాన పరాక్రమవంతుడైన రాముడికి దాసుణ్ణి అన్నాడు హనుమ. ఇంతవరకు ఎక్కడా తాను దాసుడని హనుమ చెప్పలేదు. సుగ్రీవ సచివుడని, రామదూత యని చెప్పాడే గాని రామదాసు అని చెప్పలేదు. ఇక్కడే ప్రథమంగా దాసభావాన్ని వ్యక్తం చేశాడు.

రాక్షసులను సంహరించుటకు ఉద్యుక్తుడైన హనుమ తనను దాసుడుగా వర్ణించుకున్నాడు. కర్తృత్వభావన తనది కాదు, తనకు లేదు అని చెప్పుటయే దాసభావంలో ఇమిడియున్న రహస్యం. ఇది రామకార్యం. ఎందరు రాక్షసు లెదురైనా ఫరవాలేదు. కర్త రాముడు. ఫలము రామునిది. తాను పనిముట్టు మాత్రమే. ఇదియే దాసభావన. ఈ భావంతో కర్మలాచరించే వారు ఓటమిని ఎరుగరు. సదా వారికి విజయమే. అదియే భక్త విజయం. పరమాత్మ చేతిలో పరికరమై సాధించే భవ్యమైన విజయం. దివ్యమైన విజయం.


దాసుడైన వాడే వీరుడౌతాడు. అందుచేత హనుమంతుడు తాను దాసుడనని మొదట చెప్పి, తరువాత తాను శత్రుంజయుడనని చెప్పుకుంటాడు.

భక్తులు మొదట దాసులు అయితే, తరువాత వీరులౌతారు. దాసత్వంలో ఓడిపోవడం జరిగితే, వీరత్వంలో గెలుచుకోవడం జరుగుతుంది. ఈ రెండూ జరిగిన తరువాత అసలు ఓడిందంటూ లేనేలేదని, అంతా జయమే నని అవగత మవుతుంది.

దాసత్వంలో నేను, నాది అనే అహంకార మమకారాల్ని పోగొట్టుకొని ఓడిపోవడం జరుగుతుంది. వీరత్వంలో కామక్రోధాది అరిషడ్వర్గాల మీద విజయాన్ని సాధించడం జరుగుతుంది.

ఒకవిధంగా చెప్తే, దాసత్వంతో రాముణ్ణి జయించడం. ఇదే భక్తవిజయం. మరో విధంగా చూస్తే వీరత్వంతో రావణుణ్ణి జయించడం. అదే అజ్ఞాననాశము.

పెద్దగా అరుస్తూ, పర్వతరూపుడై శోభిస్తున్న పవనసుతుని గాంచి రాక్షసులు భయభ్రాంతులకు లోనయ్యారు. పెద్ద సంధ్యాకాల మేఘంలాగా గోచరించాడు.



రాక్షసులు ఆయుధాలు చేపట్టి హనుమ పై పడ్డారు. హనుమంతుడు ముఖద్వారానికి ఉన్న ఇనుప గడియను లాగి చేత పట్టుకున్నాడు. ఆ ఇనుప పరిఘతో రాక్షసుల్ని కొట్టి కొట్టి చంపుతున్నాడు. మెలికలు తిరుగుచున్న పెద్ద సర్పాన్ని గరుత్మంతుడు పట్టుకున్నట్లు పరిఘను చేత్తో పట్టుకొని గగన విహారం చేశాడు హనుమ.

కింకరుల నందరిని వధించి, క్రొత్తవారి కొరకు నిరీక్షిస్తూ మళ్ళీ ముఖద్వారం వద్ద నిలబడ్డాడు హనుమ. హనుమంతుని వద్ద నుండి ఎలాగో తప్పించుకొనిన కొందరు రాక్షసులు రావణుని సమీపించి, కింకరులందరూ శంకరాలయం చేరారని చెప్పారు.

అంతపెద్ద సేన నశించి పోయిందని వినగానే రావణుని కళ్ళు మసక లయ్యాయి. పరాక్రమవంతుడైన ప్రహస్తుని కుమారుడు జంబుమాలిని పంపాడు హనుమంతుని మీదికి.

జంబుమాలి జారిపోయాడు

"ఉద్యానవనాన్ని ఊడ్చేశాను. చైత్యప్రాసాదాన్ని ఇప్పుడు ఎత్తిపోస్తాను" అని పలికి మేరుపర్వతం లాగా ఎత్తుగా ఉన్న చైత్యప్రాసాదం మీదికి ఉరికాడు హనుమంతుడు. కొండలా

ఆనుతున్న ఆ చైత్యం మీద హనుమంతుడు రెండవ సూర్యుడా అన్నట్లు భాసించాడు. చూస్తుండగనే పర్వతమంత పెరిగాడు. పెద్దగా జబ్బలు చరచాడు. ఆ శబ్దానికి ఆకాశాన ఎగిరే పిట్టలు చచ్చి క్రిందపడ్డాయి. చైత్యాన్ని రక్షించే రాక్షసుల ప్రాణాలు పైకి పోయాయి.

రాక్షసులు అనేకమంది ఖడ్గాలు, గండ్రగొడ్డళ్ళు, ఈటెలు పట్టుకొని హనుమంతుని మీదికి దుమికారు. హనుమంతుని చుట్టూ వలయంలా నిలబడిన ఆ రాక్షసులు గంగానదిలో ఏర్పడిన సుడిలా తెలుస్తున్నారు.

హనుమంతుడు ఆ నాలుగు విజయశ్లోకాలను మళ్ళీ పలికాడు. భయంకర రూపాన్ని దాల్చాడు. ఆ చైత్యప్రాసాదాని కున్న స్వర్ణాలంకృత స్తంభాన్ని పెకలించాడు. నూరు అంచులు గల ఆ స్తంభాన్ని గిర్రున త్రిప్పాడు వడిసుడిలాగా.

హనుమంతుడు అలా త్రిప్పడం వల్ల అక్కడ అగ్ని పుట్టింది. చైత్యప్రాసాద మంతా బుగ్గైపోయింది. తన చుట్టూ వున్న రాక్షసుల్ని తుక్కుతుక్కుగా తన్నేశాడు హనుమ క్రుద్ధుడై. ఆకాశాన నిలబడ్డాడు.

"బలశాలురు, పెద్ద దేహాలను ధరించినవారు, వేలకొలది నాలాంటి వానరులు సుగ్రీవుని ఆజ్ఞకు లోబడి ఉన్నారు. జాగర్త. వానరులలో కొందరు పది ఏనుగుల బలము గలవారున్నారు. కొందరికి వంద ఏనుగుల బలముంది. కొందరైతే వెయ్యి ఏనుగుల బలంతో కూడా ఉన్నారు. వానరసేన ఇంత, అంత అని ఎవ్వరూ చెప్పలేరు. వారి ఆయుధా లేమిటో తెలుసా! పళ్ళు, గోళ్ళు-అంతే. సుగ్రీవుని వెంట వచ్చే వానరులు కోట్ల సంఖ్యలోనే ఉన్నారు.

"మహాత్ముడైన రామునితో పెట్టుకుంటార్రా కజ్జా! గుజ్జుగుజ్జుగా పిసికేస్తాము. నుగ్గునుగ్గుగా కొట్టేస్తాము. సిగ తరిగేస్తాము. లంకలో పొగ చూసేస్తాము.

"లంక లేదిక. మీరుండరు. రావణుడు మీతో కలిసే వస్తాడు;" అన్నాడు హనుమంతుడు. ఈలోగా రావణుని ఆజ్ఞచే జంబుమాలి బయలుదేరి వస్తున్నాడు.

జంబుమాలి ప్రహస్తుని కొడుకు. గొప్ప విలుకాడు. బలశాలి. ఎఱ్ఱని వస్త్రాలు కట్టుకున్నాడు. ఎఱ్ఱని పూల దండలు వేసుకున్నాడు. ఎఱ్ఱటి కుండలాలు ధరించాడు. గొప్పదైన ధనుస్సును పట్టుకున్నాడు. పెద్ద దేహం, గుండ్రని కళ్ళు, చూడడానికే భయంకరంగా ఉన్నాడు. గాడిదలు పూన్చిన రథమెక్కి వచ్చాడు జంబుమాలి.

ముఖద్వారం పై కూర్చుని యున్న మారుతిని చూశాడు. వెంటనే ధనుష్టంకారము చేశాడు. హనుమంతునిపై వాడియైన బాణాలను ప్రయోగించాడు. ఒక బాణము హనుమంతుని ముఖంపై తగిలింది.

అసలే ఎఱ్ఱని ముఖం హనుమది. బాణం తగిలి రక్తం ఎర్రగా చిమ్మగానే, శరత్కాలములో సూర్యకిరణాలు పడి వికసించిన పద్మం లాగా కనిపించింది పవనసుతుని ముఖం. రక్తముతో తడిసిన హనుమంతుని ముఖం, ఆకాశమధ్యమున ఉన్న పెద్ద తామరపువ్వు మీద చందన చుక్కలు పడ్డట్లు కనిపించింది.

బాణాల దెబ్బలచే క్రుద్ధుడైన హనుమ పెద్దగా అరచాడు. ఆ శబ్దానికి లంకంతా బూరటిల్లి పోయింది. ప్రక్కనే ఉన్న ఒక పెద్ద రాతిబండను ఎత్తుకొని జంబుమాలిపై విసిరాడు. వాడియైన తన బాణాలతో ఆ బండను ముక్కలు చేశాడు జంబుమాలి.

విసిరిన బండ నిరుపయోగం కాగానే పెద్ద మద్దిచెట్టును పెకలించి, దానివి గుండ్రంగా త్రిప్పాడు హనుమంతుడు. వరుసగా నాలుగు బాణాలు ప్రయోగించి ఆ మద్దిచెట్టును కూడా కొట్టేశాడు జంబుమాలి.

మళ్ళీ మొదటికే వచ్చాడు మారుతి. పరిఘను చేత్తో పుచ్చుకున్నాడు. ఆ ఇనుప గడియను వేగంగా త్రిప్పి జంబుమాలి వక్షస్థలంపై కొట్టాడు హనుమంతుడు.

తస్యచైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ
న ధను ర్నరథో నాశ్వాస్తత్రా దృశ్యన్త నేషవః

"హనుమంతుడు పరిఘతో కొట్టగానే జంబుమాలి జారిపోయాడు. తల పగిలిపోయింది. చేతులు విరిగి వేరైపోయాయి. మోకాళ్ళు మచ్చుకైనా లేవు. ధనుస్సు ముక్కలై పోయింది. రథం కూలిపోయింది. గాడిదలు పచ్చడై పోయాయి. బాణాలెక్కడా కనిపించలేదు. అవయవాలు చూర్ణం కాగా చచ్చి నేలపై పడ్డాడు జంబుమాలి.

వాల్మీకిమహర్షి కమనీయ కవనవైశిష్ట్యాన్ని పై శ్లోకంలో మనం చూడవచ్చు. వడివడిగా వాయుపుత్రుడు పరిఘతో జంబుమాలిని కొడితే, విడిపోయిన జంబుమాలి అవయవాల్ని విడివిడి పదాలతో పొడిపొడిగా రచించడం వాల్మీకి పసిడికవితకు నిదర్శనము.

ఈ శ్లోకమంతా వ్యస్తపదాలతోనే రచించాడు. సమస్త పదము ఒక్కటి కూడా లేదు. సమస్తమును తెలిసిన వాల్మీకి ప్రశస్త కవితావైదుష్యమిది.

జంబుమాలి కూడా నశించినట్లు రావణుడికి తెలిసింది. క్రుద్ధుడైన రావణుని కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. వెంటనే బలవంతులైన మంత్రిపుత్రులను వెళ్ళమని ఆజ్ఞాపించాడు రావణుడు.

మంత్రిపుత్రుల మరణం

రావణుడు ఆజ్ఞాపించగానే అశ్వాలు పూన్చిన గొప్ప రథాలను ఎక్కి అమాత్యపుత్రులు ఏడుగురు బయలుదేరారు. వారు అగ్నిశిఖల వంటివారు. అస్త్రవిద్యలో ఆరితేరిన వారు. నేనంటే నేనని వారు పరస్పరము పోటీపడుతూ రథా లెక్కారు. "నా రథం ముందు-నా రథం ముందు" అంటూ సమరోత్సాహంతో కదిలారు. మెరుపులతో కూడిన మేఘాల్లాగా బయలు దేరారు.

"ఆ వానరుడెవరో, పోయిన వాళ్ళలో ఒక్కర్ని కూడా వెనక్కి పంపించడం లేదు. మరి వీళ్లు వెళ్తున్నారు;" అంటూ గోలపెట్టేశారు బంధువులు, మిత్రులు, అందరూనూ.

అశోకవనం ముఖద్వారము వద్దకు వెళ్ళగానే, ఆ ముఖద్వారంపై ఆసీనుడై వున్న హనుమ కనిపించాడు. మేఘాల్లా శోభిస్తున్న ఆ మంత్రికుమారులు, ఉరుముల వంటి రథశబ్దాలతో వచ్చి, హనుమంతునిపై బాణవర్షం కురిపించారు.

మేఘం వర్షించినట్లు హనుమంతునిపై శరవర్షం కురిసింది. వర్షంతో కప్పబడిన పర్వత రాజు లాగా ప్రకాశించాడు పవనసుతుడు. శరవేగము కంటెను శీఘ్రంగా చరించగలిగే హనుమంతుడు తనపై ఒక్క బాణం కూడా పడకుండా చరించాడు. ఇంద్రధనుస్సుల మధ్య శోభించే మేఘమండలముతో వాయుదేవుడు క్రీడిస్తున్నట్లు అగుపించాడు ఆంజనేయుడు.

ఆకాశంలో నిలబడి సింహనాదం చేసి హనుమంతుడు మంత్రిపుత్రులపై విజృంభించాడు. కొందరిని అరచేతితో బాదాడు. కొందరిని కాళ్ళతో తన్నాడు. కొందరిని పిడికిళ్ళతో గుద్దాడు. కొందరిని గోళ్ళతో గీకేశాడు. కొందరిని మోచేతులతో పొడిచాడు. కొందరిని మోకాళ్ళతో పొడిచాడు. తొడల తాకిడిచే కొందరిని, వక్షస్థలంతో ఢీకొని మరికొందరిని చంపేశాడు. హనుమంతుని అరుపుకే కొందరు ఆగకుండా పైకి వెళ్ళిపోయారు. చచ్చి పడియున్న వారిని చూచి కొందరు అక్కడే చచ్చిపోయారు.



ఏనుగులు పెద్దగా ఘీంకరించాయి. గుఱ్ఱాలు గీపెట్టాయి. రథాల కప్పు లెగిరి పోయాయి. జండాలు విరిగి పడ్డాయి. గొడుగులు చిరిగిపోయాయి. రక్తం జీవనదిలా పారింది. దారులన్నీ నెత్తురు వాగులే. అంతా భయానకం. బీభత్సం. లంక దద్దరిల్లింది.

అమాత్యకుమారు లందరూ అయిపోయారు. కూడా వచ్చిన వారు కూడా కూడి ఒక్కసారే వెళ్ళారు. మిగిలిన వారెవరైనా ఉంటే పలాయనమంత్రం పఠించారు. ఈసారి ఎవ రొస్తారో చూద్దామని మళ్ళీ గోడెక్కి కూర్చున్నాడు మారుతి. ఇదే పనైపోయింది పవన కుమారునికి.

మంత్రిపుత్రులు వధించబడ్డారని రావణునికి తెలిసింది. మనసును దిగులు కుదిపేసింది. దానిని బహిర్గతం కానివ్వకుండా లోపలే దాచుకున్నాడు రావణుడు.

రావణుని వద్ద విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘసుడు, భాసకర్ణుడు అనువారు ప్రధాన సేనాధిపతులు. యుద్ధంలో వాయువేగంతో చరిస్తారు. హనుమంతుని పట్టుకోవాలని వారిలోనూ ఉత్సాహం గోచరించింది. రావణుడు ఆ ఐదుగురిని హనుమంతుని మీదికి పంపాడు.

"చతురంగబలాన్ని వెంటబెట్టుకొని వెళ్ళి ఆ వానరుణ్ణి శిక్షించండి. ఆ వానరుని విషయంలో మీరు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. అతడు చేసింది చూస్తే ఎందుకో అతడు వానరుడని నాకు అనిపించడం లేదు. అదేదో మాయాభూతమని, మహాభూతమని నా కనిపిస్తోంది.

"పూర్వము మిమ్మల్ని వెంటబెట్టుకొని నేను గంధర్వులను, దేవతలను, అసురులను, మహర్షులను జయించి ఉన్నాను. వాళ్ళందరూ మనకు అపకారం చేయడానికి సిద్ధంగానే ఉంటారు. ఇది అలాంటిదే అయి ఉంటుంది. మీరు ఆ వానరుణ్ణి తక్కువగా అంచనా వేయకండి.

"వాలి, సుగ్రీవుడు, జాంబవంతుడు, నీలుడు, ద్వివిదుడు మొదలైన వానరులు పూర్వము నాకు తెలుసు. వీళ్ళంతా చాలా బలవంతులు. కానీ ఇంత పరాక్రమము, బుద్ధిబలము, ఉత్సాహము, రూపాన్ని అంత త్వరగా మార్చే నైపుణ్యము వారికి కూడా లేదు.

"మీరంతా గొప్ప యుద్ధవీరులే. బలవంతులే. ఇంద్రాది దేవతలు కూడా మీముందు నిలువలేరు. అది నిజమే కావచ్చు. అయినా,

తథాపి తు నయజ్ఞేన జయ మాకాంక్షతా రణే
ఆత్మా రక్ష్యః ప్రయత్నేన యుద్ధ సిద్ధిర్హి చంచలా

"యుద్ధములో జయమును పొందాలని వాంఛించే నీతికోవిదుడు, ముందు తనను తాను రక్షించుకొనుటకు ప్రయత్నించాలి. ఎందుకంటే, యుద్ధములో జయమే కలుగుతుందని చెప్పలేము;" అన్నాడు రావణుడు.

ఈ సమయంలో రావణుని ఆంతర్యం బాగా కలత చెందినట్లు తెలుస్తూ ఉంది. ఎందరో వెళ్ళినా, ఒక్కరు కూడా తిరిగి రాలేదు. పోయిన వారంతా అలా పోయారే గాని తమను తాము రక్షించుకొని తిరిగి రాలేక పోయారు, పారిపోయి వచ్చిన పిరికిపందలు తప్ప.

తనకు అపజయమే లేదని విర్రవీగుతూ ఉండిన రావణుడు జయము నిశ్చయము కాదని తొలిసారిగా పలుకుతున్నాడు. నైతికంగా రావణుడు కొద్దో, గొప్పో దెబ్బతిన్నాడని స్పష్టంగా తెలుస్తోంది. మనస్తత్వ శాస్త్ర పరిధిలో నుండి రావణుని మనసును ఇప్పుడు మదింపు వేయగలిగితే, సమరజయాన్ని కాంక్షించే యుద్ధవిశారదుడు తనను తాను రక్షించుకోవాలి అని చెప్పిన విషయము సేనాధిపతుల నుద్దేశించి పలికిందా, లేక తన మానసిక స్థితిని ప్రతిఫలింప చేసుకోవడమా అనే శంక కూడా అసమంజస మైనది కాదు.

ఐదుగురు సేనాధిపతులూ బయలుదేరారు. ముఖద్వారము వద్ద హనుమంతుడు ఉత్సాహంతో కనిపించాడు. ఉదయభానుని లాగా వెలిగిపోతున్నాడు. భయంకరమైన ఆయుధాలతో వారు హనుమంతుని ఎదుర్కొన్నారు.

దుర్ధరుడు వాడియైన ఐదు ఇనుపబాణాలను మారుతి తలపై ప్రయోగించాడు. దిక్కులు పిక్కటిల్లేలా గర్జించి, హనుమంతుడు ఆకాశంలోకి ఎగిరాడు. దుర్ధరుడు రథముతో కూడా ఆకాశంలోకి వెళ్ళి వందల కొలది బాణాలను వాయుపుత్రునిపై సంధించాడు.

హనుమంతుడు దేహాన్ని చాలా పెద్దదిగా పెంచేసి దుర్ధరుని రథముపై పడ్డాడు. రథము క్రిందపడి ముక్కలైంది. గుఱ్ఱాలు నలిగిపోయాయి. దుర్ధరుడు రథము క్రిందపడి మరణించాడు.

అది చూచి క్రుద్ధులైన విరూపాక్ష యూపాక్షులు ఆకాశంలోకి ఎగిరారు. హనుమంతుని గుండెపై ముద్గరాలతో బాదారు. హనుమంతుడు మళ్ళీ భూమి మీదకి దిగాడు. ఒక సాల వృక్షాన్ని పెకలించి దానితో విరూపాక్ష యూపాక్షులను వధించాడు.

ఐదుమంది సేనాధిపతులలో ముగ్గురు హతులయ్యారు. అది చూచి ప్రఘసుడు, భాసకర్ణుడు పట్టిస శూలాలను చేత పట్టుకొని హనుమంతునిపై దుమికారు. హనుమంతుని తీవ్రంగా కొట్టారు. హనుమ కోపోద్రిక్తుడై ఒక పర్వతశిఖరాన్ని పెకలించి వారిపై విసిరాడు.

ప్రఘస భాసకర్ణులు కూడా మరణించారు. వారు మరణించగానే మిగిలిన సైన్యాన్ని కూడా హనుమంతుడు వధించాడు.

అలా అందరిని వధించి మళ్ళీ మామూలుగానే ముఖద్వారంపై ఎక్కి కూర్చున్నాడు రాక్షససంహారానికి నిరీక్షిస్తూ.

ఐదుగురు సేనాధిపతులు హతులయ్యారని రావణునకు తెలిసింది. ఉద్ధతుడు, సమరోన్ముఖుడైన అక్షకుమారుని వైపు చూశాడు రావణుడు. చెబితే చాలన్నట్లు ఉరకలేస్తున్నాడు సమరోత్సాహంతో అక్షకుమారుడు. రావణుడు తన వైపు చూడగానే అగ్నిహోత్రుని లాగా లేచి బయలుదేరాడు అక్షకుమారుడు.

అక్షకుమారుని అసమాన పరాక్రమం

అక్షకుమారుడు రావణుని కొడుకు. గొప్ప పరాక్రమవంతుడు. ఇంద్రతేజమును బోలినవాడు. బంగారురథము నెక్కి దివ్యమైన బాణాలు ధరించి రణోన్ముఖు డయ్యాడు. మనోవేగముతో సమాన వేగముగల ఎనిమిది గుఱ్ఱాలు పూన్చిన రథంలో బయలుదేరాడు అక్షకుమారుడు. అశ్వ, గజ, రథ ధ్వనులతో పెద్ద సైన్యము అక్షకుమారుని అనుసరించింది.

ప్రళయకాలాగ్ని లాగా వెలిగిపోతున్న హనుమంతుని చూశాడు అక్షకుమారుడు. హనుమంతుని అసమాన తేజానికి ఆశ్చర్యపడ్డాడు. గౌరవదృష్టితో హనుమను చూశాడు. హనుమంతుని శక్తిసామర్థ్యాలను మదింపు వేసుకుంటూ మబ్బు తొలగిన సూర్యునిలా ప్రకాశించాడు అక్షకుమారుడు.

పదునైన మూడు బాణాలను హనుమంతునిపై సంధించి యుద్ధానికి పురికొల్పాడు అక్షకుమారుడు. ఇద్దరూ పోరాటానికి దిగారు.

వారి యుద్ధానికి భూమి దద్దరిల్లింది. సూర్యుడు పూర్ణంగా ప్రకాశించలేక పోయాడు. వాయువు మెల్లగా వీచడం కూడా మానేసింది. పర్వతాలు చలించాయి. ఆకాశము ధ్వనించింది. సాగరము తీవ్ర క్షోభకు గురియైంది. వారి అసమాన పరాక్రమమునకు దేవతలు కూడా విస్మయం చెందారు.

చక్కని చివరి భాగములు కలిగి, బంగారు పొన్నులతో ప్రకాశిస్తూ, విషపూరిత సర్పాలవలె వున్న బాణాలను హనుమంతునిపై సంధించాడు అక్షకుమారుడు. హనుమంతుని ముఖం నుండి రక్తం చిమ్మింది.

అక్షకుమారుని ప్రతాపాన్ని చూచి హనుమంతుడు సంతోషించాడు. యుద్ధోన్ముఖుడై దేహాన్ని పెంచాడు. ప్రళయకాల రుద్రుడు లాగా అక్షకుమారుని, అతని సైన్యాన్ని వీక్షించాడు హనుమంతుడు.

భయంకరమైన బాణాలతో హనుమంతుని బలంగా కొట్టాడు అక్షకుమారుడు. హనుమంతుడు గొప్ప ధ్వని చేస్తూ ఆకాశంలోకి ఎగిరాడు. అలా ఎగురుతున్న హనుమపై బాణవర్షం కురిపించాడు అక్షకుమారుడు. చూడడానికి అది మేఘము పర్వతముపై వర్షించినట్లు కనిపించింది.

అక్షకుమారుడు కూడా హనుమంతుని అనుసరిస్తూ పైకి ఎగిరాడు. మనోవేగంతో హనుమపై బాణవృష్టిని కురిపించాడు. మహావీరుడైన హనుమంతుడు బాణానికి బాణానికి మధ్య గాలిలాగా తప్పించుకుంటూ ఆకాశంలో సంచరించాడు. శ్రేష్ఠమైన బాణాలతో ఆకాశాన్నంతా కప్పేస్తున్నాడు అక్షకుమారుడు.

అక్షకుమారుని అసమాన పరాక్రమాన్ని వీక్షించిన హనుమంతుడు ఆశ్చర్యపడ్డాడు. అక్షకుమారుని గౌరవభావంతో చూశాడు. కొన్ని క్షణాలు ఆలోచనలో పడ్డాడు. శరాలతో గుండెల్ని తొలిచేస్తున్న ఈ యువకిశోరాన్ని ఎలా ఎదుర్కోవాలా! అని ఆలోచించాడు.

"అక్షకుమారుడు గొప్ప యుద్ధనైపుణ్యాన్ని చూపుతున్నాడు. ఇతని పరాక్రమము అమోఘం. ఇతని ప్రతాపం అద్భుతం. ఇతడ్ని చంపడానికి నాకు మనసు అంగీకరించడం లేదు. ఈ యువకుణ్ణి ఎవరైనా మెచ్చకుండా ఉండరు. ఇతడు దేవతలకు కూడా భయాన్ని పుట్టించగలడు.

"ఏమైనా ఇక ఈ అక్షకుమారుని ఉపేక్షించడానికి లేదు. యుద్ధంలో ఇతని ప్రతాపము ప్రతిక్షణవర్ధమానంగా ఉంది. ఇక ఇతణ్ణి వధించడమే మంచిది.

న వర్ధమానోఽగ్ని రుపేక్షితుం క్షమః

"పొంగే అగ్నిని ఉపేక్షించకూడదు" అని భావించి, శత్రుబలాన్ని గూర్చి యోచించి, తన కార్యాన్ని నిర్ణయించుకొని వేగాన్ని పుంజుకున్నాడు. వధించాలని నిర్ణయించుకున్నాడు ఆంజనేయుడు.

అక్షకుమారుని రథానికున్న ఎనిమిది గుఱ్ఱాలను అరచేతితో కొట్టాడు. వెంటనే అవి మరణించాయి. హనుమంతుని అరచేతి దెబ్బకు రథము విరిగిపోయి నేలమీద పడింది.

రథాన్ని విడచిపెట్టి, ఖడ్గాన్ని చేతిలో ధరించి ఆకాశానికి ఎగిరాడు అక్షకుమారుడు. అక్షకుమారుడు అలా ఊర్ధ్వంగా పయనిస్తుంటే స్వర్గానికి చేరుతున్న ఋషిలా భాసించాడు.

హనుమంతుడు అక్షకుమారుని సమీపించి, అతని రెండు కాళ్ళు కలిపి గరుడుడు సర్పమును పట్టుకొనునట్లు గట్టిగా పట్టుకొని, చాలాసార్లు గిర్రున త్రిప్పి నేలపై కొట్టాడు.

అక్షకుమారుని బాహువులు, తొడలు, కంఠము విరిగిపోయాయి. రక్తము ప్రవాహంలా స్రవించింది. ఎముకలు నుగ్గయ్యాయి. కళ్ళు గుజ్జయ్యాయి. కీళ్ళు ఊడిపోయాయి. శరీరం శిథిలమై పోయింది. అక్షకుమారుడు మరణించాడు. దేవతలు కూడా హనుమంతుని పరాక్రమానికి ఆశ్చర్యపోయారు.

వీరుడైన అక్షకుమారుడు మరణించాడు. బిడ్డల్ని ధర్మమార్గంలో నడపవలసిన తండ్రి, దారితప్పి ప్రవర్తిస్తూ, తన అక్రమజీవితానికి బిడ్డల ప్రాణాల్ని బలి చేసుకుంటున్న పరమ నీచుడు, దుష్టుడు రావణుడు.

అక్షకుమారుని వధించిన హనుమంతుడు అలసట తెలియనివాడై, తరువాత ఎవరొస్తారా అని నిరీక్షిస్తూ మళ్ళీ ముఖద్వారము నెక్కాడు.

సముద్రోల్లంఘనం అనే అద్భుతకార్యమును సాధించి, మహా శక్తిమంతుడైన అక్ష కుమారుని రామభక్తి అనే శక్తితో వధించిన రామదూతను ఈవిధంగా కీర్తిస్తారు త్యాగరాజు.

పాహి రామదూత, జగత్ప్రాణ కుమార, మాం
వాహినీశ తరణ, దశవదన సూను తనుహరణ ॥ పాహి ॥

హనుమదింద్రజిత్తులు

అక్షకుమారుడు మరణించాడనే వార్త వినగానే రావణుడు గతుక్కుమన్నాడు. కుమారుడు మరణించినందుకు దుఃఖం పొంగి వచ్చింది. ఎవరికీ తెలియనీయక లోపలే దాచేసుకున్నాడు. స్థిమితంగా కనిపిస్తూ, ఇంద్రజిత్తును వెళ్ళమని ఆజ్ఞాపించాడు.

"అస్త్రశస్త్రాలలో నీవు ఆరితేరిన వాడవు. సురాసురులను గడగడ లాడించావు. బ్రహ్మదేవుని నుండి వరాలు పొందావు. నీ ముందు యుద్ధంలో నిలబడే ధైర్యశాలురు లేరు. నీకు భుజబలముంది. తపోబలమూ వుంది. ఎప్పుడు ఏది ఎలా చెయ్యాలో నీకు తెలుసు.

"ఏదైనా ఘోరసమరము వచ్చినపుడు నా మనసులో నువ్వే మెదుల్తావు. వెంటనే అనుకుంటాను విజయము నాదే నని.

"చూశావు కదూ! కింకరులు హతులయ్యారు. జంబుమాలి నశించాడు. అమాత్య కుమారులు చంపబడ్డారు. సేనాధిపతులు మృతి చెందారు. నీ ప్రియసోదరుడు అక్షకుమారుడు కూడా వధించబడ్డాడు.

"నా శక్తి నీలో ఉందే గాని వారెవ్వరిలోనూ లేదు. వెళ్ళు. కార్యభంగము లేకుండా ప్రవర్తించు. విజయంతో తిరిగి రా!

అవశ్య మేవ బోద్ధవ్యం కామ్యశ్చ విజయో రణే

"యుద్ధములో విజయాన్ని కాంక్షించాలి. ఇదే రాజధర్మం;" అన్నాడు రావణుడు.

సేనాధిపతుల్ని హనుమంతుని మీదికి పంపేటప్పుడు రావణుడు ఒక విషయం చెప్పాడు. యుద్ధములో జయమే కలుగుతుందని చెప్పలేము. జయమును వాంఛించే నీతి కోవిదుడు ముందు తనను తాను రక్షించుకోవాలి అని చెప్పాడు. ఇప్పుడు విజయాన్ని కాంక్షించడమే రాజధర్మం అని ఇంద్రజిత్తుతో చెప్తున్నాడు.

వెళ్ళిన వారంతా మరణిస్తున్నారే గాని తిరిగి రావడం లేదు అని భావించి, తమను రక్షించుకోమని సేనాధిపతులకు సలహా ఇచ్చాడు. ఇప్పుడు ఈ దశలో తన అవగాహనను రావణుడు మార్చుకున్నాడు.

హనుమంతుని జయించినవాడు తిరిగి వస్తాడు గాని జయించలేనివాడు మరణించి తీరుతాడు అనే నిర్ణయానికి వచ్చాడు. అందువల్ల విజయాన్ని సాధించి రమ్మంటున్నాడు. ఇంద్రజిత్తు హతుడైతే ఆ తరువాత రావణుడే కదలవలసి ఉంటుంది.

తండ్రి చెప్పిన మాటలు ఇంద్రజిత్తులో రణోత్సాహాన్ని రెండింతలు పెంచాయి. రావణునకు ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు ఇంద్రజిత్తు. యుద్ధానికి బయలుదేరాడు. ఉత్తమమైన రథానెక్కి.

హనుమంతుడు ఇంద్రజిత్తును చూశాడు. అతని ధనుష్టంకారమును విని సంతోషించాడు.

ఇంద్రజిత్తు గొప్ప బాణాలను హనుమంతునిపై ప్రయోగించాడు. వాటిని నిష్ఫలం చేసి హనుమంతుడు గగనవిహారం చేశాడు. చిత్రవిచిత్రము లైన భయంకర శరాలను ఇంద్రజిత్తు ప్రయోగిస్తుంటే వాటి మధ్య వాయువులా హనుమంతుడు దూసుకొని పోతున్నాడు.

హనుమంతునిలో లోప మెక్కడుందో, అతనిని ఎలా జయించాలో ఇంద్రజిత్తుకు అర్థం కాలేదు. ఇంద్రజిత్తు లోప మెక్కడుందో హనుమంతునికి అవగతం కాలేదు.

విఫలం కావడానికి వీలులేని శక్తివంతమైన శరాలను కూడా సంధించాడు ఇంద్రజిత్తు. కానీ ప్రయోజనం కనిపించడం లేదు. ఇంద్రజిత్తు ఆలోచించాడు.

"ఇతణ్ణి వధించడం సాధ్యం కాదు. ఒకవేళ బంధించడాని కేమైనా లొంగుతాడా?" అని ఆలోచించాడు. వెంటనే ఇంద్రజిత్తు హనుమంతునిపై బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు.

బ్రహ్మాస్త్రముచే బంధించబడిన హనుమంతుడు కదలలేక నేలమీద పడ్డాడు. తాను అస్త్రబంధంలో ఉన్నట్లు ఆంజనేయుడు గ్రహించాడు. పూర్వము బ్రహ్మదేవుడు తనను అనుగ్రహించిన విషయాన్ని స్మృతికి తెచ్చుకొని బ్రహ్మదేవుని ప్రార్థించాడు.

"ఇది బ్రహ్మాస్త్రము. దీనికి కట్టుబడి యుండుటయే నా ధర్మము" అని భావించి బ్రహ్మదేవునకు నమస్కరించాడు హనుమంతుడు.

రాక్షసు లందరూ చుట్టూచేరి హనుమంతుని జనుపనార తాళ్ళతో, నారతాళ్ళతో కట్టి బంధించారు. ఎప్పుడైతే రాక్షసులు హనుమంతుని తాళ్ళతో బంధించారో వెంటనే బ్రహ్మాస్త్రము హనుమంతుని విడిచేసింది. మరొక దానితో బంధిస్తే అస్త్రబంధము పట్టుకోదు.

ఇది చూచి ఇంద్రజిత్తు ఆందోళనలో పడ్డాడు. రాక్షసులు బ్రహ్మాస్త్రము యొక్క ప్రాశస్త్యాన్ని తెలియక తన ప్రయత్నాన్ని వృథా చేశారని భావించాడు. ఒకసారి అస్త్రము విఫలమైతే అదే అస్త్రము మళ్ళీ ఉపకరించదు.

ఈలోగా రాక్షసులు బంధించబడియున్న హనుమంతుని రావణుని వద్దకు ఈడ్చుకొని పోతున్నారు. ఈవిధంగా నైనా రావణుణ్ణి చూసే అవకాశం కలిగిందని సంతోషించాడు హనుమంతుడు.

హనుమంతుని తీసికొని వెళ్ళి "ఇతడే ఆ వానరుడు" అని రావణునికి చూపారు రాక్షసులు. హనుమంతుని వివరాలను గూర్చి రాక్షసులు ఒకరితో ఒకరు ముచ్చటించు కుంటున్నారు.

"వీడ్ని చంపండి. ఇంకా చూస్తారేం? కాల్చేయండి. అందరూ కలిసి తినేయండి" అన్నారు కొందరు రాక్షసులు.

రావణుడు హనుమంతుని చూశాడు. కళ్ళెర్ర చేసి "ఇతని సంగతి ఏమిటో తెలుసుకోండి;" అన్నాడు మంత్రులతో రావణుడు.

"ఎవరు నువ్వు? నిన్ను పంపిందెవరు?" అని మంత్రులు హనుమంతుని ప్రశ్నించారు. "నేను సుగ్రీవుని దూతను. ఆ మహారాజు పంపగా వచ్చాను" అన్నాడు వాయుపుత్రుడు.

హనుమ ద్రావణులు

హనుమంతుడు రావణుని చూశాడు. ముత్యాలు తాపి తళతళ మెరుస్తున్న బంగారు కిరీటాన్ని ధరించి వున్నాడు రావణుడు. స్ఫటికశిలతో చేసిన సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు. వజ్రాలు, మణులు పొదిగిన బంగారు ఆభరణాలు అలంకరించుకొని ఉన్నాడు.

పట్టుబట్టలు ధరించి, ఎఱ్ఱచందనాన్ని పూసికొని యున్న అతని దేహంపై బొమ్మలు కూడా చిత్రింపబడి వున్నాయి పచ్చబొట్లతో. పది తలలతో ప్రకాశిస్తున్నాడు. ఎదపై ముత్యాల హారముంది. నల్లని కాటుకకొండ లాగా మెరిసిపోతున్నాడు.

అందమైన స్త్రీలు వింజామరలు వీస్తున్నారు. మంత్రులు చుట్టూ నిలబడి వున్నారు. దేవతల మధ్య దేవేంద్రుని లాగా ప్రకాశిస్తున్నాడు రావణుడు. రావణుని చూచి హనుమంతుడు తనలో తాను ఇలా భావించాడు.

"ఆహా! ఏమి ఇతని వైభవము! ఏమి ధైర్యము! ఏమి బలము? ఏమి తేజము! సర్వ లక్షణ సంపన్నత్వము విభ్రాజమాన మవుతోంది. నన్ను కూడా బద్ధుణ్ణి చేసి తన దగ్గరికి రప్పించుకున్నాడు.

"ఇతడు అధర్మపరుడు. అలా కాకుండా ఉన్నట్లయితే దేవేంద్రుని మించి శోభించేవాడు. ఇంద్రపదవిని పొంది దేవతలకు ప్రభువై ఉండేవాడు. ఇతడి దుష్టకర్మల వల్ల మూడు లోకాలూ కృశిస్తున్నాయి. దుఃఖిస్తున్నాయి. వీడు కోపిస్తే ప్రపంచమంతా జలమయం చేయగలడు;" అని ఆలోచించాడు హనుమంతుడు.

రావణుడు హనుమంతుని తదేకంగా చూచి తనలో తాను ఇలా మాట్లాడుకున్నాడు. "ఇతడు ఎవడై ఉంటాడు? పూర్వం నేను కైలాసపర్వతాన్ని కదిలించినపుడు నందికేశ్వరుడు నన్ను శపించాడు. బహుశ అతడే ఈ వానరరూపంలో అగుపిస్తున్నాడా?

"లేక వీడు బాణాసురుడా!" అని ఆలోచిస్తూ, క్రుద్ధుడై ప్రహస్తుని వైపు తిరిగి ఇలా పలికాడు.

"ప్రహస్తా! అడుగు ఈ దురాత్ముణ్ణి. ఎక్కడ నుండి వచ్చావు? ఎందుకు వచ్చావు? వనాన్ని ఎందుకు పాడు చేశావు? రాక్షసాంగనలను ఎందుకు భయపెట్టావు? అని వీణ్ణి అడుగు. ప్రవేశింప శక్యము గాని లంకలో ఎందుకు ప్రవేశించాడో చెప్పమను. యుద్ధము ఎందుకు చేశాడో అడుగు, ఆ దుష్టుణ్ణి;" అన్నాడు రావణుడు. రావణుని ఆజ్ఞకు తలవంచిన ప్రహస్తుడు హనుమంతుని వైపు తిరిగి ప్రశ్నించాడు.

"ఓ వానరా! కాస్త ఊరట పొందు. భయపడకు. నిన్నేమీ చేయము. ఉన్నదున్నట్లు చెప్పేయి. నిన్ను ఇక్కడికి ఎవరు పంపారు? ఇంద్రుడా! నిజం చెప్పు. భయపడకు. నిజం చెప్తే నిన్ను ఇప్పుడే విడిచిపెట్టేస్తాము.

"గూఢచారి లాగా లంకలోకి ప్రవేశించావు? నిన్ను పంపింది కుబేరుడేనా! లేక యముడా! మరెవరు? వరుణుడా? విష్ణువేమన్నా పంపాడా? నీవేమో వానరరూపంలో ఉన్నావు. కానీ నీ పరాక్రమము వానరుని పరాక్రమం కాదే! నిజం చెప్పు. విడిచేస్తాము.

"అబద్ధం చెప్పావా, అసలుకే మోసం వస్తుంది. నీ జీవితం సమాప్త మవుతుంది;" అని పలికాడు. ప్రహస్తుని మాటలను ఆలకించిన హనుమంతుడు రావణుడికి సమాధానం చెప్పాడు.

రావణుడు హనుమంతుని తాను ప్రశ్నించకుండా ప్రహస్తుని అడగమన్నాడు. వానరునితో మాట్లాడడం తన స్థాయికి భంగకరమని భావించి ప్రహస్తుని చేత అడిగించాడు రావణుడు.

హనుమంతుడు కూడా ప్రహస్తునికి చెప్పకుండా రావణునితోనే పలుకుతున్నాడు. ప్రహస్తునికి ప్రత్యుత్తరం ఇవ్వడం తన స్థాయికి భంగకరమని భావించి అలా ప్రవర్తించాడు పవనసుతుడు.

"నేను ఇంద్రుడు పంపిస్తే రాలేదు. వరుణుడు పంపితే రాలేదు. కుబేరుని చేత పంపబడ్డవాణ్ణి కాను. నన్ను విష్ణువు కూడా పంపలేదు. నేను మారువేషంలో రాలేదు. నా రూపం ఇదే. నేను వానరుణ్ణే. లంకకు రావాలని భావించే వచ్చాను.

"నిన్ను చూడాలనుకున్నాను. నాకెలా సాధ్యపడుతుంది? అందుకని వనాన్ని పాడుచేశాను. అది చూసి బలవంతులైన రాక్షసులు నా మీదికి కాలుదువ్వారు. నన్ను నేను రక్షించుకోవాలి కదా! అందుకే వారితో యుద్ధం చేశాను.

"నన్ను అస్త్రాలతో బంధించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. నాకు కూడా బ్రహ్మదేవుని వరముంది. రాక్షసులు నన్ను నారతాళ్ళతో బంధించగానే బ్రహ్మాస్త్రము నన్ను విడిచేసింది. అయినా బంధింపబడ్డట్టే వుండినాను. ఎందుకో తెలుసా! నిన్ను చూడాలని.

"ఒక రాజకార్యం మీద నేను ఇక్కడికి వచ్చాను. నేనెవరో కాదు. మహాతేజోవంతుడైన రాముని దూతను. అర్థమయిందా! ఒక మంచి మాట చెబుతాను. విను.

"వానరరాజు సుగ్రీవుడు పంపితే వచ్చాను నేను. వానరప్రభువైన నీ సోదరుడు సుగ్రీవుడు నిన్ను కుశల మడిగాడు. ధర్మార్థాలకు సంబంధించినవి, ఇహపరాలకు ఉపకరించేవి కొన్ని మాటలు చెప్పి పంపాడు సుగ్రీవుడు. చెప్తాను. విను.

"దశరథుడనే రాజు ఉండేవాడు. లోకానికి తండ్రి లాంటివాడు. ఇంద్రునితో సమానుడు. ఆయన పెద్దకుమారుడే మాకు ప్రభువైన రాముడు. ధర్మాత్ముడు. తండ్రి మాటను పాలించుటకు భార్యను, సోదరుని వెంటబెట్టుకొని దండకారణ్యంలో ప్రవేశించాడు.

"దశరథుని కోడలు, జనకుని పుత్రిక, రాముని భార్య అయిన సీతమ్మ అరణ్యంలో కనిపించకుండా పోయింది. ఆమెను అన్వేషిస్తూ తమ్ముడైన లక్ష్మణునితో కలిసి రాముడు ఋష్యమూకానికి వచ్చాడు.

"రామసుగ్రీవులకు మైత్రి ఏర్పడింది. సీతను అన్వేషించే బాధ్యతను సుగ్రీవుడు స్వీకరించాడు. కిష్కింధను సుగ్రీవునికి అప్పచెప్పే బాధ్యతను రాముడు గ్రహించాడు. పరస్పరము అలా శపథం చేసుకున్నారు.

"రాముడు వాలిని చంపేశాడు. వానర భల్లూక రాజ్యాలకు సుగ్రీవుడు ప్రభువయ్యాడు. వాలి ఎవరో నీకు లోగడే తెలుసు కదా! బలశాలియైన వాలిని ఒక్క బాణంతో కొట్టేశాడు రాముడు.

"సీతమ్మను వెదికే ప్రయత్నంలో వానరవీరుల నందరిని నియమించాడు సుగ్రీవుడు. అన్ని దిక్కులకు వెళ్ళి సీతమ్మను అన్వేషిస్తున్నారు వానరులు. పాతాళంలో గాలిస్తున్నారు. ఆకాశంలో కూడా అన్వేషిస్తున్నారు. మహాబలశాలురైన వానరులలో కొందరు గరుత్మంతుని వంటివారు. కొందరు వాయుదేవుని వంటివారు. వారి గమనాన్ని ఎవ్వరూ అడ్డగించలేరు. మనోవేగంతో సంచరిస్తారు.

"నేను వాయుదేవుని ఔరసపుత్రుణ్ణి. నన్ను హనుమంతుడు అంటారు. సీతమ్మను అన్వేషించే కార్యంలో శతయోజన విస్తీర్ణము గల సముద్రాన్ని దాటివచ్చాను. లంకలో తిరిగి తిరిగి చివరికి సీతమ్మను చూశాను.

"నీవు ధర్మార్థములు తెలియనివాడివి కావు. తపశ్శాలివి కూడా. పరదారను నీ ఇంట్లో ఉంచుకోవచ్చా? బుద్ధిశాలివి. ధర్మానికి విరుద్ధమైన కార్యము, మొదటికే మోసం తెచ్చే పని చేయవచ్చా?

"రావణా! ముల్లోకాలలో కూడా రామునికి అపకారం చేసినవాడు ఎవ్వడూ సుఖంగా ఉండలేడు. ఇది ధర్మసమ్మతమైన మాట. ఈ మాటే సుగ్రీవుడు నీతో చెప్పమన్నాడు.

"నా మాట విను. సీతను రాముని వద్దకు చేర్చేయి. నేను సీతమ్మను దర్శించాను. గొప్ప అపాయాన్ని కోరి తెచ్చుకోకు.

నేరం జరయితుం శక్యా సాసురైః రమరైః రపి
విష సంస్పృష్ట మత్యర్థం భుక్త మన్న మివౌ జసా

"విషం కలిపిన ఆహారాన్ని ఎవరూ జీర్ణించుకోలేరు. దేవాసురులు ఏకమైనా సీతమ్మను విలుపుకోలేరు.

"తపోఫలంగా, ధర్మఫలంగా నువ్వు దీర్ఘాయువును పొందియున్నావు. దాన్ని నశింపచేసుకోకు. సురాసురుల నుండి మరణం లేనట్లు నీవు వరాన్ని పొంది యున్నావు. అంత మాత్రాన నీ మరణానికి కారణం లేదని భావించకు.

"సుగ్రీవుడు ఎవరు? అతడు దేవుడు కాడు. రాక్షసుడు కాడు. గంధర్వుడు కాడు. పన్నగుడు కాడు. యక్షుడూ కాడు. మరి, సుగ్రీవుని నుండి నీ ప్రాణాల్ని ఎలా కాపాడు కుంటావు?

"నీవు చేసిన తపస్సుకు, ధర్మానికి సంబంధించిన ఫలాన్ని ఇంతవరకు అనుభవించావు. నీ అధర్మానికి ఫలితం నీకు రాబోతూవుంది. చతురంగబలముతో కూడిన నీ లంకా పట్టణాన్ని నేను ఒక్కడినే నాశనం చేయగలను. కాని అది రామునికి అభిమతం కాదు.

"సీతను అపహరించిన వానిని తానే నాశనం చేస్తానని వానర భల్లూక వీరుల సమక్షంలో రాముడు ప్రతిజ్ఞ చేశాడు. రాముడికి అపకారం చేసి ఇంద్రుడు కూడా బట్టకట్టలేడు. ఇక నీ విషయం ప్రత్యేకించి చెప్పాలా?

యాం సీతే త్యభిజానాసి యే యం తిష్ఠతి తే వశే
కాలరాత్రీతి తాం విద్ధి సర్వలంకా వినాశినీమ్ ॥

ఎవరిని నీవు సీత అని భావిస్తున్నావో, ఏ స్త్రీ నీ అధీనంలో ఉందో, ఆమె ఈ లంకనంతా నాశనం చేసే కాళరాత్రి అని తెలుసుకో.

"సీత అనే యమపాశాన్ని కంఠానికి చుట్టుకోకు. నీకు ఏది హితమో ఆలోచించుకో;" అన్నాడు హనుమంతుడు. హనుమంతుని మాటలు విని క్రుద్ధుడైన రావణుడు "వీణ్ణి వధించండి" అని ఆజ్ఞాపించాడు.

విభీషణుని విజ్ఞాపనము

హనుమంతుని వధించమని రావణుడు పలకడం రావణుని సోదరుడైన విభీషణునికి నచ్చలేదు. వాక్చాతుర్యము గల విభీషణుడు దూతవధ జరగకూడదని భావించి సోదరుడు, ప్రభువు అయిన రావణునితో ఇలా పలికాడు.

"మహారాజా! నన్ను క్షమించు. రోషం త్యజించు. అనుగ్రహించి నా మాట ఆలకించు. యుక్తాయుక్తములు తెలిసిన ప్రభువులు దూతను వధించరు.

"మహావీరా! ఈ వానరుణ్ణి వధించడం రాజధర్మానికి తగని విషయం. లోకాచారానికి కూడా ఇది విరుద్ధమే. ఇది నువ్వు చెయ్యదగిన పని కాదు.

"నీకు ధర్మాధర్మాలు తెలుసు. రాజధర్మంలో నీవు ప్రాజ్ఞుడవు. నీకు తెలియని పరమార్థ మేమున్నది? నీలాంటి విపశ్చితులు కూడా ఈవిధంగా రోషానికి లొంగిపోతే, శాస్త్రాధ్యయనమే నిష్ప్రయోజనమని లోకం భావిస్తుంది.

"శత్రుసంహారకా! నీవు అసమాన పరాక్రమవంతుడవు. ప్రసన్నుడివి కా! మంచి చెడులను విచారించి దూతను దండించు" అన్నాడు విభీషణుడు.

న పాపానాం వధేపావం విద్యతే శత్రుసూదన
తస్మాదేనం వధిష్యామి వానరం పావచారిణమ్

"ఓ శత్రుసంహారకా! విభీషణా! పాపిని వధించడం పాపం కాదు. ఈ వానరుడు పాపాచారి. వీడ్ని ఇప్పుడే వధిస్తాను;" అన్నాడు రావణుడు.

దూతను వధించడ మనేది అధర్మమైన మాట. దుష్టులకు అంగీకారమైన మాట. రోషంతో పలికే రావణునికి సముచితమైన మాటను చెప్పాడు విభీషణుడు.

"లంకాధిపతీ! రాక్షసేశ్వరా! ధర్మయుతమైన ఒక్క మాటను ఆలకించు. దూతను వధించడం ఏ దేశంలోనూ జరుగలేదు. ఏ కాలంలోనూ జరుగలేదు. ఇది మహాత్ములు చెబుతున్న మాట.

"ఈ వానరుడు తప్పు చేసింది వాస్తవమే. చెప్పలేనంత దుఃఖాన్ని కలిగించాడు. నిజమే. అయినా దూతను వధించడము అనే కార్యాన్ని ఎవ్వరూ మెచ్చరు. దారి తప్పిన దూతను వధించడానికి అనేక దండనలు ఉన్నాయి కదా!

"అవయవ ఖండనము, శరీరమును వికారంగా మార్చడము, కొరడా దెబ్బలు, ముండనము చేయించుట, చెరగని ముద్రలను శరీరంపై నిలుపుట-ఇవన్నీ దూతకు విధించవలసిన దండములని బుధజనుల మాట. దూత వధ్యుడు కాడు అనేది సర్వజన సమ్మతము. ధర్మార్థోపబృంహితము.

"ధర్మనిర్ణయము నందు, లోకవ్యవహార శాస్త్రము నందు నిన్ను మించిన వారు లేరు. సురాసురులను ఎందరినో వధించి గొప్ప వీరుడని పేరు సంపాదించావు. ఈ వానరుణ్ణి చంపడం వల్ల ఏమి ప్రయోజనము? దూతను వధించాడనే చెడ్డపేరు నిలిచిపోతుంది. కాల మెరుగని కార్యమిది.

"ఈ వానరుడు దూత. మరొకరు పంపితే వచ్చిన వాడే కాని స్వేచ్ఛతో వ్యవహరించిన వాడు కాడు. ఇతనిని చంపినా లాభం లేదు. అదేదో రామలక్ష్మణుల విషయంలో చేయడమే మంచిది" అన్నాడు ధర్మాత్ముడైన విభీషణుడు.

"తమ్ముడూ! విభీషణా! నీవు చెప్పింది కూడా బాగానే ఉంది. దూతను వధించుట నిందనీయమే. వీణ్ణి వధించడం మానేసి మరేదైనా దండన విధిస్తాను. కోతికి తోకే భూషణము. తోకకు నిప్పు అంటించండి. కాలిపోయిన తోకతో తిరిగి వెళ్ళనీ ఈ కోతిని. తోక లేని ఈ వానరుణ్ణి బంధువులు, మిత్రులు, జ్ఞాతులు పరిహసించనీ.

"తోకకు నిప్పంటించి పట్టణ వీధులలో ఊరేగించండి ఈ వానరుణ్ణి," అని ఆజ్ఞాపించాడు రావణుడు.

ముందే క్రుద్ధులై యున్న రాక్షసులు రావణుని మాటలు విని రోషంతో మరీ మండిపడ్డారు. పాత నూలుబట్టలు తెచ్చి బాగా చుట్టారు తోకకి. నూనె తడిపారు బాగా. నిప్పు అంటించారు. తోక అంటుకుంది. మండుతోంది.

రాక్షసు లందరూ కలసి మళ్ళీ హనుమంతుని బంధించి కాలుతున్న తోకతో నడిపించడం ప్రారంభించారు. హనుమంతుని చూడడానికి, బంధుమిత్ర సమేతంగా రాక్షసు లందరూ కదలి వచ్చారు. హనుమంతుడు తనలో తాను ఇలా భావించాడు;

"ఈ రాక్షసులు నన్ను బంధించలేరు. అవసర మనుకుంటే ఈ క్షణంలోనే నేను బంధాలు త్రెంచుకొని వీళ్ళందరిని వధించగలను. నేను రామకార్యంలో ఉన్నాను.

"యుద్ధంలో దుష్టులైన ఈ రాక్షసుల నందరినీ నేను ఒక్కణ్ణే చంపగలను. రామాజ్ఞ లేనిదే నేను ఆ పని చేయను. వీరు నన్ను లంక అంతా త్రిప్పుతారేమో. త్రిప్పనీ, ఏమైంది? లంకను మళ్ళీ ఒక్కసారి చూస్తాను. నేను ఈ లంకాపట్టణాన్ని, కోటని, చైత్యప్రాసాదాల్ని రాత్రి సమయంలో చూశాను. ఇప్పుడు పగటి కాంతిలో చక్కగా చూస్తాను;" అని భావించాడు హనుమంతుడు.

హనుమంతుని భావము రాక్షసులకు తెలియదు. రాక్షసులందరు గుమిగూడి శంఖాలు, భేరీలు మ్రోగించారు. హనుమంతుని అపరాధాలను సింహనాదం చేస్తూ, హనుమంతుని నగరమంతా త్రిప్పారు. తోక కాలుతూనే ఉంది.

"ఇతడు గూఢచారి. మహాపాపి. వీణ్ణి శిక్షిస్తున్నాం" అని అరుస్తూ నడుస్తున్నారు రాక్షసు లందరూ. స్త్రీలు, బాలురు, వృద్ధులు ఇళ్ళనుండి బయటికి వచ్చి వింతగా వీక్షిస్తున్నారు హనుమంతుని.

హనుమంతుని తోకకు నిప్పంటించి, లంకానగర వీధులలో నడిపిస్తూ అనేక విధాలుగా బాధిస్తున్నారు రాక్షసులు. కొందరు తిడుతున్నారు. కొందరు రాళ్ళు విసురుతున్నారు. కొందరు అపహాస్యం చేస్తున్నారు. మరికొందరు భయంకరంగా నిందిస్తున్నారు.

భగవంతుని కార్యంలో భక్తులు నిర్విరామంగా శ్రమిస్తూ సాగరాన్ని దాటేటంతటి శ్రమను అనుభవిస్తూ ఉంటే, లౌకికులు వారిని నిందిస్తూ, బాధిస్తూ, కష్టపెడుతూ, అపహాస్యం చేస్తుంటారు. చివరికి తగలబెట్టడం కూడా చేస్తుంటారు.

భక్తులు వాటి నన్నిటిని సంతోషముతో భరిస్తారు. బాధల్ని బోధలుగా భావించి ఆనందంతో స్వీకరిస్తారు. లోకులు పెట్టే కష్టాల్ని భరిస్తూ, మంటల్ని సహిస్తూ, తాము కాలిపోకుండా లోకంలోని దౌష్ట్యాన్ని దగ్ధం చేస్తారు. హనుమంతుని తోక కాలిపోలేదు. దుష్టత్వానికి నిలయమైన లంక దగ్ధమైపోయింది. చెడు ఎప్పుడైనా చెడిపోయేదే.

సీతమ్మను హనుమంతుడు దర్శించిన తరువాతే లంకాదహనం జరిగింది. ఆత్మదర్శనమైన వారే అధర్మాన్ని దగ్ధం చేయగలరు. జ్ఞానాగ్ని అజ్ఞాన జనితమైన కర్మల నన్నిటినీ దగ్ధం చేస్తుంది.

జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః

"ఎవని కర్మలు జ్ఞానమనే అగ్నిచేత దహింపబడి ఉంటాయో అట్టివాడు పండితుడని బుధజనులు పలికారు" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత-జ్ఞానయోగములో తెలిపారు.

శ్రీరాముని, సీతమ్మను దర్శించిన తరువాత కూడా బాధలు తప్పలేదు హనుమంతునికి. అరణ్యంలో మృగాల బెడద తప్పుతుందా! బాధల ప్రపంచంలో ఎవరిని వదలి పెడుతాయి బాధలు?

సాగరాన్ని దాటగలిగిన మహోన్నత వ్యక్తిని నీచులు నిందిస్తారా! దుష్టులు బాధిస్తారా! శిల్పి ఉలితో కొడితే శిలకు రూపం వస్తుంది. కాలినపుడే బంగారుకు వన్నె వస్తుంది. కష్టాలు సాధువులకు కమనీయ బాటను నిర్మిస్తాయి.

శంకరాచార్యులు, తుకారాం, జ్ఞానదేవ్, మీరా, జనాబాయి, ఏకనాథ్, కబీర్, రామదాసు, బుద్ధుడు, జినుడు, వివేకానంద, రామతీర్థ లాంటి మహనీయుల నందరినీ బాధించింది ఈ మానవసమాజం.

బాధించిన వారంతా చరిత్రహీనులై, దోమల్లాగా, చీమల్లాగా రాలిపోతే, బాధపడిన మహనీయు లందరూ చరిత్రపురుషులై, మహాత్ములై, కీర్తిమంతులై శోభిస్తున్నారు. ఇదే గత చరిత్ర నిరూపించిన నగ్నసత్యం.

కొందరు రాక్షసాంగనలు వెళ్ళి హనుమంతుని తోకకు నిప్పంటించిన విషయాన్ని సీతమ్మకు చెప్పారు. హనుమంతుని తోకకు నిప్పంటించి వీధుల్లో త్రిప్పుతున్నారనే మాటను వినగానే సీతమ్మ దుఃఖంతో కుమిలిపోయింది. రావణుడు తనను అపహరించిన సమయంలో ఎంత వ్యథను అనుభవించిందో అంతటి బాధను మళ్ళీ ఈ సమయంలో అనుభవించింది. వెంటనే అగ్నిదేవుని ప్రార్థించింది.

"అగ్నిదేవా! నేను యథార్థంగా పతిసేవ చేసి ఉంటే, నా తపస్సులో దోషము లేకుంటే, నా పాతివ్రత్యం పవిత్రమే అయితే హనుమంతునికి చల్లగా ఉండుగాక!

"రామునికి నామీద ఏపాటి దయ ఉండినా, నా అదృష్టం ఏమాత్రము మిగిలివున్నా, హనుమంతునికి వేడి తగలకుండుగాక!" అని ప్రార్థించింది. చల్లని తల్లి సీతమ్మ దీవెనలు కపిశ్రేష్ఠునికి అండగా నిలిచాయి. హనుమంతుడు ఇలా భావిస్తున్నాడు.

"ఇదేమిటి? చాలా ఆశ్చర్యంగా ఉంది. మంట ఏమో పెద్దగా లేస్తోంది. నాకేమో వేడి తగలడం లేదు. పైగా తోక చివర వెన్నముద్ద ఉంచినట్లు చల్లగా ఉంది.

"ఇది పవిత్రమైన రామకార్యం కనుక సముద్రుడు, మైనాకపర్వతము నన్ను కరుణించారు. అగ్నిదేవుడు కూడా అలాగే అనుగ్రహిస్తున్నాడేమో.

"అమ్మ దయ నామీద వుంది. రాముని కరుణ నాకు తోడుగా ఉంది. అగ్నిదేవుడు మా తండ్రి వాయుదేవునకు స్నేహితుడు. అందుచేత అగ్ని నన్ను దహించుట లేదు;" ఈ విధంగా ఆలోచిస్తున్న ఆంజనేయుడు పైకి ఎగిరి సింహనాదం చేశాడు. నగరద్వారము పైకి వెళ్ళాడు.

దేహాన్ని పర్వతమంత పెంచేశాడు. బంధాలను త్రెంచేసుకున్నాడు. మళ్ళీ పరిఘను చేత పట్టుకున్నాడు. ఆ ఇనుప పరిఘతో రాక్షసుల్ని తుక్కుతుక్కుగా కొట్టి చంపాడు. తోక చుట్టూ మంటలు లేస్తూ ఉంటే, కిరణాలతో శోభించే ఉదయభానునిలా ప్రకాశించాడు. తనలో తాను ఇలా ఆలోచించుకున్నాడు.

లంకాదహనము

"అశోకవనాన్ని ధ్వంసం చేశాను. గొప్పవాళ్ళైన రాక్షసుల్ని హతమార్చాను. చాలా వరకు సైన్యాన్ని తుదముట్టించాను. ఇక కోటను కాల్చేయడం ఒక్కటే మిగిలుంది. అదికూడా చేసి వెళ్తే ఆ తరువాత రాముడు చేయవలసిన కార్యం కొద్దిగానే ఉంటుంది.

యోహ్యయం మమ లాంగూలే దీప్యతే హవ్యవాహనః
అస్య సంతర్పణం న్యాయం కర్తుమే భిర్గృహోత్తమైః

"అగ్నిదేవుడు నాకు ఎంతో మేలు చేశాడు. కనుక ఆయనకు గొప్ప విందు చేస్తాను. రావణుని ఉత్తమ భవనాలతో అగ్నికి సంతర్పణ చేస్తాను;" అని భావించి, లంకలోని గృహాలపై సంచరిస్తూ ఇళ్ళన్నీ అగ్నితప్తం చేస్తున్నాడు.

ఒక గృహం కాగానే మరొక గృహంపై వాలుతూ, మండుతున్న వాలాన్ని గుండ్రంగా త్రిప్పుతూ, మెరిసే మేఘం లాగా సంచరిస్తూ లంకలోని గృహాలను దగ్ధం చేస్తున్నాడు.

ప్రహస్తుని గృహాన్ని ప్రచండంగా కాల్చేశాడు. మహాపార్శ్వుని మేడ మారణహోమంగా మారిపోయింది. వజ్రదంష్ట్రశుక, సారణుల భవనాలు కూలిపోయాయి. ఇంద్రజిత్తు భవనం కాలిపోయింది. ఒక్క విభీషణుని భవనాన్ని విడిచిపెట్టి మిగిలిన అన్ని భవనాలను అగ్నిదేవునికి ఆహుతి చేశాడు ఆంజనేయుడు.

హనుమంతుని "లోకయజ్ఞం" లో విభీషణుడు తప్ప అందరు రాక్షసులు పాలు పంచుకున్నారు. కొందరు గుడ్డలు అర్పించారు. కొందరు నూనె సమర్పించారు. కొందరు నెయ్యి సమర్పించారు. మరికొందరు మంట పెట్టారు. ఏమీ చేయనివాడు విభీషణుడే.

యజ్ఞంలో పాల్గొన్నవారికి ప్రసాదవితరణ జరిగినట్లు, హనుమంతుని "లోకయజ్ఞం"లో పాల్గొన్న వారందరికి అగ్నిప్రసాదము అందించబడింది. విభీషణుడు పాల్గొనలేదు కనుక ఆయనికి మంటల ప్రసాదం అందలేదు.

ఇళ్ళలోని సంపద లన్నీ బుగ్గిపాలయ్యాయి. చివరగా రావణుని భవనాన్ని చేరాడు హనుమంతుడు. మేఘగర్జనం చేసి దానిని కూడా అగ్నిమయం చేశాడు.

గృహాలన్నీ దహించుక పోతున్నాయి. అగ్నికి వాయువు తోడయ్యాడు. ఎక్కడైనా, ఏమైనా కాలకుండా ఉంటే ఆ పని వాయుదేవుడు పూర్తి చేస్తున్నాడు.

"అయ్యో! ఇతడు వానరుడు కాడు. అగ్నిదేవుడే ఈ వానరరూపంలో వచ్చాడు లంకను దగ్ధం చేయడానికి." అని లంకావాసులు గోలపెట్టేస్తున్నారు. లంకాదహనం విషయంలో ముగ్గురు అసంతృప్తితో ఉన్నారంటాడు వాల్మీకి.

నాగ్నిస్తృప్యతి కాష్ఠానాం తృణానాం చ యథా తథా
హనుమాన్ రాక్షసేన్ద్రాణాం వధే కించిన్న తృప్యతి
న హనూమ ద్విశస్తానాం రాక్షసానాం వసుంధరా!

"ఎన్ని గృహాలు దగ్ధమవుతున్నా అగ్నిదేవుడు తృప్తి చెందడం లేదు. ఎన్ని శవాలు రాలుతున్నా భూదేవి సంతృప్తి చెందడం లేదు. ఎందరు రాక్షసుల్ని వధించినా హనుమంతునికి తృప్తి లేకుండా ఉంది."

లంకానగరము పెద్దపెద్ద జ్వాలలతో మండిపోతోంది. బంగారు కిటికీలు, ముత్యాల వలలు, రత్నఖచిత మంటపాలు, మణులు పొదిగిన స్తంభాలు గల దివ్యములైన భవనాలన్నీ ఫెళఫెళమని శబ్దాలతో కూలిపోతున్నాయి. రాలిపోతున్నాయి. మాడిపోతున్నాయి. మసై మసై పోతున్నాయి.

ఎత్తైన మేడల మీద వెంట్రుకలు విరబోసుకొని బిడ్డల్ని చంకన ఎత్తుకొని ఉన్న స్త్రీలు భవనాలతో పాటు క్రిందపడి మరణించారు. వాళ్ళు అలా పడుతుంటే మేఘాలనుండి జారి క్రిందపడుతున్న మెరుపుల్లా కనిపించారు. మహావేగంతో దుముకుతున్న ఆ హనుమంతుడు పురత్రయాన్ని రుద్రుడు కాల్చినట్లు, లంకానగరాన్ని దగ్ధం చేశాడు.

ఆకాశాన్ని అంటుటకా అన్నట్లు భవనాల మీద నుండి లేస్తున్న అగ్నిశిఖలు కొన్నిచోట్ల మోదుగు పుష్పాల్లాగా, కొన్నిచోట్ల బూరుగు పుష్పాల్లాగా, కొన్నిచోట్ల కుంకుమ పువ్వుల్లాగా మెరిసిపోతున్నాయి. ఎటు చూసినా ధూమం లేని జ్వాలలే కనిపిస్తున్నాయి.

కోటి సూర్యులు ప్రకాశించునట్లు లంక దేదీప్యమానంగా వెలిగిపోతుంది. భయంకరమైన పిడుగుల వంటి శబ్దాలతో బ్రహ్మాండము బ్రద్దలైనట్లు వినిపిస్తోంది.

"వానరుడా! కానేకాడు. వజ్రాయుధాన్ని ధరించిన ఇంద్రుడై ఉంటాడు. లేదా యముడై ఉంటాడు. కుబేరుడు గాని, రుద్రుడు గాని అయి ఉండవచ్చు. లేదా కాలపురుషుడై ఉంటాడు. లేక రాక్షససంహారానికై వానరరూపంలో బ్రహ్మదేవుడైనా వచ్చుండాలి. ఇదేదో విష్ణుమాయ లాగా ఉంది.

"అయ్యో! కొడుకా! ఇంకెక్కడి భర్త! పోయావా ప్రియుడా! వెళ్ళావా మిత్రుడా! ఇంకెక్కడి బ్రతుకు! అంతా బూడిదై పోయింది; అనే శబ్దాలే వినిపిస్తున్నాయి లంకలో ఎక్కడ చూచినా. హనుమంతుని ప్రతాపాన్ని చూచి దేవత లందరూ విస్తుపోయారు. స్తుతించారు హనుమంతుణ్ణి.

ఈ లంకాదహనం కార్యం ద్వారా హనుమ రెండు ప్రయోజనాల్ని సాధించాడు. రాక్షసుల్ని నైతికంగా బలహీనుల్ని చేశాడు. వానరుల్లో నిజయోత్సాహాన్ని వృద్ధి చేశాడు.

ఒక్క హనుమంతుడే చాలా వరకు లంకను పాడుచేసేశాడు. మన మందరమూ వెళ్ళితే ఇంక మిగుల్తుందా లంక? అనే ఆలోచనను వానరులలో కదిలించాడు. హనుమంతునితో అంగదాదులు ఆ మాట అంటారు కూడా.

ఇకపోతే, ఒక్క వానరుడు వస్తేనే లంక ఇంతగా నాశనమైంది. రేపు రాముని సైన్యమంతా వస్తే ఎలా ఉంటుందో అనే భయాన్ని రాక్షసుల్లో కలిగించాడు. ఒక విధంగా చెప్పాలంటే ఈ భయం రావణునిలో కూడా ప్రవేశించింది.

అశోకవనము ధ్వంసమైంది. రాక్షసు లెందరో వధించబడ్డారు. లంకానగర మంతా కాలి పోయింది. ఇదంతా ఆలోచించుకుంటూ ఆనందిస్తున్న హనుమంతునికి హృదయంలో భయాందోళనలు చెలరేగాయి.

లంకను చూశాడు వాయుపుత్రుడు. అగ్నిమయంగా కనిపిస్తున్న ఆ నగరాన్ని చూచి, "అయ్యో! ఎంత పని చేశాను. లంకను కాల్చివేసి ఎంత ఘోరమైన అపరాధాన్ని చేశాను" అని తనను తాను నిందించుకున్నాడు.

"నేనెంత దుష్కార్యం చేశాను. కోపం పాపానికి నాంది. కోపించిన వాడు పెద్దలను వధించడానికి కూడా వెనుకాడడు. సాధువుల్ని కూడా పరుషంగా నిందిస్తాడు.

"క్రుద్ధుడైన వానికి ఏం మాట్లాడాలో తెలియదు. ఏది మాట్లాడ కూడదో తెలియదు. కోపి ఏదైనా చేస్తాడు. ఏమైనా మాట్లాడుతాడు.

ధన్యాస్తే పురుష శ్రేష్ఠా యే బుద్ధ్యా కోపముత్థితమ్
నిరున్ధన్తి మహాత్మానో దీప్తమగ్ని మివామ్భసా!

"మండే అగ్నిని నీళ్ళు చల్లి ఆర్పినట్లు, పుట్టిన కోపాన్ని ఉపశమింప చేసుకున్న మహాత్ములే ఎప్పుడైనా ధన్యులు.

"కుబుసమును సర్పము త్యజించునట్లు కోపమును ఎవరు విడిచిపెడ్తారో వారే ఉత్తమ పురుషులు.

"ఛీ ఛీ! బుద్ధిలేని పని చేశాను. సిగ్గుతో తలవంచుకొనే పని చేశాను. సీతమ్మ ఆలోచనే లేకుండా లంకను దగ్ధం చేశాను. స్వామికార్యాన్ని పాడుచేశాను. మహాపాపిని నేను.

"లంక ఇంతగా కాలిపోయిందే! సీతమ్మ మాత్రం ఉంటుందా! ఎంత మందమతిని. దేనిని సాధించాలని ఇంతగా శ్రమించానో ఆ కార్యాన్నంతా నా చేతులారా నాశనం చేశాను. ఎంతో చేశాను గాని చివరికి చింతతో మిగిలిపోయాను.

"లంకలో కాలని చోటే లేదు. సీతమ్మ కూడా కాలిపోయే ఉంటుంది. అదే జరిగి ఉంటే, నేను కూడా ఇక్కడే ప్రాణత్యాగం చేస్తాను. ఎలా చెయ్యాలో ఇప్పుడే నిర్ణయించుకుంటాను.

"ఇంత ఘోరకార్యం చేసి, తిరిగివెళ్ళి సుగ్రీవుడికి నా ముఖం ఎలా చూపెట్టేది? రామలక్ష్మణులను ఏ ముఖంతో చూసేది? క్రోధావేశంలో ఇదంతా చేసేశాను. వానరులు చపలచిత్తులు అని జగమెరిగిన సత్యాన్ని ఋజువు చేసుకున్నాను. నా చంచలత్వాన్ని నిరూపించుకున్నాను.

"రజోగుణము మంచిది కాదు. మనిషిని అదుపు తప్పించేది అదే. నేను ఎంతో సమర్థుణ్ణి. దేనికి? **తగలబెట్టడానికా?** సీత మరణిస్తే రామలక్ష్మణులు జీవించి ఉంటారా? రామలక్ష్మణులు లేకపోతే సుగ్రీవుడు మనగలడా? ఈ వార్త తెలిసి భరతశత్రుఘ్నులతో సహా ఇక్ష్వాకు వంశమంతా నశించిపోతుంది. ప్రజలంతా కృశించిపోతారు. దీని కంతటికి నేనే కారణం.

"లేదు. కాదు. అలా ఉండదు. సీతమ్మ నశించదు. ఆమె తేజస్సే ఆమెను రక్షిస్తుంది. ధర్మాత్ముడైన రాముని అర్ధాంగిని అగ్ని స్పృశించడు. మహాపతివ్రత అయిన సీతమ్మకు ఏ కష్టమూ వాటిల్లదు.

"నేనే కాలలేదే! సీతమ్మ ఎలా కాలుతుంది? నా దేహం మండకపోవడానికి ఆమె పుణ్యమే కారణము. రాముని ప్రభావమే కారణము. భరతుడు లాంటి ధర్మాత్ములకు ఈమె పూజ్యురాలు. మహాత్ముడైన రాముడికి ధర్మపత్ని. అట్టి సీతమ్మ నశిస్తుందా? అలా జరుగదు. నా తోకనే కాల్చని అగ్నిదేవుడు సీతను కాలుస్తాడా?

న నశిష్యతి కల్యాణీ నాగ్ని రగ్నౌ ప్రవర్తతే

"సీతమ్మ దగ్ధం కాదు. అగ్ని అగ్నిని కాల్చలేదు." అని ఆలోచిస్తుండగా హనుమంతునికి చారణుల మాటలు వినిపించాయి.

"ఆహా! ఎంత ఆశ్చర్యము! ఈ వానరుడు ఎవ్వరూ చెయ్యలేని పని చేశాడు. నగర మంతా కాల్చేశాడు. కానీ సీత మాత్రము చెక్కుచెదరకుండా ఉంది."

ఆ మాటలు విని అత్యానందంతో పరవశిస్తూ సీతమ్మను చూడాలని బయలుదేరాడు వాయుపుత్రుడు.

తిరుగుప్రయాణం

అశోకవనంలో శింశుపావృక్షము క్రింద కూర్చుని ఉన్న సీతమ్మను చూశాడు హనుమంతుడు. "అమ్మా! అంతా దైవకృప. నిన్ను అపాయం లేకుండా చూడగలిగాము" అన్నాడు.

"హనుమా! నీ బలపరాక్రమాలు వర్ణించుటకు సాధ్యం కావు. ఎంతటి కార్యాన్నైనా నీవు ఒక్కడివే సాధించగలవు. కానీ, రాముడే స్వయంగా వచ్చి, రావణుని వధించి, నాకు రక్షణ కల్పిస్తే బావుంటుంది. అలా చేయడము రాముని స్థాయికి తగినట్లు ఉంటుంది" అన్నది సీతమ్మ.

"అమ్మా! వానర భల్లూక వీరులతో రాముడు త్వరగా ఇక్కడికి వస్తాడు. శత్రు సంహారము చేస్తాడు. నీ శోకాన్ని తొలగిస్తాడు;" అని పలికి సీతమ్మకు ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు హనుమంతుడు.

అజర అమర గుణనిధి సుత హోహూ
కరహు౯ బహుత్ రఘునాయక ఛోహూ ॥
కరహు౯ కృపా ప్రభు అసుని కానా
నిర్భర ప్రేమ మగన హనుమానా ॥

"నాయనా! నీకు జరామరణాలు లేకుండా ఉండుగాక! గుణనిధివై శోభించెదవు గాక! సదా రాముడు నిన్ను ప్రేమించుగాక! అని సీతమ్మ హనుమంతుని దీవించగా హనుమంతుడు ఆ ప్రేమను భరించలేక పరవశించి పోయాడు" అంటాడు రామచరితమానసంలో తులసీదాస్.

సీతమ్మ వద్ద సెలవు తీసుకున్నాడు. రామప్రభువును దర్శించాలనే తహతహ తీవ్రమైంది పవనసుతునికి. శ్రేష్ఠమైన ఒక పర్వతాన్ని ఎక్కి, సముద్రాన్ని ఎగిరి దాటేందుకు సిద్ధపడ్డాడు.

శ్రేష్ఠమైన ఆ పర్వతముపై అనేక శిఖరాలున్నాయి. గుహలున్నాయి. సాలవృక్షాలు, తాళవృక్షాలు, అశ్వకర్ణ వృక్షాలు, వెదురుపొదలు, పూసిన పుష్పలతలూ, అనేక మృగాలు, సెలయేళ్ళూ, రాళ్ళగుట్టలు ఉన్నాయి.

ఆ పర్వతముపై పెద్దపెద్ద వృక్షాలున్నాయి. తీగలు అందంగా ప్రాకున్నాయి. గుహల్లో పులులు, సింహాలు నివసిస్తున్నాయి. తియ్యని దుంపలు, పండ్లు అపారంగా ఉన్నాయి.

ఎత్తైన దేవదారు చెట్లు ఆ పర్వతము మీద నిలబడి చేతులు పైకెత్తినట్లున్నాయి. శిఖరముల మధ్య మేఘాలు వ్రేలాడుతూ ఉండడం వల్ల ఆ పర్వతము శాలువా కప్పుకొనియున్నట్లు శోభిస్తోంది.

పర్వతశృంగము నుండి జాలువారే జలపాతము సంగీత కచ్చేరీ ఆరంభములో వినిపించే శ్రుతి మోతలా ఉంది. కొండ చరియల్లో సాగే జలప్రవాహం వేదఘోషలా వినిపిస్తోంది. గాలికి ధ్వనిస్తున్న వెదురు బొంగులు పాట పాడుతున్నట్లున్నాయి. లోతైన గుహలు మంచుచేత కప్పబడి ధ్యానం చేస్తున్నట్లున్నాయి.

రామదర్శనానికి తపన చెందుతున్న పవనతనయుడు పర్వతాన్ని ఎక్కాడు. హనుమంతుని పాద తాకిడికి గండుశిలలన్నీ పొడిపొడి అయ్యాయి. పర్వతాన్ని ఎక్కి, సముద్రాన్ని లంఘించాలని భావించి దేహాన్ని పెంచాడు. పెద్దపెద్ద చేపలతో, సర్పాలతో నిండి కల్లోలంగా కనిపిస్తున్న సాగరాన్ని వీక్షించాడు సమీరకుమారుడు.

పర్వతాన్ని తన బలమైన పాదాలతో హనుమంతుడు తొక్కిపట్టాడు. ఆ భారానికి శిఖరాలు చలించిపోయాయి. వృక్షాలు పడిపోయాయి. మృగాలన్నీ భయంకరంగా అరచాయి. గుహలలోని పులులు, సింహాలు భయంకరంగా గర్జించాయి.

హనుమంతుడు పైకి ఎగిరాడు.

ఆకాశంలో అలసట లేకుండా అంజనీసుతుడు కదలిపోతూ వుంటే సముద్రంలో ఓడ పయనించిన ట్లుండింది. హనుమంతుడు నోరు తెరచినపుడు ఆకాశాన్ని మ్రింగేస్తున్నట్లు కన్పించాడు. మేఘసరాల మధ్య చరించునపుడు గరుత్మంతుని వలే గోచరించాడు.

సాగరాన్ని దాటుతున్న సమయంలో మహేంద్రగిరికి సమీపంగా రాగానే హనుమంతుడు గొప్పగా సింహనాదం చేశాడు. ఆ ధ్వనికి దిక్కులు పిక్కటిల్లాయి.

మిత్రులను చూడాలనే ఆసక్తితో ఆంజనేయుడు బిగ్గరగా ధ్వని చేయుటే కాక తోకను త్రిప్పడం కూడా చేశాడు. హనుమంతుడు భయంకరంగా అరచిన ఆ అరుపుకు ఆకాశము బ్రద్దలైనట్లు వినిపించింది.

హనుమంతుని కొరకు దీనులై నిరీక్షిస్తూ ఉండిన వానరు లందరూ, హనుమంతుని శబ్దాన్ని ఆలకించి పరుగులు తీశారు. అందరూ గుమిగూడారు.

"హనుమంతుడు వెళ్ళిన కార్యాన్ని సాధించుకొని వస్తున్నాడు. లేనిచో అలా ధ్వని చేసే వాడు కాడు;" అన్నాడు జాంబవంతుడు.

తొందరగా హనుమంతుని చూడాలని కొందరు వానరవీరులు చెట్లెక్కారు. కొందరు కొండలెక్కారు. ఆనందాన్ని పట్టలేక చెట్లకొమ్మలు ఊపేశారు. దులిపేశారు. విరిచేశారు.

హనుమంతుడు దట్టమైన మేఘంలాగా క్రిందికి వచ్చి దిగుతూవుంటే వానరు లందరూ చేతులు జోడించి నమస్కరించారు. రామకార్యాన్ని సఫలం చేసేవారికి ఎవరైనా నమస్కరిస్తారు.

హనుమంతుడు మహేంద్రపర్వతాగ్రముపై కాలుమోపాడు. మహేంద్రపర్వతముపై శోభించే సుందరమైన సెలయేటిలో రెక్కలు తెగిన పర్వతంలాగా దిగాడు పవనసుతుడు.

వానరు లందరూ ఆనందంతో హనుమంతుని చుట్టుముట్టారు. దివ్యానందాన్ని పొందారు. ఫలాలను, పుష్పాలను కానుకలుగా హనుమంతునికి సమర్పించారు.

జ్యేష్ఠుడైన జాంబవంతునికి, శ్రేష్ఠుడైన అంగదునికి నమస్కరించాడు హనుమంతుడు. అంగదుని చేయి పట్టుకొని, సీతమ్మను చూశానని చెప్పి, మహేంద్రపర్వతముపై ఒక రమణీయమైన ప్రదేశమునందు అందరూ ఆసీనులయ్యారు.

"లంకానగరాన అశోకవనంలో సీతమ్మను చూశాను. భయంకరులైన రాక్షసాంగనలు ఆమెను కాపలా కాస్తున్నారు. రాముణ్ణి దర్శించడానికి తహతహలాడుతోంది సీతమ్మ. ఉపవాసాలతో కృశించి వుంది. దుమ్ముతో నిండివుంది;" అన్నాడు హనుమంతుడు.

"చూశాను" అని హనుమంతుడు పలకగానే వానరుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. సంతోషాన్ని ఆపుకోలేకపోయారు.

కొందరు పెద్దగా సింహనాదం చేశారు. కొందరు పెద్దగా జబ్బలు చరచారు. విచిత్రమైన అరుపులు అరచారు కొందరు. కొందరు ఒకరిమూతిలో మూతిపెట్టి అరిస్తే, మరికొందరు చెవుల్లో నోరుపెట్టి గూబ పగిలేలా అరచారు.

కొందరు తోకల్ని పైకి ఎత్తి, దించకుండా కర్రలాగా చాలాసేపు నిలిపేశారు. అలా నిలిచిన తోకను ఎగిరి దుమికారు కొందరు. కొందరు క్రిందనుండి పైకెక్కితే కొందరు పైనుండి క్రిందికి దిగారు. కొందరు పరస్పరము తలలు పట్టుకొని గోకారు. కిచకిచమని కొందరు ధ్వని చేస్తే, గొంతుమార్చి వికారంగా అరచారు కొందరు.

"హనుమంతా! దాటేశావు సముద్రాన్నంతా! నీకు నీవే సాటి. నీ పరాక్రమం అసమానమైంది. నీ ప్రభుభక్తి వర్ణించరానిది. సీతాదేవిని చూశావు. ఇక రాముని శోకము తీరినట్లే" అన్నాడు అంగదుడు. జాంబవంతుడు, అంగదుడు, హనుమంతుడు కూర్చున్నారు. కపులందరూ వారి చుట్టూ కూర్చున్నారు. వాయుపుత్రుని నుండి విశేషాలు వినాలని కుతూహల పడసాగారు.

వానరు లందరూ చుట్టూ మూగియుండగా, దేవలోకంలో దేవతలచే పరివేష్ఠితుడైన ఇంద్రునిలాగా ప్రకాశించాడు వానర నాయకుడైన అంగదుడు.

సీతాన్వేషణమునకు బయలుదేరినది మొదలు తిరిగి మహేంద్రగిరిని చేరునంత వరకు జరిగిన విషయాలను, చూసిన సన్నివేశాలను చెప్పమని అడిగాడు జాంబవంతుడు. తన పర్యటన విశేషాలన్నీ పూసగుచ్చినట్లు వివరించాడు హనుమంతుడు.

ముందుగా దక్షిణదిక్కు వైపు చూచి, సీతమ్మకు తలవంచి నమస్కరించి, చెప్పడం ప్రారంభించాడు హనుమంతుడు.

మహేంద్రగిరి నుండి ఎగరడం, మైనాకను స్పృశించడము, సురసను జయించడము, సింహికను వధించడము, సూర్యాస్తమయం తరువాత లంకలో ప్రవేశించడము, లంకిణిని స్వాధీన పరచుకోవడము, రావణుని భవనాన్ని దర్శించడము, అశోకవనంలో సీతమ్మను దర్శించడము, రాక్షసాంగనలు ఆమెను వేధిస్తూ ఉండడము, రావణుడు సీతమ్మను భయపెట్టడము, సీతమ్మ చెప్పిన సమాధానము, మండిపడిన రావణుని ధాన్యమాలిని *నివారించడము, త్రిజటాస్వప్నము, తాను రామకథ వర్ణించడము, నరవానరమైత్రి ఎలా సాధ్యమని సీతమ్మ ప్రశ్నించడము, రామసుగ్రీవుల మైత్రిని వివరించడము, రాముడు ఇచ్చిన ముద్రికను సీతమ్మకు ఇవ్వడం, తన వీపుపై కూర్చుని రాముని వద్దకు రమ్మని హనుమ ప్రార్థించడము, రాముడే వచ్చి తీసికొని వెళ్ళాలని సీతమ్మ పలకడము, ఆనవాలుగా రామునికి ఇచ్చుటకు ఏదైనా ప్రసాదించమని కోరడము, చూడామణిని సీతమ్మ ఇవ్వడము, సీతాసందేశము, అశోకవన నాశము, కింకరుల వధ, జంబుమాలి వినాశము, మంత్రిపుత్రుల మరణము, సేనాధిపతుల్ని సంహరించుట, అక్షకుమార వధ, ఇంద్రజిత్తుతో పోరాటము, బ్రహ్మాస్త్ర ప్రయోగము, రావణుని చూచుట, సుగ్రీవుని గూర్చి, సీతాన్వేషణమును గూర్చి రావణునకు తెలుపుట, వాలివధను వివరించుట, సీతమ్మను తిరిగి అప్పగించమని చెప్పుట, హనుమ వధకు రావణుడు ఆజ్ఞ ఇచ్చుట, విభీషణుని వినతి, వాలాన్ని కాల్చమని రావణుడు చెప్పుట, రాక్షసులు తోకను కాల్చుట, రాక్షస సంహారము, లంకాదహనము, తోక కాలకుండా చల్లగా ఉండుట, సీతమ్మ విషయమై వ్యథ చెందుట, సీతమ్మను దర్శించుట, ఆమెకు ప్రదక్షిణ నమస్కారములు చేసి తిరిగి పయనమగుట మున్నగు విషయాలతో కూడిన తన పర్యటనా వివరాలను హనుమంతుడు వానరులకు తెలిపాడు.

"ఇంతవరకు నేను చేశాను. మిగిలిన కార్యాన్ని గూర్చి మీరు ఆలోచించండి" అని చెప్పాడు హనుమంతుడు.

అమోఘ పాతివ్రత్యం

లంకలో సీతమ్మను దర్శించిన విషయాన్నంతా వివరించి చెప్పిన తరువాత అగ్నితుల్యమైన సీతమ్మ యొక్క శీలాన్ని వర్ణిస్తున్నాడు హనుమంతుడు.

"సీతమ్మ పాతివ్రత్యం ఉన్నతమైంది. ఉదాత్తమైంది. రాముని ప్రయత్నము సఫలమైంది. సుగ్రీవుని ఉత్సాహము ఫలించింది. ఆమెపై నాకు భక్తి కుదిరింది.

"రావణుడు సామాన్యుడు కాడు. గొప్ప బలశాలి. తపశ్శాలి. అతని క్రోధం ముందు ఎంతవారైనా తలవంచక తప్పదు. సీతమ్మను స్పృశించి అపహరించినా అతడు భస్మం

*ధాన్యమాలిని మండోదరి కాకపోవచ్చు అని నా అభిప్రాయము.

కాలేదంటే దానికి కారణం అతని తపస్సే. సీతమ్మ కోపిస్తే ఆమె క్రోధాగ్ని ముందు అగ్నిజ్వాలలు వెలవెలపోతాయి.

"రామలక్ష్మణుల దగ్గరికి సీతమ్మను కూడా వెంటబెట్టుకొని వెళ్తే బాగుంటుందని నా అభిప్రాయము. లంకను ధ్వంసం చేయడానికి, రావణుని సంహరించడానికి నేనొక్కడినే సరిపోతాను.

"మీరందరూ బలవంతులు. శూరులు. వీరులు. మీరుకూడా తోడుగా ఉంటే ఇక చెప్పాలా? రావణుని, అతని సోదరుల్ని, పుత్రుల్ని, పరివారాన్ని నేనే చంపగలను. బ్రహ్మాస్త్రాన్ని, ఇంద్రాస్త్రాన్ని, రౌద్రాస్త్రాన్ని, వాయువ్యాస్త్రాన్ని, వారుణాస్త్రాన్ని కూడా నిరోధించగలను.

"మహావీరుడైన జాంబవంతుడు, శత్రుసంహారకుడైన అంగదుడు, మహాశక్తిమంతులైన పనస నీలాదులు, అసమాన పరాక్రమవంతుడైన ద్వివిదుడు, అశ్వినీదేవతల కుమారులు కలిసి నిలబడితే రావణసేన అంతా క్షణంలో కూలిపోతుంది.

"నేనొక్కడినే లంకనంతా కాల్చేశాను. భస్మం చేసేశాను. రామ, లక్ష్మణ, సుగ్రీవుల పేర్లను లంకానగర వీధులలో ప్రతిధ్వనించేలా ఘోషించాను.

"అశోకవనంలో శింశుపావృక్షము క్రింద సీతమ్మ దీనురాలై ఉంది. చంద్రరేఖ లాగా కాంతిహీనంగా ఉంది. బలవంతుడైన రావణుణ్ణి ఆమె లక్ష్యపెట్టడం లేదు. ఆమె మనసంతా రాముని మీదే ఉంది.

"ఒకే వస్త్రముతో, ఒంటిజడతో, దుమ్ము నిండిన శరీరంతో, సదా రాముణ్ణే స్మరిస్తున్న ఆ తల్లిని చూస్తే గుండె చెరువవుతుంది. నేలమీదనే శయనిస్తూ రంగు మారిన శరీరంతో శిశిర ఋతువులో పద్మలతలా శోభిస్తోంది. తనువు చాలించాలని కూడా తలుస్తోంది.

"సీతమ్మ నియమాలను దాటదు. లేనిచో రావణుడు ఎప్పుడో భస్మమై ఉండేవాడు. రాముని వియోగంతో సీతమ్మ కృశించిపోయింది. పాడ్యమి నాడు చదివిన వాని చదువు లాగా సీతమ్మ బాగా సన్నగిల్లింది. ఇలా ఉంది సీతమ్మ పరిస్థితి. ఇక చేయవలసిన కార్యాన్ని మీరే నిర్ణయించాలి;" అన్నాడు హనుమంతుడు. కపిశ్రేష్ఠుడైన ఆంజనేయుని మాటలు విని నాయకుడైన అంగదుడు నోరువిప్పాడు.

"కపివరులారా! సీతాదేవిని హనుమ దర్శించాడు. దర్శించిన తరువాత సీతమ్మ లేకుండా వెళ్ళి రాముని దర్శించడం సముచితంగా లేదు. మన పరాక్రమ మేమిటో మనకు తెలుసు. ఒక్క హనుమంతుడే అందరిని వధించాడు కదా! మన మందరమూ వెళ్దాము. జానకిని వెంటబెట్టుకొని రాముని వద్దకు వెళ్దాము" అన్నాడు నాయకుడైన అంగదుడు.

"రాజకుమారా! నీవు చెప్పింది చాలా చక్కగా ఉంది. చేయదగిందే. కాని రాముని సంకల్పము ఎలా ఉందో! అదికూడా మనం ఆలోచించాలి;" అన్నాడు జాంబవంతుడు.

మధువనంలో మర్కటవిన్యాసాలు

జాంబవంతుడు చెప్పింది బావుందని అంగదుడు మొదలైన కపివీరులంతా అంగీకరించారు. ప్రియమైన వార్తను రామునికి తెలుపాలనే ఉత్సాహంతో వానరవీరు లందరూ హనుమంతుని ముందు పెట్టుకొని మహేంద్రపర్వతం నుండి ఎగిరారు.

వానరు లందరూ ఒక్కసారి ఎగిరేసరికి ఆకాశము వానరులచే కప్పబడి పచ్చగా గోచరించింది. అందరి కళ్ళూ హనుమంతుని మీదనే ఉన్నాయి. వానరు లందరూ గౌరవ సూచకంగా హనుమంతుని తమ చూపులతోనే మోసేస్తున్నారా! అన్నట్లుంది.

ఆనందంతో ఎగిరి వెళ్తున్న వానరులు మధ్యలో ఫలపుష్ప భరితమైన, వృక్షలతాదులతో కూడిన ఉద్యానవనాన్ని చూశారు. అదియే మధువనం.

మధువనం సుగ్రీవునిది. దానిని సుగ్రీవుని మేనమామ యైన దధిముఖుడు అనే వానరవీరుడు రక్షిస్తూ ఉంటాడు. వానరు లందరూ ఆ మధువనంలో దిగారు. అందులోని ఫలాలను ఆరగించాలని, ఫలపుష్పాదుల నుండి తయారుచేసి ఉంచిన మధువును త్రాగాలని ఉబలాటం ఎక్కువైంది.

వానరు లందరూ అంగదుని సమీపించారు. ఫలాలను ఆరగించి, మధువును త్రాగేందుకు అనుమతి నివ్వమని ప్రార్థించారు. అంగద జాంబవదాదులు "అలాగే" అన్నారు.

అనుమతి లభించగానే వానరు లందరూ అధికోత్సాహంతో మధువనంలో ప్రవేశించారు. నృత్యము చేశారు వివిధ భంగిమలతో.

పండ్లన్నీ కోసి తింటున్నారు. దాచి ఉంచిన మధువును గ్రోలుతున్నారు. మధుపానము చేయగానే వానరవీరులకు మత్తెక్కింది. మత్తెక్కిన మర్కటవీరుల విన్యాసాలు వర్ణించుటకు వీలుకాకుండా ఉన్నాయి.

కొందరు చేతులు త్రిప్పుతూ కచ్చేరీ చేస్తున్నట్లు పాడుతున్నారు. కొందరు ఆడుతున్నారు. కొందరు పకపక నవ్వుతూ మధ్యలో ఆపి ఏడుస్తున్నారు. కొందరు ఏడుస్తూ మధ్యలో ఆపేసి నవ్వుతున్నారు.

కొందరు వెనుక చేతులు కట్టుకొని హుందాగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు రాజుల్లాగా. వాళ్ళ వెనుకాలే కట్టెపుల్లల్ని దండముల వలె చేతిలో ధరించి, సేవకుల్లాగా నటిస్తూ కొందరు వెంబడిస్తున్నారు. కొందరు ఎగిరెగిరి గంతులేస్తున్నారు. కొందరు వారికే అర్థంగాని మాటలతో దీర్ఘోపన్యాసాలు చేస్తున్నారు.

పరస్పరం కేచి దుపాశ్రయన్తే
పరస్పరం కేచి దుపాక్రమన్తే
పరస్పరం కేచి దుపబ్రువన్తే
పరస్పరం కేచి దుపారమన్తే

"కొందరు చేతులు కలుపుకొని వనంలో తిరుగుతున్నారు. కొందరు కొందరిమీద ఎక్కుతున్నారు. కొందరు పరస్పరం దీర్ఘంగా భాషించుకొంటున్నారు. కొందరు పరస్పరం క్రీడిస్తున్నారు.

ఒక వానరుడు ఒకచేతితో చెవిని మూసేసి, రెండవ చేతిని బారచాచి ఏదో ఆలాపన చేస్తున్నాడు. అదిచూసి మరొక వానరుడు నవ్వుతూ ఆ గాయకుణ్ణి సమీపిస్తున్నాడు. నవ్వుతూ సమీపించిన వానిని చూసి ఏడుస్తూ మరొకడు సమీపించాడు. వేరొకడు వెనకాలే వచ్చి పాడేవాడ్ని ఠపీమని కొట్టి పారిపోయాడు.

నలుగురు వానరులు ఒకే వరసలో నిలబడి ఒకర్ని ఒకరు గెంటుకుంటూ ప్రక్కకు నడుస్తున్నారు. మరొక వానరుడు దర్శకుడన్నట్లు వారికి సూచన లిస్తున్నాడు.

ఒక వానరుడు కాళ్ళు మడచి మునిలా ధ్యానం చేస్తున్నాడు. వేరొక వానరుడొచ్చి ఆ ముని తలపై తబలా వాయిస్తున్నాడు. ఆ ధ్యానయోగికి ఎదురుగా ఒక వానరుడు నిలబడి, అభయహస్తాన్ని చూపుతూ అనుగ్రహిస్తున్నట్లు నిలబడ్డాడు.

ఒక వానరుడు మూలుగుతూ రోగిలా నడుస్తుంటే, వేరొక వానరుడు వైద్యునిలా వచ్చి పరీక్షిస్తున్నాడు. పరీక్షిస్తున్న వైద్యకపి ఠపీమని క్రిందపడ్డాడు. అంతవరకు రోగిలా మూలుగుతున్న వానరుడు చివుక్కున లేచి వైద్యవృత్తి స్వీకరించాడు. అది చూచి చాలామంది వానరులు చుట్టూ మూగారు. వైద్యుడుగా మారిన రోగి మూగియున్న వానరసమూహాన్ని చూపి పెదవి విరిచాడు.

అందరూ గొల్లుమని ఏడ్చారు. కొందరు అతనిపై బడి దొర్లిదొర్లి ఏడ్చారు. ఈలోగా ఒక వానరుడు పరుగెత్తి నీళ్ళను తీసికొని కంటికి రాసుకుని, దుఃఖాతిశయాన్ని వ్యక్తం చేస్తూ తెగ ఏడ్చేస్తున్నాడు. అందరూ కలిసి పడివున్న కపిని ఎత్తుకొని ఏడుస్తూ నడుస్తున్నారు. వారిపై పడుకుని వున్న వ్యక్తి మధ్యమధ్యలో మోసేవాళ్ళ తలను గోకుతున్నాడు. కొన్ని అడుగులు వేయగానే పడుకొనియున్న కపివీరుడు ఎగిరి చెట్టెక్కాడు. "దెయ్యం బాబోయ్" అంటూ మిగిలినవారు పరుగులు తీశారు. ఇలా ఉంది వ్యవహారం.

మధువన రక్షకులైన వానరులు వనాన్ని పాడుచేస్తున్న వానరుల్ని నివారించే ప్రయత్నం చేశారు. కానీ అది విఫలప్రయత్నమైంది. వానరు లందరూ విజృంభించి రక్షకుల్ని ఇష్ట మొచ్చినట్లు బాదేశారు.

అది తెలిసి దధిముఖుడు వచ్చాడు. కొందరిని తిట్టాడు. కొందరిని అరచేతితో బాదాడు. కొందరికి మంచిగా చెప్పిచూశాడు. కొందరితో పేచీ పెట్టుకున్నాడు.

వానరులు అంతటితో ఆగలేదు. దధిముఖుణ్ణి కూడా ఎదిరించారు. అతణ్ణి పట్టుకొని అటు కొందరు లాగితే ఇటు కొందరు లాగారు. కొందరు దధిముఖుణ్ణి గోళ్ళతో గోకారు. గీకారు. పళ్ళతో కరిచారు. మోకాళ్ళతో కుమ్మారు. కాళ్ళతో తన్నారు.

అంతటితో ఆగకుండా వనంలో కొమ్మలు విరిచేశారు. పండ్లు, పూలు రాల్చేశారు. అంతా రణరంగంలా మార్చేశారు.

"మీరేమీ భయపడకండి. వెనుకంజ వేయకండి. మధువును కడుపారా సేవించండి. మిమ్మల్ని అడ్డగించేవారి విషయం నేను చూసుకుంటాను" అని కపివరులకు హనుమంతుడు హామీ ఇచ్చాడు.

"హనుమంతుడు కార్యాన్ని సాధించుకొని వచ్చాడు. అతడు చెప్పింది జరిగి తీరాల్సిందే. మీ ఇష్టం. విజృంభించండి" అన్నాడు నాయకుడైన అంగదుడు. ఆ మాట వినగానే "భలే... భలే" అంటూ చేష్టల్ని తీవ్రతరం చేశారు వానరులు.

మధుభాండములన్నీ స్వాధీనం చేసుకున్నారు. పీకవరకు పట్టించేశారు. కొన్ని భాండముల మధువును క్రుమ్మరించారు. కొందరికి మత్తు ఎక్కువై చెట్లకొమ్మల్ని పట్టుకొని చెట్లమొదళ్ళలో

చతికిలబడ్డారు. కొందరు ఆకులు పరచుకొని పండుకుంటే, మరికొందరు ఆకులు కప్పుకొని పడుకున్నారు.

కొందరు తడబడుతూ, పాటలు పాడుతూ నడువసాగారు. కొందరు సింహనాదాలు చేశారు. కొందరు పెద్దగా ఈలలు వేశారు. కొందరు "ఛీ-పో" అంటూ బట్టలు విప్పి దూరంగా పారేశారు.

ఇదంతా చూసి దధిముఖుడు క్రుద్ధుడై అంగద హనుమదాదుల్ని సమీపించాడు. అప్పటికి అంగదుడు కూడా పుచ్చేసుకొని, కదలకుండా, రెప్ప వాల్చకుండా, చూపు త్రిప్ప కుండా తదేకంగా చూస్తూ వున్నాడు.

దధిముఖుడు వచ్చి అంగదునికి కోపంతో చెబుతున్నాడు. ఈలోగా అంగదుడు మెల్లగా లేచాడు. తాత అనికూడా ఆలోచించక మధుపానం చేసిన మత్తులో దధిముఖుని క్రింద పడేసి మోకాళ్ళతో కుమ్మేశాడు ఆగకుండా. బాహువుల్తో బాదేశాడు. స్పృహతప్పి క్రిందపడిన దధిముఖుని పిండిలా పిసికేశాడు.

స్పృహ రాగానే ఎలాగో తప్పించుకొని పారిపోయాడు దధిముఖుడు. తన సేవకులను సమీపించి, "అక్కడే ఉండనివ్వండి వాళ్ళని. మనం రామసుగ్రీవు లున్నచోటికి వెళ్దాం. అంగదుడు చేసిన ఆగడము నంతా సుగ్రీవుడికి చెప్తాం. సుగ్రీవుడు ఈ వానరమూక నంతా వధించమని ఆజ్ఞలిస్తాడు.

"ఈ మధువనం సుగ్రీవుని తాత ముత్తాతల నుండి సంక్రమించింది. ఈ వనమంటే సుగ్రీవునికి చాలా ఇష్టం. ఇందులో సుగ్రీవాజ్ఞను అతిక్రమించి చీమకూడా చొరబడలేదు. ఈ దుష్టమూకకు కాలం తీరింది. లేకపోతే పెద్దవాణ్ణి అనికూడా భావించకుండా నన్ను మోకాళ్ళతో కుమ్ముతారా? ముఖ్యంగా వాడు, అంగదుడు. చూస్తా. చూస్తా" అంటూ సేవకులను వెంటబెట్టుకొని వేగంగా ఎగిరి వెళ్ళాడు సుగ్రీవుని వద్దకు.

సుగ్రీవ రామలక్ష్మణుల వద్దకు వచ్చాడు. సుగ్రీవుని చూడగానే దధిముఖుడు నమస్కరిస్తూ సుగ్రీవుని పాదాలపై పడ్డాడు.

"అదేమిటి మామా! నువ్వు నా కాళ్ళమీద పడతావేమిటి? వీరకపీ! లే.... నీకు అభయమిచ్చాను. ఏం జరిగిందో చెప్పు" అన్నాడు సుగ్రీవుడు.

"రాజా! నీకు ప్రియమైన మధువనంలో ఇంతవరకు ఎవ్వరూ స్వేచ్ఛగా విహరించలేదు. ఈరోజు ఆ మధువనమంతా ధ్వంసమై పోయింది" అన్నాడు దధిముఖుడు.

శుభప్రదము

"ఎవరు? మధువనాన్ని పాడుచేసిం దెవరు? భయపడకుండా చెప్పు" అన్నాడు సుగ్రీవుడు.

"మధువనాన్ని వానరులే పాడుచేశారు. అంగదాదులతో కూడి తిరిగి వస్తున్న వానరులు మధువనాన్నంతా పాడుచేశారు. పండ్లు తినేశారు. మధువులు త్రాగేశారు. మేము వాళ్ళను

నివారించాము. మమ్మల్ని కొట్టారు. తన్నారు. మోకాళ్ళతో పొడిచారు;" అని దధిముఖుడు చెప్తూ వున్నాడు. ఈలోగా లక్ష్మణుడు వచ్చి దధిముఖుని దుఃఖానికి కారణ మేమిటని సుగ్రీవుని అడిగాడు.

"లక్ష్మణా! సీతాన్వేషణకై దక్షిణదిక్కుగా వెళ్ళిన అంగధాదులు తిరుగుప్రయాణంలో మధువనంలో ప్రవేశించి పండ్లు తినేశారని, మధువు త్రాగేశారని ఫిర్యాదు చేస్తున్నాడు.

"లక్ష్మణా! కార్యము సఫలమై ఉంటేనే వానరులు అధికోత్సాహంలో అలాంటి పని చేసుంటారు. మధువనంలో ప్రవేశించారంటే మనకు మధురమైన వార్తను తెచ్చారనే భావించాలి. సీతాదేవి కనిపించినట్లే. సందేహము లేదు. అదికూడా దేవిని హనుమంతుడే వీక్షించి ఉంటాడు.

"హనుమంతునిలో ఆలోచనాశక్తి ఎక్కువ. ప్రయత్నశీలుడు. పరాక్రమవంతుడు. పండితుడు కూడా. అతడు తప్ప మరొకరు ఈ కార్యాన్ని సాధించలేరు. హనుమంతుడు, జాంబవంతుడు, అంగదుడు కూడి చేసిన కార్యము ఏదీ విఫలం కాదు.

"లక్ష్మణా! వానరులు మధుపానం చేశారంటే సీత జాడ కనిపెట్టారనే అర్థం. లేకపోతే ప్రవేశం లేని మధువనంలోకి వెళ్తారా!" అన్నాడు సుగ్రీవుడు. సుగ్రీవుని మాటలు రామలక్ష్మణులకు శ్రవణానందాన్ని కలిగించాయి.

"దధిముఖుడా! మరోలా భావించకు. ఘనమైన కార్యాన్ని సాధించి వచ్చిన వానరశ్రేష్ఠులు మధువనాన్ని ఆక్రమించడంలో తప్పు లేదు. వాళ్ళ కార్యాన్ని నేను క్షమించాను. వారిని త్వరగా చూడాలని మేము ఆసక్తితో ఉన్నాము;" అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని మాటలను విని రామలక్ష్మణులు ఎంతో సంతోషించారు. రామలక్ష్మణుల ముఖంలో విప్పారిన సంతోషరేఖలను చూచి సుగ్రీవుడు గగుర్పాటుతో చలించిపోయాడు.

దధిముఖుడు కూడా సంతోషించాడు. రామలక్ష్మణులకు దధిముఖుడు నమస్కరించాడు. శూరులైన వానరులతో కలిసి మధువనానికి ఎగిరిపోయాడు.

దధిముఖుడు మధువనం చేరాడు. అప్పటికి మత్తు వదలి నటులంతా పైకి లేస్తున్నారు. అంగదుణ్ణి సమీపించి, నమస్కరించి ఇలా పలికాడు దధిముఖుడు.

"సౌమ్యుడా! అంగదా! మేము మిమ్మల్ని ఆటంకపరచామని బాధపడకు. కోపం తెచ్చుకోకు. నువ్వు యువరాజువి. ఈ వనంపై నీకు అధికారముంది. నేను మూర్ఖంగా ప్రవర్తించాను. క్షమించు.

"మీరు వచ్చారన్న వార్త విని రాజైన సుగ్రీవుడు చాలా సంతోషించాడు. మధువనం ధ్వంసమైందని తెలిసి కూడా అతడు కోపగించుకోలేదు. మిమ్మల్ని చూడాలనే ఆసక్తితో ఉన్నాడు సుగ్రీవుడు. మీకు చెప్పమన్నాడు కూడా."

దధిముఖుని మాటలు విని అంగదుడు ఇలా పలికాడు. "వానరవీరులారా! ఈ వార్త రామునికి కూడా తెలిసే ఉంటుంది. కార్యం సాధించిన వాళ్ళం. ఆలస్యం చేయడం మంచిది కాదు.

"నేను యువరాజునే. అంతమాత్రాన నేను మిమ్మల్ని ఆజ్ఞాపించలేను. కార్యమును సాధించినవారు మీరు. మీరు ఎలా చెప్తే నేను అలా నడుచుకుంటాను;" అని భావస్ఫూర్తితో పలికాడు అంగదుడు. అంగదుని మాటల నాలకించిన కపివరులు ఇలా పలికారు.

ఏవం వదతి కోరాజన్ ప్రభుః సన్ వానరర్షభ
ఐశ్వర్య మదమత్తో హి సర్వోహ మితి మన్యతే

"యువరాజా! యువరాజైనవాడు ఇలా ఎవరు పలుకుతారు? ఐశ్వర్యముతో మదించి "నేను-నేను" అని విఱ్ఱవీగుతూ ఉంటారు.

"ఇలా పలకడం నీకే తగింది. మరొకరు ఇలా మాట్లాడలేరు. నీలోని వినయము భవిష్యత్తులో నిన్ను శ్రేష్ఠునిగా మార్చుతుంది. నీకు శుభం కలుగుతుంది.

"రాజా! మేమందరము కూడా సుగ్రీవుని వద్దకు వెళ్ళాలనే అభిప్రాయ పడుతున్నాము. నీ ఆజ్ఞకు వ్యతిరేకంగా మేము కాలు కదపము. ఇది సత్యం. మామాట నమ్ము;" అన్నారు వానరులు.

అంగదుడు సంతోషించి "వెళ్దాం" అన్నాడు. వానరు లందరూ పూర్ణహృదయులై ఆకాశం మీదికి ఎగిరారు.

గొప్ప వేగముగల ఆ వానరవీరులు యంత్రము చేత పైకి ఎత్తబడిన పర్వతము వలె **(యంత్రోత్క్షిప్తా ఇవాచలాః)**, గాలిచే ఎగురుచున్న మేఘమువలె ఆకాశంలో ఎగిరారు.

అంగదాదులు ఇంకా సుగ్రీవుని వద్దకు చేరలేదు. విషయము తెలియక రాముడు కలతచెంది కదలిపోతున్నాడు. అది గమనించి సుగ్రీవుడు ఇలా పలికాడు.

"రామా! విచారించకు. నీకు మేలు జరుగుతుంది. సీతమ్మ కనిపించింది. ఈ విషయంలో సందేహం లేదు. కార్యము సఫలం కానిచో అంగదుడు నా వద్దకు వచ్చేవాడే కాడు. రామా! చింతించకు." అని సుగ్రీవుడు పలుకుతుండగా, కిష్కింధను సమీపించిన వానరుల శబ్దాలు మిన్నుముట్టాయి.

కపివీరు లందరూ అంగద హనుమదాదులను ముందుపెట్టుకొని వచ్చారు. హనుమంతుడు శిరస్సు వంచి నమస్కరించాడు. రామునితో ఇలా భాషించాడు.

దృష్టా దేవేతి హనుమ ద్వదనా దమృతోపమమ్
ఆకర్ణ్య వచనం రామో హర్షమాప సలక్ష్మణః

"చూశాను సీతాదేవిని" అని హనుమంతుని నోటినుండి వెలువడిన అమృతం లాంటి మాట విని రాముడు, లక్ష్మణుడు గొప్ప ఆనందాన్ని అనుభవించారు.

హనుమంతుడు కార్యాన్ని సాధించి తీరుతాడు అనిన సుగ్రీవుని లక్ష్మణుడు గౌరవభావంతో వీక్షించాడు. ఆనందంతో పొంగిపోతున్న రాముడు హనుమంతుని గౌరవభావంతో వీక్షించాడు.

అమృతసందేశం

"వానరవీరులారా! సీత ఎక్కడ ఉంది? నన్ను గురించి ఏమి అనుకుంటూ ఉంది? ఆమె విషయాలన్నీ నాకు చెప్పండి;" అన్నాడు రాముడు. వానరు లందరు హనుమంతుని ముందుకు తోశారు చెప్పమని.

హనుమంతుడు సీతమ్మ ఉన్న దిక్కువైపు తిరిగి నమస్కరించాడు. వినమ్రుడై రామునితో ఇలా పలికాడు.

"నూరు యోజనముల పొడవైన సముద్రాన్ని లంఘించి, సీతమ్మను అన్వేషిస్తూ వెళ్ళాను. దక్షిణసముద్రతీరంలో దుర్మార్గుడైన రావణుని లంకానగర ముంది.

తత్ర దృష్టా మయా సీతా రావణాన్తఃపురే సతీ
సంన్యస్య త్వయి జీవన్తి రామా రామ మనోరథమ్


"రామా! రావణుని అంతఃపురములో నేను పతివ్రతయైన సీతను చూశాను. ఆమె తన మనోరథాలన్నీ నీ మీదనే పెట్టుకొని జీవిస్తోంది;" అన్నాడు హనుమంతుడు.

సీతమ్మ పాతివ్రత్యం **(సతీ)** తో ఉన్నది. జీవించి యున్నది **(జీవన్తి)** అని చెప్పడంలో హనుమంతుని వాక్పటిమను మనము గుర్తించవచ్చు. పాతివ్రత్యంతో ఉన్నది అన్నాడు కదా! మళ్ళీ జీవించి యున్నది అని ఎందుకు చెప్పవలసి వచ్చింది?

సీతమ్మ పాతివ్రత్యమును కాపాడుకుంది. కానీ జీవించి ఉన్నదా లేదా! పాతివ్రత్యముండి జీవించకపోయినా నిష్ఫలమే. జీవించియుండి పాతివ్రత్యాన్ని పోగొట్టుకున్నా నిష్ప్రయోజనమే. అందుచేత సీతమ్మ పాతివ్రత్యంతో ఉంది. జీవించి ఉంది అని చెప్పాడు హనుమంతుడు.

"రామా! అశోకవనంలో రాక్షసస్త్రీల మధ్య ఉన్న సీతమ్మను నేను చూశాను. ఆమె తీవ్రమైన దుఃఖంతో కృశించి ఉంది. ఏకవేణిని ధరించి ఉంది. ఏకవస్త్రంతో జీవిస్తోంది. నేలమీద పడుకోనుంది. రంగుమారిన దేహంతో శిశిరఋతువు లోని పద్మపు తీగలాగా ఉంది. నీమీదనే మనసు నిలుపుకోనుంది.

"రామా! ఇక్ష్వాకువంశ చరిత్రను మెల్లగా కీర్తించాను. ఆమె విశ్వాసాన్ని చూరగొన్నాను. రామసుగ్రీవుల మైత్రిని కూడా వివరించి చెప్పాను. ఆమె సంతోషించింది. సీతమ్మ సదాచారంతో ఉంది. నీమీద సద్భక్తితో ఉంది. ఉగ్రతపస్సులో ఉంది. నా భాగ్యం పండి ఆమెను దర్శించాను.



"రామా! చిత్రకూటపర్వతము మీద మీ ఇద్దరి మధ్య జరిగిన కాకి వృత్తాంతాన్ని ఆనవాలుగా చెప్పింది. నేను అక్కడ చూసిందంతా నీకు చెప్పమన్నది. ఎంతో ప్రయత్నముతో దాచి ఉంచినట్లు చెప్పి ఈ చూడామణిని నీకు ఇవ్వమన్నది. మణిశిలతో బొట్టు పెట్టిన విషయాన్ని గుర్తుచేయమని చెప్పింది.

జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ
ఊర్ధ్వం మాసాన్న జీవేయం రక్షసాం వశమాగతా!

"రామా! నేను ఒక్క నెల మాత్రమే జీవించి ఉంటాను. ఈ రాక్షసుల మధ్య మాసము తరువాత జీవించలేను" అని చెప్పమన్నది.

"రామా! ఉన్నదున్నట్లు చెప్పాను. లంకను చేరేందుకు సముద్రముపై సేతువును నిర్మించాలి;" అని చెప్పి చూడామణిని రామునికి సమర్పించాడు రామదూత.

శోకమయమైన రాముని హృదయం

హనుమంతుడు ఇచ్చిన చూడామణిని గుండెలమీద పెట్టుకొని రాముడు దుఃఖించాడు. రాముని కళ్ళు మేఘాలై వర్షించాయి.

"సుగ్రీవా! దూడను చూడగానే ధేనువు ద్రవించునట్లు, ఈ మణిని చూడగానే నా హృదయం ద్రవిస్తోంది. వివాహసమయంలో మామగారు జనకమహారాజు పెట్టిందిది. సీత తలపై ఎంతగానో శోభించేది.

"పూర్వము జనకుడు చేసిన యజ్ఞానికి తృప్తిచెంది ఇంద్రుడు ఈ మణిని జనకునిచ్చాడు. ఈ మణి సముద్రజలాల నుండి పుట్టింది. ఇది పూజార్హమైంది సజ్జనులకు. దీనిని చూస్తూ ఉంటే మా నాన్నగారు, మా మామగారు నాకు జ్ఞాపక మొస్తున్నారు.

"సుగ్రీవా! ఎప్పుడూ సీత శిరస్సుపై ప్రకాశించే ఈ మణిని చూడగానే సీతను చూచినట్లు ఉంది నాకు. లక్ష్మణా! చూశావా! సీతను చూచే అదృష్టం లేక ఈ మణిని చూచి తృప్తి చెందుతున్నా.

"ఒక్క మాసం రోజులు జీవించగలిగితే సీత చిరంజీవియే. కానీ నేను మాత్రం ఆమెను వదలి క్షణకాలం జీవించ లేకున్నాను. నన్నుకూడా సీత దగ్గరికి తీసికొనిపొండి. ఆమె జాడ తెలిసిన తరువాత ఇక క్షణం కూడా నేను నిలువలేను.

"ఆ రాక్షసుల మధ్య సీత ఎలా భీతిచెంది యున్నదో? హనుమా! చెప్పు నాయనా! సీత ఇంకా ఏమి చెప్పిందో చెప్పు. శోకంతో దహించబడే నా హృదయాన్ని నీ మాటలనే నీళ్ళతో చల్లార్చు.

ఏ తేన ఖలు జీవిష్యే భేషజే నాతురో యథా

"ఔషధమును పుచ్చుకొని రోగి జీవించునట్లు, సీత మాటలు విని నేను బ్రతుకుతాను;" అన్నాడు రాముడు.

రామునికి మఱల సీతమ్మ సందేశాన్ని వినిపిస్తూ, సీతమ్మ చెప్పిన కాకాసుర వృత్తాంతాన్ని విపులంగా వివరించాడు హనుమంతుడు.

"రామా! కాకిని శిక్షించిన రాముడు రావణుని ఎందుకు శిక్షించుటలేదు అని సీతమ్మ ప్రశ్నించింది. రాముడు త్వరలోనే వచ్చి రావణసంహారం గావిస్తాడు అని నేను ఆమెను ఓదార్చాను.

"నేను దేహాన్ని పెంచి బయలుదేరుతూ ఉంటే సీతమ్మ అశ్రుపూరిత నయనాలతో వీక్షించి, త్వరగా వచ్చి తనను రక్షించమని నీకు చెప్పమంది.

"రాముడు సైన్యంతో వచ్చి, రావణుని వధించి, తనను రక్షించుటే సముచిత కార్యమని సీతమ్మ చెప్పింది. రాముణ్ణి మోసగించి తనను రావణుడు అపహరించినట్లు, రావణునికి భయపడినట్లు తనను రహస్యంగా తీసికొని వెళ్ళడం యుక్తం కాదని చెప్పింది సీతమ్మ.

"నేను ఆమె సందేహాన్ని నివారించాను. వానరుల శక్తిసామర్థ్యాలను వివరించి చెప్పాను. త్వరలోనే లంకలో వానరులను చూడగలవు అన్నాను. సూర్యచంద్రుల వలె రామలక్ష్మణులు నా భుజాలపై ఎక్కి రావడాన్ని చూస్తావని చెప్పాను.

"రామా! నీవు సీత కొరకు బాధపడుతున్నావని వినగానే సీతమ్మ చాలా దుఃఖించింది. నేను ఆమెకు మంచిమాటలు చెప్పాను. ఓదార్చాను. సీతమ్మ శాంతించింది;" అన్నాడు రామదూత హనుమంతుడు.

శ్రీరామ భక్త హనుమాన్ కీ జై

సుందరకాండము సమాప్తము



మారుతీ! నీవే మా గతి

అతులిత బలధామం స్వర్ణ శైలాభ దేహం
దనుజ వన కృశానుం జ్ఞానినా మగ్రగణ్యమ్
సకలగుణ నిధానం వానరాణా మధీశం
రఘుపతి ప్రియభక్తం వాతజాతం నమామి ॥

గొప్ప బలశాలి, సువర్ణగిరి వలె దివ్యమైన దేహము కలవాడు, రాక్షసులనే అరణ్యానికి దావాగ్ని వంటివాడు, జ్ఞానులలో అగ్ర గణ్యుడు, సకల సుగుణ నిధి, వానరనాయకుడు, రఘురాముని ప్రియభక్తుడు, వాయుపుత్రుడు అగు హనుమంతునకు నమస్కారము.

I bow to the son of the Wind-God, the home of immeasurable strength, possessing a body shining like a mountain of gold, a fire to consume the forest of the demon race, the foremost among the wise, store house of every excellence, the chief of the monkeys, Raghupati's noble messenger!



తులసీదాసకృత

హనుమాన్ చాలీసా

అనన్యభక్తితో అచ్యుతుని ఆరాధించే భక్తులకు భగవానుడే అండయై నిలుస్తాడు. బ్రతుకులను పండిస్తాడు. పరమాత్మ కృపారసము త్యాగజీవుల పైనే వర్షిస్తుంది. నిర్మల భక్తి ప్రపత్తులు గలవారిని నారాయణుడు సదా రక్షిస్తూనే ఉంటాడు.

భారతదేశము భక్తుల దేశము. త్యాగులు అవతరించిన భూమి. జ్ఞానులు వెల్లివిరిసిన పవిత్ర భూమి. పరమ పవిత్రులైన భక్తులలో శ్రీ తులసీదాస్ మహాత్ముడు అగ్రగణ్యుడు. వరిష్ఠుడైన ఆ మహాత్ముని ద్వారా ఎన్నో వైభవాలు, భగవద్విభూతులు వ్యక్తమైనాయి. మృతిచెందిన వ్యక్తి ఈ మహాత్ముని కరస్పర్శతో పునర్జీవితుడైనట్లు కూడా తెలుస్తూ ఉంది.

ఒకనాడు తీర్థాటన చేస్తూ తులసీదాసు పండరీపురం చేరాడు. చంద్రభాగాలో స్నాన మాచరించాడు. పవిత్ర చంద్రభాగా తీరాన ఆసీనుడై విఠలనాథుని ధ్యానించాడు. హృదయం దివ్యపారవశ్యంతో నిండిపోయింది. ధ్యానము ముగిసింది. కానీ ధ్యానపారవశ్యము ఇంకా తగ్గలేదు. విఠలుని దర్శించేందుకు బయలుదేరి నదీతీరాన పరవశిస్తూ నడుస్తున్నాడు. ఈలోగా ఇంటిలో తగాదా పెట్టుకొని, చంద్రభాగాలో దూకి మరణించేందుకు ఒక అంధుడు చంద్రభాగా తీరానికి వచ్చాడు. అంధునికి తులసీ అగుపించడు. ధ్యానావేశములో నున్న తులసీకి అంధుడు కనిపించడు. గ్రుడ్డివాడు తులసీదాసును ఢీకొని క్రింద పడ్డాడు. తులసీ మనస్సు ఆ సంఘటనతో బహిర్ముఖ మైంది. అంధుని పైకిలేపి, ఆలింగనము చేసుకొని, "నాయనా!క్షమించు! తప్పు నాదే అని భావిస్తున్నాను" అంటూ అంధుని ముఖాన్ని చూశాడు తులసీ. "అయ్యో! అదేమిటి? కళ్ళు తెరవలేదే? ఏమైంది? తండ్రీ! నా తప్పును మన్నించి, కళ్ళు తెరిచి, నీ కృపాదృష్టిని ఈ దీనుడిపై ప్రసరింపజేయి" అని పలికాడు. అంధుడు కళ్ళు తెరిచాడు. అతనికి దృష్టి అనుగ్రహింపబడింది. అంధుడు ఆనందాశ్రువుల్ని చిందిస్తూ తులసీ పాదాలపై బడ్డాడు. "మీరు సాక్షాత్తు పాండురంగడే. నాకు దృష్టిని ప్రసాదించారు" అని ఆనందపారవశ్యముతో అమితముగ దుఃఖించ సాగాడు.

"నాయనా! నేను దాసుణ్ణి. సామాన్యుణ్ణి. నిన్ను ప్రభువు అనుగ్రహించాడు. భగవంతుని లీలలు అద్భుతములు. అనూహ్యములు. నీకు దృష్టి ప్రసాదించబడింది. అది

మామూలు దృష్టి కాదు. పాండురంగి భగవానుడు అనుగ్రహించినది గనుక అది దివ్యదృష్టి. పూర్ణకరుణాదృష్టి. ఇక మీదట నీ శేషజీవితాన్ని భగవత్సేవకే అంకితము చేసి ధన్యజీవివి కా;" అని పలికి ఆశీర్వదించాడు.

మహాత్ముడైన తులసీదాసు చరిత్రలో ఇలాంటి సంఘటన లెన్నో ఉన్నాయి. తులసీ ఎప్పుడూ మహిమల్ని ప్రదర్శించలేదు. మహిమలన్నీ ఆయన ద్వారా వ్యక్తమైనవే. భగవానుడే తులసీదాసు ద్వారా తన వైభవములను, విభూతులను ప్రదర్శించుకొని తృప్తి చెందాడు.

తులసీదాసు ద్వారా వ్యక్తమైన మహిమలు పాదుషా చెవికి చేరాయి. పాదుషా తులసీని కొలువుకు రావలసిందిగా కబురు పెట్టాడు. చక్రవర్తియైన పాదుషా కొలువుదీరి యుండగా తులసీదాసు లోనికి ప్రవేశించాడు. పాదుషా తులసీని చూచి, "భళీ! తులసీ! భళీ! నువ్వు చాలా మహిమలను చేసినట్లు మాకు తెలిసింది. అందులో కొన్ని మహిమలను మాముందు ప్రదర్శించి, మమ్మానందపరిచి, మానుండి పారితోషికమును పొందు" అన్నాడు. పాదుషా మాటల నాలకించి తులసీ నిర్ఘాంతపోయాడు.

"పాదుషా! చక్రవర్తీ! క్షమించు! నేను దాసుడ్ని. రాముడు నా ప్రభువు. నాలో ఏ మహిమలు లేవు. నేను సామాన్యుణ్ణి. ఒకవేళ మహిమలు వ్యక్తమై ఉంటే అవి రామచంద్రుని విభూతులు. నాకు వాటితో సంబంధము లేదు." అన్నాడు.

"ఏమిటీ! పాదుషానే ధిక్కరిస్తున్నావా? నీకు రెండు నిముషాలు మాత్రమే సమయ మిస్తున్నాను. మాట వినకపోతే మరణం తప్పదు" అన్నాడు పాదుషా.

"మరణమే శరణమని రాముని అభిప్రాయమైతే ఆ తరుణము ఆపినా ఆగదు. ప్రభూ! నాకు ఏ మహిమలు తెలియవు. ఆపైన మీ ఇష్టం" అన్నాడు తులసీ.

పాదుషా కోపం తీవ్రస్థాయికి చేరింది. భటులను రప్పించాడు. కొరడాలు తెప్పించాడు. అందరూ చూస్తుండగనే తులసీపై కొరడా ఝుళిపించమన్నాడు. ఆజ్ఞ అయింది. భటులు కొరడాలు చేత పట్టుకొని సిద్ధమయ్యారు. తులసీ రెండు చేతులు జోడించి, రామునికి నమస్కరించాడు.

కొరడాలు పైకి లేచాయి. లేచిన కొరడాలు లేచినట్లే ఆగిపోయాయి. రాజభవనమంతా కోతులు నిండిపోయాయి. ప్రతి వ్యక్తి వెనుక రెండు కోతులు భయంకర చూపులతో ఉగ్ర రూపం దాల్చి నిలబడి ఉన్నాయి. భటులు నివ్వెరపోయి పారిపోయారు. పాదుషా దిగ్భ్రాంతి చెంది భయపడసాగాడు. తులసీదాస్ పాదాలపైబడి క్షమాభిక్ష కోరాడు. తులసీకి హనుమంతుని విశ్వరూపం గోచరిస్తున్నది. తులసీ చేతులు జోడించి వాయునందనునికి నమస్కరించాడు. మేను పులకరించి, రోమాంచలమవుతున్న దేహము కదిలిపోతూఉంటే, కంఠము ఆనందాతిశయముతో గద్గదమై, నేత్రములు ఆనంద బాష్పములను రాల్చుతుంటే ఎలుగెత్తి హనుమంతుని స్తుతించాడు. అదే **"హనుమాన్ చాలీసా"**

భక్తులారా! పరమపవిత్రమైన హనుమాన్ చాలీసాను ఆంధ్ర ఆంగ్ల అనువాదములతో మీకు అందిస్తున్నాను. భక్తి శ్రద్దలతో నిత్యము పఠించి, భక్తాగ్రగణ్యుడైన తులసీదాసు కృపకు, రామచంద్ర భగవానుని కరుణకు పాత్రులై తరించండి.



తులసీ దాసకృత

హనుమాన్ చాలీసా



దోహా

శ్రీ గురు చరణ సరోజ రజ
నిజ మన ముకురు సుధారి
వరణౌ రఘువర విమలయశ
జో దాయక ఫలచారి ॥

శ్రీ సద్గురు చరణకమల ధూళిచే నా మనస్సనెడి దర్పణమును శుద్ధి పఱచుకొని, చతుర్విధ పురుషార్థఫలముల నొసంగెడి రామభద్రుని నిర్మల యశస్సును కీర్తించెదను.

Having cleansed the mirror of my heart with the holy dust of the Guru's lotus feet, I sing the taintless glory of Bhagawan Ramachandra, the bestower of fourfold attainments of life.

బుద్ధిహీన తను జానికే
సుమిరౌ పవన కుమార్
బల బుద్ధి విద్యా దేహు మొహి
హరహు కలేశ వికార్ ॥

ఈ దేహము అజ్ఞానము వలన సంభవించినదని గ్రహించి పవనసుతుడైన హనుమంతుని నేను స్మరించెదను. బలమును, బుద్ధిని, విద్యను అతడు నా కొసంగి క్లేశముల నుండి, పాపముల నుండి నన్ను రక్షించుగావుత!

Knowing that this mortal coil is the product of ignorance, I contemplate on Hanuman, the son of the wind. May He bestow on me strength, pure intellect and knowledge and rid me of my miseries and misfortunes.

చౌపాయీ

జయ హనుమాన జ్ఞాన గుణ సాగర
జయ కపీశ తిహు లోక ఉజాగర ॥

సమస్త శాస్త్రజ్ఞానమునకు, సుగుణములకు సాగరరూపుడైన హనుమంతునకు జయమగు గాక! త్రిలోకములను ఉద్దీపింప జేయు కపీశ్వరునకు జయమగు గాక!

Glory to thee, O Hanuman! ocean of wisdom and virtue. Glory to the Lord of monkeys, the illuminating presence of all the three worlds.

రామదూత అతులిత బలధామా
అంజని పుత్ర పవన సుత నామా ॥

ఓ రామదూతా! నీవు అసమాన పరాక్రమ వంతుడవు. అంజనీ పుత్రుడ వనియు, పవన కుమారుడ వనియు పిలువబడు చుందువు.

Thou art the messenger of Rama. Thou art the abode of immeasurable strength and valour. You are familiarly known as Anjaniputra, the son of Anjani Devi, and Pavanaputra, the son of Wind-God.

మహావీర విక్రమ బజరంగీ
కుమతి నివార సుమతి కే సంగీ ॥

మహావీరా! నీవు గొప్ప బలసంపన్నుడవు. వజ్రమయ దేహుడవు. దుర్బుద్ధి నివారకుడవు. సద్బుద్ధి యుక్తమగు సత్సంగమును అనుగ్రహించు వాడవు.

You are mighty, valiant, radiant and resplendent. You are the destroyer of wickedness and friend of the virtuous.

కంచన వరణ విరాజ సువేశా
కానన కుండల కుంచిత కేశా ॥

స్వర్ణతుల్య కాంతిని బోలిన ప్రకాశమాన దేహము కలవాడా! అత్యంత సుందర వేషముతో వెల్గొందువాడా! నీ శ్రోత్రములు కుండలములచే విరాజమాన మగుచుండగా, నీ కేశములు ఉంగరముల వలె అందముగా తిరిగి యున్నవి.

O Golden-hued and effulgent, you look charming with sparkling ear-studs and curly hair on the head.

హాథ వజ్ర అరు ధ్వజా విరాజై
కాంధే మూంజ జనేవూ చాజై ॥

నీ చేతి యందు వజ్రము, శ్రీరామచంద్రుని విజయ ధ్వజము శోభాయమానముగా గోచరించు చున్నవి. స్కంధము నందు ముంజయు, యజ్ఞోపవీతము శోభించు చున్నవి.

In your hands shine the mace of lightening and a flag of glory and across your shoulder the sacred thread of Munja grass.

శంకర సువన కేసరీ నందన
తేజ ప్రతాప మహా జగ వందన ॥

నీవు శ్రీశంకరుని పుత్రుడవు. కేసరీ నందనుడవు. నీ తేజము, ప్రతాపము అసమాన మైనవి. అందు చేత నీవు సమస్త జగత్తుచే వందనీయుడవు.

O son of Sankara, the darling of Kesari, your lustre and resplendent glory is adored by the whole world.

విద్యావాన గుణీ అతి చాతుర
రామ కాజ కరివేకో ఆతుర ॥

నీవు సమస్త విద్యలకు భాండాగారము వంటి వాడవు. సర్వసుగుణములకు నిలయమైన వాడవు. నీవు అత్యంత చతురుడవు. రామప్రభువు కార్యమును నిర్వహించుటకు సదా పూర్ణోత్సాహముతో నుండు వాడవు.

You are the repository of all knowledge, full of virtue and jovial, always eager and enthusiastic to serve Rama.

ప్రభు చరిత్ర సునివేకో రసియా
రామ లఖన సీతా మన బసియా ॥

శ్రీరామప్రభువు యొక్క చరితామృతమును శ్రవణము చేయుటలో నీవు అద్వితీయ రసికుడవు. నీ మనస్సనెడి మందిరములో సీతారామ లక్ష్మణులు సదా వసించు చుందురు.

You always rejoice in listening to the nectar-like story of Sri Rama Prabhu. In the temple of your heart do Rama, Lakshmana and Sita permanently reside.

సూక్ష్మరూప ధరి సియహి దిఖావా
వికటరూప ధరి లంక జరావా ॥

సూక్ష్మరూపమును ధరించి సీతకు గోచరించితివి. భయంకర రూపమును దాల్చి లంకను దగ్ధ మొనర్చితివి.

You appeared before mother Sita in a tiny form. You assumed a terrible form and burnt the city of Lanka.

భీమరూప ధరి అసుర సంహారే
రామచంద్ర కే కాజ సవారే ॥

మహా భయంకరమగు భీమరూపమును దాల్చి రావణుని అసురసైన్యమును అంతమొందించితివి. రామచంద్రుని మహత్కార్యమును సఫల మొనర్చితివి.

You killed the demons by assuming a terrific form and thus fulfilled the mission of Rama.

లాయ సజీవన లఖన జియాయే
శ్రీ రఘువీర హరషి ఉర్ లాయే ॥

ద్రోణాచలము నుండి మృతసంజీవినిని గొని తెచ్చి లక్ష్మణుని పునర్జీవింప చేసితివి. అది గాంచి సంతుష్ట చిత్తుడైన శ్రీరాముడు నిన్ను హృదయమునకు హత్తుకొనెను.

You brought Lakshmana back to life with the Sanjivini; Sree Rama then with over-whelming ecstasy clasped you to his bosom.

రఘుపతి కీన్హీ బహుత బడాయీ
తుమ మమ ప్రియ భరతహి సమ భాయీ ॥

రఘునాథుడు నిన్ను ఘనంగా ప్రశంసించి, "నీవు నా సోదరుడైన భరతునితో సమానముగా ప్రియమైన వాడవు" అనెను.

Raghunatha praised you highly and said, " You are as dear to me as Bharata".

సహస వదన తుమ్హరో యశ గావై
అసకహి శ్రీపతి కంఠ లగావై ॥

"వేయి నోళ్ళుగల ఆదిశేషుడు నీ యశస్సును గానము చేయుచున్నాడు" అని పలికి శ్రీనాథుడు నిన్ను కౌగిలించుకొనెను.

The Lord of Lakshmi embraced you saying "The thousand-headed Adisesha chants your glory".

సనకాదిక బ్రహ్మాది మునీశా
నారద శారద సహిత అహీశా ॥

ఆదిశేషుడే గాక సనకాది ఋషులు, బ్రహ్మదులు, మునిశ్రేష్ఠుడైన నారదుడు, సరస్వతి ఇత్యాదు లందరు నీ యశస్సును గాన మొనర్చిరి.

Not only Adisesha but also Sanaka, Brahma, Narada, the exalted sage, Sharada and also others chant your praise.

యమ కుబేర దిగపాల జహాంతే
కవి కోవిద కహి సకే కహాంతే ॥

యముడు, కుబేరుడు, దిక్పాలకులు కూడా మిమ్ములను వర్ణించలేక యుండగా, కవులు ,పండితులు ఏమి స్తుతించగలరు?

Even Yama, Kubera and Dikpalaka have no voice to sing your glory. What to speak of poets and scholars?

తుమ ఉపకార సుగ్రీవహి కీన్హా
రామ మిలాయ రాజపద దీన్హా ॥

నీవు సుగ్రీవునికి మహోపకారము చేసితివి. శ్రీరామునితో స్నేహమును కుదిర్చి కిష్కింధ రాజ్యమును ఇప్పించితివి.

You helped Sugriva get back his kingdom with the divine blessings of Ramachandra.

తుమ్హరో మన్త్ర విభీషణ మానా
లంకేశ్వర భయే సబ జగ జానా ॥

విభీషణుడు నీ సలహాను పాటించి లంకాధి పతి యైనాడు. ఈ సత్యము జగద్విదితము.

Vibhishana accepted your advice and became the king of the city of Lanka. The whole world knows this truth.

యుగ సహస్ర యోజన పర భానూ
లీల్యో తాహి మధుర ఫల జానూ ॥

రెండు వేల యోజనముల దూరమున నున్న సూర్యుని మధుర ఫలమని భావించి లీలామాత్రముగా గ్రహించినావు.

You swallowed the Sun from a distance of two thousand yojanas, considering him to be a sweet fruit.

ప్రభు ముద్రికా మేలిముఖ మాహీ
జలధి లాంఘి గయే అచరజ నాహీ ॥

రామప్రభువు ఒసంగిన ముద్రికను నోటిలో నిడుకొని సాగరమును సునాయాసముగా దాటినావు. ఇందులో అతిశయోక్తి లేదు.

Carrying the Lord's ring in your mouth, you crossed the mighty ocean. In this, there is neither wonder nor exaggeration.

దుర్గమ కాజ జగత కే జేతే
సుగమ అనుగ్రహ తుమ్హరే తేతే ॥

ఈ ప్రపంచమునందు ఏ కార్యము దుర్గమమో అది నీ కృపచేత అత్యంత సుగమ మగును.

All the difficulties and difficult tasks of the world can be overcome easily by your bounteous grace.

రామ దుఆరే తుమ రఖవారే
హోత న ఆజ్ఞా బిను పైఠారే ॥

హనుమంతా! నీవు రామచంద్ర ప్రభువు యొక్క రాజద్వారము చెంత రక్షకుడవు. మీ ఆజ్ఞ లేనిదే ఎవ్వరికీ ప్రవేశము లభించదు.

You are the sentinel of king Ramachandra. Without your permission none can enter in.

సబ్ సుఖ లహై తుమ్హారీ శరనా
తుమ రక్షక కాహూకో డరనా ॥

నిన్ను శరణుజొచ్చిన వారు సమస్త సుఖములను అనుభవింతురు. నీవు రక్షకుడైనచో ఇక భయమెలా కలుగును?

He who takes refuge in you enjoys all happiness and becomes free from fear.

ఆపన తేజ సమ్హారో ఆపై
తీనోం లోక హాంక తే కాంపై ॥

మీ యొక్క పరాక్రమమును మీరే నిగ్రహించు కోగలరు. మీ యొక్క అరుపుతో ముల్లోకములు కదిలిపోవును.

You alone can control your effulgent glory. When you roar all the three worlds tremble.

భూత పిశాచ నికట నహి ఆవై
మహావీర జబ నామ సునావై ॥

ఓ మహావీరుడా! నీ నామము చెవిని పడినచో భూతప్రేత పిశాచము లెవ్వియును దగ్గరకు చేరవు.

Evil spirits, ghosts and goblins cannot come near your devotees who repeat your divine name.

నాసై రోగ హరై సబ్ పీరా
జపత నిరంతర హనుమత వీరా ॥

నీ నామమును సదా స్మరించినచో రోగములు, రాగములు నశించును. సమస్తమైన పీడలు తొలగిపోవును.

Constant repetition of your divine name destroys all diseases and pains.

సంకట తే హనుమాన ఛుడావై
మనక్రమ వచన ధ్యాన జో లావై ॥

మనోవాక్కాయ కర్మముల ద్వారా ఎవడు హను మంతుని ధ్యానించునో వానిని అతడు సంకటముల నుండి విముక్తులను గావించును.

Hanuman rids one of every trouble if one contemplates on him with thought, word and deed.

సబ పర రామ తపస్వీ రాజా
తిన కే కాజ సకల తుమ సాజా ॥

రాజు యైన రాముడు తపస్వియై సర్వులకు ప్రభునై యున్నాడు. అతని కార్యముల నన్నింటిని నీవు నెరవేర్చు చుందువు.

Though Rama is the Ascetic King and the lord of all, yet you accomplished all his missions.

ఔర మనోరథ జో కోయి లావై
సోయి అమిత జీవన ఫల పావై ॥

ఏ కోరికను మనస్సు నందు నిలుపుకొని మానవుడు నిన్ను ఆశ్రయించునో అట్టి మనోరథమును అతడు తప్పక ఈడేర్చుకొనును.

Whoever comes to you with desire in mind, definitely achieves the object desire of.

చారో యుగ పరతాప తుమ్హారా
హై పరసిద్ధ జగత ఉజియారా ॥

మీ ప్రతాపము నాలుగు యుగము లందును కడు ప్రసిద్ధము. దాని వలన ప్రపంచము దేదీప్యమాన మగుచున్నది.

Your splendour is acclaimed in all the four yugas and your divine radiance envelopes the entire cosmos.

సాధు సంత కే తుమ రఖవారే
అసుర నికందన రామ దులారే ॥

సాధువులను, సంత్ పురుషులను నీవు సదా రక్షించు చుందువు. రాక్షసులను వధించి రామునకు ప్రియుడవైతివి.

You are the protector of saints and sages and destroyer of demons, Ramachandra has great love for you.

అష్ట సిద్ధి నవ నిధికే దాతా
అస వర దీన్హ జానకీ మాతా ॥

అష్టసిద్ధులను, నవనిధులను అనుగ్రహించు దాతగా జానకీమాత నీకు వరదాన మొసగినది.

Mother Janaki bestowed on you the boon to grant any one with any of eight sidhis and nine nidhis.

రామ రసాయన తుమ్హారే పాసా
సదా రహో రఘుపతి కే దాసా ॥

రామరసాయనము అనెడి నామామృతము నీవద్ద కలదు. నీవు నిరంతరము రఘురామునికి దాస్యము చేయుచుందువు.

You possess the Rama Rasayana-the divine Elixir of the holy name of Ramachandra. You ever remain blessed with the service of Raghunatha.

తుమ్హారే భజన రామ కో పావై
జనమ జనమ కే దుఃఖ బిసరావై

నిన్ను భజించుట చేత మనుజుడు రామ సాన్నిధ్యమును పొంది అనేక జన్మల నుండి ప్రాప్తించిన దుఃఖముల నన్నింటిని పోగొట్టుకొను చున్నాడు.

By chanting your holy name the aspirant reaches the abode of Rama and becomes free from the sufferings of many births.

అంతకాల రఘువర పుర జాయీ
జహా జన్మ హరి భక్త కహాయీ

నీ భక్తులు అంత్యకాలమున రాముని సన్నిధికి చేరుదురు. నూతన జన్మను బడసినచో హరిభక్తు లగుదురు.

After casting the mortal coil your devotee attains Sri Rama. He remains a devotee of Sree Hari if he takes a new birth on earth.

ఔర దేవతా చిత్త న ధరయీ
హనుమత సేయి సర్వ సుఖ కరయీ

అన్యదేవతలను చిత్తమున నిలుపుకొనక హనుమంతుని సేవించినచో సమస్త సుఖములను ప్రసాదించును.

He who does not worship other Gods and serves only Hanuman is rewarded all pleasures.

సంకట కటై మిటై సబ పీరా
జో సుమిరై హనుమత బలవీరా ॥

బలయుతుడైన హనుమంతుని స్మరించినచో సంకటము లన్నియు తొలగిపోవును. పీడ లన్నియు పారిపోవును.

If one chants the holy name of Hanuman, all difficulties and discomforts disappear and diminish.

జై జై జై హనుమాన గోసాయీ
కృపాకరో గురుదేవ కీ నాయీ ॥

హనుమంతునకు జయము. ఆంజనేయునకు జయము. పవన సుతునకు జయము. గురుదేవుని వలె నాపై పూర్ణకృపను కలిగియుండుము.

Hail, Hail, Hail unto thee O Hanuman! Be as gracious to me as my compassionate Guru.

జో శత వార పాఠ కర కోయీ
ఛుటహి బంది మహా సుఖ హోయీ ॥

ఎవరైతే నిర్మలభక్తితో ఈ స్తుతిని వంద పర్యాయములు పఠింతురో వారు సమస్త బంధముల నుండి విడిపడి పరమసుఖము ననుభవింతురు.

He who chants this a hundred times is freed from the wheel of transmigration and enjoys un-alloyed Bliss.

జో యహ పఢై హనుమాన చాలీసా
హోయ సిద్ది సాఖీ గౌరీశా

ఈ "హనుమాన్ చాలీసా" యను ప్రార్థనను ఎవరు శుద్ధభక్తితో పఠింతురో వారికి సిద్ధి కలుగును. ఈ ప్రతిజ్ఞకు సాక్షి పరమేశ్వరుడే.

He who recites these forty verses of Hanumanji attains salvation. Lord Sankara is the witness of this pledge.

తులసీదాస సదా హరి చేరా
కీ జై నాథ హృదయ మహడేరా ॥

తులసీదాసు సదా హరిదాసే అయి యున్నాడు. ఓ ప్రభూ! హనుమా! కరుణించి నా హృదయ కమలమున సదా వసింపుము.

Tulasidas is an eternal devotee of Sree Hari. O Hanuman! kindly dwell in my lotus-heart for ever.

దోహా

పవన తనయ సంకట హరణ
మంగళ మూరతి రూప
రామ లఖన సీతా సహిత
హృదయ బసహు సుర భూప

పవనకుమారా! సమస్త సంకటములను అంతమొందించువాడా! మంగళమూర్తీ! హనుమంతా! రామ లక్ష్మణ సీతా సహితులై, సర్వ దేవతా గణములతో కూడినవారై నా హృదయమున నివసింపుడు.

O Hanuman! the son of the Wind-God, destroyer of all difficulties, the embodiment of auspiciousness, dwell in my heart together with Sri Rama Lakshmana Sita and also the Gods of heaven.



శ్రీ హనుమన్మంగళహారతి

శ్రీరామచంద్ర సేవకాయ వజ్రదేహ పంజరాయ వారిసేతు బంధనాయ వీర మంగళమ్
ఆంజనేయ మంగళమ్ 1

రామచంద్రుని సేవకుడును, వజ్రదేహము కలవాడును, సముద్రముపై సేతువును నిర్మించిన వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

అంజనీ తపఃఫలాయ ఆత్మయోగ తత్పరాయ సత్యధీ పరాక్రమాయ ॥వీర॥ 2

అంజనీదేవి యొక్క తపఃఫలమును, ఆత్మయోగ తత్పరుడును, సత్యబుద్ధియు, తేజమును కలవాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

అష్టసిద్ధి యోగవేద్య దుష్టబుద్ధి నాశనాయ నిత్యముక్త కర్మకాయ ॥వీర॥ 3

అణిమా ద్యష్టసిద్ధులను, యమనియమాది అష్టాంగయోగము నెరిగిన వాడును, దుష్ట బుద్ధులను నశింపజేయు వాడును, జ్ఞానుల నడవడికను కలిగిన వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

భానువంశ రక్షణాయ సర్వశాస్త్ర పారగాయ శ్రీరమేశ సేవకాయ ॥వీర॥ 4

సూర్యవంశోద్ధారకుడును, సమస్త శాస్త్రముల నెరిగిన వాడును, లక్ష్మీపతికి సేవకుడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

శాంతి దాంతి భూషణాయ శత్రు గర్వ శోషణాయ మోహబంధ ఛేదనాయ ॥వీర॥ 5

శాంతియు, దాంతియు భూషణములుగా గలవాడును, శత్రువుల గర్వమును పోగొట్టువాడును, అజ్ఞానబంధమును అంతమొందించు వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

సుప్రసన్న వీక్షణాయ సూర్యబింబ భక్షణాయ సర్వదేవ వంద్య పాత్ర ॥వీర॥ 6

ప్రసన్నమైన దృష్టిచే వీక్షించువాడును, సూర్యుని మ్రింగుటకు యత్నించిన వాడును, దేవతలందరికి వందనీయుడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

భానుపుత్ర మంత్రివర్య భానుమూర్తి శిష్యవర్య వేదశాస్త్ర ధర్మవేద్య ॥వీర॥ 7

సూర్యుని కుమారుడగు సుగ్రీవునకు మంత్రివర్యుడును, సూర్యుని శిష్యుడును, వేదశాస్త్రములను, ధర్మశాస్త్రములను ఎఱిగిన వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

దైవకార్య పోషణాయ దైత్యమాయ నాశకాయ గోష్పదీకృతార్ణవాయ ॥వీర॥ 8

దైవకార్యములను పోషించు వాడును, రాక్షసుల మాయను అంతమొందించు వాడును, సాగరమును గోష్పాద మంతటి జలముగ భావించి దాటినవాడును, అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

ఆదివిష్ణు సేవకాయ గూఢకార్య సాధకాయ సర్వలోక ప్రాణపుత్ర ॥వీర॥ 9

ఆద్యపురుషుడైన నారాయణుని దాసుడును, నిగూఢములైన కార్యములను సాధించిన వాడును, సమస్తలోకమునకు ప్రాణదాత యగు వాయుదేవుని కుమారుడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!35

సర్వరోగ నాశకాయ సర్వబంధ మోచకాయ వీతరాగ రూపకాయ ॥వీర॥ 10

సమస్త రోగములను పోగొట్టు వాడును, సమస్త బంధములను తొలగించు వాడును, అనురాగము నుండి విడిపడిన వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

రామభక్త వత్సలాయ భీమగర్వ భంజనాయ సర్వ దుఃఖ నాశకాయ ॥వీర॥ 11

శ్రీరామునకు ప్రియభక్తుడును, భీముని గర్వము నణచిన వాడును, సమస్త దుఃఖములను పోగొట్టు వాడును అగు వీరుడైన ఆంజనేయునకు శుభమగు గాక!

నిత్యశుద్ధ మానసాయ సత్యబద్ధ కర్మణాయ కామరూప ధారణాయ ॥వీర॥ 12

సదా పరిశుద్ధాంతఃకరణ గలవాడును, సత్యమార్గములో సదా చరించు వాడును, కామరూపవిద్య నెరిగిన వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

దాస తాప నాశకాయ దేవలోక వందితాయ రక్తమాల భూషణాయ ॥వీర॥ 13

దాసులైనవారి తాపములను పోగొట్టు వాడును, దేవలోక వాసులకు స్తవనీయుడును, ఎఱ్ఱని పూలమాలను ధరించిన వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగుగాక!

శాకినీ పిశాచ నాశ ఢాకినీ గ్రహాది నాశ క్షుద్ర దేవతా వినాశ ॥వీర॥ 14

శాకినీ మున్నగు పిశాచములను నశింపజేయు వాడును, ఢాకినీ మున్నగు గ్రహములను అంతమొందించు వాడును, క్షుద్ర దేవతలను మట్టుపెట్టు వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

సీత దుఃఖ నాశకాయ పాపకర్మ భంజకాయ మాయ యంత్ర ఛేదకాయ ॥వీర॥ 15

సీతాదేవి యొక్క శోకమును పోగొట్టిన వాడును, పాపకర్మములను తొలగించు వాడును, మాయాయంత్రమును ఛేదించినవాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

రామరూప పూజకాయ రామనామ కీర్తనాయ రామ సత్కథా ప్రసంగ ॥వీర॥ 16

రామరూపమును అర్చించువాడును, రామనామమునే కీర్తించువాడును, రామకథా ప్రసంగములను చేయువాడును అగు వీరుడైన ఆంజనేయునకు శుభమగు గాక!

యుద్ధకాండము

